

ఖర
మాఘము

భారతి

సంపుటము 29
సంచిక 2

అవనీంద్రస్మృతి

★

శ్రీ మొక్కపాటి కృష్ణమూర్తి

కునికిన దాస్యజీవన విఘూర్ణిత జాతికళా ప్రదీపికన్
దన యతిలోక భావపరిణాహసముజ్జ్వల కాంతిధారచే
పునరుపలబ్ధ భవ్య సుషమోచ్ఛ్వసనమ్ముగ జేసి వెల్గులన్
నినిచిన దివ్యశిల్పి యవనీంద్రుడు నేడు జగాన లేడటే!


ఒక పదిమంది భావుక మహాగయశాలురలో మెడందలన్
జికిలి యొనర్చి భారత విశిష్టనవీనకళా మహస్సు చం
దక మ్మనుసారభాకలిత భావనగా మొనయించె; వారునున్
ప్రకటిత విశ్వమోహన కళాప్రతిభావిజయ ప్రభాసితుల్!

ఉత్తమ శిల్పలక్ష్యములు, నూర్జిత సర్వ కళారహస్యముల్
గుత్తగొనంగ, నాతని యొకొక్క వినూత్న కళాప్రయత్నమున్
గ్రొత్తగ సంతరించె దళుకొత్త, కళాన్యుల వారి పోకలన్;
మొత్తమునన్ని ఫక్కికలు బుట్టెను బో యవనీంద్రు తూలికన్!

చిక్కని భావనాపటిమ, చేవలు దేరు కళాప్రభుత్వ స
మ్యక్కమనీయ విన్యసనమాధురి, మార్మిక రేఖ తెల్లమై
చొక్కపు చిత్రజాలముల సోద్యముగా మెరుగొందు; నైననున్
నిక్కపుటింద్రజాలమెదో నిండిన దాజిలుగొందు కుంచియన్!

మొగలుల చిత్రలేఖన విమోహనచాతురి, సూక్ష్మ రేఖలన్
సొగసగు రాజపుత్ర సరసోజ్వల రాగ కళానుభావమున్
జగదభిరామ హేతువు నజంత కళామహనీయ భావమున్
బగటుకొనంగ నందముల మర్త్యులకున్ దయ సేయ బోయెనో!

మనకిక దూరమయ్యె నసమాన కళా మహనీయ కేళికుం
డని మదిలో నెదోయొక మహాంధ్యము క్రమ్మెడు; నైననంతలో
నన యువనీంద్ర చంద్రమునసంత సుధామధుదీప్తి దోచి, యూ
యన చలువల్ దొలంకు శరశాశివమున్ మది నూహసేసెదన్



భౌతికశాస్త్రము-తత్త్వజ్ఞానము

★

శ్రీ విస్సా అప్పారావు

బాహ్యప్రపంచముయొక్క స్వరూపస్వభావములను తెలిసికొనుటకై శాస్త్రజ్ఞానము తోడ్పడుచుండును. నిత్యజీవితమునకు సంబంధించిన విషయముల గురించియే కాకుండా, అనాదినుండి జిజ్ఞాసువులకు గల మానసికములగు గొప్ప సమస్యలగురించికూడా, శాస్త్రజ్ఞానము తోడ్పడుచుండును. జీవితపరమార్థమేమి, ఈవిశాల ప్రపంచమందు మనకుగల స్థానమెట్టిది, మృత్యువును జయించి శాశ్వతత్వమును పొందగలమా, కడపటి సత్యమనునేమి, అనుప్రశ్నలకు సమాధానములకై శాస్త్రవిచారమును చేయుచుందుము.

శాస్త్రపరిశోధనకై చేయుప్రయత్నములు హిమాచల పర్వతారోహణ ప్రయత్నములవంటివి. పైకిపోయినకొలది వాతావరణము నిర్మలమై, దృష్టి విశాలమగుచుండును. ఒక్కొక్క శిఖరము పైకెక్కుచు, దానిపైనుండి పూర్వపు సంకుచితాభిప్రాయములను విశాలముచేసికొనుచు, విజ్ఞానవికాసమును, ఉత్సాహశక్తిని, క్రమముగా పెంపొందించుకొనుచు పైపైశిఖరముల కెగబ్రాక ప్రయత్నించుచుందుము. ఇది అంతులేని ప్రయత్నము. తీరని అన్వేషణ— సత్యాన్వేషణ.

గడచిన 25-30 ఏండ్లలో సుక్రమాభివృద్ధిపొందుచున్న నవీన భౌతికశాస్త్ర (*Modern Physics*) పరిశోధనాఫలితము లీతీరని యన్వేషణలో ఎంతవరకు పరికరించుచున్నదో తెలిసికొందాము.

1. సాంప్రదాయక భౌతికశాస్త్రము

(Classical physics)

న్యూటన్ శాస్త్రజ్ఞుడు గతిశాస్త్రము(*Dynamics*) న కాధారములగు (*Laws*) ను ప్రతిపాదించినాడు. గతిశాస్త్రముతో. సూర్యకుటుంబమందలి గ్రహగతులను, గ్రహణాదులను లెక్కింపగలుగుచున్నాము. బండ్లు, ఓడలు, విమానములు, మోటారులు మొదలగు సర్వయంత్రములకు గతిశాస్త్రము అమోఘముగా తోడ్పడుచున్నది. గతి శాస్త్రబద్ధమగు బ్రహ్మాండమైనయంత్రమువలె, ఒక నిశ్చితమగు మార్గానుసారముగా, సర్వప్రపంచము సాగిపోవుచున్నదని, అట్టి ప్రపంచమందు మానవసంకల్పమునకు—ప్రపంచమార్గము ను సవరించుటలో—తావులేదని, ఆ మహాయంత్రబంధమునుండి విడిపించుకొనగల స్వేచ్ఛ, దానిని ధిక్కరించగల ఆధ్యాత్మికశక్తి, మానవునికిలేవని, అభిప్రాయములు భౌతికశాస్త్రవేత్తలలో కరడుగట్టిపోయినవి.

మరియు, ఇంద్రియగోచరమగు ప్రపంచమునకు భిన్నమైన ప్రపంచములేదని, సర్వజ్ఞానమునకు యింద్రియములే ద్వారములని, అతీంద్రియజ్ఞానమును సది యుండుట యసంభవమని, అసత్యమని, (*World is Subjective and not objective*) అను వాదము ప్రబలమైనది. ఇట్టి వాదమును చేయు వారిని (*Positivists - realists*) వ్యక్తివాదులనవచ్చును. వీరికి వ్యక్తిజ్ఞానమే ప్రమాణము—వీరిని వాస్తవికులని కూడ అనవచ్చును వీరికి జగత్తు వ్యక్తిభావనాత్మకము. వ్యక్తులభావనల కితరమై వారు భావించినా భావించకపోయినా సత్యమై, నిత్యమై, స్వతస్సిద్ధమై, జగత్తున్నదను ప్రతివాదమునకు సత్తావాదమని పేరు—(సత్ =ఉన్నది, సత్తు). ఇట్టివాదమునకు చెందినవారిని (*idealists*) సత్తావాదులనవచ్చును. వీరికి వ్యక్తేతర భావనే ప్రమాణము. భౌతికశాస్త్ర పురోగమనమంతయు ఈ వాద, ప్రతివాదముల ఫలమని చెప్పవచ్చును. వీరి సిద్ధాంత పూర్వపక్షముల మూలముగా శాస్త్రము వృద్ధి పొందినది.

ప్రయోగములచేత ప్రత్యక్షముగా తెలిసికోలేని విషయమంతా సత్యేతరమనే వాస్తవికుల వాదమునకు ప్రతివాదము లేకపోలేదు. సుమారు 150 ఏండ్లక్రిందట జాన్ డాల్టన్, పరమాణువాదము

(*Atomic hypothesis*) ను, ప్రతిపాదించినాడు. పరమాణువులు ప్రత్యక్షముగా తెలిసికొనగలిగినట్టివి కావు, కాని అట్టి అప్రత్యక్ష పరమాణువాదముతో అమూల్యమైన రసాయనిక శాస్త్రవిషయములు గ్రహింపబడినవి. పరమాణు భారములు (*Atomic weights*) లెక్కింపబడినవి. అవి శాస్త్రమందు నిత్యముపయోగములో కలవు. కావున ఇవి సత్యములు కాక మరేమిటి.

2. నవీన భౌతికశాస్త్రము Modern physics

(1) బోర్ సిద్ధాంతం (*Bohr's Atomic Theory*)

పరమాణువులు భేదింపవీలులేని ద్రవ్యకణములని (*Atoms-ultimate particles*) డాల్టను అభిప్రాయపడినాడు. 1900 సంవత్సర ప్రాంతమువరకు అదే సిద్ధాంతమని భౌతిక శాస్త్రవేత్త లభిప్రాయపడినారు. కాని పరమాణువులను భేదించవచ్చునని, అందు భాగములున్నవని—కేంద్రకము (*Nucleus*) దాని చుట్టు తిరుగు ఎలక్ట్రానులు (*Planetary electrons*), ఎలక్ట్రానులు తిరిగే కక్ష్యలు (*Orbits*) కలవని, పరమాణువు ఒక చిత్రమైన కట్టడము (*Structure*) కలదని, రూథర్ ఫర్డు, బోర్, అను ప్రముఖ శాస్త్రవేత్తలు ప్రతిపాదించిరి. ఈ నూతన వివరములతో పరమాణువాదమును పెంచి, క్రొత్త సిద్ధాంతము నొకదానిని బోర్ కల్పించినాడు. దాని యాధారమున 1910—25 సంవత్సరముల మధ్యను అనేక భౌతికశాస్త్ర, రసాయనిక శాస్త్ర రహస్యములు వెల్లడైనవి. బోర్ కల్పించిన పరమాణు కట్టడములయందలి వివిధ వివరణలు ఊహామాత్రములే. ప్రత్యక్షముగా నిరూపింపగలిగినవి కావు. ఇంద్రియగోచరములు కావు. కాని, అంతమాత్రమున డాల్టన్, రూథర్ ఫర్డు, బోర్-ప్రతిపాదించిన పరమాణు వాదము సత్యేతరమని త్రోసివేయ వీలగునా అని ప్రతివాదము బలముగా సాగినది.

ఐనను బోర్ వాదము ఎంతవరకు సమర్థనీయము అను విషయమును పరిశీలించవలసియున్నది.

పరమాణు కట్టడములు ఒక్కొక్క పరమాణువున కొక్కొక్క రీతిని కల్పింపబడిన నమూనాలు—(*Atomic models*) అన్నింటికంటె బరువు తక్కువ గల ఉదజని, హీలియము, పరమాణు నమూనాలలో ఒకటి, రెండు, ఎలక్ట్రానులు మాత్రమే ఉండి, అవి ఒకటి, రెండు, కక్ష్యలలో (*Orbits*) తిరుగుచుండును. పరమాణువుల బరువు పెరిగినకొలది కక్ష్యలసంఖ్య పెరుగును. అందుచేత నమూనా కట్టడముల నిర్మాణము చిత్రవిచిత్రాకారములు కలిగి చిక్కుగా ఉండును.

ఉదజని కట్టడమందలి ఎలక్ట్రాను ఒక విధముగా ప్రవర్తించునని యూహించి దానినిబట్టి ఉదజని వర్ణమాల (*Spectrum*) లోని వివిధరంగులయొక్క తరంగపు కొలతలను (*Wave-lengths*) బోర్, లెక్కగట్టి చూపెను. ఈ లెక్కించిన కొలతలు ప్రత్యక్షముగా ప్రయోగముల మూలమున కనిపెట్టిన కొలతలకు సరిపోయినవి. ఇట్లే హీలియము వర్ణమాలకుకూడ ఉపపత్తి (*Explanation*) బోర్ చే కల్పించబడినది. కాని పరమాణువులు బరువైనకొలది వాటి వర్ణమాలల కుపపత్తి సంపూర్ణముగా సాధ్యపడలేదు. అందుచేత బోర్ విధానములో ఏదో ఒక లోటున్నదని స్పష్టపడినది.

మరియు, కేంద్రకము చుట్టు తిరుగు ఎలక్ట్రానుల వేగము (*Velocity*) గాని, కక్ష్యలలో ఎలక్ట్రాను లాక్రమించియున్న స్థానము (*Position*) గాని బోరువిధానము వలన లెక్కించి తెలిసికొను వీలు కలుగలేదు. హైడ్రోజను వర్ణమాలకుసంబంధించిన ఉపపత్తి గణితములో ఎక్కడను ఈ ఎలక్ట్రానుల స్థితి, గతి, ఉపయోగించవలసిన అగత్యము కలుగలేదు. ఇది చాలా వింత విషయము. కక్ష్యలలో ఎలక్ట్రానులు నిజముగానే తిరుగుతూఉంటే, వాటి స్థితి, గతి, తెలియకుండుట అవి గణితమందు లేకుండుట వింతగాదా. అందుచేత ఎలక్ట్రానులు కక్ష్యలలో తిరుగుచున్నవను ఊహ బూటకమా అను సందేహము ఏర్పడినది. పరమాణుకేంద్రకము చుట్టు ఎలక్ట్రానులు తిరుగుచుండును అను సందేహాస్పదమగు విషయమును ప్రవేశపెట్టుట చేత బోర్ సిద్ధాంతములో లోటు కల్గినదని, అందుచేతనే బరువైన పరమాణువులయొక్క వర్ణమాలలకు సరియైన ఉపపత్తి దొరకలేదని వ్యక్తివాదులు (*Positivists*) ఆక్షేపించిరి. వీరిలో ప్రముఖుడు హైజన్‌బర్గు అను జర్మను శాస్త్రజ్ఞుడు.

II. (2) హైజన్‌బర్గు క్వాంటమ్ మెకానిక్సు
Heisenberg's Quantum Mechanics

ఊహాకల్పితమగు పరమాణు నమూనాలను విసర్జించి, ప్రయోగములచేత ప్రత్యక్షముగా తెలిసికొనగలిగిన సామగ్రితో, ఒక సిద్ధాంతమును ప్రతిపాదించినచో అన్ని పరమాణు వర్ణమాలలకు పూర్ణముగ నుపపత్తి పుట్టునని హైజన్‌బర్గు అభిప్రాయపడినాడు. వర్ణమాలలోని రంగులయొక్క తరంగపు కొలతలు (*Wave - lengths*) రంగులయొక్క ధాతు తీవ్రతలు (*intensity of Colours*) ప్రయోగములచే తెలిసికొనగల ప్రత్యక్ష విషయములు గనుక, వీటి నుపయోగించి క్వాన్టమ్ మెకానిక్సు అను నూతన సిద్ధాంతమును 1926 లో, కల్పించినాడు. మేట్రిక్సు మెకానిక్సు (*Matrix mechanics*) అను నూతన గణిత విధానమును ఈ సిద్ధాంతమం దుపయోగించినాడు. పరమాణువుల వర్ణమాలలకు సమగ్రముగ ఉపపత్తిని ఏర్పరిచి చూపినాడు. ఇంకను నూతన విషయములను, గణితముచే, నిరూపించినాడు. అవి ప్రయోగములచే ప్రత్యక్షము చేయబడినవి. బోర్ సిద్ధాంతము కంటె హైజన్‌బర్గు సిద్ధాంతము సర్వాత్మనా మేలైనదని, స్పష్టమైనది. దీనినిబట్టి సత్తావాదము కంటె వ్యక్తివాదమే బలీయమని చెప్పవలసివచ్చినది.

అనిశ్చయత్వ సూత్రము
(*Principle of Uncertainity*)

హైజన్‌బర్గు సిద్ధాంతాంతర్భూతమై, మూలాధార మైనదగు అనిశ్చయత్వ సూత్రమునుగురించి కొంత తెలిసికొనవలసియున్నది.

వ్యవహారములో, నిత్య జీవితములో, అనేకముగా బండ్లు, యంత్రములు మొదలగువాని చలనమును గతిశాస్త్రముతో సాధించుచున్నాము. ఈ యంత్రముల బరువు ఎన్నో పౌనులు, మణుగులు ఉండును. అట్టి వానికి గతిశాస్త్రమెట్లుపయోగపడుచున్నదో ఒక చిన్న ఉదాహరణము వలన తెలిసికొనవచ్చును. నేలమట్టము నుండి సెకనుకు 100 అడుగుల వేగముతో పైకి నిటారుగా ఒక రాతిని విసిరినచో 3⅛ సెకనుల తరువాత అది 156 అడుగుల ఎత్తున కెగిరి ఆగునని, అక్కడనుండి తిరిగి 3⅛ సెకనులలో నేల మీదకు, సెకనుకు 100 అడుగుల వేగముతో, పడునని, లెక్క గతిశాస్త్రముచేత కట్టుచున్నాము. అనగా ఒక కాలమందు గల స్థితి—(*position*)—నేల మట్టము, గతి (*velocity*) సెకనుకు 100 అడుగులు, తెలిసినచో మరియొక కాలమందు—3⅛ సెకనుల తరువాత, దానియొక్క స్థితి— 156 అడుగుల ఎత్తు, గతి—శూన్యము (ఏమంటే అంతవరకే వెళ్లి ఆగిపోయినది కనుక) లెక్కించ గలుగుచున్నాము. ఈ విధానానుసారమే గతి శాస్త్రము నుపయోగించుచున్నాము. ఇట్లే, పరమాణువులలో గల ఎలక్ట్రానుల యొక్క చలనమును గతి శాస్త్రముతో సాధించవచ్చునని బోర్ భావించినాడు. లెక్కలు కట్టినాడు. బోర్ విధానము సంపూర్ణఫలితముల నీయలేదు. ఇది ఎందుచేత, అని విచారణలు జరిగినవి. గాని ఫలితముగా 1927 లో సూక్ష్మద్రవ్య ఖండములను పరమాణువుల యందు న్యూటను గతిశాస్త్రము సరిగా వర్తించ నేరదు అని హైజన్‌బర్గు తన సిద్ధాంతరీత్యా లెక్కించి చూపించినాడు. మరియు పరమాణువులయొక్క స్థితి గతి, రెండూ కూడా ఏకకాలమందు నిశ్చితముగా తెలిసికొనుటకు వీలులేదని, ఈ రెంటిలో ఒకదానిని నిశితముగా కొలిచినచో, ఈ కొలుచుట యను క్రియ వలన పరమాణువు గతి మారునని, కదలిపోవునని, అందుచేత రెండవదాని కొలత నిశితముగా ఉండదని స్పష్టపరచినాడు. రెండవ కొలతలో సంభవించు తేడాను—అనగా అనిశ్చయత్వమును, నిరూపించినాడు. ఈ నిరూపణకు అనిశ్చయత్వసూత్రమని (*Principle of Uncertainity or Priuciple of Indeterminacy*) పేరు. ఈఅనిశ్చయత్వముయొక్క పరిమాణము అతి సూక్ష్మమైనది. పరమాణువులయొక్క ద్రవ్యపరిమాణములతో పోల్చతగినంత తక్కువైనది. అందుచేత, పరమాణువుల గణితమందు దీనికి విలువ ఏర్పడుచున్నది. వ్యవహారమందు తటస్థించు పెద్ద ద్రవ్యఖండములయందీ అనిశ్చయత్వ పరిమాణమునకు విలువలేదు. అందుచేత స్థూలప్రపంచమందు (*macrocosm*) నిశితముగా ఉపయోగపడే గతి శాస్త్రము సూక్ష్మప్రపంచమందు, (*microcosm*) నిశితముగా ఉపయోగపడదు.

ఐతే ఎలక్ట్రాను బరువింత, దాని విద్యుదావేశము (*Electric charge*) ఇంత, అని చెప్పుచున్నామే, అవి ఎలా లెక్కించినారు; గణితశాస్త్రముచేత చేగదా; అవి కూడ అనిశ్చితములేనా, యని సందేహము కలుగవచ్చును. ఎలక్ట్రాను బరువు ఇంత అను కొలత ఒక్కొక్క పరమాణువుమీద ప్రయోగములుచేసి గ్రహించినది కాదు. అసంఖ్యాకములగు పరమాణు సమూహముతో ప్రయోగములను చేసి నిశ్చయించినది. ఈ నిశ్చయము నిశితమైనదే. ఎప్పుడైనను, ఎవరైనను ఈ ప్రయోగములను తిరిగి చేసి చూచినచో వాటి ఫలితముగా ఈ కొలత ఏర్పడగలదు. ఇది దామాషాయీగాకట్టిన పరిమాణము. (*Statistical average value*) మన దేశమందు జీవితప్రమాణము 27 సంవత్సరములని చెప్పుచున్నాము. ఇది కోట్లాది ప్రజలలో ప్రతీవారి ఆయుర్దాయమని చెప్పవచ్చునా—చెప్పరాదు. వారందరి ఆయుఃప్రమాణముల యొక్క దామాషాయీరామే, ఈ 27. ఇట్లే ఎలక్ట్రానుయొక్క బరువింత విద్యుదావేశమింత అనుపరిమాణములను గ్రహించవలసియున్నది. ఒక్కొక్క పరమాణువుతో లెక్కించే కొలత లనిశ్చితములు. అసంఖ్యాకములగు పరమాణు గుంపుతో లెక్కించే కొలతలు సునిశ్చితములు— అను విషయము పర్యవసానము. ప్రతి పరమాణువుయొక్క నిజస్థితి ఈ దామాషా యీ కొలతలవలన తెలియదు. పరమాణువుల నిజస్థితి తెలుసుకునే మార్గము ఇంకను లభ్యము కాలేదు. ఒక విధముచే ఆలోచించగా ఈ దామాషాయీలెక్కలు మిథ్యలని చెప్పవలసియున్నది. సత్యమును యింకొక రీతిని తెలుసుకొనుటకు వీలులేక, దామాషాయీ లెక్కలనే వాడుచున్నాము. స్థూల ప్రపంచమంతయు పరమాణుగుంపుల మయము గనుక ఈ దామాషా ఈ లెక్కలు స్థూల ప్రపంచమందు సరిపోవుచున్నవి. మన జ్ఞానమంతయును దామాషాయీ జ్ఞానమే—బహుశః, ప్రాయశః (*Probable*) అని చెప్పేదే గాని ఇదమిద్ధము (*True*) అని చెప్ప వీలులేనిది.

11. (3) ష్రోడింగరు వేవ్ మెకానిక్స (*Shrodinger's Wave Mechanics*)

బోర్ కల్పించిన పరమాణు నమూనా (*Atomic Model*) తో, సంబంధము లేకుండా అట్టి నమూనాను పూర్తిగా విసర్జించి, ప్రత్యక్షాంశములను మాత్ర ముపయోగించి పరమాణువుల గురించిన సర్వ విషయములను సువిశితముగా హైసెన్బర్గ నిరూపించినాడు. పరమాణు నమూనాలోని లోట్లు హైజన్బర్గును బాధించినంతగా ఇతర భౌతికశాస్త్రవేత్తలను బాధించలేదు. అట్టి వారిలో ప్రముఖులు లూయీ డి బ్రాగ్లీ (*Louis de Brogli*), ష్రోడింగరు అనువారు. పరమాణు నమూనాను పూర్తిగా విసర్జించక, అందలి లోట్లను సవరించి, ఒక నవీన సిద్ధాంతమును కల్పించి, పునరుద్ధరించవలెనని వారు పూనుకొనిరి.

ఎలక్ట్రానులు, ప్రోటానులు, సూక్ష్మములగు ద్రవ్యకణములు (*Particles*) అని, కొన్ని సందర్భములలో అవి కాంతి (*Light*) ని వెదజల్లునని (*Radiate*), అట్టి కాంతి (*Radiation*) తరంగరూపమున ప్రసరించునని శాస్త్రజ్ఞులు భావించుచుండిరి. కణములకు, తరంగములకు గుణములలో భేదమున్నది, రెండింటికిని ఎట్టి సంబంధముండ వీలులేదు కణములు ద్రవ్యమయములు, తరంగములు శక్తిమయములు; ద్రవ్యమునకు, శక్తికి, ఏమియును సంబంధము లేదు; అని శాస్త్రజ్ఞులు భావించుచుండిరి. పరమాణు కేంద్రకమును చుట్టితిరుగు ఎలక్ట్రానులు కణములని బోర్ భావించెను. వాటి స్థలనిర్దేశము చేయబూనెను గాని సాధ్యము కాలేదు. కక్ష్యలలో తిరుగు ఎలక్ట్రానులు కణములవలెగాక తరంగములవలె ప్రవర్తించినచో, తరంగములు వ్యాపించు స్వభావము కలవి గనుక, అవి కక్ష్య నంతటను వ్యాపించినచో ఒక స్థలనిర్దేశము చేయుట అను విషయమునకు చోటుండదు. కనుక ఈ కారణములచేతనే ఎలక్ట్రానుల స్థలనిర్దేశము చేయ వీలుపడలేకపోయినది డిబ్రాగ్లీ తర్కించుచున్నాడు. తరంగములు (*Radiation*) కణముల (*Photons*) వలె ప్రవర్తించునని 1923 లో కాంప్టన్ (*Compten*) శాస్త్రజ్ఞుడు ప్రయోగములను చేసి చూపించినాడు. అట్లే కణములుమాత్రము తరంగములవలె ఏల ప్రవర్తించకూడదని డిబ్రాగ్లే తర్కించుచున్నాడు. ఎలక్ట్రాను, తరంగమువలె వర్తించినప్పుడు, కలిగే ఎలక్ట్రాను తరంగము (*Electron wave*) నకు ఒక నిర్ణీతమగు కొలత (*wave - length*) ఉండునని ఆకొలతను ఎలక్ట్రాను బరువుతో చేర్చి లెక్కించవచ్చునని డిబ్రాగ్లీ సూచించినాడు. ఎల

క్ట్రాను—తరంగము ఎక్సురేతరంగములతో సమానముగు కొలతగలదని లెక్కగట్టి చూపినాడు. ఐతే ఎలక్ట్రానులు తరంగములవలె ప్రవర్తించు నని ప్రత్యక్షముగా ప్రయోగములచేత నిరూపించినగాని డి బ్రాగ్లీ ఊహ నిజమని స్థిరపడదు. 1927 లో డావిజన్, గర్మర్ అను వారిద్దరు ఎలక్ట్రానులు కాంతి వలెనే ప్రవర్తించుచున్నవని ప్రయోగపూర్వకముగా నిరూపించినారు. డి బ్రాగ్లీ యభిప్రాయమును రుజువు చేసినారు.

డి బ్రాగ్లీ అత్యద్భుతమైన నూతనాభిప్రాయమును శాస్త్రమందు జొప్పించి భౌతికశాస్త్రమునకు అతినవీనమగు మెరుగును పెట్టినాడు. కణము (*particle*) తరంగము (*wave*) రెండూ అవినాభావములని, ఏదో ఒకవస్తువు ఒకసారి కణము వలెను మరియొకసారి తరంగమువలెను ప్రవర్తించు చున్నదని, డి బ్రాగ్లీ నిరూపించినాడు. ఈనూతన వస్తువును కణమనీ, తరంగమనీకూడా చెప్పవలసి వచ్చినది. అందుచేత దీనికి కణ—తరంగమని (*wave Particle or wavicle*) పేరుపెట్టిరి. కణమును, తరంగమును వేరు వేరుగా ఊహించగలుగు చున్నాము కాని, కణ—తరంగమను సమ్మేళన వస్తువును ఊహించవీలు లేకున్నది. కాని అట్టి దొకటి ఉన్నది అని, అది వాస్తవమైనదని, చెప్పకతప్పదు. అది అనిర్వచనీయమైన వింతవస్తువు.

హైడ్రజనుపరమాణువు కణమేగనుక అట్టి వస్తువని, కణతరంగమని, భావించవలసియున్నది. ఆవస్తువు స్పందించుస్వభావముకలది. అట్లు స్పందించునప్పుడు తరంగముపుట్టుచుండును. స్పందించు రీతిఏదో, ఆవస్తు వేదో తెలియదు. ఇది ఒక నిగూఢమగు మర్మము.

ఈ విషయములనన్నిటిని నాధారము చేసికొని పరమాణు నమూనా నొకదానిని శ్రాడింగరు భావించినాడు. హైడ్రజను పరమాణువును నీటిబిందువు వంటిదని భావించి, సంప్రదాయ గణితముప్రకారము నీటిబిందువు స్పందించుటచే కలిగే తరంగముయొక్క సమీకరణము (*Wave-equation*) ను పోలిన ఒక సమీకరణమును సృష్టించినాడు. అట్టి సమీకరణతో ప్రారంభించి, గణితమును చేసి పరమాణువులయొక్క వర్ణమాలలోని వివిధ విషయములకు సరియైన నిష్పత్తిని కనిపెట్టినాడు. ఈ గణిత మార్గమునకు వేవ్ మెకానిక్స (*Wave-Machanics*) అని పేరు. మరియు భౌతికశాస్త్రమందు ఇదివరలో కనిపెట్టబడి ఉపపత్తి లేని విషయముల కన్నింటికిని వేవ్ మెకానిక్సు ఉపపత్తిని కల్పించగలిగినది. అనిశ్చయత్వ మాత్రమునుకూడ వేవ్ మెకానిక్సుతో నిర్వచింపవచ్చును. అందుచేత శ్రాడింగరు సిద్ధాంతము సర్వ సమగ్రమని నిశ్చయింపబడినది. అదిగాక, దీని గణిత విధానము హైజన్‌బర్గు గణితపద్ధతికంటె చాల సులువైనది కూడా.

కనుక ప్రత్యక్షమే ప్రమాణమను హైజన్‌బర్గు సిద్ధాంతము, అప్రత్యక్షము ప్రమాణముగాగల శ్రాడింగరు సిద్ధాంతము — రెండూకూడా — ఒకే సత్యమును నిరూపించుచున్నవి. ఈ రెండువాదములకు పర్యవసానమున భేదములేదని స్పష్టపడినది. విరుద్ధ ప్రమాణములతో కూడిన సిద్ధాంతములకు పర్యవసానమున భేదములేకుండుట సిద్ధించినది. ఇది ఒక గొప్పవిషయము.

మరియు, ఈ శ్రాడింగరు సిద్ధాంత మందింకొక నిగూఢమగు, వింతవిషయ మున్నది. కాంతి తరంగములు (*light waves*) ఆకాశము (*space*) నందు, శబ్దతరంగములు (*Sound waves*) గాలియందు ఆధారపడి యున్నట్లు కణ-తరంగ స్పందనముచే పుట్టు తరంగములు ఒక వింత ఆకాశమందు ఆధారపడి యున్నవని శ్రాడింగరు గణితమువలన తెలియు చున్నది. మన మెరిగిన ఆకాశమును (*oridnary space*) పొడుగు, వెడల్పు, ఎత్తు అను మూడు నిరూపకముల (*Co-ordinate*) మూలమున తెలిసికొను చున్నాము. కణతరంగములయందు గర్భితమైన వింత ఆకాశమునకు నిరూపకములు మూడింటి కంటె ఎక్కువగా ఉండును. హైడ్రజను కణ-తరంగమందు మాత్రము మూడే ఉండును, హీలియమునందు ఆరు ఉండును. ఇట్లే బరువుపెరిగిన కొలది పరమాణువుల లోని ఆకాశముయొక్క నిరూపకముల సంఖ్య పెరుగు చుండును. మూడింటికి దాటిన నిరూపకములుగల ఆకాశమెట్టిదో ఊహించవీలులేదు.

ఈ వింత ఆకాశమందుండు తరంగములు మనకు తెలిసిన తరంగములవంటివని చెప్పవీలులేదు. ఈ వింత తరంగములను, సంభావ్యతరంగములు (*Probability*

waves) అని చెప్పవచ్చును. ఈ విషయము లన్నియు అపూర్వములు, గణితనుయములు. అట్టి తరంగములను భావింప వీలులేకున్నను వాటితో చేసిన గణితము వలన ప్రత్యక్షవిషయములకు వ్యుత్పత్తి లేలుచున్నది గనుక అదేదో తెలియని వాస్తవికత (*reality*) నిగూఢముగా ఉన్నదని చెప్పక తప్పదు.

కణ-తరంగ మెట్టివస్తువో, అందలి వింత ఆకాశ మెట్టిదో ఊహాతీతము - అనిర్వచనీయము—అవ్యక్తము—నిగూఢము-అవాఙ్మానసగోచరము! ఇంద్రియములకు, అగోచరమైనట్టి సత్యము నిత్యముమైనదేదో యున్నదని నవీన భౌతికశాస్త్రమువలన గ్రహించవలసియున్నది ప్రత్యక్షముగా తెలిసికొనే సత్యము కాక, దానికివెనుక పరోక్షముగ సత్యముకూడ యున్నదని చెప్పవలసియున్నది. ప్రత్యక్ష సత్యమును భౌతిక శాస్త్రముచేత విచారణచేసి తెలుసుకుంటున్నాము. మనస్సును మించినట్టి ఆత్మను సాధనముగా, ప్రత్యక్షమునకు మించిన పరోక్షమును, సాధించవచ్చునా యను తత్వజిజ్ఞాసకు తావు ఏర్పడుచున్నదేమో! ఈ సందర్భములో బోర్ శాస్త్రవేత్త, తత్వవేత్తవలె చెప్పిన మాటలు గణనార్హములు.

భౌతికశాస్త్ర విషయము లన్నియు ప్రాణము లేని పదార్థములతో చేసిన పరిశోధనలవలన గ్రహించినవే. అట్టి శాస్త్రజ్ఞానములో ప్రాణుల చర్యలను గ్రహించవీలులేదు. ప్రాణుల చైతన్యక్రియ లన్నియు ఆత్మకు సంబంధించి యుండును. అందుచేత ప్రాణుల క్రియానిమర్శనము ఆత్మతత్వశాస్త్రము (*psychology*) నకు సంబంధించియుండును. కాంతి చేత ప్రకాశమానముచేసి పరమాణువుయొక్క స్థితిని పరిక్షించునప్పుడు కాంతికిరణము (ఫోటాను) కణముయొక్క తాకుడుచేత పరమాణువుయొక్క పూర్వపు స్థితి మార్పుచెందునని అనిశ్చయతత్వ సూత్ర వివరణయందు తెలిసికొంటిమి అట్లే ప్రజ్ఞను బాహ్యము నుండి లోనికి మళ్ళించి, చింతన చేయుటచేత, లోపలితత్వము మార్పుచెందునని బోర్ అభిప్రాయపడినాడు. ప్రత్యక్షసత్యమును దాటి, పూర్ణసత్యమును ఈ ఆధ్యాత్మచింతనచేత అందుకోవచ్చునేమో!

ప్రత్యక్ష సత్యసాధనములతో నిండి భౌతిక విషయములయందు మాత్రమే కార్యకారణభావము (*Causality*) వర్తించునని, ఆత్మవిషయములయందు కార్యకారణభావము నతిక్రమించిన స్వేచ్ఛ—స్వతంత్రము—(*free-will*) ఉండగలదని బోర్ అభిప్రాయము. ఆత్మవిచారణచేత ఆత్మకు—దేహమునకు (*soul and body*) గల సంబంధమును తెలిసికొనవచ్చునని యంటున్నాడు. కొందరు భౌతిక శాస్త్ర నిపుణులు ఆధ్యాత్మవేత్తలవలె జిజ్ఞాసలు చేయ మొదలిడుచున్నారు. దీనికి కారణము—సాధారణుల కందని విషయ జిజ్ఞాసలోనికి నవీన భౌతికశాస్త్రము పురోగమించుటయే యని చెప్పవలెను. ఇట్లు పోగాపోగా పూర్ణసత్యదర్శనమునకు నమ్మకముతో పరిశోధనలు అనంతముగా జరుపుటయే కార్యము.

మా సంక్రాంతి ★

శ్రీ వోలేటి పార్వతీశం

శర్వరీవియన్నైల్య నిశ్వాసధామ్య
శకల సకల జలధరాల శతసహస్ర
కోటి తారకాంకితకాంతి వాటి దాటి
క్రాంతి సంక్రాంతి వీటి కేతెంచె? ఉదయి

శాంతి వైహ జీవి శాశ్వాస నిలయ
గేహళి బ్రతుకుమంట వెళ్లించి, నిద్ర
తాంత శారీరి కాలసత్వమ్ము శీత
సాంద్రతలు సురాళింపు వైశ్వానరాన.

ఈయుషస్వినీకాంత సాంధ్యాతిక నీల
గలసరాగ కాంతికల సంక్రాంతి రేఖ
విరిసినది కల్వరేకు కావిరులలోన
బరువుగా నిశ్వసించు మాపాడు గుడిసె!

మాకు సంక్రాంతిలేదు! చీకాకు చింత
సంతరించి, మామొడద సంజ్వాల సమాణ
సైతిహోత్రహోమమ్ము త్రవ్వించు మాకు
త్రోపుడుల యాట నిత్య మృత్యుజ్వరమ్ము.

సంకల్ప సిద్ధుడు

★

శ్రీపంతుల శ్రీరామశాస్త్రి

శంకర శాస్త్రుల్లుగారిని తెలిసిన వాళ్ళంతా ఆయన గురించి చిత్రంగా మాట్లాడుతారు. 'ఆయనకేమి టయ్యా, లక్షాధికారి, బైటికి అలావుండగా నేసరా?' అని కొందరూ, 'లక్షాధికారే, అయితే ఎక్కణ్ణించి వచ్చిందిదంతా? వడ్డీలకు వడ్డీలు పెంచి లాకట్లు వాకట్లు చేసేసుకొని సంపాదించినదేకదూ?' అని కొందరూ, "సంకల్ప సిద్ధుడంటే ఆయనేనండీ, చిన్నతనంలో ఒక మారు తనలో తాను నిశ్చయం చేసుకొన్నాడు. తనచేతిమీదుగా ఒక లక్షారంపైగా సంపాదించాలని, అంతే అంతవరకూ మనిషి పట్టిన పట్టు విడవలేదు—" "నిజమే, సంపాదించాడయ్యా, కాని ఏం ఫలితం? దమ్మిడీ దానం ధర్మం అని లేదు కదా, ఎంగిలి చేత్తో కాకినయినా కొట్టడే,వట్టి నిర్గంధ కుసుమం" అని కొందరూ ఇలా బైటికి స్పష్టంగా అనకపోయినా, లోపల్లోపల శంకరశాస్త్రుల్లంటే ఏదో ఈర్ష్య ఉన్నట్టే మాట్లాడుతారు.

ఇందుకు కారణమేమిటా అని ఆలోచిస్తే ప్రధానంగా ఒక్కటే కనిపిస్తుంది. శంకర శాస్త్రుల్లు ఒంటరి మనిషి. కొడుకులూ కూతుళ్ళూ కాదు, తదితర సమీప బంధువులు కూడా లేని మనిషి. అతనికి కాస్త డబ్బు చేకూరిన తరవాత, దూరపు బంధువులు కొందరు అతనితోడి తమ బాంధవ్యాన్ని పునరుద్ధరింప తలచుకొని హతాశులయేరు. ఇక, ఇటువంటి ఇరస్తా పరస్తాకాని, శంకరశాస్త్రుల్లు దగ్గర లక్ష రూపాయలుండడమూ? అదీ, ఏదో పిత్రీయ మయిన ఆస్తిగాని, ఏలాటరీలోనో హఠాత్తుగా అప్రయత్నంగా వచ్చినటువంటిది కాక, కేవలం స్వార్జితమని ఒక్కొక్క రూపాయ చొప్పున పెంచిన ఆస్తా? ఇక ఈర్ష్యకేంలోటు? తావేం బాగా చదువుకొన్నవాడా? మొదట కొన్నాళ్ళు సంస్కృతం చదివి, తరవాత ఇంగ్లీషు ఆరంభించి, నాలుగున్నర అంటే ఇప్పటి మూడవ ఫారములో చదువు చాలించినవాడు. పోనీ అలాగని చదువుకోకపోయినా సహజమయిన మేధా సంపద విపరీతంగా కలవాడేమో అంటే అదీ లేదు. ఇన్ని సంవత్సరాలుగా కడుతున్న వడ్డీ లెక్కలు ఈ సరికి మరొకరికయితే కంఠతా రావలసింది, అయిదు వందలకి వెయ్యికి ఆర్నెల్లకి వడ్డీ కట్టడానికి కూడా అరగంటసేపు పలక మీద లెక్క చేస్తాడు. ఒకమారు వచ్చిన మొత్తాన్ని కాగితంమీద వేసుకొని దాన్ని చూడకుండా మళ్ళీ పలక మీద చేసి రెండు మొత్తాలూ సరిపోతే అప్పుడు తృప్తిపడేవాడు. రెండు మార్లూ ఒకే రకం తప్పు చేసి ఉండవచ్చుననే అనుమానం ఆయనకు కలగదు.

అవలీలగా ఎంతెంతలేసి లెక్కలూ నోటితో చేయగలిగిన వాళ్ళు, అనర్గళంగా గంటల తరబడిని ఉపన్యసించ గలిగిన వాళ్ళూ, అమూల్యమయిన పథకాలు వేయగలిగినవాళ్ళు, అతిలోక రమణీయమయిన కవిత్వం వ్రాయ గలిగిన వాళ్ళు—ఎందరో మంది తమకు శంకరశాస్త్రుల్లు యడల కలిగిన ఈర్ష్య చాలా ధర్మ్యమయినదనే నమ్మకొనేవారు.

నిజం చెప్పవద్దూ, నామటుకు నాకూ ఒకప్పుడలాగే ఉండేది. నాకే లక్ష రూపాయిలుంటేనా, ఎన్నో గొప్ప పనులు చేసే వాణ్ణి. ఏమిటో అని నాకే నిశ్చయం లేదనుకోండి. శంకరశాస్త్రుల్లుకి అంత డబ్బును ధర్మంగా సంపాదించదగిన తెలివి తేటలు లేవు; ఇక ఉన్న డబ్బును లోకోపకారం నిమిత్తం కాకపోతే మానె అధమం తన ఆనందం కోసం అయినా ఖర్చుపెట్టే చొరవలేదు. గనక, అది కలిగి ఉండడానికి అతనికి అర్హతలేదు. అంతే కాదు, ఈ మాత్రం డబ్బుందికదా, నాకేం ఉచితంగా అక్కర లేదు. ప్రస్తుతం కొంత పెట్టుబడి కింద ఇయ్యకూడదా? ప్రస్తుతం ఏమీ హామీ లేక పోయినందువల్ల అపనమ్మకం పెట్టుకోవాలా? తరవాత అణా పైసలుతో సహా అసలు వృద్ధులు తీర్చివేయనూ? వ్యక్తి గౌరవం మీద శంకరశాస్త్రుల్లుకి అంతపాటి నమ్మకం ఉంటే మరింక కావలసిం దేమిటి?— నాకు పెళ్ళి అయి, పెళ్ళాం పిల్లలూ ఉంటేమాత్రం

మించి పోయిందేమిటి? తాను నన్ను పెంచుకో రాదూ? ఎవణ్ణో కళ్ళు తెరవని పసి కూనను పెంచుకొని వాడికి చదువు చెప్పించితే, ఒకప్పుడు ఆ దత్త పుత్త్రుడుకి చదువబ్బక పోవచ్చును. నేను ఇప్పుడే గ్రాడ్యుయేటుని—ఆ తరవాత వాడికి పెళ్ళి చేసి, తీరా చేస్తే దంపతుల మధ్య ప్రేమానురాగాలు లోపించవచ్చును. పోనీ, దంపతులు సానురాగంగానే ఉన్నా వాళ్ళకు పిల్లలు కలగక పోవచ్చును. ఇంత పెంచుకొన్న ప్రయోజనమూ నశిస్తుంది. వంశం నిలబడకపోతే వాళ్ళూ మళ్ళీ దత్తత చేసుకొని, ఇన్ని పాట్లూ పడాలి. అటువంటి చిక్కు లేవీ కలక్కుండా నన్నే దత్తత చేసుకొంటే—గిరీశం చెప్పాడే, పెళ్ళిమీద పెళ్ళి, పెళ్ళిమీద పెళ్ళి చొప్పున బాల్యవివాహాలూ చేసి చివరికి నావంటి ప్రయోజకుడికిచ్చి పెళ్ళి చేస్తే, అని, అవిధంగా ఉండదూ? ఉండకేం, మహారాజులా ఉంటుంది. కాని, ఈ బుద్ధి నాకూ మీకూ కలిగి ఏం లాభం? ఆశంకర శాస్త్రుల్లుకి కలగాలిగాని,...అలా అలా విభజించుకొని పోతే నా ఈర్ష్య ఇన్ని చిలవలూ పలవలూ వేసింది.

ఇదంతా వెనక ఎప్పుడో శాస్త్రుల్లుగారిని గూర్చి సరిగా తెలియనప్పటి సంగతి. ఇప్పుడుమాత్రం నాకు ఆయనను తలచుకొంటే ఈర్ష్య కలగదుగాని, అదో కమాదిరి జాలితో కూడిన ఉపేక్షాభావం కలుగుతుంది. లేదు నీలో ఇంకా అంతర్వాహినిగా అప్పటి ఈర్ష్యాభావమే ఉంది; దానికి కొత్తరంగు పూస్తున్నావు అంటే మరిచెప్ప లేనుగాని, నా దృష్టిలో కలిగినమార్పుకు కారణాలు తెలియజేసుకొంటున్నాను.

ఆయన అటూ ఇటూ పూర్తికాని, చదువుతో, ఎలాగో అతికష్టంమీద గవర్నమెంటులో పాతిక రూపాయిల జీతంమీద గుమాస్తాగిరీ సంపాదించాడు. లంచాలు పుచ్చుకోక పోవడమూ, యథార్థంగా ముక్కుకు సూటిగా పోవడమూ కారణంగా మాత్రమే ఉద్యోగం పోయిందట. తాను స్వయంగా లంచాలు పుచ్చుకోలేనివాడు తనపై అధికారులకు సదుపాయాలూ మామూళ్లు ఏం చూడగలడు? కొత్త సంసారం, అందులో ఇంటియజమానికి ఉద్యోగం లేని సంసారం, అందులో ఒకచిన్న పిల్ల—ఆ పిల్లకు ఉద్యోగం ఉన్న కొద్ది సంవత్సరాలు అతిగా ముద్దు జరిపేడు... అటువంటి రోజుల్లో ఉద్యోగం పోవడంతో, మనిషికి ఒక వెఱ్ఱి పట్టుదల వచ్చింది. ఎంత దూరమయినా సంభావనలకూ సంతర్పణలకూ హాజరయేడు. కోమట్లకు లెక్కలు పరిచూసి పెట్టేవాడు. దస్తావేజులు రాసేవాడు; జాతకాలు చూసేవాడు స్వయంగా తనకు విశేషం నమ్మకం లేకపోయినాను. ఇలా, ఒకటేమిటి, రాత్రిం దివములు అలా ఏదో పని చేస్తూనే ఉండేవాడు.

ఆయన భార్యకూడా అన్నివిధాలా కలిసి వచ్చిన మనిషే. ఆవిడ పొందిక జగత్ప్రసిద్ధి చెందినది. ఆ పొందికని వేరే మాటల్లో చెప్పాలంటే, కేవలం ప్రాణం నిలబడి ఉండడానికి తగిన కనీసపు ఆహారాన్ని మాత్రమే తీసుకొంటూ, చిరుగులుకుట్టిన వస్త్రే తప్ప బట్ట కనబడనంత వరకూ ఉపయోగిస్తూ, ఏ యితరఖర్చూ పెట్టకుండా నిద్రపోయినకొద్ది గంటలు మినహా ఏదో తృణమో కణమో కలిసివచ్చే పని చేస్తూ ఉండడం...ఆయన కేవలం చెంబు పట్టుకొని, యాయవారానికి వెళ్ళ లేదు: ఆవిడ ఇంత జీతానికీ ఆని వంట లక్కగా నిర్దయంగా ఎక్కడా కుదురుకో లేదు. అంతేగాని, ఇద్దరూ అంత పనీ చేసేవారు.

ఏ పేటాఫలసాయం సరిగా రాని భూమిని అమ్మగా వచ్చిన కొద్దిపాటి మూలధనంతో వడ్డీవ్యాపారం ఆరంభించాడు. వందా యేభైయేకాదు. ఒకటీ రెండూ అయిదూ పదీ వడ్డీకిచ్చేవాడు. ఇవ్వడమయితే, ఎంత కీమని ఇచ్చేవాడో, వసూలు చెయ్యడంలోనూ అంత కట్టుదిట్టంగా ఉండేవాడు. అందరూ అతన్ని శాపనార్థాలు పెట్టేవాళ్లే. 'అప్పుడేదో తెలియక బుద్ధి గడ్డితిని పుచ్చుకొన్నాం, ఇక మరెప్పుడూ ప్రాణంపోయినా అతనిదగ్గర అప్పు తీసుకొని రాకూడదనుకొనేవాళ్ళే. కాని మళ్ళీ అవసరం కలిగి అతని దగ్గరకి వెళ్ళినప్పుడు అతను పాత సంగతులన్నీ మరిచిపోయి ఉంటాడనే తమను తాము నమ్మించుకొనే వారు; అతనూ నిజంగానే మరిచిపోయినట్లే ఉండేవాడు. వాళ్లిష్టం ఏమాట అనుకొనీ, మాటలేం మనమీదపడి కొట్టేయా? మనడబ్బు మనకి ప్రధానం! ఇదీ అతని తత్వం.

భార్యకి జబ్బుచేసినప్పుడు ఆయన డబ్బిచ్చి వైద్యం చేయిస్తాననే అన్నాడు. ఆమెమాత్రం ఉచితంగా వచ్చే మందులిప్పు, తనకు వంటిమీద స్పృహ

ఉన్నంతవరకూ ఒకదమ్మిడీ అయినా ఖర్చుపెట్టనియ్య లేదు. ఆమె పోయిన తరవాత, అప్పటికే పన్నెండేళ్ల పిల్ల కూతురికి పెళ్లి చేసేడు. తరవాత నాలుగయిదేళ్ళలో దురదృష్ట వశాత్తు, ఆమెకు వైధవ్యం ప్రాప్తిస్తే అదంతా శంకరశాస్త్రులు ముసలివాడికిచ్చి పెళ్లిచేసిన కక్కుర్తి ఫలితమే అంటారు కొందరు. అయినా వాళ్లకి అసలు విషయమేమిటో కావలిస్తే కదూ, తనంటే కిట్టక ఏదో అలా అంటారంతే.

కూతురు తిరిగి వచ్చిన తరవాత ఒక ఏడాది పాటు బాగానే ఉంది తన స్థితికి తగినట్టుగా. తరవాత కాశీయాత్రకి వెళ్తానంది. ఒక వారంరోజులు పాటు ఆలోచించి, ఇక దానికి ఐహిక జీవితంలో మరేవీ అవలంబనం లేదు; ఎప్పటి కయినా ఆ ముష్మికం చూసుకోవలసినదే కదా అని, డబ్బిచ్చి తెగిన పెద్దవాళ్లతో కలిపి పంపాడు. ఆ వెళ్లడం కూతురు ఎవడితోనో లేచిపోయిందనీ, యాత్ర అన్నది కేవలం ఒక మిష అనీ, తెలిసింది. 'సరే, దాని మొగుడితో పాటు అదీ పోయిందనేసు కొంటా' నన్నాడు శంకరశాస్త్రులు.

ఇప్పుడు బాగా పెద్దవాడయి పోవడంచేత, ఎక్కడికీ కదలలేడు. ఎప్పుడూ ఇంట్లోనే ఉంటాడు, ఉంటాడంటే ఊరికే గోళ్లు గిల్లుకొంటూ కూర్చుంటాడా? పెరట్లో అన్నిరకాల కాయగూరలూ పండిస్తాడు. తనకు ఎక్కువయినది అమ్మేస్తాడు, ఓపికగా బియ్యపుగింజలు ఒక్కొక్కటే ఏరుకొని, వండుకొని, భోంచేస్తాడు, ఒక్కపూటే. రెండవ పూట ఏదో ఒక పండుతిని కొద్దిగా మజ్జిగ తాగుతాడంతే.

ఇప్పుడు మునపటి ఆ వసూలు చేసుకొనే ఓపికా, జ్ఞాపకశక్తీ తగ్గిపోవడంవల్ల, కేవలం బంగారం వెండి వస్తువులమీద తప్ప డబ్బు ఇవ్వడం మానుకొన్నాడు. అతని దగ్గర డబ్బు తీసుకొని వెళ్ళిన ప్రతివాళ్ళూ అంటూ ఉంటారు. "ఇంత ముసలివాడయేడు. నా అన్నవాళ్లెవరూ లేరుకదా ఎందుకంత డబ్బు కక్కుర్తి చెప్మా?" అని. కాని, ఆ కక్కుర్తివల్లనే, తనకు ఆమాత్రం అప్పు ఇయ్య గలపాటి డబ్బు చేరిందనీ, అతడు అందరిలాగే సామాన్యమయిన జీవితం గడిపి ఉంటే, అందరికంటే దరిద్రుడుగానే ఉండునని గ్రహించరు.

అతని జీవిత వివరాలు తెలుసుకొన్న తరవాత అతన్ని చూసి ఎలా ఈర్ష్యపడడం? మళ్లీ నా జీవితమంతా మొదటనుండీ బతకడానికి సావకాశం ఉన్నా, అతని జీవితం వంటిది ముమ్మాటికీ నాకక్కరలేదు. నాకే కాదు, చాలామందికి అలాగే ఉంటుందనుకొంటాను.

అడవిలో పట్టిన తేనెపట్టు ఎవరికీ లభ్యంకాకుండా పోతున్నదే అనుకొంటే ఎంత ఫలితమో, అతని డబ్బు ఎవరికీ కాకుండా పోతున్నదే అనుకొన్నా అంతే ఫలితం. అయితే తేనె పట్టులోని తేనెను సమకూర్చడానికి తేనెటీగలన్నీ కలిసి పడ్డకంటే ఎక్కువే కష్టపడ్డాడుగాని తక్కువ పడలేదు దానిని సంపాదించడానికి. అటువంటి శంకర శాస్త్రులును చూసి ఈర్ష్యపడడం దేనికి? ఇంతకీ అతని ఆస్తంతా మహా ఉంటే ఒకటిన్నర లక్షలు. ఆ మాత్రం మొత్తాన్ని అవలీలగా ఏమీ లక్ష్యంలేకుండా ఖర్చుపెట్టే శ్రీమంతులున్న మన వ్యావహారిక జగత్తులో అతన్ని గురించి అంతగా అనుకోడం ధర్మంకాదు కాని, భూగర్భంలో నిక్షిప్తమయి ఉన్న అమూల్యమయిన ఖనిజాల గురించి కలగని ఆలోచన తేనెపట్టును చూసే సరికల్లా కలుగుతుంది ఎలా దీన్ని సంపాదించడమా? దీనిలో ఏ మాత్రం తేనె ఉంటుందా? అని.

లోకులు, నాతోపాటు ఎవరేమనుకొన్నా సరే శంకరశాస్త్రులుగారు మాత్రం సంకల్ప సిద్ధుడు. ఆ తృప్తి లేకపోతే ఆయన ఇన్నాళ్ళు బ్రతికనే లేక పోయేవాడు.

యజ్ఞఫలము

భాసమహాకవి సంస్కృతనాటకమునకు ఆంధ్రీకరణము

శ్రీ బులుసు వేంకటేశ్వరులు

[భాసమహాకవి సంస్కృతములో నిరువదిమూడు నాటకములు వ్రాసినాడని యందు "కిరణావళి" "మకుటతాడితకము" "ఉదాత్తరాఘవము" మున్నగునవి కలవని శ్రీ ఆర్. వి. కృష్ణమాచారిగారు వ్రాసిరి. ఇటీవలనే రాజవైద్య జీవరామకాళిదాసశాస్త్రి గారు "యజ్ఞఫల"మను ఈనాటకమును సంపాదించి ప్రకటించి యిది భాసమహాకవికృతమే యని నిరూపించియున్నారు. ఈ యభిప్రాయమును విమర్శకాగ్రేసరులగు డాక్టరు. పుసలేకర్, ప్రొఫెసరు సిన్హా మున్నగువారు విపుల విమర్శతో దీనిని బలపఱచియున్నారు. ఈ విషయములెల్ల ప్రత్యేకవ్యాసమున నిరూపితమగును. ఇంతవఱకీ నాటకమే భాషలోనికి ననువదింపబడలేదు. ఈ తెలుఁగుసేఁతయే ప్రప్రథమ భాషాంతరీకరణము.]

ఇందలి పాత్రలు

సూత్రధారుఁడు
సుమంత్రుఁడు
కాంచుకీయుఁడు
విదూషకుఁడు
చిత్రకేతుఁడు, చిత్రపదుఁడు } గంధర్వులు
రావణుఁడు
మాళవకుఁడు, భషకుడు, దంతిలుఁడు, గోపలుఁడు } వైతాళికులు
దేవతలు
గంధర్వులు
రాక్షసులు

దశరథుఁడు [రాజు]
విశ్వామిత్రుఁడు
వసిష్ఠుఁడు
రాముఁడు, భరతుఁడు, లక్ష్మణుఁడు, శత్రుఘ్నుఁడు } కుమారులు
జనకుఁడు
పరశురాముఁడు

నటి
విజయ
చేటి
మంథర
కౌసల్య, సుమిత్ర, కైకేయి } రాణులు
మధురిక, చతురిక, పుష్పలిక, చంద్రకళ } సీత చెలికత్తెలు
సీత, మాండవి, ఊర్మిళ, శ్రుతకీర్తి } వధువులు

(నాంద్యంతమున సూత్రధారుడు ప్రవేశించును)

సూత్ర :

"శ్రీరాముండు కృపాళుఁడా భరత
సుశ్రీమంజులాకారుఁడున్
చారుశ్రీ శుభలక్ష్మణ ప్రథితుఁడున్
శత్రుఘ్న వీరుండు వి
స్తార ప్రాభవ మాని చంద్ర కృత
యజ్ఞత్రాత, కోదండ హ
స్తా రాఘవుండు ప్రసన్నమూర్తి
నిరతోత్సాహుండు మిమ్మేలుతన్."

(తెరవంక జూచి) ఆర్యా! ఒకపారి యిటు రమ్ము.

నటి : (ప్రవేశించి) ఆర్యపుత్రా! వచ్చితిని. ఏమి పని?

సూత్ర : ఆర్యా! ఈ సభాసదులు మనము ప్రయోగించు నాటకము చూడ గోరుచున్నారు. వీరి సంతోషము కొఱకై వసంతఋతువునుగూర్చి నీవొక పాట పాడుము.

నటి : సరే. (పాడును)

పాట :

"క్రొంజివుళ్ళ చేత మిసుల గోమలంబు లౌ లతల్
మంజులంబు లైన తియ్య మామిడిక్ సుగంధముల్
రంజకంబు లిట్టి తోట రక్తి చెందుచుండగన్
సంజవేళ మల్లెపూలు సరసమాడు నవ్వులన్."

సూత్ర : బాగు. బాగు. నీ పాటవలన నందఱు సంతోషించుచున్నారు.

(తెరలో) "ఏమి! అందఱు సంతోషించుచున్నారు గదా!"

సూత్ర : (విని) ఓహో!

"పుత్రజన నోత్సవంబున భూవిభుండు
తనర, నుత్సవదాన సత్కారములను
పౌరు లెల్లర సంతోషపఱచి యిచటి
కిదె సుమంత్రుడు విచ్చేసె, పద లతాంగి!"

(నిష్క్రమింతురు)

ఇది స్థాపన.

ప్రథమాంకము

(ప్రవేశము : సుమంత్రుడు)

సుమం : ఏమీ! అందఱు సంతోషించుచున్నారుగదా!

"పౌరులు తుష్టులైరి మఱి
బ్రాహ్మణు లెల్ల రభీప్సితార్థవి
స్తార సుఖాబ్ధి దేలిరి; ముదంబున
శ్రోత్రియపుంగవుల్ సదా
చారులు సత్తమవ్రతులు సంయము
లందఱి తృప్తి సర్వస
త్కారపరంపరన్ ; దలప
గామ్యము తీరనివార లే రికన్."

కంచుకి : (ప్రవేశించి) అమాత్యా! పురజనులను జానపదులను సంయములను సర్వజనములను సర్వవాంఛాపరితృప్తుల నొనరింపు మని నీకు మహారాజాజ్ఞయైనది. ఏయొక్కడైనను నెట్టికోరిక కోరినను దీరనివాఁ డుండరాదని మఱి మఱి నొక్కి చెప్పిరి.

సుమం : మహారాజుమనసు తెలిసి నేనే సర్వము నొనరించితిని.

కంచు : మంచిది. సుమంత్రా! మంచిది.

"జనపతియాంతరహృదయం
బు నెఱింగి యమాత్యపుంగవుండు శుభంబుల్
బొనరింప ధర్మసంగతి
గను నపవర్గంబు బరమకల్యాణంబున్."

మఱియు, నెవ్వ రెవ్వ రెచ టెచట నేయే కారణములచే బద్ధులైయున్నను వారివారి నెల్లర విడిపింపుమని రాజాజ్ఞ.

సుమం : బద్ధు లెవ రున్నారు?

"దొంగలు లేరు రాజ్యమున
దుష్టులు వేదము లచ్చువారల
న్యాంగన గోరువారు మఱు
వానెదువారును ద్యూతకారు లె
న్నం గనరారు మందున కనంగ ;
విత్రాణనుబద్ధుఁడౌ నృపుం
డంగనలం గుమారకుల నంది
గడించెను దివ్యముక్తతన్."

విదూ : (ప్రవేశించి) మహారాజుగారి పుత్రకామేష్టిఫల మిప్పుడే సఫలమైనది. ఇన్నాళ్లు నేను మోదకములు మెక్కుటలో నా జఠరముపై నేమాత్రము దయ చూప లేదు. ఇటువంటి యజ్ఞములు చాలగైనవా నే నప్రతిరథుడ నను మోదకహరి నగుదును. నావంటివిప్రులు భోజనము చేసి తుష్టులగుబోనే యజ్ఞకర్మ సఫలము కాదు.

సుమం : ఓయీ! సుందరకా! నీకు సువర్ణము చాలినంత లభించినదా?

విదూ : ఏమి? నేను సువర్ణమును దినను. త్రాగను. ముట్టను. బంగారము ప్రియమనుటకు నేను రాజు ననుకుంటివా కోమటి ననుకొంటివా?

కంచు : ఓ మహాబ్రాహ్మణా! మఱి నీకేది ప్రియము?

విదూ : మోదక భోజనము.

కంచు : నీ వెన్ని మోదకములు తినగలవు?

విదూ : మహారథుఁడగు మహారా జెంతమంది శత్రువులను జంపగలఁడో యన్ని.

కంచు : పదివేలమంది శత్రువులను జయింపగలవాఁడే మహారథుఁడు.

విదూ : నేను పదివేల మోదకములను దినగల మహారథుఁడను.

కంచు : ఏమి? ఒక్కదినమున నీవు పదివేల మోదకములు తినగలవా?

విదూ : ఏమి? ఒక్కదినములో మహారథుఁడు పదివేలమంది శత్రువులను జంపగలఁడా?

కంచు : పదివేలమందిలో గొంతమంది చనిపోవుదురు. కొంతమంది పాఱిపోదురు. కొంతమంది చెల్లాచెదరగుదురు. కొంతమంది శరణుచొత్తురు. వీరిని మహారథుఁడు రక్షించును.

విదూ : నేనును గొన్ని మోదకములను మ్రింగుదును. కొన్నిటిని చెదరగొట్టుదును. కొన్నిటిని జిఱుకగొట్టుదును. కొన్నిటిని దయతో రక్షింతును.

సుమం : బాభ్రవ్యా! వైతండికుడు హేతువాదమున కొప్పుకొనడు. వీనితో నేమి? నేను నా పని చేసికొని మహారాజు నభినందింప నేగుదును. (ముందు చూచి) ఓహో! సపరిజనుఁడై మహారాజిటకే వచ్చుచున్నాడు.

కంచు: నేను నాపనికై పోవుదును. (నిష్క్రమించును.)

విదూ: నేను తినగా మిగిలిన మోదకములను దాచుకొనుటకై పోదును. (నిష్క్రమించును.)

సుమం: ఆహా! మహారాజు వార్ధకదశయందైన నెంత రమణీయాకృతితో నొప్పుచున్నాడు! నిత్యము రాజకార్యముల నిర్వహించుచున్నను నాతడు నిత్య ప్రసన్నుడుగనే యుండును.

"సవనశతంబు లొక్కరొడ జల్పను;
జూచుకొనన్ స్వకార్యముల్
వివిధము లొక్కవంక; నరి
వీరుల నుక్కడగించు నొక్కటన్
విపులగ దన్పు నొక్కటను మిత్రుల;
నొక్కెడ వేటకేగు; ని
ట్లవిరళ కార్యభారమున నందదు
దుఃఖ మొకింతయేనియున్."

"తరుణ వయస్కు నట్లు సతతంబు
నొనర్చును స్వీయధర్మముల్
పరిణతి నందినన్ వయసు పాయదు
తేజము రాజచంద్రునిన్
నరవరచంద్రు పేరు వినినన్ గనినన్
జనముల్ రవంతయేన్
దురితము వంక బోరు; విజయుర్వ
కలాపము లొక్క త్రేల్మడిన్."

(సపరివారముగా రాజు ప్రవేశించును)

రాజు:

"రిపుభయ మింతయేనియు
ధరిత్రిని లేదు; సమస్త మానవుల్
విపుల వయార్థ సంపదల
విశ్రుతి గాంచిరి; అన్యవస్తుదు
ర్కృపలతో గాంచువారును
రుజాధరతన్ విలపించు వారలున్
కపటము జూపువారును
నకాలమృతిన్ గనువారు లేరిటన్."

"కాలవర్షంబు గురియు మేఘంబు లెపుడు
ఈతిబాధలు లేక సస్యేందిర కృషి
ఫల మనంత మొసంగును అలఘుపుణ్య
కలిత దైవానుకూల్యంబు కలుగబట్టి."

"వేద మధీతమయ్యె; రిపువీరులు
ద్రుగ్గిరి; భూప్రజల్ సుఖా
పాదితులైరి స్వీయపరిపాలన
మందున బోలె; నెవ్వరె
య్యేది మనంబులన్ దలచి రెల్లర
కయ్యది చేకుఱెన్; మఱిం
కేది యొనర్పగా వలయు నిప్పుడు
నేను మహీజనార్థమై."

"దేవతలన్ వితరులు భూ
దేవతలన్ శరణుగోరు దీనులు నార్తుల్
వేవిధముల బూజితు లను
టే విధి వంశవ్రతంబు నిష్టము నాకున్."

"పుత్ర జననంబుచేత సంపూర్ణమయ్యె
మన్మనోరథ మహిత సమున్నత్య ఫలము;
ఇంతకంటెను మన్మనోభీప్సితంబు
లేదు వేఱొండను; సంతుష్టి లేదు వేఱె."

సుమం: (సమీపించి) మహారాజా! జయము.

"ప్రజల బాలింప యోగ్యు లాత్మజుల గాంచి
యాత్మభారంబు వారిపై ననుపు వలుప
హృదయభారంబు తొలగిపోయెనుగదా! నృ
పాలచంద్రమ! సంతృప్తి పైకొనె గద!"

రాజు: సుమంత్రా! నిజమే. నీవు వెంటనే సర్వార్థిజనమును సఫలాశాచిత్తుల గావింపుము.

సుమం: మహారాజా! కావించితిని.

రాజు: శ్రోత్రియులను గోహిరణ్య దానములచే సంతోషపెట్టుము.

సుమం: మహారాజా! సంతోషపెట్టితిని.

రాజు: కారాగృహబద్ధు లనువారి నెల్లర విడిపింపుము.

సుమం: మహారాజా!

"ధర్మపరిపాలనంబున ధరణిజనుల
రాజవై నీవు పాలించి రాజిలంగ
స్వర్గసౌఖ్యము లంది రొప్పార జనులు
బద్ధు లెవ్వరు? దుఃఖసంబద్ధు లెవరు?"

రాజు:

"పూర్వపుణ్యంబువలన రాజ్యభూమి పరమ
విస్తృతంబయ్యె; నింతటి విపులభూమి
ధర్మహీనుండు బంధనదండనమున
కర్హుడైనట్టి వా డొకండైన లేడె?"

సుమం:

"రాజసింహుడవై నీవు రాజ్య మేల
దుష్కృతం బొనరింపగా దొడగు నెవడు?
సూర్యుడు నిరభ్ర గగనాన శోభిలంగ
దారి కడ్డమువచ్చు నే తమము తలప."

"ఇంతకు బద్ధులైన నరు లెవ్వరు
లే రిక నుండ బోరు భూ
కాంతుడ! బద్ధమోహగుణము కల్గు
ప్రశంసయె లేదు చూడ నా
వంతయు; ద్వత్పితౄణపరిబద్ధుడ
వొక్కడ వీవె; కాని నీ
వంతయు జేసికొంటి వదె యార్య!
సుపుత్రమహోదయంబునన్."

రాజు: ఔను: నిజమే. పితరులఋణము తీర్ప గంటిని కాని, మఱియొక దృఢతరబంధమే నాకు

కలిగినది. దానిని గడద్రోచి ముక్తికను మార్గము మాత్రము కానరాకున్నది.

సుమం : ఏమది?

రాజు : ఏముందువా? నా నెత్తిమీద నెంత బాధ్యత పడినదో!

"చదివింపకావలె వేదశాస్త్రములు ;
వంశప్రాభవాచారముల్
మొదలన్ నేర్పవలెన్ ; వసిష్ఠ
పరమామోఘంబు నా ధర్మసం
పద చేకూర్పవలెన్ ;—రణస్థలిని
దివ్యాస్త్రాన్వితున్ గాంచి యా
పద పైబడ్డటు భీతిచెందురిపు
శ్రేణిన్ — నేను భీతిల్లెదన్."

"రాగద్వేష వివర్జితాత్ములె
మహారాజ్యంబు లేలన్ బ్రజా
యోగక్షేమము జూచి ప్రోవ గనగా
యోగ్యుల్ కదా! కాని నే
నీగంజాలను ధర్మబంధనము ;
నే దీర్ఘ త్రిరాగంబుతో
నై కల్గించె ద్విబద్ధతిన్, గలదె
ముక్తత్వంబు నాకేవిధిన్ ?"

"దృఢతరంబుగ బంధింపబడితి బుత్త్ర
రాగపాశంబునన్ ద్రెంపరాదు దీని ;
మోక్ష మెటుకల్గు బుత్త్ర వ్యామోహపాశ
బద్ధునకు ? నిట్లు నాస్థితి భయదముగను."

ప్రతీహారి : (ప్రవేశించి) మహారాజా! జయము. పుత్త్రోత్సవమైన పిదప కౌసల్యాదేవి మహారాజును జూడ వేడుకపడుచున్నది. తాను పెద్దభార్య గాన తొలుత నే తన్ను సంభావింప మహారాజును గోరుకొన్నది.

రాజు : విజయా!

"ఉత్తమవంశ ప్రభవయు
నుత్తమ పత్నియును నా మనుపలాలిత యు
త్కృష్టమ సుందరి దేవిని
నెత్తరిని నుపేక్షసేయ నిజరమ్యంబున్."

చేటి : (ప్రవేశించి) మహారాజా! జయము. సుమిత్రాదేవి మహారాజ కృపచే సుశీలమనియు దా నిద్దఱుకుమారుల గన్నతల్లియగుటచే ముందుగా సంభావింప గోరుకొన్న దనియు జెప్పుమన్నది.

"సర్వంసహా క్షమలోన ని
గర్విణి మన్మిత్రమా సకలసంగతులకా
పర్వవశంవద యామెయు
నోర్వ నుపేక్షింప దన్నియోగం బింకన్."

(అంత మంథర, విదూషకుడు ప్రవేశింతురు)

మంథ : మహారాజా! అభిజనానురూపాదరయు, రాణులలో కనిష్ఠయయ్యు గుణములలో జ్యేష్ఠయు, తనయ యయ్యు సగౌరవయు, మహారాజ బహుమతయు, అప్రతిరథుడను కేకయరాజు కూతురును నగుదేవి తానే ముందు సంభావింపదగిన దని నివేదింపుమన్నది.

విదూ : (తనలో) అహో! ఈరండ వచనోపన్యాసము! ఎంత గర్వసహితము! (ప్రకాశముగా) వయస్యా! ఉపేక్షించినచో కనిష్ఠయగుదేవి యేమి చేయునో వినదలచితి నని ప్రతివచన మిమ్ము.

రాజు : (తనలో)

"తనకు సుతునకు నభిషేకము
గొనగ బ్రతినగొన్న యామె కోపించినచో
ఘనమగు సింహికవలె నీ
మెను రాణులతో డగూడ మెప్పింపవలెన్.
(ప్రకాశముగా) మంథరా!
"పరమధర్మార్థకామ సత్పాలనమున
సేవనీయులపై భేదభావ మున్న
ముగ్గురను కూడ సమముగా ముదముతోడ
నాదరింతు సపుత్రుల నచిరమున నె."

అందుచే నందఱును మధ్యమమందిరమున నా రాక నిరీక్షింపుడంటి నని చెప్పుడు.

మంథ : (తనలో) ఏమి? మా రాణిని ముందు గౌరవింపడా? (ప్రకాశముగా) మహారాజా సెలవు ప్రకారమే.

(ప్రతీహారి, చేటి, మంథర నిష్క్రమింతురు.)

రాజు : అమాత్యా! నీవును వెళ్ళిరమ్ము. నేను రాణుల నభినందింతును.

సుమం : చిత్తము. (నిష్క్రమించును.)

విదూ : వయస్యా! నీవు ముగ్గురు దేవులను సమానముగా మన్నింపరాదు. సుమిత్రకిద్దఱు కొడుకులు—కైకేయి కొక్క కొడుకు. కావున, సుమిత్రపై జూపిన మన్ననలో సగమే కైకేయిపై జూపవలయును.

రాజు : వయస్యా!

"కనగ ధర్మార్థకామమోక్షములలోన
భేద మెటులేదో పుత్త్రులకు లేదు నాకు;
ఒక్క వేదంబునైనను దక్కవన్న
యతడు విప్రుండె? వైదికుం డగునె యతడు?"

విదూ : (తనలో) ముగ్గురు రాణులు త్రివర్గతుల్యలు. నలుగురు కొడుకులు చతుర్వర్గతుల్యులు. ఐదుగురు సమకూడినచో నేమనవలయునో? (ప్రకాశముగా) నేను నీకు కనిష్ఠవయస్యుడను. నీ పుత్రులతోపాటు సమానముగా భోజనీయుడను కానిచో నీతో స్నేహము చేయను. అపుడు పురుషార్థములు నాలుగు. వేదము లైదు లేవు కదా!

రాజు : (నవ్వి)
వందమహో యజ్ఞంబుల
నెంచన్ విప్రుండు సమము నీ ధైదిటితో
మించెదరు మీరు నట్లే
కించపడగ నేల నీకొకింత వయస్యా!

విదూ : అలుగుట లేదు. ఉన్న నీ మాటకారితనము తెలిసిపోయినదే. (ప్రకాశముగా) కొడుకులు పుట్టినదినమన్న యుత్సాహముతో నీ వాకలి సైతము మఱచితివి. సూర్యు డస్తమించుచున్నాడు. చూడుము.

రాజు: ఓహో! సంధ్యాకాలము సమీపించినది.

కిరణమొసంగు వృక్షముల జ
య్యన పక్షులు చేరి కూసెడుకా
గిరణములకా నభిస్థలిని నిం
పెడు సర్వశశాంకు డిప్పుడే;
చరమ నగంబునన్ దినవిశాంపతి
గ్రక్కును గాంతిపుంజముల్;
పరగు ప్రకాశమున్ రజని
భవ్య ముఖామల భూషణం బనన్.
మఱియు.
హిమకరు డేగుదెంచి గగనం
బిరకున్ గనుపండు వట్లుగా
విమల సరోలసత్కుముద విస్రుత
మిత్ర పవిత్రుండు ను
త్తమ బహురాజ సంయుత యధార్థ
సుశాసియు నౌట ను
త్తము డగు రాజు నా బరగు దత్త
దనూన విధాన కర్మలన్.

(నిష్క్రమింతురు.)

ఇది ప్రథమాంకము.

విష్కంభము

(ప్రవేశము : కాంచుకీయుడు)

కాంచు : మహారాజు నా కిట్లాజ్ఞాపించెను. "ఓ బాభ్రవ్యా! ధారాగృహముకడ నున్న గ్రీష్మోద్యానమున కేగి యచట బరిజను లెవ్వరు నుండరాదని యాజ్ఞాపింపుము." మహారా జటకు విహారమునకు వచ్చును. రాణులు నుందురు. పరిజను లుండరాదని యేల యనెనో? ఏదైన రహస్యాలోచనము గలదా? రాణులతో గూడి రహస్యవిహారము మహా జెప్పుడును జేసియుండలేదే! నా కీగొడవ యేల? నన్నేమి చేయుమన్న నదియే చేయుదును.

"రాజుల చేష్ట లన్నియు గరంబు
దలంప నిగూఢ భావవి
భ్రాజితముల్; సుమంత్రులకు గ్రాహ్యము
లన్యల కట్లుగా వవే
యోజను కంక చేసినను నెవ్వధి
వెల్లడిచేయ రాదయా;
ప్రోజితబుద్ధి కన్నులను మూసికొనక
దలపోయ గృత్యమా."

(అంత, చేటికలు ప్రవేశింతురు)

ఒక చేటిక : ఆర్యా! నలుగురు కుమారులకు నాలుగు కుసుమ జవనికలను మేము సూత్ర మక్కఱ లేకయే తయారు చేయుచున్నాము.

కాంచు: మంచిదే. కాని, మఱియొక యుద్యానమున కేగి మీ కోరిక తీర్చుకొనుడు.

మఱియొక చేటిక : ఆర్యా! ఇంకొక యుద్యానమున నిన్ని రంగులు నింత పరిమళము కలిగిన పువ్వు లధికముగా లభింపవు.

కాంచు : ఐన నే నేమి చేయగలను? ఇప్పు డెవరు నిట నుండరాదని మహారాజాజ్ఞ.

చేటికలు : ఓహో! ఐనచో బోవుదము.

(నిష్క్రమింతురు)

ఇది విష్కంభము.

ద్వితీయాంకము

(మహారాజు పరిజనులతో ప్రవేశించును)

రాజు : (స్వేచ్ఛగా నడచి)
"చేసితి జన్మముల్ బుషివిశిష్ట
విధిని బహుశ ప్రకారముల్;
దోసిళులన్ ప్రదానముల దుష్టిగ
నిచ్చితి ప్రోచితిన్ ప్రజన్;
వీసముకూడ శత్రుభయవిహ్వలతల్
గనరావు; నే నిరా
యాసముగా జరాధరత
స్వాంతమునందున శాంతి నందెదన్."

మఱియు :

"కంటిని వాత్మసౌఖ్యమునకంటె
బ్రజాసుఖ ముత్తమంబుగన్;
మంటి గులానురూప ముగు
మాన్యయశోధనవృత్తిచేత; నే
నుంటి స్వకర్మ పీడక ము
హోన్నతభోగము లెల్ల నంది; నే
కొంటి జనానురాగ మిక
గోరిక నేది యొనర్తు నర్మిలిన్"

(ఆలోచించి)

"రాణులను ముగ్వురను గూడ రంజిలంగ
జేసి రాజగుణాన్వితశ్రీ వెలంగు
రామచంద్రుని రఘువంశరత్న సదృశు
యౌవరాజ్యాభిషిక్తు జేయం దలంతు"

ఎవరక్కడ ?

ప్రతీహారి : (ప్రవేశించి) మహారాజా! జయము ఏమాజ్ఞ ?

రాజు : విజయా ! అమాత్యవరుని సుమంత్రుని బిలువుము.

ప్రతీహారి : చిత్తము. (నిష్క్రమించి సుమంత్రునితో మరల ప్రవేశించును.)

ఆర్యా ! ఇటు. ఇటు. ఇదిగో మహారాజు. సమీపింపుడు.

సుమం : (చేరి) మహారాజా ! జయము.

రాజు : అమాత్యా! స్వాగతము. రమ్ము కూర్చుండుము.

ఇరువురు : (కూర్చుందురు)

రాజు : విజయా ! నీవు బొమ్ము. (పరిజనులను జూచి) మీరును బోయి విశ్రాంతి నందుడు.

పరిజనులు : చిత్తము. (నిష్క్రమింతురు)

రాజు : అమాత్యా ! నామనస్సు చింతాజాగరణపరవశమై యున్నది.

సుమం : (తనలో)

"భూరియశంబును గన్న మ
హారా జితడేకొను ; రిపుభయప్రదు డయ్యున్
వారప్రియుడై చింతా
భారజ్వరుడౌట కేమివచ్చెనొ కట్టా !

(ప్రకాశముగా) మహారాజా !

స్థిరసద్వ్రతిమున్ ప్రజా
ప్రియ మహోదృష్టిమ్ము గీశ్వరు శా
సురుతన్ గాంచిన నీకు
నెక్కడి దయా ఘోరవ్యథల్ దేవ! న
ల్వురు పుత్రుల్ వినయాన్వితుల్
ప్రజల కెప్డున్ ప్రేమ పాత్రంబులై
పరగన్ మానసిక వ్యథాభరము
దేవా! యెట్లు కల్గెంగటా !

మఱియు :

"కృతసంస్కారులు వినయా
న్వితులున్ జనరంజకులును బితృభక్తులునౌ
సుతులన్ నల్వురఁ గనుగొని
వెతలెల్లన్ బాయఁగవలె వేవేగ ప్రభూ!

లేక :

"అవిభక్తకుటుంబికి నె
ట్లవిరళదుఃఖంబు కలుగు నటులే నీకున్
సువిశాలరాజ్య మనియెడు
నవిభక్తకుటుంబమందు నది కల్గెనొకో ?"

పోనిమ్ము. మహారాజా! చింతాప్రతీకార మూహింపరాదా !

రాజు : అందులకే నిన్ను బిలిచినది.

సుమం : సెలవిమ్ము.

రాజు :

"కైకేయీ తనయుండే
యేకైకప్రభువు గాఁగ నీతుహి కల్లన్
గేకయ వరమిచ్చితి నని
వేకంబున దొల్లి దాన వెతగందు గటా !"

సుమం : ఏమి ?

రాజు :

"రాజ్యపాలన యోగ్యుండు రాముడె యగు
తు త్రిసుగుణాకరుండైన కారణమున
యౌవరాజ్యాభిషేకంబు నతని కేను
జేయదలచితి సుకరంబె? ఈయది కట !"

సుమం : మహారాజా ! అది దుష్కరము కాదు.

రాజు : ఎట్లు ?

సుమం :

"వినయ నయ ప్రవర్తన వివేక
గుణాదికపూర్ణులైన రా
ముని మువురమ్ములున్ దమదు
ముద్దులబిడ్డని గాఁగ ప్రేమ పెం
పున గనుగొంద్రు ; జ్యేష్ఠుడగు
భూరిగుణంబుల దేజముండు ; నా
తని కభిషేకమన్న ను ముదంబును
గాంతురు రాజు లెల్లరున్."

అందుచే నీవు చింతింపవలసిన పని లేదు. ఇంతకు సుమూర్తు లుపనీతులైరి. శస్త్ర శాస్త్రాభిజ్ఞులయిన పూర్ణులైన పిదపగదా యభిషేకము. ఇప్పటినుండియు నీకీ చింత యేల?

రాజు : పుత్ర రాజ్యాభిషేక వివాదహేతువు నిప్పటినుండి యాలోచించిన నప్పటి కేయుపాయముచేనైన దానిని దొలగించుకొనవచ్చును గదా! ఏలన యొక్కొక్కప్పుడు :

"పరగ బ్రాక్చింతితంబౌ నుపాయమునను
భావికష్టంబు తొలచుకోవచ్చును గద!
వచ్చి పైబడ్డ కష్టమ్ము బాపుకొనగ
త్రోవ వెదకుట యగు ద్విధా దుఃఖకరము."

సుమం : నా కేమి యాజ్ఞ ?

రాజు :

"పరిజన భృత్యమంత్రిజన పౌరజనంబులు
రాణులన్ నిరం
తరమును రామమానసు లనారత
రామవిధేయ చిత్తులా
కరణి నొనర్పు; మా భరతు
గాఢత రాగ్రజభక్తియుక్తి సం
ధరితు నొనర్పు; మియ్యది సుమంత్ర!
తొలంచు మహాత్మ కల్యమున్.

సుమం : (తనలో) ఆహా! మహారాజు దూర

దృష్టి! (ప్రకాశముగా) మహారాజా! అట్లే యొన
రించెదను. నీకు సర్వము సుముఖముగను. కావున నీ
కొంతయు విచారింప బనిలేదు! (ముందు చూచి)
మహారాజా! ముగ్గురు రాణులును బరిజనసహితముగా
నిటకు వచ్చియున్నారు.

రాజు : మంచిది. నీవు వెళ్లిరమ్ము. నే నన్న
దేమాత్రమేమఱకుము.

సుమం : చిత్తము. (నిష్క్రమించును)

రాజు : రాణులు ముగ్గురు సపరివారముగా
వచ్చియున్నారు. నే నీగ్రీష్మోద్యానమున గూర్చుండి
వారి నందఱను రప్పించెదను. (నిరూపించి) ముందు
కౌసల్య :

"మానినము త్రియంబు, మునుముందట
వచ్చిన లక్ష్మి, దివ్యశో
భాసము పేత కోటి సుమభివ్య లతా
లలితాంగి, నా యెడందలో (?)
భాసిలు మాననీయ పతిభక్త
తనూభిరముఁ గడుఁ శ్రీమా
భ్యాసముసక్ దరించునది యామె
ను పేతు యొనర్ప ధర్మమే ?"

తరువాత సుమిత్ర :

"వ్రత నియమావళీ పరమబంధ్య
కృశాంగి, ముఖాంబుజ ప్రభా
వితత శుభాంగి, యుత్తమ వివేక
వతీమణి, నోట గట్టిగా
నతివ యెఱింగియున్ బలుక,
దర్శనిపాలిత నేత్రి, శాంతదే
వత, బహు సౌఖ్యదాయక, శుభప్రద
యామె నుతింప నెల్లదే ?"

ఇక కైకేయి. ఆమె :

"కమల వనంబు మధ్యమున
గన్పడు భానుబింబ మట్లు నె
య్యమున మెలంగుచుఁ దన
సముంచిత భంగి నిజాదు బూర్వమా
యము, కడు నున్న లక్ష్యమున
నాదృతి జూడదు తా సపత్నులన్;
సముదమ్మ్రేంద్ర మట్టులనిశం
బోక చీరికినోదు లోకమున్."

ఫీరిలో :

"తోలినుహిమ, రామజననియు
విలసచ్ఛుభ లక్షణాంగి విశ్రుతనయ సం
కలిత సగర్వయు నగు కో
సలరాజాత్మజయె నిత్యసమ్మాన్య యగున్."

కాని :

"దురభిమాన రోషములు ముందునకు గొనదు
సర్వమిత్రె సుమిత్ర యాకౌసల్యముగను
ఆత్మకామానుసారిణి యహరహంబు
నా యెడంద జయించిన నాతి యామె."

కైకేయి :

"ఏ కార్యంబు నెలుంగని
యా కాంతకు మక్కువందె యెపగను గోపం
బే కాని విక్రమాన్విత
నా కష్టము బాపి యసురు నాకుఁ గాచెన్."

వినను :

"ఈమె రోషము పరిగణియింపరాని
దగును కార్యప్రణయశీల యగుటచేత;
తలప ఛందోనుబద్ధవృత్తంబురీతి
శీఘ్రమున నే ప్రసాదసంసిద్ధి గూర్చు."

(అంత ముగ్గురు రాణులు పరిజనులతో ప్రవే
శింతురు.)

అందఱు : మహారాజా! జయము.

రాజు : రాణులకు స్వాగతము. రండు. ఈ
మణిఖచిత శిలాతలమున గూర్చుండుడు.

అందఱు : (కూర్చుందురు)

రాజు : పరిజనులారా! మీరు పోయి విశ్ర
మింపుడు.

పరి : (నవ్వి) చిత్తము. మహారాజా! (నిష్క్ర
మింతురు.)

రాజు : ఆహా! గ్రీష్మకాల మధ్యాహ్నసమయ
మునకైన నీశీతలోద్యాన మెటు లున్నదో చూడుడు:

"ఘనవృక్షంబు లెల్ల దరుపంక్తుల నీడల
గూర్చు పెట్టెడున్;
ప్రవిమలవాపికా జలచరంబులు హంసలు
కృత్రిమంబులౌ
పవిదిని దోచు; గోడ లిట
బాదపశాఖల జంక్రమించు; దో
దవుల గలట్టిపక్షు లిట
దారసిలున్ సుఖశైత్య మందగన్."

కౌస : ఈ యుద్యానవనము చూచినవారి కెల్ల
రికి సుఖావహమే కాని, నాకిదివఱ కిచ్చు సుఖ
మిచ్చుట లేదు.

రాజు : ఏదైనను కాలము ననుసరించియే
సుఖముకాని దుఃఖముకాని కలుగును.

"చన్నిటన్ స్నానము సం
పన్నము చేసితిని, కాని మఱి శీతున నా
పన్నము కావున గాలమె
యొన్నగ సుఖదుఃఖవితతి నిచ్చు నరులకున్."

కైకే : ఆర్యపుత్రా! ఈకాలమున మే మేమి
చేయవలయు నని నీకోరిక ?

కైక : (తనలో) ఈమె మాటలు శిలాక్షరముల
వలె నుండును.

రాజు : ఈ యుద్యానరమణీయతం దిలకింప

చేయుటకే నేను మిమ్మిటకు పిలువనంపితిని. ఈచెట్టు నీడను జల్లగా గూర్చుండి సరసముగా మాటాడు కొందము.

రాణులు : సంతోషము.

రాజు : బిడ్డల కుపనయనములు చేసితిమి. పదు నైదు సంవత్సరములు వచ్చినవి.

కైకే : ఔను.

రాజు : అందఱును గుణాశ్రయు లగువీరులే.

కౌస : (తనలో) రాముడే సర్వగుణాకరుడు ; రాజ్యయోగ్యుడు.

కైకే : పితృభులనుకూడ దక్కువది కాదు గాదా!

రాజు : నిజమే. కాని :

"స్వగుణముచే గ్రియన్
దలరువంశము దీపితముం బొనర్చు ట
త్యగణితగౌరవంబగును నారయ
బుత్రుడు కట్టిచో నికన్
సుగుణము నుత్తమాన్వయము
శోభిలజేయును గాదె మిక్కిలిన్
విగుణుని కీర్తి భారము వివేకముతో
బరికించి చూచినన్."

ఇంతకు వీరిలో నిన్నియును గలవు. దేనికిని లోపము లేదు.

అందుచే నందరియందును నాకు సమానప్రేమ గలదు.

కౌస : (తనలో) నాకు మాత్రము రామునిపైన్నే యెక్కువ ప్రేమ.

సుమి : జన్మక్రమము ననుసరించియే నా ప్రేమ భేదము.

కైకే : నాకు గుణాధికునిపై నెక్కువ ప్రేమ.

రాజు : గుణాధికు డెవడు?

కౌస : (తనలో) రాముడే.

కైకే : అవసరమైనప్పుడు చెప్పెదను.

రాజు : అందఱు నాదాయభాగమున కర్హులే.

సుమి : దాయవస్తువులలో శ్రేష్ఠ మేదో యది జ్యేష్ఠునికే రావలయు నని మనువు చెప్పినాడు.

కౌస : (సంతోషమున దనలో) మహారాజా దాయవస్తువులలో రాజ్యమే శ్రేష్ఠము.

రాజు : ఆచారవిషయమున మనువు ప్రమాణము. రాజధర్మ విషయమున వాసిష్ఠము ప్రమాణితము.

కైకే : వాసిష్ఠ మేమనును?

కౌస : (తనలో) రామునికే రాజ్య మిమ్మని.

రాజు : వాసిష్ఠమున నిట్లు గలదు :

"ధనకనకాదికం బయినదాయము
పుత్త్రులు పంచుకొందగున్ ;
గుణముల శ్రేష్ఠ డెన్న గయికొందగు
పెద్దతికంబు సర్వదా ;
యనుపమ సైన్యనాయకత యా
గురుకార్యనకే, వయోగుణం
బున నది కాదు ; రాజ్యమును బొందగ
నర్హుడు యోగ్యవర్తియే."

కైకే : యోగ్యత ప్రతి పురుషుని దృష్టిని భిన్నముగా నుండును. ఒకని మనసునకు యోగ్యముగా దోచునదే మఱియొకని కయోగ్యముగా దోచును.

రాజు : (తనలో) ఏదో వ్యాజమున నా కోరికకు విరుద్ధభావమును కైకి జూపి కార్యసిద్ధి నందుదును. (ప్రకాశముగా) కుమారులు నలుగురు యోగ్యులే. రాజ్యమును నాలుగు భాగములు చేసి యొక్కొక్కని కొక్కొక్క భాగ మిచ్చెదను.

కౌస : (తనలో) రాజ్యమంతయు రామునికే యీదగును.

కైకే : ఇదియు వాసిష్ఠమతమే యగునా యేమి? ఇట్టి యశాస్త్రవచనమునకు బ్రమాణ మేమి? ఏక రాజ్యమే కాని సామ్రాజ్యవిభాగము పనికిరాదు.

రాజు : మఱి రాజ్య మెవరి కీయదగును?

కౌస : (తనలో) రామునికే.

కైకే : యోగ్యతమునకు.

రాజు : (తనలో) ఇప్పుడే సర్వము మాటాడుదును. (ప్రకాశముగా కైకేయితో) మన వివాహకాలమున నేను నీ కిచ్చిన వాగ్దానముమాట జ్ఞప్తి యున్నదా?

కైకే : అంతయు జ్ఞప్తి యున్నది.

రాజు : కావున భరతుడే రాజ్య దాయార్హుడు.

కైకే : ఏ స్త్రీ పుత్త్రునకు రాజ్యలాభము కలిగిన సంతోషింపదు?

కౌస : (తనలో) ఈ మాట వజ్రపాత సదృశము. (మూర్ఛిల్లును)

సుమి : మహారాజా! రక్షింపుము. కౌసల్య మూర్ఛిల్లినది.

(రాజు పైబట్టతో విసురును. కైకేయి పుష్కరిణి నుండి జలము తెచ్చి ముఖముపై జల్లును. సుమిత్ర కాలుసేతులు రాయుచుండును.)

సుమి : దేవి తేరుకొన్నది. (కౌసల్యకు స్పృహ వచ్చును.)

రాజు : దేవీ! ఏల మూర్ఛిల్లితివి?

కౌస : మధ్యాహ్నవేళ యిటకు వచ్చితివి. ఎండదెబ్బ తగిలినది.

రాజు : (తనలో) రాణి దుఃఖకారణము కాశలము కూడ బోధపడినవి.

సుమిత్రి : మహారాజా! వివాహకాలమున జేసినప్రతిజ్ఞ ననుసరించి భరతుడు రాజగును. జ్యేష్ఠు

డగుటవలన రాముడు రాజగును. భరతునకు చేరి సగము రాజ్యమీయ దగును.

రాజు: నీకొడుకుల కేమిమ్మందువు?

సుమిత్ర: నాకు నా కొడుకులకు నేమియు నక్కఱలేదు.

"శ్రీరామచంద్రుడు ధాత్రిని రక్షకుండయి
రాజ్యమేలుచునుండ రమణ మీఱ
నేను లక్ష్మణునితో నిత్యంబు ప్రియమార
సేవజేయుచునుండు జిత్తశుద్ధి
భరతశత్రుఘ్నులు పరిపూర్ణసుఖములం
బొందుచుండురు సదానందులగుచు
రాజ్యమన్నను బరరాజభయంబును
స్వజనపాలన మహాభార మెంచను;
నది యొసంగు నిరంతర మకట! క్లేశ
సమితి; జెడగొట్టు మానసశాంతి నదియు
నఖిలమును మెంచిచూడ మహాసుఖంబు
పరమశాంతియె; యదియె సేవాఫలమ్ము."

రాజు: కైకే: ఆహా! సుమిత్రాదేవి త్యాగగుణము. లౌల్యరాహిత్యము నతిసంభావనీయములు గదా!

కౌస: (తనలో) ఇంతమాత్రమున నాకు సంతోషము లేదు. (ప్రకాశముగా) నాసపత్నీ యెంత మహానుభావురాలు!

రాజు: తల్లిగుణములు కొడుకులకు వచ్చునట. ఇట్టియామె పుత్త్రులే భ్రాతృసేవాదర్శభూతులగు పుత్త్రులు: వారే ధన్యులు.

సుమి: నాకు గావలసిన దిదే:

"మానిని గాదు మానవతి
మానిని గాదు ప్రపంచరంగన
మ్మానిని గాదు నిత్యమృదు
మంజులవాక్చతురాస్య కాదు శో
భానన గాదు సన్నయగు
నామె సపత్నులచేత భర్తచే
మానిత కీర్తనీయ యగు
మానిని దిక్కగు భూతధాత్రిలో."

రాజు: ఇంతకు రాజ్యయోగ్యు డెవడు?

కైకే: నామాట పాటించుచో రాముడే రాజ్యార్హుడు.

కౌస: సంతోషము. సంతోషము.

సుమి: నామనసున నెట్లున్నదో కైకేయియట్లే పలికినది.

రాజు: వివాహకాలమున నే జేసిన ప్రతిజ్ఞ గతి యేమి?

కైకే: శుభగతియే.

రాజు: ప్రతిజ్ఞాహాని పాతక మనియే సంప్రదాయము.

కైకే: భవాదృశులగు రాజర్షులకు ప్రతిజ్ఞాహాని యనర్థకము కాజాలదు.

ఏలన:

"ప్రతిన యుపేక్షితం బయిన
పద్ధతిలో నది తప్పు; లేక యా
ప్రతిన స్వసౌఖ్యలబ్ధికయి
పాడొనరించుట తప్పు; మాట నీ
గతులను రెండిటన్ బ్రతిన
గాంచని యట్టులు చూపి ధర్మసం
గతి యగు నిక; దీని కథ
కారిని నీవె; తలంపు ధర్మమున్."

కౌస: (తనలో) అయ్యో! పెనుగుపాటు సంభవింపదుగదా!

రాజు: యుక్తమే.

కైకే:

"ప్రజల సౌఖ్యంబుకోసమే ప్రతిన నీవు
దాటజూలవుకాని స్వార్థమున గాదు;
ప్రతిన తప్పుటవలన లవంబుకూడ
పాప మంటదుగద! మహాభాగ! నీకు."

మఱియు:

"గుణాలలోపల రాముడే గుణివరుండు
పాలనాశక్తిం దెలిమున్నపగిది నతడె
భువనసంరక్షణార్థమై యవతరించె
విష్ణువగిదిని విఖ్యాతవీరు డతడు."

ఒక కార్యము విచారించునపుడు కారణప్రాధాన్యము నుపేక్షింపరాదు. నన్ను సంతోషపెట్టుటకే నాకుమారునికి రాజ్యదాయ మిత్తునని నీవానాడు పలికితివి. రామునికి రాజ్యదానము చేయుటవలన నేను ప్రసన్న నగుదును. భరతునికి రాజ్యమిచ్చిన నెంతయో రాముని కిచ్చినను నాకంతియే.

రాజు: భరతుడును గుణవంతుడు; రాజ్యార్హుడుగదా!

కైకే: ఔను కాని:

"అగుణవంతునికంటె మేలగును సుగుణి
గుణుల గుణవత్తరుడు మేలు కోటిరెట్లు
భాస్వరము రాత్రి వెలుగు దీపంబుపగిది
కాని యది యెంత మధ్యాహ్నభానుముందు?"

వేయేల?

"భరతుడు గుణి యగు గుణవ
త్తరు డగు రాముండు కాన దగు నతడే రా
జ్యరమం గైకొన సుగుణా
భరణుం డతి డతని కన్న బరముడు కలడే?"

కౌస: సంతోషము. సంతోషము.

సుమి: ఆహా! సపత్ని కైకేయి మహానుభావయు నీతిజ్ఞయు.

రాజు : మేఘములు గర్జించిననే కాని యమృత వృష్టి కురియదు.

కైకే : ఆర్యపుత్రా! ప్రణయ సమయమున నైన నిర్వ్యాజముగా నేను సత్యమే చెప్పుదును. అదియే మేఘ గర్జనము. అయుక్తముమాత్ర మెన్నడును బలుకను. అదియే యమృతవృష్టి. ఏలన

"అమృతవర్షము కురిసెడు నట్టి మేఘ
మెపుడు వర్తించు సహజమౌ వృత్తితోడ;
దానిమార్గ నిరోధంబు దివరి కేని
అలవిగాదెను వర్షించు నది నిజమ్ము."

రాజు : (తనలో) అధిక ప్రసంగమువలన మరి యొక భీతి కలుగుచున్నది. ఈ దేవి క్షణములో కోపించును. క్షణములో శాంతించును. కావున నిక నాకు శంక వలదు. (ప్రకాశముగా)

"ప్రాప్త కాలంబునన్ రాజ్యపాలకు డగు
సుగుణవంతుడు నైన మహిన్యాను; డప్పుడు
నియతి నాతం డొనర్చును నిశ్చయముగ
సర్వసౌఖ్యాన్వితుల గాగ సర్వజనుల."

కైకే : ఆర్యపుత్రా! ఇప్పుడు మన మనుకొన్నట్లే జరుగగలదు. మన మట్లే తిప్పక యొనరింతము.

కౌస : మహారాజా! సాయంతన క్రీడల కేగిన కుమారులు నలుగురు జ్యేష్ఠ వశ నాకు నమస్కరింప వచ్చియుందురు. వారిని సంభావింప నే నేగి వచ్చెదను.

సుమి : కుమారు లందఱు మువ్వురు తల్లులకు సాయంకాలము వచ్చి నమస్కరింతురు. వారికి జ్యేష్ఠ, కనిష్ఠ భేదము లేదు.

కైకే : ఔను. నేనును బోయివచ్చెదను.

రాజు : మంచిది.

రాణులు : (రాజునకు నమస్కరించి నిష్క్రమింతురు)

రాజు :

"ముదిమి గలంగు మానసము
మోదమునం దెను తీరి వర్తనన్
బదురుగ కుండ దొక్క రుచి;
వర్తిలు భిన్న రుచుల్ జనాళిలో;
నొదవును జ్యేష్ఠ కాత్మజుకు
నున్నతి రక్తి; కనిష్ఠ కీర్ష్యయౌ;
మమలు విభిన్నముల్; కలుగు
మాటికి దుఃఖము నాకు నింటిలో."

"బహు భార్యాత్వము నరునకు
బహు సౌఖ్యావహము గాదు పరికింపంగా
బహు మానసరోగంబులు
బహురాగము కూడ నతని బట్టి పలార్చున్."

ఎవరక్కడ?

ప్రతీహారి : (ప్రవేశించి) మహారాజా! జయము ఏమి. సెలవు?

రాజు : విజయా! సుమంత్రుని బిలువుము.

ప్రతీ : (నిష్క్రమించి సుమంత్రునితో ప్రవేశించి) ఆర్యా! ఇటు. ఇటు.

సుమం : మహారాజా! జయము.

రాజు : అమాత్యా! స్వాగతము. రమ్ము. కూర్చుండుము. విజయా! నీవు బయట కేగి కూర్చుండుము.

ప్రతీ : చిత్తము. (నిష్క్రమించును)

సుమం : ఏమి సెలవు?

రాజు : నే నిప్పుడు కైకేయి మహానుభావత సుమిత్ర యాలోలుపత తెలిసికొంటిని.

సుమం : ఎట్లు?

రాజు : కైకేయి తనయునికే రాజ్య మిచ్చెద నని నా ప్రతిజ్ఞ యున్న నామె గుణవత్తరునకు రాజ్య మీయ దగునన్న న్యాయముచే రామునికే దానిని విడిచిపెట్టినది. ఇక, సుమిత్ర తనయులతో రామ సేవానిమగ్నత గోరుకొన్నది. వీరి మహానుభావత పర మాశ్చర్యభరితము కదా!

సుమం : ఔను. కాని,

"భావిన్ సౌఖ్యము గోరి నారిజనముల్
భావించి భాగోసులన్
సేవింపన్ గోరంగోండ్రు న్యాయపథమున్
కొందర్మహా కష్టమున్;
దైవాయత్తము లోకమంతియు; నేమన్
జంపున్ సదా దైవమే;
జీవుం డిట్టులొనర్చు దొంటి జనిలో
సిద్ధించు నట్లే జనిన్."

అందుచే :

"పుత్రులు నల్వురున్ సుగుణపుంజము
లద్భుత సూరి శేఖరుల్
గాత్రము లెన్న వేఱయిన గాని
మనస్సులు చూడ నొక్కటే
మాత్రము క్షేమ భంగమును మాత్రము
కల్గగ నీదు రాజ్య మీ
పుత్రుల; కంతివాడి యను ముల్లను
నీకల జిల్లుపుచ్చు నే?"

కనుక, నీవు రాజ్యప్రదాన చింతను విడువుము. రాముడే రాజగును. నీవు సంతోషముగా నుండవచ్చును. జను లెల్లరు సంతోషింతురు. ఇక నీ కేమి కావలయును?

రాజు : నే నిప్పు డదే యాలోచించుచున్నాను.

సుమం : వసిష్ఠ భగవాను లిట్లు విన్నవించిరి.

రాజు : గురుభగవాను లేమని సెలవిచ్చిరి?

సుమం : ఇట్లని; "కుమారులు :

"వేదములెల్ల నేర్చిరి వి
 వేకమునన్ శస్త్రవిద్య లెల్ల న
త్యాదరణంబునన్ వినిరి
 యౌవనమందె కుశాగ్రబుద్ధిసం
వేదిత నస్త్రశస్త్రబహు
 విద్యల గాంచిరి వీరి రాజనీ
త్యాదుల శాసనాదిక వి
 ధానల జేసి యనుగ్రహించెదన్."

విదూ : (నవ్వుచు ప్రవేశించి) ఓయీ! వయస్యా! ప్రతీహారులు నన్ను రానీక పోగా వారితో పోరాడి నీకొక ప్రియవిశేషము చెప్పుటకై యిట వచ్చిపడితిని.

రాజు : ఏమి ప్రియము?

విదూ : రామునకు రాజ్యాభిషేక మనువని కౌసల్య నాకెన్నో మోదకములు పెట్టినది. ఈసంగతి యంతయు నీకు నివేదించుటకై వచ్చుటవలన నా హృదయభారము మోదకభారము కూడ దిగిపోయినవి.

రాజు : ప్రతిదినము నీవు మోదకములే తిందువులే. రాముడు రాజైనను భరతుడు రాజైనను నీకు మోదకములకు మాత్రము లోటు లేదు. చింతింపకుము.

విదూ : ఏల చింతించెదను? రాముడు రాజైనచో కౌసల్యాదేవి బహుమోదకములచే నన్ను ప్రీతిని జేయును. భరతుడు రాజైనచో కైకేయి బహుతర మోదకములచే నన్ను సంతుష్టిని జేయును.

సుమం : వసిష్ఠభగవానులతో నేమని నివేదింతును?

విదూ : (జనాంతికముగా) అమాత్యా! నే నేమైన జెప్పిన నావయస్యుడు కోపించును. నీకా సంగతి తెలియదు. (రాజుతో) నేను మోదకములతో సంతోషింపనంతవరకు అభిషేకవిధి ప్రారంభింపరాదని వసిష్ఠునితో జెప్పెదను.

రాజు : భగవానులు గురుపాదులు నగు వసిష్ఠులతో శీఘ్రమే తాము సెలవిచ్చినప్రకారము చేయు దంటి మని నివేదించిరమ్ము.

విదూ : (అపవారించి) వయస్యునకు క్షోభ కలిగింతును. అంతకుమించి నాకేమియు తెలియదు కదా! (ప్రకాశముగా) నాకు తెలియని విషయము నీవు చెప్పవు. నే నడుగను. ఇపుడు నాకే తెలిసినది. భరతున కియవలసినరాజ్యము నా చెలికాడు రామున కిచ్చునట. నే నంతఃపురమున రాణులకు బయట భృత్యులకు పోరాటము కల్పింతును. లేనిచో ప్రాయోపవేశము జేయుదు నని యందఱను భయపెట్టెదను.

రాజు : అమాత్యా! నే జెప్పినది భగవానులతో జెప్పిరమ్ము.

సుమం : చిత్తము. (నిష్క్రమించును)

విదూ : ఈ కపట పండితుడు పోయినాడు.

రాజు : (తనలో) చపలు డసనీవటువు కలహప్రియుడు. ఆ కలహఫల మెఱుంగడు. ఈ మూర్ఖుడు క్షోభ కలిగించునేమో యని శంక కలుగుచున్నది. కానిమ్ము. (ప్రకాశముగా) సఖా! సుందరకా! ఏదో కథాప్రసంగవశమున రాజ్యదాయ విచారము కలిగినది. ఈ మాట యేమాత్రము నిజము?

అధిక విప్లవకరమైన యీ నృపత్వ
మేల? సుకుమారచేతస్కు లీమదీయ
పుత్రు లేల? పరిహాసపూర్వక మిది
ఇందు సత్యంబు కలదని యెంచకయ్య!"

విదూ : నిత్య మా కథాప్రసంగమే వచ్చుగాక!

(తెరలో)

"శక్రపురిన్ జయించి, సురసంఘము
 త్రోలి, వలంచి వీరరాట్
చక్రము రావణాసురుడు కాంతి
 గడించియు భంగమందె ని
ర్వక్ర పరాక్రమ ప్రథిత రామ
 చరిత్రము విన్న; నా డిటన్
వక్రగతిన్ నిగూఢు డయి వచ్చె
 జరింపను జాగరూకుడై."

రాజు : (విని) ఓహో! ప్రధానచారు డగు సుబుద్ధి స్వరమువలె నున్నది. సుందరకా! నీవుపోయి నా వచనముగా నాతనితో "నీ మాట వింటిమి. సంగతి తెలిసిన"దని చెప్పుము.

విదూ : బాబో! నేను వెళ్ళను. దారిలో నేనే రాముడ ననుకొని యీ రావణుడు నన్ను మ్రింగి వేయగలడు.

రాజు : సరే. నేనే వెళ్లెదను. (తనలో)

"ఒక శంక నివృత్తం బిం
కొక టుద్భూతంబు నయ్యె; ఒక దుఃఖమె నా
కకటా కొడుకులు లేమిన్;
వికలత హృదికయ్యె విపుడు వేయి విధములన్."

అహో!

"సుతులు జనించినారు వర
 శూరు లటంచును వ్యాప్తి చెందె ది
క్తతి నిపుడే విరోధులను
 దివ్యులయందును లేవ జొచ్చి కీ
సుతు లతిబాలకుల్ తలప
 శూరుడ నయ్యెను వృద్ధుడైతి నే;
నతి బలవంతు లుద్ధతు ల
 హా! యరు లింక శరణ్య మీశుడే."

(నిష్క్రమించును) ఇది ద్వితీయాంకము.

కవిసన్మానము

★

శ్రీ జనమంచి రామకృష్ణ

తారాసింగ్ : (వాసుకునే బల్ల ముందు పెట్టుకుని వీధిలో వచ్చే పోయే జనాన్ని చూస్తూ) మిత్రులారా, నేడు సుదినం. ఈ వేళ ఎందుకో ఈ జీవితం అతి మనోహరంగా తోస్తుంది. స్వప్నాల్లోనే చూశా నా వనితని. ఎంత పవిత్రమైన నామం. ఎంత తీయనిది. చంద్రకళ, చంద్రకళ. నా స్వప్న సుందర్ని గురించి సున్నితంగా సుకుమారంగా గీత మల్లాను. (తలుపు చప్పుడు)

తాతబ్బాయి : తారాసింగ్, తారాసింగ్, విన్నావా...

తారా : అరేమిటట్లా పిండి చేతులు గాలిలో ఎగరేస్తూ తన్మయంతో వస్తున్నావు? తాతబ్బాయి... ఈ వేళ ఇంత త్వరగా గాడిపొయ్యి ఆర్పేశావే? మరి రొట్టెలు వేయవూ?

తాత : నువ్వేదో కవిత్వపు కట్టలు రాసేసి పారేస్తున్నట్లున్నావే... ఇందాకా రొట్టెలు తినేందుకెవరో వచ్చారు. రొట్టిలో నంజుకుందుకు పచ్చడిబద్ద చేస్తూంటే ఒకడు 'ఒరేయి, ఆఖరికి కుబేరుడుగారు పిల్లకి పెళ్ళి తలపెట్టారురా? అంటూంటే విన్నాను. ఇది నిజమేనంటావా?

తారా : నిజమేనటగా.

తాత : ఆమె అందచందాలని వర్ణిస్తూ ఎవరైతే చక్కని ఇంపైన సొంపైన కవిత్వం చెప్తాడో అతనికామెనిచ్చి పెళ్ళిచేస్తారటకదూ?

తారా : కాని, ఇంకో షరతుంది తాతబ్బాయి.

తాత : ఇంకో షరతా.

తారా : ఔను, సూర్యాస్తమయం అయే లోపుగా గీతాన్ని పూర్తి చెయ్యాలి.

తాత : ఓస్, ఇంతేనా, తప్పకుండాను. ఇంకా ఓ ఘంటసేపు నాకు తీరుబడే. నాలుగు పంక్తుల్లో అద్భుతంగా ఓ గీతాన్ని వ్రాసేస్తాను. తారాసింగ్, ఓ పాటు మార్వాడికి ఓ ఘంటలో, రకరకాలైన రొట్టెలు తయారు చేసి ఇచ్చాను. అటువంటప్పుడు ఈ గీతం వ్రాయడం ఎంత సేపు చెప్పూ? సరే కాని ఒక్క గేయం వ్రాస్తే సరిపోతుందా, లేకపోతే ఇంకా గీతానికి సంబంధించిన షరతులేమన్నా ఉన్నాయా?

తారా : కంసాలి వజ్రవైడూర్యాలని పొదిగి ఎంత బాగా నాజూకైన ఆభరణాన్ని చేస్తాడో అమె సరుగానే, గేయంలో ఆమె పవిత్రతానూన్ని ఇమిడ్చి పొందికగా వ్రాయాలి.

తాత : ఓహో, రొట్టెలపిండితో రొట్టె చుట్టూరా ఆకులూ పువ్వులూ అమర్చినట్లు. అంటేనా ...అరే. తారాసింగ్, లోపల్నుంచి...అప్పుడే... ఏమిటి, కవిత్వం ఉబికుబికి పైకొస్తున్నట్లుగా ఉంది.

తారా : సరేకాని, తాతబ్బాయి, ఆ గేయాన్ని ముట్టుకు చక్కని దస్తూరీలో వ్రాయాలి.

తాత : పెద్ద ఇబ్బంది తెచ్చిపెట్టావే. మరి నాకు కలం పట్టటం రాదు. రొట్టెలపిండి కుబ్బుమంటావా, నీఇష్టం వచ్చినంత సుళువుగా వయ్యారంగా పాత్రాన్ని...

తారా : తాతబ్బాయి, ఎందుకంత తొందరపోతావు. నేనున్నానుగా.

తాత : వట్టిపుణ్యానికి వ్రాయక్కర్లేదులే!

తారా : ఒక్క దీనారం. వ్రాయడం వంతు నాకొదిలెయ్యవోయి. నీగేయాన్ని చూసి, ప్రజంతా, ఆబ్బా, చంద్రకళ, తప్పకుండా తాతబ్బాయినే ప్రేమిస్తుంది అని ఈర్ష్యపడాలి.

తాత : సరే, ఇదిగో...ఇంత నా గేయంగురించి ఆలోచించాలి...ఉండు ఆలోచిస్తాను...ఇదిగో, ఆమె దీపం, నేను మిడత అని ఆమెతో చెప్తాను... తారాసింగ్, నాకు మతిపోతూంది. భావాలు ఊరికే పరుగెత్తుకుంటూ వచ్చేస్తున్నాయి. నేను దీపాన్ని ఆమె నా చుట్టూ తిరిగే మిడతా...కాదు కాదు...

మొదట ఎట్లా చెప్పాను తారాసింగ్ ? (తలుపు చప్పుడు)

తారా : ఎవరు వారు ?

ఫరీద్ : (అడుగులు చప్పుడుతో దూరాన్నుంచే) నేను, ఫరీదుని...

తారా : ఓహో హో...ఫరీదుగారా రండి, రండి, దయచేయండి, ఏమిటీ వేళ ఇలా దయచేశారు.

ఫరీద్ : ఏముందండి ? ఇంతదూరం వచ్చాను కదా అని ఓమాటు చూసిపోదామని...(లోపలనుండి మూల్గువిని) అరే, ఎవరండీ అలా మూల్గుతున్నారు ? ఏం పాపం, ఒంట్లో బాగులేదా ? ఏమిటి ఆయన బాధ ?

తారా : ఎరగరూ అతణ్ణి. తాతబ్బాయి. ఈ పక్క కొట్టులో రొట్టెలు చేసి అమ్ముతాడు.

ఫరీద్ : నే నెరగనులెండి. ఔను కాని ఎందు కండి ఆయన ఘడీకోమాటు తలకాయ చేతితో కొట్టు కుంటాడు ? ఘడీకోమాటు రెండు చేతులూ పైకెత్తి రాగం తీస్తున్నాడు...కొద్దిగా మతి...చెడిందా ? పాపం, చిన్నవాడేనండీ...

తారా : (నవ్వుతూ) అబ్బే అతను కవితా వాహినిలో ఈత నేర్చుకుంటున్నాడు.

ఫరీద్ : ఏమిటేమిటి? రొట్టెలమ్ముకు నేవానికి, కవితాహృదయమా ? తారాసింగ్ ! చంద్రకళని వశం చేసుకునే నేర్పుతో, నిజంగా కవిత్వం అల్లగల డంటావా ? (దూరాన్నుంచి) అబ్బబ్బా, ఏమిటా గోల. నేను కవిత్వం ఆలోచిస్తూ న్నట్లు తెలియదూ. ఎవరు ? ఓహో. మీరా ? ఫరీదుగారూ ! ఎంతకాలానికి మళ్లా కనిపించారు. సాయబుగారూ, ఎప్పుడో తిన్న చిమ్మిలిరొట్టెకి డబ్బు లివ్వారు కారే. (పాడును) "లోన మధుకీలరేపిన దీప మీవు."

ఫరీద్ : తారాసింగ్, తను తయారుచేసే రొట్టెల్లాగే వుంటుంది సుమా వీడి కవిత్వం. (నవ్వు) ఔనుకాని, నీతో ఓ విషయం మాట్లాడుదామని వచ్చాను...ఏమిటి, అది నిజమేనా...ఆఖరికి కుబేరుడుగారు చంద్రకళని.....?

తారా : ఔనయ్యా, ఏం నీకు, ఆ పిల్లమీద కన్నుపడిందా ? ఊ...కానియ్యి...నువ్వూ మొదలెట్టు కవిత్వం...

ఫరీద్ : కుబేరుడుగారికి చదవడం రాదు గదా...సరతెందుకోయి. కూతురికి చదవటం వచ్చునని, తండ్రి కంత గర్వం అనుకున్నావ్.

తారా : ఔనౌను. ఆమె చంద్రకళ కాదు... విద్యాసుందరి...చదువుల సరస్వతి.

ఫరీద్ : ఔను తారాసింగ్, చంద్రకళ సామాన్యురాలు కాదు...నాపాట వ్రాసిపెట్టేందుకు ఎంత పుచ్చుకుంటావు ?

తారా : ఎంతోనా, రెండు దీనారాలు.

ఫరీద్ : రెండా ? ఒకటందూ, నేనుగాని చంద్రకళని సంపాదించావా, నా డబ్బంతా నీదే.

తారా : సరేలే.

తాత : (దూరాన్నుంచి) తారాసింగ్, తారాసింగ్, నాకు కవిత్వం రావడం లేదు. ఒక పాదం వచ్చింది ..రెండోది ఎలాగ ?

ఫరీద్ : తేలిక్కైందా ? మరుగ్గా మజాగా ఉండాలా ? లేకపోతే, హుందాగా ఉండాలా ?

తాత: తారాసింగ్...రెండో చరణం ఎలాగ?

ఫరీద్ : తారాసింగ్, వీణ్ణి ఇక్కణ్ణించి లేవ కొడితేనే కాని, నాకు భావాలు రావు. ఆ మొహం చూడు. పైగా గద్యంలో పద్యం వ్రాయడానికి సాహసిస్తున్నాడు.

తారా : ఫరీదుగారూ ! పోనీ మీకు ఎక్కడ కూర్చోవాలని ఉందో చెప్పండి.

ఫరీద్ : ఎక్కడో అక్కడ, కాస్త మెత్తగా ఉండాలి...ఇక్కడ మఖ్మల్ పరుపులూ బాలీసులూ లేవే. ఎలాగ కవిత్వం వ్రాయడం ?

తారా : పోనీ అక్కడ కూర్చోండి !

ఫరీద్ : (దూరాన్నుంచి) ఆఁ. అమ్మయ్య. కాస్త బాగుంది. తారాసింగ్, ఇదిగో ఇప్పుడే చెప్తున్నాను. ఎవరొచ్చినా సరే, నా దగ్గరకిమాత్రం రానీయొద్దు. నా బుర్ర ఉంటే, కాస్తైనా గొడవ ఓర్చుకోలేదు. అంత సుకుమారమైంది. కాస్త కటుకుమాట విన్నానంటే, మనస్సు చివుక్కుమంటుంది. పాడు మొహం కనిపిస్తే చాలు ఓ వారంవరకూ మతి చెడి నశైపోతాను.

తారా : సరేనయ్యా బాబూ...

షరీఫ్: ఐతే మరి నేను కవిత్వంలోకి దిగిపోతాను.

(తలుపు చప్పుడు తర్వాత అడుగుల చప్పుడు)

అప్పలస్వామి: (కత్తిరి చప్పుడు చేసుకుంటూ దూరాన్నుంచే) తారాసింగ్. మనవాడు మొత్తానికి కూతురికి పెళ్ళి తలపెట్టాడే. చంద్రకళ, చంద్రకళ, రాకుమారులు పెళ్లి చేసుకోతగ్గ సౌందర్యవతి.

తారా: అరే, అప్పలసామి, ఆ కత్తిర్ని ఇటూ అటూ తిప్పకు. నా కంట్లో గుచ్చుకోగలదు.

అప్పల: నా కంతా స్వప్నంలా ఉంది. చిన్నప్పుడు నేను పెళ్లిళ్లలో గనిపెట్టు మేళం ముందు గెంతేవాణ్ణి. ఇప్పుడూ విసంగా గెంతాలని ఉంది తారాసింగ్. ఇదిగో నేను ముందే బజానా ఇచ్చేస్తున్నాను. ఆమెనే నేను పెళ్లాడానంటే ఈ మంగలి వృత్తి మానేశానన్నమాటే. అను, (కత్తిరి చప్పుడు) నా పద్యం నేను వ్రాసేస్తాను. అప్పుడు నేను చెపుతూంటే, నువ్వు కలం పట్టుకు గబగబా వ్రాసెయ్యాలి.

భావకవి: (దూరాన్నుంచి) గాడిదా, బుద్ధిలేదూ, ఈ లోపలరా, దాక్కున్నావు? తారాసింగ్ తారాసింగ్, మంగలి అప్పలసామి లోపలున్నాడా?

అప్పల: తారాసింగ్, ఎవరా కేక వేసేది? ఓహో, అరెరే, ఆయన గడ్డం చేస్తూ చేస్తూ వచ్చేశాననుకుంటాను.

భావకవి: (కోపంగా) తారాసింగ్, వాడు లోపల ఉన్నాడా? చూడు, గడ్డం నిండా ఎట్లా నాట్లు పెట్టాడో. పైగా ఓ చంప అట్లానే ఉంచేసి చంద్రకళ మాట వినగానే పరుగెత్తాడు......ఏడీ వాడు? కనిపించడే...ఏం చేస్తానో చూడు.

తారా: కొంచెం శాంతించాలి యువకవిగారూ? అతి చెప్పడేనా ఆవిధంగా మిమ్మల్ని సగం సగం గడ్డం చేస్తూ, వదిలేశాడా?......అప్పలస్వామి పద్యం వ్రాసే ధోరణిలో ఉన్నాడు...అంతే.

భావ: పద్యమా, ఏమిటి? నా కన్నుపిస్తే బుర్ర రామకీర్తన పాడిస్తాను.

షరీఫ్: (దూరాన్నుంచి) తారాసింగ్ ఆ యువకవిగారిని అవతలికి దయ చెయ్యమను. కవిత్వం ఆలోచిస్తున్నానని తెలియదూ? పాడు గొడవ.

తార: అబ్బబ్బా, ఇందాకటినుంచీ ఓ మాట కోసం గింజుకుంటూంటే ఆఖరికి మనస్సుకి తట్టింది. కాని, ఆ మాట కాస్తా ఈ పాడు గొడవలో మళ్లీ మాయమైపోయింది.

అప్పల (గట్టిగా) అయ్యా యువకవిగారూ, మరోమాటు, ఆ రెండో చెంప గీసేస్తాను లెండి. ఇప్పుడు కాదు. చాలా కవిత్వం తొందరలో ఉన్నాను. దయచేయండి.

తారా: యువకవిగారూ, కుబేరుడిగారి సంగతి విన్నారా? ఒక పద్యం చంద్రకళమీద వ్రాశారా, చంద్రకళ మీ జీవితాన్ని కాంతిమంతం చేస్తుంది.

భావ: ఏమిటి, ఒక్క పద్యం వ్రాస్తే చాలా? చెప్పావు కాదు? అదెంతసేపు.

తారా: మీ పద్యం చక్కని దస్తూరీలో అచ్చులా ఉండాలి.

భావ: నా వ్రాత అంత బాగా ఉండదే?

తారా: నే నున్నానుగా? ఏమిటి సెలవు?

భావ: వ్రాసేందుకు ఎంత పుచ్చుకుంటావు?

తారా: ఎంతో నా, ఒక దీనారం.

భావ: అబ్బే, అంత ఇచ్చుకోలేనయ్యా.

తారా: మీరే అలాగంటే ఎట్లా? ఉత్తమమైన పద్యానికి అంత మొత్తమైనా ఇచ్చించకపోతే బావుండదు.

భావ: సరే, ఇదిగో.

షరీఫ్: అమ్మయ్య, కాస్తగొడవ తగ్గింది... కాని ప్రాస కుదరడంలేదు. కళకితగిన పదాలు... ఆ:...వస్తోంది... పెళ, తళ, గళ, బళా,...యతి ప్రాసలుంటే చాలుగా, అర్థం లేకపోతే పోయే. ధ్వనికి, ప్రాధాన్యం ఇచ్చారు కాని అర్థానికి కాదుగా...బాగుంది.

భావ: (దూరాన్నుంచి) – ఏయ్, అత్తరుసాయిబూ, వాగకు. మంచిభావంకోసం సేలంవేస్తున్న సమయానికి ఎందుకా గార్దభస్వరంతో అరుస్తావు? లోపల ఆలోచించుకోలేవూ?

షరీఫ్: మనస్సులో ఆలోచించుకోడం నాకు చేతకాదు.

అప్పల: (ఓమూలనుంచి) స్, స్, నిశ్శబ్దంగా ఉండలేరూ, భావకవిగారూ...మనస్సులో అప్పుడే నా పద్యం పూర్తిచేసేశాను. కంఠతా పడుతూంటే కాస్త మాట్లాడకండా ఉండలేరూ?

తార: (పిమూలనుంచి) మీ కంత మాట్లాడు కోవాలని ఉంటే, దూరంగాపోయి మాట్లాడుకోండి బాబూ.

ఫరీద్: (వేరే మాలా బులాలా వరసని) లాలాలా. (అని కూనిరాగం తీసి) కోయిలలా గొంతు లోన కోర్కెలు రేగనటే,...

శ్రేష్ఠ ఇలా పెంపలిడితే ఎలావుంటుందో...

తార: ఆఁ. వచ్చింది, వచ్చింది, అన్నయ్యా.

(రాగంతో) కౌముదీ కాంతి లోగొన్న కోకి
లమ్మ, గళము సరిచేసి ఘళ ఘళా పాడుమమ్మ.

ఫరీద్: (కోపంతో) ఏమిటంటున్నావు తార బ్బాయి? ఊహూ, నేనుమాత్రం ఒప్పుకోను. మొదట నాకొచ్చిందా భావం, కోకిల నా మనస్సుకే మొదట తట్టింది.

భావ: అన్నయ్యా, ఇందాకటినుండీ అంత బాగా పాడే పక్షిపేరు జ్ఞాపకంరాక గిలగిల కొట్టు కున్నాను.

(రాగంతో) కోకిలా, కోకిలా, కూయవే, కూయవే.

ఫరీద్: (చికాకుతో కోపంగా) అంతా దొంగలు. నా ఎంగిలి తింటారే. మీకు బుర్రల్లేవూ?

తారా: ఏమిటిది ఫరీద్? కవులూ, ప్రియులూ, మీరే, అలా దెబ్బలాడుకుంటే రాలా? ఈ గొంతెండి పోయిన ప్రపంచానికి మీరు, భూర్భువస్సోకాల అమృతాన్ని చిలుకుతున్నారు. వద్దు. దెబ్బలాడుకో కండి.

అప్పల: అంతా వినండి. వినండి నా గేయం. పూర్తైపోయింది వినండి.

ఫరీద్: వినం, వినం, వినం. ఈ కోకిలనురించి మొట్టమొదట ఇటో అటో తేలాలి.

అప్ప: తారాసింగ్, నేను మర్చిపోకముందే నాగేయం చెప్పేస్తాను. త్వరగా వ్రాసెయి బాబు?

(పాడును) రోజారేకుల చుబుకము దానా,
శ్యామలనీరద ఆకాశంలో
కోకిలగానము చేయవదేమె.

ఫరీద్: (అడ్డంగా వచ్చి) అప్పలసామీ, ఏదే, నీ మనస్సుకే కోకిలే పట్టిందన్నమాట. ఇన్నాళ్ళూ ఈ ప్రపంచంలో డబ్బుకోసమే దోపిళ్లు జరుగుతున్నా యనుకున్నాను. ఆఖరికి భావాలనికూడా దొంగిలి స్తున్నారు...ఇంకెక్కడి దాచుకోడం.

అప్పల: ఏమిటంటున్నావు? కోకిలా? ఔను నాకే మొట్టమొదట మనస్సుకి తట్టింది. ఎంతచక్కని మాట. కోకిల! కోకిల!

ఫరీద్: నేనూ, మొట్టమొదట అటువంటి పిక్ష ఉండంటూ కనిపెట్టినవాణ్ణి.

తార: (నవ్వుతూ) పిక్ష ఏమిటోయ్, ఫరీదు?

ఫరీద్: ఔను పక్షి, పిట్ట కలిస్తే పిక్షౌతుంది. నేనే కనిపెట్టాను.

భావ: మీ దెవరిదీ కాదు వాది.

తారా: కవులారా, మీరందరూ ఒక పక్షి గురించి ఈ విధంగా తిగూలాడి కాలయాపన చేస్తు న్నారు...చంద్రకళ ఒక్కటే ఐనా, ప్రతి వనం, వెన్నెల కౌగిలింతలో పులకరించడం లేదూ? అందరూ ప్రేమారాధకులై ప్రేమ జపమాలని తిప్పడం లేదూ?

అప్పల: బాగా చెప్పారు తారాసింగ్. కోకిల అన్నమాట నా స్వంతం కాదు కాబట్టి, మిగతా వారు వాడుకోడానికి ఎటువంటి అభ్యంతరం పెట్టను.

ఫరీద్: నేనుమాత్రం ఒప్పుకోను. ఇదిగో, ఇప్పుడే చెప్పేస్తున్నాను. కోకిలని ఎవ్వరూ కవి త్వంలో వాడ్డానికి వీలులేదు. మీ కందరికీ తెలుసు న్నదే. పునరుక్తి దోషంబు పొందక పోకండి.

అప్ప: తారాసింగ్, ఇప్పట్లో మా తగువు తీరేట్లా కనిపించడం లేదు. ఈ విషయంలో నీకు ప్రమేయం లేదు కాబట్టి, నువ్వే ఎలాగో, అలాగ, ఇదమిద్ధం అని పరిష్కారం చెయ్యి.

తార: ఔను, అప్పలసామి చెప్పింది బాగుంది. తారాసింగ్, నువ్వే చెప్పవయ్యా.

భావ: నాకు ఇష్టమే.

ఫరీద్: సరే, అందరికీ ఇష్టమైతే నాకూ ఇష్టమే.

తారా: కవులారా, ఇందులో నేను పరి ష్కారం చేయతగినదేముంది? మీరంతా మీ మీ గేయాలు ఎట్లా వ్రాసినా సరే, అవిమాత్రం అమర త్వాన్ని పొందాలి. పరిమళ భరితంగా ఉండాలి... మీ ఇష్టమొచ్చినన్ని పక్షుల్ని వాడండి, వెన్నెల్ల

నిలుకలు, పావురాలు, ఆ కోకిలను మాత్రం వదిలే శాంది. ఏం? తీరిందా తగవు?

ఫరీద్ : ఏమిటి? ఆ కోకిలని ఎవ్వరం వాడు కూడదూ? అదే చాలా కష్టమే?

దృశ్యం 2

(తారాసింగ్ గదిలోనే కవులంతా కూని రాగాలు తీస్తూ గేయాలల్లడంలో మునిగి తేలుతూంటారు)

అప్ప : (ఉత్సాహంగా) ఐపోయింది, దబ్బుని, తారాసింగ్ కాగితం కలం తెచ్చుకో...అబ్బబ్బా, భావాలు జలపాతాల్లో పడిపోతున్నాయి. ఒక్క నిమిషం కాలయాపన అయిందా భావాలు జారి పాతాళంలో ఇరుక్కుపోతాయి.

తారా : అప్పలస్వామి, నేను సిద్ధమేనయ్యా, కానీ చెప్పు.

అప్ప : (పాడుతూ)

ప్రణయ తూలిక విసురులో విరిసినట్టి
విరులహారమ్ము చెలియ, నీ వందుకొమ్ము.

అబ్బే కాదు, కాదు.

"కళ కాకరవా, చంద్రకళవు"...చ్, చ్ మర్చిపోయాను.

తాత : (అతి తొందరగా) అద్భుతము భళా, భళీ, దప్పన, గజేకాలో నూని కాగిపోతూన్నట్లు నా మెదడు ఈ ఆలోచనలతో మరిగిపోతూంది. తారా సింగ్, కలం తెచ్చుకున్నావా?...ఏమిటా ప్రాస? కళ...బళ...

అప్ప : తారాసింగ్, వచ్చేసింది, బాబ్బాబు, ఒక్కసారి రాస్తూ?

తారా : అప్పలస్వామి, నాకేం నాలుగు చేతులు లేవు? ఇక్కడి తాతబ్బాయికే వ్రాయనా, అక్కడికొచ్చి నీకు వ్రాయనా, కాస్సేపుండు.

భావ (దూరంగా పాడుతూ)

చిరుత ప్రాయమునాడె
చిరుకేలు సాపుడూ...

ఫరీద్ : తారాసింగ్, వాళ్ళంతా దొంగలు, దా, బాబు, వ్రాసెయి.

అప్పల : (పాడుతూ) "పత్రముల సందులందు పొంచియున్న"—వ్రాసుకో తారాసింగ్.

ఫరీద్ : (మేరె సాలాబులాలో; వరసని లాలా అంటూ పాడుతూ)

వంశీచేతా లేక
వనితా పాడూ నేలో.

భావ : (పాడుతూ) చిరుత ప్రాయమునాడె,
చిరుకేలు సాపుతూ,
చీమ చిటుకన గానె
చేజారిపోతివా?,

తాత : (పాడుతూ)

కాంతిలోకముకన గానె
గళము నెత్తి, కళకళాయని
కేకవేశ్చినాను.

తారా : (నవ్వుతూ) నామీద పడకండి. కవిత్వజ్వాలలు ఎగిరి నాకు మచ్చేమలూ పోస్తున్నాయి...ఒకళ్ల తర్వాత ఒకళ్లు...అప్పలస్వామి! ఏదీ నీ గేయం చెప్పు.

అప్ప : (పాడుతూ)

కళల కాకరమైన కౌముదీకళికవె.
ప్రణయ తూలిక చివర
ప్రసవించె పూమాల
ప్రణయినీ, ప్రణయినీ గళమెడే, ప్రణయినీ.

తారా : షేష్, ఎంత బావుందయ్యా, ఈ పద్యం నాదైతేనా?

ఫరీద్ : బావుందా, హా, నాకంతా పులుముడుగా ఉంది.

అప్పల : ఏమిటంటున్నావు? జాగ్రత్త సాయిబూ?

తారా : తాతబ్బాయి, ఏదీ ఓమాటు మాతి ఎత్తు, ఎటువంటి సువాసనద్రవ్యాలు వేసి పద్యాల రొట్టెని తయారుచేశావో చూస్తాను?

తాత : (పాడుతూ)

పవలు రేయనుమాటల మరచిపోయి,
నేతిలో నానిసాగిన పిండి భాతి
సందెపై దబదబా బాదు కొంటి సకియ!

తారా : షేష్, తాతబ్బాయి, షేష్...యువకవీ, ఏదీ నీ దంతవధహా వచ్చింది. చెప్పు మరి వ్రాసే స్తాను.

భావ : అనవరతము, అనుదినమును
ప్రణుతింతును నీ ప్రేమలను,
ప్రేమకళారాధనలో
చంద్రకళాధీనములో
జీవింతును, జీవింతును.

తారా : ఇదేం కవిత్వం, తమాషాగా ఉందే.

భావ : అతివాస్తవిక కవిత్వం కాదే?

తారా : అత్తరుసాయిబు, నీపాట పూర్తైందా? లేక ఇంకా మెరుగులు పెడుతున్నావా? పేరుకు తగ్గట్టు అత్తరువాసనలతో నిండిఉంటుం దనుకుంటాను.

అత్తరు : (వరసకోసం మేరే వాలా బులాలో లాలా లా అని పాడి తర్వాత తన గేయం పాడడం మొదలెడతాడు.)

నాలో కోర్కెలు రేగ వదేలనోహో
నాలో కోర్కెలు రేగ వదేలనోహో
చంద్రకళ కరగ్రహణమునకై
సేకరించితి సౌరభాలను
నాలో కోర్కెలు రేగనదేలనోహో
నాలో కోర్కెలు రేగనదేలనోహో.

తారాసింగ్, చూస్తున్నాలే నువ్వు పెదిం విరవడం? అప్పటికప్పు డొచ్చిందంతే. మన కవులంతా ఒక్కొక్క పాదం వ్రాయడానికి ఒక్కొక్క వారం తీసుకుంటారు.

అప్ప : ఓహోహో, ఎంతబాగా వ్రాశారండీ, అత్తరు సాయిబుగారూ? నా మంగలికత్తి పీపులా ఉంది మీ పద్యంలోని పదును.

తారా : మీరందరూ కవులు. కవికులానికి చెందినవాళ్లు? ఒకళ్ళ నొకళ్లు ఎత్తిపొడుచుకుంటే ప్రపంచానికి లోకువైపోరూ? మీమీ పద్యాలు వ్రాయించుకోడం ఐపోయింది కాబట్టి, నా కివ్వవలసిన పారితోషికం వెంటనే వెళ్ళి తెచ్చిఇవ్వండి.

మూడవ దృశ్యం

(కవు లందరూ తిరిగి తారాసింగ్ గదికి వస్తారు.)

తాత : తారాసింగ్,

తారా : ఎవరు? ఓహో ఎందుకు మళ్లా వచ్చావు తాతబ్బాయి?

తాత : ష్, ష్, మెల్లిగా మాట్లాడు. నీ పక్కని ఇంకెవరూ లేరుకదా?

తారా : ఎవ్వరూ లేరు...

తాత : (రహస్యంగా) చూడు, సింగ్, చంద్రకళని నేను గెలిచేట్లు ఉన్నాను. నిజానికి చెప్పొద్దూ ఆ యువకవి గేయంముందు నా గేయం డివిటీలా ఉంది. నువ్వు కొంచెం మెరుగు పెడితివా...చంద్రకళ...మరేమంటావు?

తారా : ఏదీ, ఆ యువకవి వ్రాసింది ఏదీ... ఊఁ...సరే, ఇంకో దీనారం ఇస్తావా?

తాత : (ఆనందంతో) ఒకటి కాకపోతే రెండు తీసుకో. చూడు, ఆ భావకవి దానికంటె మంచి చమక్కుగా ఉండాలిసుమా? మరి నేను వెళ్ళిపోతున్నాను?

అప్ప : (దూరంగా నే) తారా సింగ్......

తారా : ఎవరు వారు, అప్పలసామా?

అప్ప : ఆఁ, నేనే, ఈ సమయంలో నీ సహాయం లేకపోతే, ఆమెను పోగొట్టుకుని భగ్న హృదయంతో పరలోకవాసినైపోతాను.

తారా : అర్థం గ్రహించాలే.

అప్ప : కుబేరుడు పెద్ద భావాల గురించి అంతగా కాతరు చేయట్ట. ఐనా ఎందుకో నాకు ఆ అత్తరు సాయిబు గేయమే, కుబేరుడుగారు మెచ్చుకుంటారేమో అని అనుమానంగా ఉంది. పైగా వరస బాగుంది కూడాను. ఇదిగో, ఈ దీనారం తీసుకో...కొంచెం...సరేనా?

తారా : అదెంతసేపు, నేనున్నానుగా మెరుగు పెట్టేందుకు? నువ్వు నిశ్చింతగా వెళ్లిపోవచ్చు.

షరీఫ్ : తారాసింగ్,

భావకవి : తారాసింగ్,

తారా : సాయిబూ, భావకవిగారూ, ఇదేమిటి ఇద్దరూ ఓమాటే వచ్చారు?

షరీఫ్ : ఏయ్, యువకవీ, ఎందుకొచ్చావు నువ్వు?

భావ : నువ్వెందుకు వచ్చావో నేనూ అందుకే వచ్చాను.

ఫరీద్ : నీ పనికంటె నాది ఎక్కువ ముఖ్యమైనదని? ఓమాటు నువ్వు బైటికెళతావా? సింగుతో కొంచెం రహస్యం మాట్లాడాలి?

భావ : అంతకన్నా తొందరైన పనుంది నాకు. నేను మాత్రం కదలను. నువ్వే ఓమాటు బైటికెళ్లు.

తారా : ఇదిగో, మీ రిద్దరూ అలా దెబ్బలాడు కోవడం బాగులేదు. ఇద్దరూ కూర్చోండి. మీ కథే మిటో నాకు తెలుసు...ఒక్కొక్క దీనారం ఇస్తే చాలు మీమీ గేయాలకి అద్భుతమైన మెరుగు పెడతాను.

భావ : ఎలాగైనా తారాసింగ్ ఘటివాడు.

ఫరీద్ : మన మనస్సులోనిది బాగా కని పెట్టాడు. ఇదిగో నయ్యా, నువు కోరిన దీనారాలు. మరి మేము వెడతాము. సిద్ధంగా ఉంచుసుమా.

తారా : యువకవిగారూ, పేరుకి తగిన న్యాయంచెయ్యండి, మీరు కవులాయె. మీ ఇష్టం మీరేంచేసినా సరే. ఓసారి కూర్చుని మళ్ళీ వ్రాయడానికి ప్రయత్నించరాదూ ?

భావ : సరే, అత్తరుసాయిబే బాగా వ్రాశాడంటావా ?

తారా : ఔను, ఎన్నిమార్లైనా అంటాను... ఉండండి, వెళ్లిపోకండి. చంద్రకళగారింటికి అందరం కలిసి వెడదాము. అప్పుడు తేలిపోతుంది మీ అందరి కవిత్వంలోని పస. ఫలితం దైవాధీనం.

తారా : ముసురుకొన్న మబ్బుల్లోంచి శశి ప్రియుడు అదుగో బైటపడుతున్నాడు. ఆహా, చంద్రకళా, చంద్రకళవే నువ్వు. ఈ జీవితాన్నే ఒక రాగంలో సరిచేసి నీ కరస్పర్శకై తహతహ లాడుతున్నాను.

యువ : తారాసింగ్, అప్పుడే నువ్వే ఆమెని గెలిచినట్లుగా మాట్లాడుతున్నావే.

తారా : ఔను. నేను కళోపాసకుణ్ణి స్వాప్నికుణ్ణి. వలచి గెలవలేనప్పుడు గెలుపొందినట్లు కలగని ఆనందించడం చాలా గొప్ప. స్; స్ పాలకీ బోయీలహోరు కేక లేనా అవి. ఆహా, చంద్రకళా! ఎవరా వచ్చేది? కవితాప్రియులా, ఓహో, హో రండి, రండి. అప్పలస్వామి. తాతబ్బాయి, అత్తరు సాయిబు, అంతా రండి.

తాత : (ఆవేశంతో) ఆహా, నేడు నా జీవితం తరించింది, తారాసింగ్.

అప్ప : పారిజాతపుష్పంలా ఉంది ఆమె దేహం ఆమె పెదాలు...

ఫరీద్ : (కంగారుతో) ఈ గొడవలో మరిచి పోయొచ్చాము. తారాసింగ్, నీ దగ్గిర కళ్లజోడు లేదూ? మాయదర్వారం.

నాల్గవ దృశ్యం

(కుబేరుడుగారింటో కుబేరుడుగారు, కోమార్తె, చంద్రకళా, స్వయంవరానికి వచ్చిన కవి ప్రియులు)

కుబే : చంద్రకళ వివాహాన్ని గురించి చేసిన ప్రకటన మీరంతా వినే ఉంటారు. నాకు ఆస్తి పాస్తులతో నిమిత్తం లేదు. కవితాహృదయం కావాలి. నా చంద్రకళ అప్పుడే సుఖపడుతుంది. కాలయాపనెందుకు? ఏదీ మీమీ గేయాలు చూపండి.

తారా : ఓ నవనీతసుందరి, సుందరోజ్జ్వల రూపిణీ, చంద్రకళా, ఇవె నీ చరణదాసులు, నీగళాలంకరణకై ఏర్చికూర్చి చేర్చిన ప్రేమ ప్రసూన పద్యమాలలు.

చంద్ర : (అతన్ని ప్రేమించినట్లు లాలనతో) అశేష శేముషీముషీపంకమునందే స్నాతములైయున్న అంగుళులు కలవాడవు. ఓహో, నీవా రచయిత్రి లోకపు రాకుమారుడివి ?

తారా : రాకుమారుడనా, సవ్యకళా...చంద్రకళా...సన్యజ్ఞి.

చంద్ర : ఈ గేయం రచించిందెవరు ?

తాత : రాణీ, నేను తాతబ్బాయిని...గేయం కొంచెం పాకంలోకి, రాకపోయి ఉండొచ్చును. కాని గొప్పగొప్ప కవులు...

కుబే : చాలు చాలయ్యా...అమ్మా, చంద్రకళా ఏమి టనబోతున్నావు ?

చంద్ర : మాతారా, ఈ గేయంలోని మొదటి పాదం? 'పవలు రేయను మాటల మరిచిపోయి'

తాత : (ఆశ్చర్యంగా)

పవలు రేయను మాటల మరిచిపోయి
చేతిలోనాని సాగిన పింజి భాతి
గుండెపై దబదబా............

కుబే : ప్, ఊరుకో...

చంద్ర : (నవ్వుతూ) నాన్నగారూ, ఈ గేయంలో రొట్టెలూ, నెయ్యి, పిండి, అన్నీ తెచ్చిపెట్టాడండి (నవ్వుతుంది) ఇదిగో, తాతబ్బాయి, నువ్వెంత బాగా రొట్టెలపిండి రుబ్బినా, కవివిమాత్రం కాలేవు ?

తాత : (తడబడుతూ) అయ్యా కుబేరుడుగారు ...చంద్రకళా, ఆ పద్యం నేను అద్భుతంగా వ్రాశాను.

కుబే : తర్వాత కాగితంచూడు చంద్రకళా.

చంద్ర : ఈ సంతకం ఎవరిది ? అప్పలసామి ?

అప్పు : ఆఁ. నేనే.

చంద్ర : చదువుతూ—నా కరగ్రహణము.

అప్పు: కాదు కాదు. (కళలకాకరమైన కౌముదీ కలికవై...

కుబే: వాళ్ళమాటలు చెవినిపెట్టకమ్మా...ఊఁ ...తర్వాత.

చంద్ర : ఫరీన్ !

ఫరీన్ :

ముసుగోసరిల చేయుమెహా ముకుళితవదనా
చంద్రకళా, నీ ముంగురులతో
అడుకు నే పిల్లతెమ్మెర లెంత పరిమళ
భరితాలు, ఏమిటి సెలవు?

చంద్ర : (నవ్వుతూ) అత్తరు సాయిబూ, ఈ కాగితంనిండా ఈ నూనెమరక లేమిటి?

ఫరీన్ : చంద్రకళా, ఒక్కసారి వాసన చూడు. నా గీతికా పూలమాల పరిమళింపు సువాళింపుతో నిండి ఉంది.

చంద్ర : (నవ్వుతూ) కాగితప్పువ్వుల్లో అత్తరు వేసినట్లుంది.

ఫరీన్ : చంద్రకళా, ఒక మనవి. దయచేసి, నా గేయాన్ని పూర్తిగా చదవమని ప్రార్థన. అప్పుడే ఆ గేయంలోని గూఢార్థం, గ్రాహ్యం బోధతుంది. కళాపరీక్షకి గీటురాయి అదే...పూర్ణాకృతిలోనే సంపూర్ణత కనిపిస్తుంది.

చంద్ర : (చదువును) నాలో కోర్కెలు రేగిన
జేలనోహో...

ఫరీన్ : నాలో కోర్కెలు రేగినజేలనోహో
చంద్రకళ కరగ్రహణమునకై
సేకరించితి సౌరభాలను...

కుబే : ఛీ, సోదుసుయ్య. ఏమిటా కరప. ఏమిటా కూతలు?

చంద్ర : (నవ్వుతూ) నాన్నగారూ, ఈ మరుసజ్జానితోమాత్రం నాకు వివాహం వద్దు బాబూ ఈ ఆఖరి పద్యం ఎవరిది.

భావ : నాది.

కుబే : ఓహో, యువకవిగారా? మీ కవిత్వం అప్పుడప్పుడు మా అమ్మాయి చదివి నాకు వినిపిస్తూంటుంది. బాగా వ్రాస్తారండి. బహుశా యీ కవితా స్వయంవరంలో మీదేనేమో గెలుపు.

చంద్ర: ఉండండి నాన్నగారు......చూడకుండా తొందరపడకండి.

భావ : (ఆవేశంతో) జీవననందినీ, హృదయకుహరాన్ని జ్యోతిర్మయంచేసిన ఓ చంద్రకళా, ఈ పరాజ్ఞుడు నీ అధీనుడు. తనియింపుము. తరియింపుము.

చంద్ర: నాన్నగారు, కవిగారి పద్యం చూశారా. తమాషాగా ఉంది. కొత్త పంథాలో వ్రాశారు.

కుబే : మరీ మంచిది. అతన్నే వరించు తల్లీ.

చంద్ర : నాన్నగారు...కాని......

కుబే : సందేహం ?

చంద్ర : జోను...చూడండి ఆకన్ను...మెల్ల ఉంది నాన్నగారూ ?

భావ : చంద్రకళా, అది అదృష్టం మెల్ల... నా గేయాన్ని అంత చులకనగా త్రోసిపారేయకుమీ. ఓగంటసేపు కష్టపడి ఆ అద్భుతమైన గేయాన్ని పొందికగా కూర్చుకలిగాను. నీవు నిరాకరిస్తే యావజ్జీవం ప్రేమ జపమాల తిప్పుకుంటూ ప్రవాసజీవనం సాగిస్తాను. కరుణించు చంద్రకళా.

తారా : దేవీ...నా గేయం పరీక్షించవూ...

చంద్ర : ఎవరిది.

తారా : ప్రేమగాయకుడు, ప్రేమారాధకుడు తారాసింగ్ ది.

చంద్రకళా, నీ గళాలంకరణకై పుణికిన దీన తారల మాలనందుకోవలి...నా కవిత్వం, నా బలం

నా యవ్వనం, నా చిరునవ్వులు ఒకటేమిటి? నా సర్వస్వం నీకై త్యాగం చేస్తున్నాను?

కుబే: అమ్మాయి. ఏది అతను వ్రాసింది చదువమ్మా.

చంద్ర: (లాలనతో) ఇంకోరు చదివినా కూడా విననూ... తారాసింగే చదవాలి.

అప్పల: తారాసింగే చదవాలన్న మాట...... ఇంకనే తేలిపోయింది.

చంద్ర: (గారాబంగా) తారాసింగ్, నువ్వు చదవవూ?

తారా: ధన్యుణ్ణి దేవీ.

ప్రణయ మధురిమాస్నపిత
పూర్ణిమా నిశినేడు
పరతెంచె ప్రేయసీ
పరుగు లిడిరావె.
కొంకెరిన మెలికేటి
క్రీగంటి చూపులతో
నిశితోడ శశిప్రియుడు
దోబూచులాడె.
తెరచాటు కళికనై
ధరణి నెచటనో దాగ
నీ కొరకె నాకేక
నీలి మొయిలుల వెనుక
మమజీవనందినీ
మంజులభాషిణీ
అకలంకరూపిణీ,
అమృత స్వరూపిణీ.

చంద్ర: (తన్మయతలో) అబ్బా, ఎంత బావుంది. తారాసింగ్ ఆపవోయి యీపులకరింతలు.

అప్ప: తారాసింగ్, అద్భుతంగా వ్రాశావోయి. ఏమంటావు అత్తరుసాయిబు.

కుబే: తారాసింగ్, చంద్రకళ నేటినుండి నీది. ఇద్దరూ, ఒకే మేళవింపులో మీ హృదయ తంత్రుల్ని మ్రోయించుకుని ప్రేమగానంలో జీవించండి.

తారా: మిత్రులారా, నాదో మనవి...ఇదిగో ఈ డబ్బంతా ఎవరిది వారు తీసుకోండి. మిత్రులారా, ఇంకేం కావాలో కోరుకోండి.

అప్ప: మీ ప్రేమ ఉంటే చాలు.

తారా: దానికేమి కొదవ.

(ఆల్ ఇండియా రేడియో వారి సౌజన్యంతో).

భారతీయుడు - అశరీరవాణి

శ్రీ బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు

భారతీయుడు:

నేను మరుగుజ్జనే యైన నేమి-నా పి
తామహుని యంత పొడుగరి ధరను లేడు
ఒక్కనరమటు లిపుడు నే నున్న నేమి
ఉర్విగెల్చె మా ముత్తాత ఒక్కచేత!
నా 'మనోవర్తి' మనికి అంత మయినంత
నేనె నాఇంటి పెత్తన మ్మూనినంత

నన్నుగని నవ్వుచున్నారు—నవ్వకండి!
నేను రారాజ వంశంపు నిసువునండి!!

నిజమె! ఇంటను బయటను నిమిష నిమిష
మాత తాయుల సంఖ్య మిన్నంటుచుండె
ధర్మపరుడను గనుక, ఈ ధరణి తరణి
నాడను గనుక ఊరుకొన్నాను నేను

ఎన్నటికేని నేనే
ఇన్నర జాతులకు నెల్ల ఏడుగడనుగా
నున్నానా అవకాశము
మన్నయి పోదా-ఇప్పుడు ప్రమాదపడినచో!

అశరీరవాణి:

ఓయి కుమార! భ్రాంతి విడుమోయి- పురాతన వైభవస్మృతిన్
నీయిపుడున్న దుస్థితి గణింపక కన్నులు మూసికొని దే
లోయి! నిజమ్ము చెప్పెద మరొక్క- డెవండును నీవలెన్ విప
త్తోయధి మగ్నుడై సతము శోచడు నేటి జగత్పటమ్ముపై.

నిన్నటిదాక పెత్తనము నీపయి చేసిన అయ్య వర్తి పె
ద్దన్ననుగా నినున్ మలచె నన్న యథార్థ మెరింగి, ఇంతనై
న న్నిను నీవు దిద్దుకొననా తెరగారసికొమ్ము! ఎవ్వరే
మన్నను ధాత్రిపై తనకుమాలిన ధర్మము లేదు నాయనా!

లేలే ఇంతటనైన నిద్రవిడి-ఉర్వీరాజ్యమం దెంత నీ
పాలో అంతయు గెల్చుకన్క- విరమింపన్ రాదు పోరాటమున్
ఏలా నీ కుడిచేతితో ఎడమ చేయీలాగు పోరాడగా?
నీలో చక్కని సామరస్య మనుసంధింపన్ వలెన్ నాయనా!

తాతకును తగ్గ మనుమ డీత డను కీర్తి
స్వప్రతిభచే గడించుకోవలెను తండ్రి!
నీపితాళ్లు స్వపౌత్రుని నిన్ను జూచి
ప్రమద వారాశి తేలిపోవలెను తండ్రి!!

కవి సార్వభౌముడు భానుకరుడు - శ్రీకృష్ణదేవరాయలు

★

శ్రీ ఈయుణ్ణి వెంకట వీరరాఘవాచార్యులు

భూమిక

మిథిలాదేశము (బీహార్) గీర్వాణకవి శేఖరులకు, శాస్త్రావతారములే యనదగు నుద్దండ పండితాఖండులకు జన్మస్థానమై కీర్తి నందినది. విద్వత్కవివంశ ముక్తామణియై, ప్రౌఢవైదుషీభూషితుడై, కవిశేఖరుడై క్రీ. శ. 16 వ శతాబ్దమున విలసిల్లిన గీర్వాణ కవితల్లజుడు భానుకరుడు. భానుదత్తు డని యీతని ప్రఖ్యాత నామము. నాటి బిల్హణ మహాకవివలె, నేటి తిరుపతి వేంకటకవులవలెను నానారాజ సందర్శనము చేసి, తత్తద్రాజాస్థానముల దన కవితాసౌరభమును వెదజల్లుచు, రాజసమ్మానముల నందిన మహామహుడు భానుకరుడు. కవితార్కిక చూడామణి యగు గణపతి మిశ్రుడీతని జనకుడు; మహాదేవ మిశ్రుడు పితామహుడు; ఈ మహాకవుని కగ్రజుడే మహామహోపాధ్యాయ బిరుదాలంకృతు డగు శంకరమిశ్రుడు. కర్ణభూషణము, భృంగదూతము, శృంగారవనమాల మొదలగు కృతిరత్నములను రచించిన గంగానంద కవీంద్రుడు భానుకరునికి పౌత్రీపుత్త్రుడు. శంకరమిశ్రునివలెనే భానుదత్తుడును మహామహోపాధ్యాయ బిరుదభూషితుడు. ఈతని కృతులలో మనకు తెలియవచ్చిన తొమ్మిదింటిలో మూడుమాత్ర ముద్రితములు; తక్కిన యాఱును సూర్యాలోకము నందినవి.

భానుకరుని కృతులు

1. అలంకార తిలకము (కొన్ని నెలల క్రిందటనే ముద్రితము) 1949.

2. కావ్యదీపిక (ముద్రితము. 1885. అలభ్యము)

3. కుమారభార్గవీయము (అముద్రితము)

4. గీతగౌరీపతి (గీతగౌరీశము)—గీతగోవిందము వోలె గీతములతో, శ్లోకములతో గూడిన గేయ కావ్యము. ముద్రితము 1887.

5. చిత్రచంద్రిక (అలభ్యము; చిత్రగూఢ ప్రహేళికా ప్రశ్నాది విచారకము. అలంకార తిలకమున నుద్ధృతము)

6. రసతరంగిణి (గంగారామజడికృతనౌకా వ్యాఖ్యతో ముద్రితము, 1885. కాశీ; 1887—88 బొంబాయి) ప్యారిస్ నగర ప్రచురణము, 1884.

7. రసపారిజాతము (ముద్రితము. లాహోరు, 1939; పితృపాదు లగు గణపతిమిశ్రుల కావ్యముల నుండి, తన వివిధ కృతులనుండి వివిధ శీర్షికల క్రింద చేర్చికూర్చిన సంధాన గ్రంథము. (*Anthology*)

8. రసమంజరి (ముద్రితము; ఆంగ్లీకృతము. వేదం వేంకటరాయశాస్త్రిపాదుల తెనుగు టీకతో. 1909. మద్రాసు.)

9. శృంగారదీపిక (దుర్లభము)

ఇవికాక 'పారిజాత' మను ధర్మశాస్త్ర గ్రంథమును, 'ముహూర్తసార' మను జ్యోతిష గ్రంథము నీ కవి రచించినట్లు తెలియును గాని, యీ యంశము లింకను బరిశీలింపవలసియున్నది.

వాఙ్మయరంగమున దత్తకవితాదరము

ఉదాత్తకవితా సురభిళము లగు నీతని కృతులు కవిలోకమాన్యములై విలసిల్లినవి. ఈతని కవిత మనోహర మనుటకు దత్పద్యముల నెన్నిటినో యుల్లేఖించుకొనిన యీ క్రింది ప్రాచీన సుభాషితకోశములే ప్రమాణము :

1. పద్యరచన (ఉదాహృతపద్యములు: 185)
2. పద్యవేణి (46)
3. పద్యామృత తరంగిణి (11)

4. రసికజీవనము (116)
5. విద్యాకర సహస్రకము (9)
6. పద్యాలంకరణము (57)
7. సారసంగ్రహము (2)
8. సుభాషిత సారసముచ్చయము (88)
9. సుభాషిత హారావళి (11)
10. సూక్తిసుందరము (10)

జగన్నాథపండితరాయలు 'రసగంగాధరము'న చిరంజీవి భట్టాచార్యులు 'కావ్యవిలాసము'న, విశ్వేశ్వర పాండేయకవి 'అలంకార కౌస్తుభము'న, అచ్యుతరాయ పండితుడు 'సాహిత్యసారము'నను భానుకరుని యభిప్రాయమును విమర్శించియు, ప్రమాణీకరించుకొనియు నున్నారు. పండితరాయలవంటి దిగ్దంతి, కవిచక్ర చూడామణి యీతని శ్లోకమును విమర్శించుటయే చాలు నీతని విఖ్యాతికి నిదర్శనము.

నానా రాజ సందర్శనము

భానుకరుడు చేసిన ప్రభుప్రశంసలను బట్టి యీతఁ డిరువురు మహమ్మదీయ ప్రభువులను, ఇరువురు హైందవరాజుల నాశ్రయించి, తత్తత్సంస్థానముల యందు మన్నన లందిన ట్లూహింపదగును.

క్రీ. శ. 1540—45 నడుమ రాజ్యపాలన మొనరించిన షెర్షా (*Shershah*) ప్రభు వొక శ్లోకమున స్తుతింపబడుటచే భానుకరు డీతని నాశ్రయించిన ట్లును, క్రీ. 16 వ శతాబ్ద పూర్వార్ధమున నుండినట్లును తెలియుచున్నది.

భానుకరుడు నైజాం షా ప్రభువును 17 శ్లోకములలో ప్రశంసించియున్నాడు. ఈ ప్రభు వహమద్ నగరమున రాజ్యముచేసిన నైజాం షాహీ రాజవంశమునకు జెందినవాడు. క్రీ. 1509—53 నడుమ రాజ్యము సేసెను. (*Boorhan Nizam Shah* I) భానుకరు డీతని దర్బారునఁ జే విశేషకాలము గడపిన ట్లూహింపదగును. శ్లోకపంచకమున భానుకరస్తుత్యుఁడగు హిందూప్రభువు వీరభాను నృపతి. ఈతడు రీవాలో రాజ్యము చేసిన 'వఘేల' రాజవంశమునకు జెందినవాడు. ఈతని పట్టమహిషి సుకుమారదేవి. అక్బరు చక్రవర్తికి సమకాలవర్తి యగు నీతడు క్రీ. 1540—55 లో రాజ్యము చేసెను. ఈతనికి బిమ్మట నీతని తనయుడు, అక్బరీయ కాళిదాసస్తుత్యుడు నగు రామచంద్రప్రభువు 1555—92 వఱకు రాజ్యపాలన మొనరించెను.

భానుకర ప్రశంసాస్పదు డగు రెండవ హిందూ ప్రభువు మహాపరాక్రమశాలియు సమర-సతృష్ణుడు నగు కృష్ణ నృపతి. రసమంజరిలోని రెండు శ్లోకములలో నీ కృష్ణభూపతి వ్యంగ్యముగా ప్రశంసింపబడి నట్లు కన్పట్టును. క్రీ. శ. 16 వ శతకమున బూర్వార్ధమున రాజ్యముచేసిన యీ కృష్ణనృపతి విజయనగర చక్రవర్తి యగు మన కృష్ణదేవరాయలే. (క్రీ. 1509—30 పాలనము.) నేటివఱకు వెలువడిన సంస్కృతవాఙ్మయచరిత్రనిర్మాత లెవరును ఈ విశేషమును గుర్తించినట్లే కన్పట్టదు.

కృష్ణనృపతి ప్రశంసాశ్లోకములు

1. ఆర్యా. 'కృష్ణం సమర-సతృష్ణం,
దృష్టవతో (భ్రాన్తి) విస్తరత్రసతః,
రాజన్య జన్మయాలే,
భుజయాలే పులకముకుళాని.
—రసపారిజాతము. III. కి. ౧౮ పు.

2. శార్దూల విక్రీడితము.
'ప్రస్థానం రతిమన్దిరాత్
కమలినీబన్ధోరపి ప్రేక్షణం,
కాకుః కేళివిధిం వినాఽపి
చరణన్యాసః పృథివ్యామపి,
కిఞ్చ క్లాన్త మతాల వృన్త
పవనః ప్రత్యఙ్గ మాలిఙ్గతి,
ద్రష్టవ్యం కి మతోఽపి కృష్ణ
నృపతే! ప్రత్యర్థి వామభ్రువామ్'
—ర. పా. III 45. 20 పు. (ఉపద్యరచనా. 27 పు. ౬౩ ప)

ఈ క్రింది రెండు పద్యములయందును వ్యంగ్య మర్యాదచే కృష్ణనృపతి పేర్కొనబడినట్లు కన్పట్టును :

3. 'చక్రే చన్ద్రిముఖీ ప్రదీపకలికా
ధారా ధరామణ్డలే,
తస్యా దైవవశా ద్గతాఽపి చరమా
ప్రాయః సముద్దీప్యతి,
తద్ బ్రూమః శిరసా నతేన సహసా
శ్రీకృష్ణ నిక్షిప్యతాం,

స్నేహః స్రుత తథా యథా న భవతి
త్రైలోక్య మస్తం తమః.'
—రసమంజరి, నా॥ పద్య. 72 పు. (ర.పా.V 48 ప. 40 పు. 'శ్రీకృష్ణ'కు 'ప్రాణేశ'— పాఠా.)

4. 'ఖేదో వాచి దృశో ర్జలం, తదను చ
స్వేదః, ప్రకమ్పో౽ధరే,
పాండు ర్గండతటే, తనౌ చ పులక
వ్రాతో, లయ శ్చేతసి,
ఆలస్యం నయనద్వయే, చరణయోః
స్తమ్భః సముజ్జృమ్భతే;
తత్కిం రాజపథే వ్రజేన్ద్రతనయః
కృష్ణ స్త్వయా౽౽లోకితః?'
—(ర. మం. ౧౨౦ ప. 89 పు.)

పై పాఠము 'మకరంద' వ్యాఖ్య ననుసరించినది. అనంతపండితుని 'వ్యంగ్యార్థకౌముది' నిబట్టి యీ పాఠము కన్పట్టుచున్నది :—

రెండవ పాదము :
పాండు ర్గండతటీ, వపుః పులకితం,
లీనం మన స్తిష్ఠతి,
ఆలస్యం నయనశ్రియ, శ్చరణయోః
స్తమ్భః, సముజ్జృమ్భతే;
తత్కిం రాజపథే నిజామధరణీ—
పాలో౽ద్య మాలోకితః?'

పై పద్య తురీయచరణమున కనంత పండితుని వ్యాఖ్య :

'తత్కిం = తర్హి కిం; రాజపథే = రాజమార్గే; అనయా, నిజామధరణీపాలః = దేవగిరిరాజః; ఆలోకితః = దృష్టః.

యద్వా — నిజాన్ = ఆత్మీయాన్ ; అమతి = ప్రాప్నోతీతి నిజామః; స చాసౌ ధరణీపాలః, దుష్టహ దానవాది విదారకత్వాదితి భావః. ఏతాదృశః శ్రీకృష్ణః—ఇత్యర్థః'—(283 పు.)

పై రెండు శ్లోకములయందును కృష్ణభూపతి వ్యంగ్యముగా సూచింపబడినట్లు కన్పట్టును.

కృష్ణదేవరాయలు స్వవిరచితసంస్కృతకృతుల పేళ్ళ నాంధ్రవల్లభునిచే నొక సీసమున బల్కించినాడు. అందు మదాలసచరిత్ర, సత్యావధూప్రీణనము, సకలకథాసార సంగ్రహము, జ్ఞానచింతామణి యను గీర్వాణకృతులనే కాక, "మఱియు రసమంజరీ ముఖ్య మధురకావ్యరచన మెప్పించుకొంటి గీర్వాణ భాష." నని ఆముక్తమాల్యదయందు (I. 13) నుడివించియున్నాడు. పై కావ్యము లన్నియు లభింపలేదు కాని, పైని పేర్కొనబడని 'జాంబవతీ పరిణయ'మను సంస్కృతరూపక మొకటి లేఖకదోషజుష్టము, త్రుటితముగా నాతని రచనము లభించినది. తా నాంధ్రగీర్వాణముల నుద్దండపండితుడై కవిరాజై, ఆంధ్రగీర్వాణ కవికోవిదబాంధవుడైన యీ రాజకవి యాస్థానమున సంస్కృతాంధ్ర కవిచూడామణు లెందఱో యుండెడివారు. అందు మైథిలుడగు భానుకరు డొకడని నా విశ్వాసము. వీరిరువురును సమకాలికులగుట, భానుకరుడు కృష్ణనృపతి పరాక్రమ కృత్యముల వర్ణించుట, ఇరువురును రసమంజరి యను నామముతో గృతులను రచించుటయు దీనికి సాధకము.

ఒకవేళ భానుకరుడు కృష్ణరాయల ప్రోత్సాహముననే రసమంజరీనామముతో సాహిత్యకృతిని రచింప దానినిమించు నుద్దేశముతో గృష్ణరాయలు కూడ నానామముతోడనే మఱియొక సాహిత్యగ్రంథమును రచించియుండవోపు. లేక తన్నామగంధలోభమున నా పేరుతో నొక 'మధురకావ్యము'ను గృష్ణదేవరాయలు రచించి యుండవచ్చును. భానుకరుని కృతులను, రాయల కృతులను లభించినంతవఱకు తుల నాత్మకముగ గవేషణ మొనరించినచో గొన్ని కొన్ని కవితాసామ్యములు లభించునని తోచును. కృష్ణరాయల సంస్కృతకృతులు చాలవఱకు నుత్సన్నము లగుట శోచనీయము. రాయల గీర్వాణకవితారీతిని దెల్పుటకై యసమగ్రమగు 'జాంబవతీ పరిణయ' రూపకమునుండి రసికవినోదమునకొఱకు గొన్ని శ్లోకము లుదాహరింపబడును :

కృష్ణదేవరాయల గీర్వాణ కవిత :

ఆకూతస్మిత గర్భమర్థవచసా
ని వేతి శంసన్మిథో,
రుక్మిణ్యా వదనే రుషా సకుటిల—
భ్రూవల్లయం(?) వేల్లయన్,
సైషా తన్వి తవేతి కోమలతికాం
హస్తాగ్రేణ స్పృశన్,

అపి వ్యాఘ్రసమూహేనయా సరభసా—
క్లిష్టో హరిః పాతు వః'
—(జాంబ. *I*. 3)

2. 'వరాహవ్యూహోఽయం, గవయతతి
రేషా, మృగపతి
వ్రజోఽయం, సంఘాత ప్రరుణ శర
భాణా మయమయమ్,
గణో భల్లూకానా మయమిహ
నికాయః కరటినాం,
సమూహో వ్యాఘ్రాణా మయ
మిహ మృగాణాం సముదయః.'
—*I*. 30.

3. ఉల్లోలేక్షణ మున్నమయ్య
వదనం నిస్పృష్టకర్ణద్వయం,
దేహాస్యార్ధ ముదస్య పూర్వ
మపరం చావస్య గాఢాన్తరః,
వేగోద్రేకవశా దలక్ష్యచరణ
న్యాసః క్షితౌ భూయసా,
వల్గన్ వ్యోమ్ని చ ధావతి
ప్రతిపదవ్యావృత్త కర్ణో మృగః.'
—*I*. 33.

ఉపజీవ్య గ్రంథసూచిక
(*Bibliography*)

1. హరిభాస్కరుని 'పద్యామృత తరంగిణి' (కలకత్తా. 1941)

2. జి. వి. దేవస్థలి 'భానుకరుడు'—ఆంగ్ల వ్యాసము. (*New Indian Antiquary Oct—Nov* 1944)

3. భానుకరుని 'రసమంజరి'— వేదం వేంకటరాయశాస్త్రి గారల యాంధ్రవ్యాఖ్యతో (1909. మద్రాసు)

4. రసమంజరి (అనంతపండితుని 'వ్యంగ్యార్థ కౌముది'తో. *Benares Sanskrit Series Nos.* 83, 84, & 87. *Benares* 1304)

5. కృష్ణదేవరాయలు: 'జాంబవతీ పరిణయము'—ప్రథమాంకభాగము — తి. వే. వీ. రాఘవాచార్యునిచే పర్యవేక్షితము. (సంస్కృత సాహిత్య పరిషత్పత్రికా, *October*, 1934. *PP*. 159-68. *Calcutta*.)

6. భానుకరుని 'రసపారిజాతము' (—లాహోరు 1939)

7. కృష్ణదేవరాయలు; 'ఆముక్తమాల్యద'— (వావిళ్ల. 1914 4 వ ముద్రణము. మద్రాసు)



అఖండయాత్ర

★

శ్రీ వేముల వేంకట అప్పారావు

బ్రదుకు బాటువీడఁ బరమావధిని జేర
బయట వెడలినాఁడ భయమువీడి——
ఎదను బ్రీలఁజేయు సోదరులైన, నా ప్రళ
యాగ్నులైన నన్ను నాపలేవు!

దినముల్, రేలు నిరంతరాయముగఁ—బ్రీతిన్, దుఃఖమున్, సంశయ
మ్మును, గష్టమ్మును, నష్టమున్ వదలి, 'మున్ముం దేమిరా నున్నదో'
యనుభీతిన్ దిగఁద్రొక్కి, విఘ్న సముదాయంబున్ బ్రతారించి-పో
దును నిమ్నోన్నతభూ నభస్స్థలులయందున్ గాలిలోఁ దేలుచున్

మోదము ఖేదమున్ గడచి ముక్కుకు సూటిగనేక ధాటిగాఁ
బోదును, లోకమే మఱచిపోదును; జీవనదీనదాల్ సము
ద్రాదులు, నింగిముట్టు శిఖరావళి కల్గిన పర్వతాలు, వ
న్యాదులు నా ప్రయాణమున కడ్డమునిల్చిన రూపుమాపెదన్.

అనుదిన మస్మదీయ సదనాంతర శాంత రసాధి దేవియై,
ననుఁదన బాహుడోలిక ననారతమున్ సుఖనిద్ర పుచ్చు భా
ర్యను, దన గర్భ సంజనితులైన సుతాసుతులన్ త్యజింతు—నా
చనెడు సుదీర్ఘ యాత్రకు విషాదముచూపెదరా ని పాషకుల్!

"ఎచ్చటి కేఁగుచుంటి?" వని, యెవ్వఁడో నన్ గని ప్రశ్నవైచినాఁ
డెచ్చటినుండి వచ్చితినో, యెందుకొ, తాను గ్రహించినన్ గదా-
యెచ్చటికేగఁ గావలెనొ యీనరుఁడన్నది యర్థమౌట! ఈ
పిచ్చిజగానఁ బూర్తిగ వివేకము వచ్చినదేమి చెప్పుమా!

ఆకటి చిచ్చు నాయుదరమందునఁ బుట్టదు, పుట్టెనేని-యు
ద్రేకముతో నభస్స్థలికిఁ దిన్నగఁబోయి, సుధాంశుఁబిండి, త
ల్లోక గతామృతాంబు పరిలోభుఁడనై తనివారఁద్రావి, స్వ
ర్లోక చరత్ సురాంగనలలో నటరాణ్ణవమూర్తి నయ్యెదన్!

కాంతి విధాన సౌఖ్యమునకున్ దెగనుబ్బుచు, దుఃఖమున్నచో
భీతిని జెందుచున్ జటుల భీకరనాట్యము నల్పునేని నా
చేతము నేనచీల్చి మసిచేతును, లోఁతుగఁ ద్రవ్వినట్టి పెన్
గోతులలోనఁ బూడ్చెదను-ఘోర కఠోర కుఠార ధారినై

శీతల కాలమందు నఖచేతులుఁ గాళ్లఁ దుషారఘోర బా
ధాతరళమ్ములైన తఱి, ధారుణి బ్రద్దలువాఱు గ్రైష్మ్య భీ
ష్మాతప వేళలందు, వియదంబుదముల్ భువిపై నటించు వ
ర్షాతరుణమ్ములందు ననిశమ్ము గమింతుఁ బురోఽభిగామినై.

నేనెన్నాళ్లుగ నీ ప్రయాణగత పాండిత్యమ్ములన్ నేర్చినా
నో నాకే తెలియంగరాదు-బుధవంద్యుల్ నేను నాతల్లి గ
ర్భానన్ జేరినదాది యీ పృథుల యాత్రన్ జేయుచున్నానటః,
శ్రీనాథయాత్ర అఖండయాత్ర యఁట! యిస్సీ! యెంత దౌర్భాగ్యము !!



చిత్రకారుడు: శ్రీ సోరెన్సన్. శాంతినికేతనం

అంతస్థులు

★

శ్రీ పన్యాల రంగనాథరావు

1

విశ్వం తన చిన్ననాటి స్నేహితుడైన సుందరానికి ఉత్తరం రాసినప్పుడు, దానికొక సమాధానమంటూ వస్తుందనిగానీ, ఆ సమాధానం తన కింత అనుకూలంగానూ, ప్రోత్సాహకరంగానూ ఉంటుందనిగానీ ఎన్నడూ నమ్మలేదు.

సుందరం, తనకన్న రెండేళ్లు చిన్నవాడు కూడాను. అయితే నేం ? ముప్ఫయి ఏళ్ళకే దాదాపు వెయ్యిరూపాయల జీతగాడైనాడు. భారతదేశానికి కేంద్ర మనిపించుకుంటున్న ఢిల్లీ పట్నంలో మకాం వేశాడు. తనకు కావలసినంత అధికారం ఉంటుందని వేరే చెప్పనక్కరలేదు. ఈ ఉత్తరమే తార్కాణం.

అదృష్టం అందరికీ ఎన్నడూ కలిసిరాదు. సుందరంవంటివారిని, లక్ష్మిచేపడుతుంది. తనవంటి వారికి ఉన్న దరిద్రంతోపాటు మరికొంత కలిసి వస్తూ ఉంటుంది.

దీనంతటికీ కారణం అంతస్థులు కాకంటే మరేమిటి ? సుందరం ఉంటున్న అంతస్థులో, ప్రవేశించటానికికూడా తనకు అర్హత లేదు, ఆర్థికంగా.

అసలీ దరిద్రంవల్లనే మూడేళ్ళపాటు తను ఇంటరులో చేరటానికి వీలులేకపోయింది. తనకు కూతురుని ఇమ్మకున్న మేనమామే, తన చదువు సాగటానికి దిక్కనక తప్పలేదు. ఇటువంటి సమయంలో తను చదువు సాగించటం, విశ్వానికి బొత్తిగా ఇష్టం లేకపోయినప్పటికీ, మామయ్య బలవంతంవల్లా, ప్రాధేయంగా లీల చూసిన చూపువల్లా విశ్వం, మూడేళ్ల విరామం తర్వాత, మళ్లీ చదువుకు పడ్డాడు.

ఇది దాదాపు ఒక పుష్కరం వెనకటిమాట. అప్పుడే తనకీ సుందరంతో స్నేహమయింది. తనూ సుందరం దాదాపు అయిదేళ్లపాటు, పట్నంలో సాహచర్యం నెలగించారు. విద్యాపూర్తిచేసి విశ్వం తిరిగి ఇల్లు చేరుకున్నాడు. వెనకటి స్థితికీ అప్పటి స్థితికీ, తనమట్టుకు తనకేమీ మార్పు కనిపించలేదు. సుందరం మట్టుకు రెండేళ్లపాటు విదేశయాత్రకూడా చేసి సరాసరి ఢిల్లీ కెళ్ళిపోయి, మంచి ఉద్యోగంలో ప్రవేశించాడు.

సుందరంవంటి వాళ్లకి, మంచిమంచి ఉద్యోగాలు, లడ్డుండల్లాగా దొరుకుతై. అయితే ఏ మాట కామాటే చెప్పుకోవాలి. అటువంటి ఉద్యోగాలు దొరకాలంటే, అందుకు కావలసిన అర్హతలు కూడా ఉండాలి మరి. సుందరం విదేశయాత్ర చేసి వచ్చాడు. సుందరం నాన్నగారికి, వెనక కాంగ్రెసులో పనిచేసి ఉండటం మూలాన, మంత్రులతో చక్కని పలుకుబడి ఉంది. సుందరం ఉద్యోగానికి అన్ని హంగులూ సమకూర్చుకోగానే, ఠక్కున లడ్డుండ కాస్తా నోట్లో పడింది.

సుందరం గురించి, విశ్వానికి ఎప్పటికప్పుడు అనోటా ఆనోటా, సమాచారం యావత్తూ తెలుస్తున్నప్పటికీ, తను ఏమయిందీ సుందరానికి ఏ సంగతీ తెలీచేయటానికి ఈ ఉత్తరమే సాక్ష్యం. అంతస్థులమీద ఉన్న సుందరాన్ని ఇందుకు తప్పపట్ట వలసిన పనిలేదు.

విశ్వం చదువుకి స్వస్తిచెప్పాక ఇంతవరకూ అనేక అవతారాలు ఎత్తాడు. వీటన్నింటిలోనూ, తనకు అభిమానపాత్రమైనది కథకుడి అవతారం. ఈ అవతారమే తన సహజమైన అవతార మనిపించింది విశ్వానికి. ఉత్తమకథకుల జాబితాలోకి కూడా అతను ఎక్కకపోలేదు. అయితే, తన కథలను ఆదరించినట్టుగా, దేశం తన్ను ఆదరించలేదు. ఇందుకు, కథకుడిగా తనకు అలవడిన సంస్కారంవల్ల, విశ్వానికి దేశంమీద జాలికలిగిందేకాని, కోపంరాలేదు.

అయితే, ఈ సంస్కారం విషయంలో తను అనేక అంతస్థుల పైకెక్కిన విషయం, తెలిసిరాటానికి, సుందరమే కారకుడైనాడు.

సుందరం ఎంత సంస్కారం పొందిఉండక పోతే, తన ఉత్తరానికి సమాధానమంటూ రాస్తాడు, అని కూడా విశ్వం పొరపాటు పడ్డాడు. ఇట్లాపొరపాటు పడటానికి కారణం లేకపోలేదు.

"నువు పెద్ద ఉద్యోగంలో ఉంటున్నావని విని చాలా ఆనందించాను. ఎప్పటికప్పుడు నీ గురించి భోగట్టాలు తెలుసుకుంటూనే ఉన్నాను. నాటి నుంచీ, నేటివరకూ, నాకు స్థిమితంగా, ఎటువంటి ఆర్జనకూ అవకాశం చిక్కలేదు. తెనుగు దేశం, నాకు ఒక కథకుడిగా బోలెడంత పేరు మూట గట్టి ఇచ్చింది. ఆ మూట విప్పితే, నన్ను కట్టుకున్న కళా, నా నాలుగేళ్ల పిల్లవాడూ, ఏడుపు ముఖం పెట్టి కనిపించారు. నన్నేం చేయమంటావు? నీ పలుకుబడితో, నాకింత ఆసరా కలిగించకపోవనే ధైర్యంతోనే, ఈ ఉత్తరం-అసలిది నీకు సరిగా అందుతుందో అందదో కూడాను-రాశాను. దీన్ని కేవలం నా అక్షయ పాత్రగా పరిగణించవనీ, మన కాలేజీ రోజులు నీకు జ్ఞాపకం ఉండక పోవనీ నా విశ్వాసం."

విశ్వం, తను రాసిన ఈ ఉత్తరంలో ఆఖరు వాక్యం, ఉద్దేశ పూర్వకంగా రాసినదే! ఆ వాక్యం ఒక కొలబద్దగా పెట్టుకునే, సమాధానం రాక పోవచ్చుననుకొన్న విశ్వం సమాధానం రావటంతో, పప్పులో కాలు వేశాడు.

"విశ్వం! నీ ఉత్తరం నాకు చాలా ఆశ్చర్యం కలిగించింది. నీ కింత కాలం ఉద్యోగం లేదంటే నమ్మలేక పోయినాను. కథకుడుగా నీకు లభించిన కీర్తిని అక్కడే విడిచిపెట్టి నువు తక్షణం బయల్దేరి రా. నీకు ఉద్యోగం కావాలంటే, దొరక్క పోదు..."

ఈ ఉత్తరం అందాక. అంత దూరం వెళ్లటమా మానడమా అని క్షణం పాటు విశ్వం సందేహంలో పడక పోలేదు. కాని, తను ప్రయాణం కట్టటానికి, తనకు కావలసినంత ఉత్సాహమూ లీల ఇచ్చింది. మర్నాడే విశ్వం, వంద రూపాయలు అప్పు చేసి, ఢిల్లీకి ప్రయాణం అయినాడు.

2

విశ్వం ప్రయాణం చేస్తున్నంత కాలమూ, తను తలపెట్టిన ఈపని ఎంతవరకూ సమంజసమని ఆలోచించసాగాడు. ఎందువల్లనంటే, ఈపని చేయటం కోసం, తన జీవితంలో అతి ముఖ్యమైన ఒక నియమం భంగపరుచుకోవలసి వచ్చింది. ఇంతవరకూ ఎవరినీ ఏదీకూడా అర్థించి ఎరగడు విశ్వం. ఇప్పుడు— ఇంతదూరం ఎందుకు వెళ్ళవలసివచ్చిందో ఊహించటం అంత కష్టం కాదు.

తండ్రికి ఎటువంటి ఆర్జనా లేదు. రెండేళ్ళ బట్టీ, ఈ కుటుంబభారమంతా బలవంతాన తనే నెత్తిమీద వేసుకోక తప్పలేదు. ఒక విధంగా తన కన్నా తన తమ్ముడు నయం. వాడు ఒక పక్క తన చదువు సాగించుకుంటూ, మరో పక్క, ఇక్కడా అక్కడా ఏవో ట్యూషన్లు చెప్పుకొని, ఆ వచ్చిన డబ్బులతో చదువు సాగించుకొంటున్నాడు. కానీ పరకా మిగులుతే కూరా నారా తెచ్చిపడేస్తాడు. పుటుకతోనే, వాడికి కష్టాలు నాటినై. దరిద్రంలోనే పుట్టాడు. తన కట్లా కాదు. తల్లితండ్రీ గారాబం కొద్దీ తన్ను చిన్నప్పుడు పువ్వుల్లో పెట్టి పెంచుకొచ్చారు. ఫలానా లోపం అనే విషయం వొంటికి నాటకుండా తన్ను పెద్దవాణ్ణి చేశారు. తన యధార్థాన్ని తనే హటాత్తుగా గుర్తించుకోవలసి రావటంతో విశ్వం, మొదట్లో ఉక్కిరిబిక్కిరైనాడు. ఇక తన చెల్లెలుంది. దానికి పెళ్ళీడు వచ్చేసింది. ఈకాలం చదువులేని ఆడపిల్ల ఎందుకూ పనికిరాదు. తన చదువుకే మూడు చెరువులు ఎండకొట్టాడు తన తండ్రి! తన తల్లి పేదవాళ్ళ ఇంటోనే పుట్టింది. పేదవారి చేతిలోనే పడింది. ఈ పేదకుటుంబాన్ని ఈదుకురావటం ఆమెకే చేతవును. ఈ పరిస్థితుల్లో పుట్టుమునిగినట్టు తనకు పెళ్ళి జరిగిపోయింది. దీనంతటికీ కారకుడు తన మేనమామ. తన కూతురికి ఈడు మించిపోతున్నదని తొందరపెట్టి అమ్మనీ నాన్ననీ వొప్పించాడు. లీలనే చేసుకోవాలని చిన్నతనం నుంచీ తనకు కోరికఉండేది. మామయ్య తన కూతురికి చదువు చెప్పించలేదు. తను ఉద్యోగం చేసుకొంటూ లీలకు చదువు చెప్పించుకోవాలని విశ్వం ఆశయాలలో ఒకటి. ఏ ఆశయమూ ఫలించనట్టుగానే అదికూడా ఈనాటికీ ఫలించలేదు. ఇప్పుడు, నాలుగేళ్ళ పిల్లవాడిని పెట్టుకొని, చదువుకోమ్మంటే చదువుతుందా?

"నా చదువు ఇప్పుడేంత ముఖ్యం కాదు. ముందు పిల్లవాడి సంగతి ఆలోచించండి" అన్నది కూడానూ ఒక సందర్భంలో!

విశ్వం, తను చదువుకొంటున్న రోజులలోనే సాహిత్యంతో పరిచయం చేసుకొన్నాడు. ఏముహూర్తాన మొదటి సారి కాగితం మీద కలం పెట్టాడో గాని అతిత్వరలోనే విశ్వానికి ఒక కథకుడుగా పేరొచ్చింది. ఆర్థికంగా ఇది అంత లాభించక పోయినా, తన చేతికొచ్చిన ఈ విద్య, ఎప్పటికైనా తనకు ఒక ఆసరా చూపించక పోదనే విశ్వం గట్టిగా నమ్మాడు. ఇది కేవలం మూఢ నమ్మకం కాదనికూడా నమ్మాడు.

కొన్నాళ్ల కిందట, తనకు తెలిసినవాడొకడు ఒకపత్రిక పెట్టాడు. దానికి సంపాదకుడుగా ఆ పత్రిక పెట్టిన వాడి పేరే చెలామణీ అయినప్పటికీ, పత్రిక నడిపించే భారం తన మీద వేశాడు. ఈ భారాన్ని విశ్వం అమితఉత్సాహంతో నిర్వహించినమాట నిజం. ఇదే తన్ను పోషిస్తుందని, మొదటి రెండూ మూడు సంచికలకు నిద్రాహారాలు లేకుండా కష్టపడి పేరు తెచ్చిన వాడు తనే. పత్రిక పెట్టిన వాడు, మొదట్లో తనకు నెలకు యాభై రూపాయల చొప్పున ముట్టచెప్పేవాడు. అదే పది వేలుగా విశ్వం స్వీకరించాడు. ఆ తర్వాతనే గట్టి చిక్కు వచ్చింది. పత్రిక యజమాని ఆమోదించేవాటినీ, యజమానే స్వయంగా ఇచ్చేవాటినీ వేయవలసి వచ్చింది. ఆ విధంగా వేసే కథల్లోనూ వ్యాసాలలోనూ, సాహిత్యం ప్రయోజనం, కళా నశించి బూతు మిగిలేది. తన ఆశలన్నీ పటాపంచలు చేసుకొని విశ్వం బయట పడ్డాడు. ఇప్పుడా పత్రిక అందమైన ఫోటోలతో, ప్రణయ కథల పత్రికగా పిలువబడుతూ, ఆ యజమానికి ఒక పెద్ద మేడా, ఒక కారూ తెచ్చి పెట్టింది. తన అంతిస్థులో ఉన్న సాహిత్యానికి, ఈ దేశంలో, డబ్బు చేసుకొనే యోగ్యత ఇంకా పట్టలేదు.

ఆ తర్వాత విశ్వం ఒక రేషను దుకాణంలో పనిచేయటం, వేరే కథగా రాయవలసి వుంటుంది. ఆ రేషను దుకాణంలో చాటుగా పువ్వుల్లాంటి బియ్యం ఎంతపడితే అంతా దొరకటం, రేషనుమీద మాస్తే పశుగ్రాసంగా కూడా పనికిరాని బియ్యం లభ్యం కావటం ఇట్లా జరుగుతూ ఉండటానికి, పాలకులే చేతనైనంతగా దోహదం చేయటం, విశ్వానికి అసహ్యం వేసి బయటపడ్డాడు. తన మూడో అవతారంలో విశ్వం, రెండుమూడు పెద్దషాపులలో ఉత్తరాలు రాసిపెట్టడం. ఇదికూడా అట్టే నచ్చలేదు. అయినప్పటికీ తను సుందరానికి తెగించి ఉత్తరం రాసేవరకూ ఈ పనే చేస్తూవచ్చాడు. రేడియోకి నాటకాలు రాయడంవల్లా, పత్రికలు పంపే పదీపదిహేనులవల్లా, అంతా కలిపి నెలకో యాభై అరవై అయినా తన సంసారం ఈదటానికి పదిరోజులకు కూడా సరిపడేదికాదు. బాధ్యతలు ఎక్కువవుతున్నకొద్దీ, విశ్వానికి, తనమీద తనకే నమ్మకం క్షీణించసాగింది. ఇక ఉద్యోగంకోసం, గట్టిగా అర్థించకపోతే లాభంలేదు. తనమీద ఆధారపడ్డ వారికి తిండిపెట్టగలగడంలో తన నియమం భంగం అవుతే వొచ్చిన నష్టమేమీ లేదు. అడుగులేగాని అమ్మయినా పెట్టదుకదా?

సుందరం, చదువుకొనే రోజులలోనే ఎంత పైఅంతస్తులలో విహరిస్తూ ఉండినప్పటికీ, తన విషయంలో అభిమానంతో మెలగటం విశ్వం బాగా ఎరుగును. సుందరంతో తన ఉండిన మైత్రి, స్నేహంగా పరిగణించాడు విశ్వం. ఇప్పుడు సుందరం తన్ను ఆహ్వానించటంలో, విశ్వం స్నేహాన్ని మాత్రమే చూపగలిగాడు. ఆ స్నేహాన్ని సైతశల్యపరీక్ష చేయటానికి మాత్రం విశ్వం అంతరాత్మ సమ్మతించలేదు.

3

విశ్వం ప్రయాణం చేస్తున్నప్పుడు తెచ్చిపెట్టుకున్న ఉత్సాహమంతా, ఢిల్లీస్టేషనులో కాలుపెట్టడంతో పటాపంచలయినట్టు తోచసాగింది. తను ఏ నాటికి ఢిల్లీ చేరుకోబోతున్నదీ సుందరానికి ముందే ఉత్తరం రాశాడు. సుందరం స్టేషనుకు వస్తాడనీ పూర్వపు స్నేహంతో తన్ను ఆహ్వానిస్తాడనీ ఊహించాడు విశ్వం. కాని స్టేషనంతా కలయచూసినా సుందరంజాడ కనపడలేదు. తనకు హిందీ కూడా రాదు. బహుశా సుందరానికి ఏదో అర్జంటుపని తగిలి ఉండవచ్చునేమో! అంతపెద్ద ఉద్యోగస్థుడు, స్టేషనుకి వస్తాడని అనుకోవడం తనదే బుద్ధిపొరపాటు.

సుందరం ఎడ్రసు తెలుసుగనక, టాంగా ఒకటి మాట్లాడుకొని, సుందరం ఉంటున్న ఇల్లు చేరుకొనేసరికి పదకొండు గంటలయింది.

ఇంటిముందు ఒకపక్కగా అందమైన కారొకటి ఆగిఉంది. పక్కనే మేడకు మెట్లు

న్నాయి. దానిమీదఉన్న బోర్డుచూస్తే, సుందరం మేడమీద కాపరముంటున్నాడని స్పష్టమయింది!

ఇంతలో పైనుంచి ఎవడో కిందకు దిగి, తన బెడ్డింగుచూసి, తన్ను ఎగాదిగా పరీక్షించి, "కోన్ హై!" అన్నాడు. వాడు హిందీలో ప్రశ్నించినా అరవకట్టులో కనిపించాడు.

"మిస్టర్ సుందరం!" అన్నాడు విశ్వం.

"మీరు తెనుగువారుదానా? సామి వెళిల పోయివుండారు. అరమణిక్కల్లా వస్తురు. మీరు వచ్చి కూర్చోంకిమి" అన్నాడు.

వీడు నిస్సందేహంగా సుందరం పనివాడు.

"ఇంట్లో ఇంకెవరూ లేరా?" అన్నాడు విశ్వం సందేహంగా.

"అమ్మ పట్నం పోయి ఉండారు. సామిదా ఉండారు. నేను వారి కుక్," అన్నాడు 'కుక్.'

కింది భాగంలో ఎవరో పంజాబీవాళ్లనుకున్నాడు విశ్వం. అంతస్తుమీద అంతా దివ్యంగా ఉంది. ఇటువంటి 'పెద్ద వాళ్ల'. యిండ్లలో ముందు కాపరం ఉండటం నేర్చుకోవాలి. ముందు హాలూ, హాలులో సోఫాలూ, గోడలకు పెద్ద పెద్ద చిత్రపటాలూ, ఒక వైపు పెద్ద రేడియో, కింద తివాసీ, ద్వారాలకు రంగు రంగుల తెరలూ. ఇవన్నీ తనకు అలుక్కు పోయినట్టుగా కనిపించ సాగాయి. 'కుక్' తన బెడ్డింగు ఎక్కడికి తీసుకుపోయాడో, తన్ను ఈ అగాధంలో వొదిలి! అనుకుంటూండగానే 'కుక్' చేతిలో కాఫీతో వచ్చాడు.

"మీరిది పుచ్చుకోండి సార్. సామి ఫోను చేస్తిని. మరో పది నిమిషాలలో వస్తుండారు."

పది నిమిషాలకు సుందరం రానే వచ్చాడు. అతని వెనక మరో ఇద్దరు పెద్ద ఉద్యోగులే అయి ఉండొచ్చు—సుందరం వస్తూనే,

"హలో! విశ్వం! నీకోసమే ఎదురు చూస్తున్నా! జస్ట్ వన్ మినిట్. వీళ్లను పంపేసి వస్తాను!" అంటూ ఏవో కాగితాలు తీసుకుని వారికిచ్చి, బయటకు వెళ్లి వాళ్లను పంపేసి తిరిగి వచ్చాడు సుందరం.

విశ్వానికి శ్వాస నిలిచినట్లయింది.

సుందరం ఆప్యాయంగా సమీపించి, సోఫాలో తన పక్కనే కూర్చొని,

"ఎన్నాళ్లకు కనిపించావోయ్ విశ్వం! అయాం సో సారీ. నీ కోసం స్టేషనుకి బయల్దేరుతూండగా, అర్జంటు పని తగిలింది. నీ కోసం కారు పంపించానే. కారులో వొచ్చావా?" అన్నాడు.

"లేదు." అన్నాడు విశ్వం కాస్త ఊపిరి బిగపట్టి.

"అదేం? కారు రాలేదా యేమిటి? డ్రైవర్!" అంటూ కేక వేశాడు సుందరం.

"పోనీలెద్దూ వాడు నన్నెలా పోల్చుకుంటాడనీ! మనం మళ్లా చాలా కాలానికి కలిశాం చాలదూ?" అన్నాడు విశ్వం.

సుందరం వేసిన కేకకి, డ్రైవరు పత్తా లేడు కాని, 'కుక్' వచ్చాడు.

"చూడూ, అయ్యగారికి స్నానానికి నీళ్ళూ—ఆయనకా గదిలో అన్నీ అమర్చు," అన్నాడు సుందరం.

సుందరం ఇచ్చిన ఆతిథ్యం విశ్వానికి తాత్కాలికంగా ఎంతో సంతృప్తి కలిగించి ఉండొచ్చు, కాని, ఈ వాతావరణం విశ్వానికి గొంతులో వెలక్కాయ లాగ ఉంది. తన మామూలు జీవితంలో ఉండవలసిన స్వేచ్ఛ ఇక్కడ తనకు లభ్యం కావడం లేదు. ఏపని చేసినా, చేయాలనుకున్నా, స్నానమూ, భోజనమూ, కాలకృత్యాలు తీర్చుకోవటమూ—ప్రతీ చిన్న విషయానికికూడా, ఏదో ఒక నియమం ఉన్నట్టుగానూ, ఆ నియమం ప్రకారం ఆ పనులు చేయకపోతే, వాచీముల్లు వెనక్కు తిరిగిపోతుందేమో అన్నంత అనుమానం కలగడమూ జరుగుతోంది.

"నా భార్య పుట్టింటికి వెళ్లిందిలే. ఇది ఇంకా ఆరో నెల. ప్రస్తుతం నేనొక్కణ్ణే ఉంటున్నాను. నాన్నగారూ, అంతా పట్నంలోనే ఉన్నారు. ఆయన ఇక్కడికెలా వస్తాడూ! ఏదన్నా మినిస్టర్తో పనివుంటే వస్తూపోతూ ఉంటాడు. అంతే." అంటూ సుందరం విశ్వానికున్న కొన్ని సందేహాలు, తను కోరకుండానే తీర్చాడు.

తనకోసం వేరేగదిలో ఒకపక్క వేయించాడు. పడుకోబోయేముందు, రాత్రి ఇద్దరూ ఒక గంట

పిచ్చాపాటీ మాట్లాడుకున్నారు. వెనకటి కాలేజీ రోజులూ, అప్పటి మిత్రులూ, అన్నీ ఒకసారి జ్ఞాపకం చేసుకున్నారు. ఎన్ని మాట్లాడినప్పటికీ, సుందరం, విశ్వం ఉద్యోగప్రసక్తి తీసుకురాక పోవడం, విశ్వానికి కొంచెం ఆశాభంగం కలిగించింది. అసలు ఆ ప్రసక్తి తనే ముందుకు తీసుకు రావాలో ఏమో—ఈ వాతావరణంలో అనుకున్నాడు కూడాను.

తనకూ తను కొంతకాలంనుంచి ఎరిగిఉన్న ఒక స్నేహితుడికీ—మధ్య ఏదో ఒక గోడవంటిది ఉండటం బాధగా ఉంది. ఈ గోడపెట్టింది ఎవరు? తనా, సుందరమా? లేక, ఈ వ్యవస్థా? ఇదిమాత్రం తేల్చుకోవాలని విశ్వం తనలోతనే పరిశోధన ప్రారంభించాడు.

తను వచ్చిన పనేదో త్వరలో తేలిపోతే, భవిష్యత్తు నిర్ణయించుకోవచ్చునన్న ఆదుర్దా విశ్వానికి ఉండటం సహజమే. ఇటువంటి ఆదుర్దాలకు సుందరం ఆర్థికవ్యవస్థ అతన్ని అతీతుణ్ణి చేసిన విషయం విశ్వం గుర్తించాడు.

"ఇక్కడ ఏమున్నా ఛాన్సు..." అనబోయినాడు విశ్వం.

సుందరం మాటలోనే అడ్డువచ్చి,

"ఆలోచిద్దాం లెద్దూ. కొన్నాళ్లు ఉండాలి కదా మరి? అన్నట్టు, నువ్వు ఏం పని చేస్తావో చెప్పు ముందు!" అన్నాడు సుందరం సిగరెట్టు ముట్టిస్తూ.

తన వ్యవహారం సుందరానికి కొంత వేళాకోళంగా ఉన్నట్టు తోచసాగింది విశ్వానికి. తను ఏవిధంగా మథనపడ్తున్నదీ గుర్తించే యోగ్యత సుందరానికి లేకపోవచ్చునని విశ్వం మొదట్లో భావించలేదు.

"నీ ఉత్తరం చూడగానే, నాకోసం ఏదో ఉద్యోగం సిద్ధంగా ఉందనిపించింది సుమా! చెప్పొద్దూ!" అన్నాడు విశ్వం కసికొద్దీ. తనవంటి వాడికి కాస్త ఓర్పు హెచ్చుస్థాయిలోనే ఉండాలన్న మాట విస్మరించి.

"నేనావిధంగా రాసినట్టు నాకు జ్ఞాపకం లేదే! ఉద్యోగాలు మనకోసం అంటూ సిద్ధంగా ఉంటాయనుకోటం బుద్ధి పొరపాటు! మనకేం సృష్టించుకోవాలి ఈ కాలంలో."

సుందరం అన్న ఈ మాటలలో సత్యం ఎంతేనా ఉంది. ఇది సత్యంతో కూడుకున్న మాటే అని బాధపడి విశ్వం ఒక నవ్వు నవ్వేశాడు. కాని, ఈ ఉద్యోగాలలో లొసుగులు ఈవిధంగానే ఉంటవి కాబోలు అని స్ఫురించటంతో విశ్వంలో ఒక చిన్న మంట బయల్దేరింది.

విశ్వం, హాలు నాలుగువైపులా కలయచూడటం గమనించి, సుందరం—"ఇది గవర్నమెంటు ఇచ్చిన ఇల్లేను. అసలు నా కివ్వవలసిన బంగళా ఇంకా ఖాళీ కాలేదు. అందాకా ఈ కొంపలో ఉండమన్నారు. చాలా ఇరకాటంగానూ—ఎందుకూ పొందకుండానూ ఉంది." అంటూ తన అసంతృప్తి వెల్లడిచేశాడు.

ఇది 'కొంపా'! ఇరకాటంగా ఉందా! తనవంటివాడు కాలుమోపటానికి ఇందులో, సాహసు లేదే! అంతస్థుల భేదం!

ఆ రాత్రి అంతటితో వారి చర్చ ముగిసింది.

4

నాలుగురోజులు దాటినా కూడా సుందరం, ఇదమిద్ధంగా ఏ విషయమూ తేల్చడం లేదు. విశ్వానికి ముళ్లమీద నడకగా ఉంటున్నది. ఈలోపున విశ్వం తన భార్యకు ఉత్తరం రాశాడు. సుందరం చాలా ఆదరించాడనీ ఉద్యోగం దొరికే సూచనలు ఎక్కువగానే కనిపిస్తున్నాయనీ. ఈ నాలుగు రోజులలోనూ సుందరం తనకు వీలయినప్పుడల్లా, విశ్వాన్ని పట్నమంతా తిప్పాడు. జంతర్ మంతర్ చూపించాడు. బిర్లామందిర్ చూపించాడు. చాందినీచౌక్ అంతా తిప్పాడు. కన్నాట్ ప్లేస్‌లో అనేక పెద్ద పెద్ద దుకాణాలకు తీసుకువెళ్తే, అక్కడివారు సుందరానికి చాలామంది సలాములు చేయటం, 'కోకాకోలా'లు ఇప్పించటం విశ్వానికి ఆశ్చర్యం వేసింది.

ఒకనాటి సాయంకాల, 'రాజ్ ఘాట్'కి వెళ్లారు. సుందరం అక్కడ ఎవరితోనో తన సాటివారితో మట్లాడుతుంటే, విశ్వం, కొద్దిదూరంలో 'వినోభావే' ప్రార్థనోపన్యాసం వింటూ, గాంధీ ఆత్మకు శ్రద్ధాంజలిస్తున్నాడు.

"నీతో నాకు అనేక విషయాలలో అభిప్రాయ భేదాలు ఉంటే ఉండొచ్చుగాక. నీ విశ్వాసాలు నీవి. నా విశ్వాసాలు నావి. అయితేనేం? నువ్వు మహాత్ముడివి. నువ్వు జీవించిన కాలంలోనే నేను పుట్టిఉండటం—నువ్వు మావూరికి కొన్నేళ్ళకిందట వచ్చినప్పుడు నిన్ను చూడగలగటం నా అదృష్టంలో ఒక భాగం. కొన్ని కోట్లమంది జనంమీద నీ ప్రభావం ఒక వెలుగు వెలిగిందంటే—అది నీకే సాధ్యమయింది. నీకివే నా జోహారులు." అనుకున్నాడు విశ్వం.

ఇంకో రోజు, సుందరం మరికొంతమంది పెద్ద వాళ్ళతో కలిసి, 'కుతుబ్ మీనార్'కి పిక్నిక్‌కి పోతూ, విశ్వాన్ని కూడా తీసుకువెళ్లాడు. చరిత్రాత్మకమైన ఇటువంటిస్థలాలు చూస్తున్నప్పుడల్లా విశ్వానికి, తన లీలా, పిల్లవాడూ పదేపదే జ్ఞాపకం వస్తూ బాధించసాగారు.

వారంరోజులు గడిచినై. ఒకనాటి రాత్రి సుందరం ఇంటికి వస్తూనే,

"ఇదిగోనోయ్, నీ 'ఎపాయింట్ మెంట్' ఆర్డరు. రేపు నాతోకూడా నిన్ను తీసుకువెళ్తాను. జాయిన్ అయిపో," అన్నాడు.

"ఎక్కడ—ఏ ఆఫీసులో! ఏం కథ!" అంటూనే విశ్వం కాగితం చూసుకున్నాడు.

విశ్వం చదివేలోపునే—సుందరం అందుకొని,

"మా ఆఫీసులోనే ఖాళీ వచ్చిందిలే. ఒకసారి అడుగు పెట్టేకావంటే, మెల్లిగా తన్నుకురావచ్చు." అన్నాడు.

తను ఆశించినటువంటి ఉద్యోగానికి కనీసం మూడువందలైనా జీతముంటుందనుకున్న విశ్వం, ఈ ఉద్యోగానికి కేవలం నూటయాభై మాత్రమే జీతమనీ, అమాంబాపతులతో కలిసి రెండొందలు కిట్టాయనీ తెలిసేసరికి ఆశాభంగమయింది. ఈ నోట్ల సుమ్మరపు రోజులలో రెండువందలు. రెండురూపాయలకు సమానం! అయితే ఈమాత్రం తన దేశంలో దొరికే ఆస్కారం కనిపించలేదేమరి! అయినా, సుందరం అన్నట్టు, ఇందులో పాతుకుంటే పైకి రాలేకపోమని ఎక్కడుందీ?

మర్నాడు ఆఫీసుకి బయల్దేరే ముందు తనకిట్లా మంచి ఉద్యోగం దొరికినట్టూ త్వరలోనే పెద ఉద్యోగం కాబోయేటట్టూ, తన లీలకు ఉత్తరం రాశాడు విశ్వం. అయితే ఈ ఉత్తరం కాస్త తొందరపడి రాసిన విషయం, ఆఫీసులో చేరినాక గాని విశ్వానికి తట్టలేదు.

సుందరం గడుసువాడే! విశ్వంమీద ఏదో కసి ఉన్నట్టు అతన్ని సరాసరి తనకింద, తన అజమాయిషీలో ఉండే ఉద్యోగంలోనే వేసుకోవటం విశ్వానికి నోటమాట లేకుండా చేసింది. విశ్వం, సుందరం చేస్తున్నంత పెద్ద ఉద్యోగం, నెలకు దాదాపు వెయ్యి రూపాయలూ, ఎన్నడూ కోరలేదు. అయితే, సుందరం, తన్ను కేవలం తనకింద వేసుకుంటాడని మాత్రం విశ్వం ఎన్నడూ ఊహించలేదు. ఏ మొండి ధైర్యంతో విశ్వం ఈ ఉద్యోగంలో ప్రవేశించాడో ఆనాటినుంచే విశ్వానికి నిజమైన దుర్దినాలు ప్రారంభమైనై.

5

"నువ్వు నాకు ఒక ఉద్యోగమంటూ ఇప్పించినందుకు నేను నీకు కృతజ్ఞత చూపించవలసి వుంటుంది. అయితే నీకు నామీద ఎన్నడూ లేని ఈ కసి ఎందుకు? మనం చాలాకాలం నాటి స్నేహితులం. సమానమైన హోదాలో చదువుకున్నాం. అయితే నీకున్నంత పెద్ద ఉద్యోగం కోసం నేను రాలేదు. మన ఇద్దరికీ అంతస్థులభేదం చాలా ఉందన్నమాట నేను గుర్తించకపోలేదు. నా ముఖానికి ఇంతకన్నా ఎక్కువ ఆదాయం తెచ్చుకోగల తాహతులేదను. ఒప్పుకొంటాను, కాని ఆ ఉద్యోగం కాస్తా నీకిందే ఉన్నట్టుచూసి, నన్ను నీ బానిస చేసుకోవటంలో నీ చాతుర్యమేమిటి? ఏ ఉద్దేశంతో నువ్విట్లా అన్యాయంచేశావు? లేక, నీకసలు ఇటువంటి అభిప్రాయమే కలగలేదా?" అంటూ విశ్వం, సుందరాన్ని నిలవేసి అడగాలనుకున్నాడు. కాని, ఎన్నడూ లేనిది తన కీనాడు పిరికితనం ఆవేశించింది. తనకున్న సంస్కారంతో తను ఈ పరిస్థితిని సులభంగానే ఎదుర్కోవచ్చు. "నీ కింద ఉద్యోగం ఉంది! మహాభాగా! మన స్నేహం ఇలా ఉండనియ్యి. నాకు శెలవిప్పించు" అంటూ ఇంకొకడైతే అనగలిగేవాడేమో! కాని, అటువంటి 'పెడసరపు మాట' అనటంవల్ల, ఉన్న అవకాశం కాస్తా పోవటంతప్ప, లాభమేమీ లేదు. పెడసరంగా

మాట్లాడి, పొట్ట పోషించుకునేపాటి ధైర్యం తనకు లేదు అని రూఢి చేసుకున్నాడు విశ్వం.

"మాడూ! నువ్వు కాపరం పెడ్తే బాగుంటుం దనుకుంటాను. ఏం?" అన్నాడు సుందరం ఒక రోజున.

"కాపరం! బాగా చెప్పావు! ఈ జీతంతో నేనేం చేయగలను! ఏదన్నా హోటలుకి పోదా మనుకుంటున్నాను." అనేశాడు విశ్వం.

"మంచివాడివే! నిన్నిక్కడినుంచి వెళ్ళి పొమ్మంటున్నా ననుకొంటున్నా వేమిటి? కొంప తీశావు! నాకా అభిప్రాయం ఎన్నడూ లేదు," అంటూ సుందరం తన పొరపాటుకి నొచ్చుకున్నాడు.

"నువలా అనుకోనవసరంలేదు సుందరం! నేను మాత్రం ఎంతకాలం ఇట్లా నీ యింట్లో తిష్ఠ వేయగలను! రేపు నీ పెళ్ళాంపిల్లా వస్తారు. అసలే ఇల్లు చాల దంటున్నావు కూడాను!" అంటూ విశ్వం ఊరుకోకుండా కాస్త ఎత్తిపొడిచాడు.

"ఆ మాటకేంలే. నేనంటున్నది మరేంలేదు. ఇక్కడ ఇళ్ళకు చాలా ఇబ్బంది. అందువల్ల చేతులారా వచ్చింది జారవిడుచుకోవటం ఎందుకూ? కింది భాగంలో ఉంటున్న పంజాబీవాళ్ళ యింట్లో, ఒక గదీ, వరండా వీధికట్టిన 'బాక్సీ' గదీ అద్దెకిస్తామంటున్నారు నీకోసం 'ఫిక్సు' చేద్దామనుకుంటున్నాను. ఉత్తరోత్తరా నాకో బంగాళా వస్తే అందులో ఎలాగూ 'అవుట్ హౌస్' ఉంటుంది." అన్నాడు సుందరం.

సుందరాన్ని మనం నిందించవలసిన పనిలేదు. ఎందువల్లనంటే, తన స్నేహితుడికి, తన శక్తిలో ఉన్నంతవరకూ సహాయపడాలనే సానుభూతితోనే సుందరం. ఈ విధమైన ఏర్పాట్లన్నీ చేస్తూ ఉండవచ్చు. కాని, సుందరం చేస్తున్న ప్రతీ పనిలోనూ, విశ్వానికి అంతస్థులే కనిపిస్తున్నాయి. ఇప్పుడు ఇంటివిషయంలో ఈ అంతస్థుల భేదం స్పష్టంగా ఉండనే ఉంది.

సుందరం, తనకూ, తన భార్యకూ, తన పుట్టబోయే పిల్లకీ ఇంత ఇంద్రభవన మల్లేఉన్నటువంటిదే చాలదనుకుంటున్నప్పుడు, విశ్వానికీ, విశ్వం భార్యకూ, నాలుగేళ్ళ పిల్లవాడికీ—ఇంకా బహుశా విశ్వం కుటుంబానికంతకీ కూడా, కిందిభాగంలో ఒక గదీ ఒక తాత్కాలికమైన పంచా ఎట్లా సరిపోవచ్చునని సుందరం ఊహించాడో విశ్వానికి అంతుపట్టలేదు.

ఉద్యోగం విషయంలో విశ్వం, సుందరంతో అనదలచిన మాటలు ఎట్లా అనలేకపోయినాడో ఇంటి విషయంలోనూ కూడ అట్లానే నోరెత్తలేకపోయినాడు.

సుందరం, తన పలుకుబడి బాగానే వినియోగించి, ఆ గదికి అద్దె ముప్ఫయిరూపాయలకు మించకుండా నిర్ణయించాడు.

కాని, విశ్వం, వెంటనే తన కుటుంబాన్ని రప్పించదలచుకోలేదు. ఒక నెల్లాళ్ళపాటు, ఈ కాలకపు జీవితం రుచిచూశాకనే ఏ నిర్ణయమైనా చేసుకోవాలని నిశ్చయించుకున్నాడు. తన 'సొంతఇంటి'కి మార్చిన నాటిరాత్రి కూర్చుని, విశ్వం, ఇన్నాళ్ళకి మళ్ళీ ఒక కథ రాశాడు. ఆ కథలో ఇటీవల తను పొందిన అనుభవాల ఛాయలు కొన్ని పడకపోలేదు. ఆ రాత్రి అతనికి గుండె కాస్త తేలికై బాగా నిద్ర కూడా పట్టింది.

పంజాబీల చంటిపిల్ల ఏడుపుతో ఒకరాత్రిప్పుడు విశ్వానికి మెలకువయింది. మళ్లీ ఎంత ప్రయత్నించినా నిద్రపట్టలేదు. రాత్రి బహుశా రెండుగంటలు దాటిఉంటుంది. అంతవరకూ తనకు పట్టిన నిద్రకు మనసు ప్రశాంతంగానే ఉన్నట్టు తోచింది కాని, ఈ సరికొత్త వాతావరణంలో నిద్ర పట్టటం కష్టంగా తోచింది. రాత్రి కథ రాయటం వల్లా, మనసులో ఉంటున్న బాధ కాస్తా ఆ కథలో కొంతవరకు వ్యక్తం కావటంవల్లా, చప్పున పట్టిన నిద్ర కేవలం తాత్కాలికమయిపోయింది విశ్వానికి.

విశ్వం అట్లా పడుకునే ఆలోచనలో పడ్డాడు. అతనికి, తన కుటుంబం యావత్తూ జ్ఞాపకమొచ్చి కలవరపుతోంది. ఏమ్మశేం చేస్తున్నాడో! పిల్లవాడి ఆరోగ్యంగురించి లీల ఉత్తరమే రాసింది కాదు. ఇల్లు ఎలా గడుస్తున్నదో! దినం ఎట్లా గడవటమనే మహాసమస్య ఎదురైనప్పుడు, ఇంకే సమస్య గురించీ ఆటే ఆలోచన పోదు. ఇందులో కేవలం తన సుఖం మాత్రమే చూసుకొంటున్నట్లవుతున్నదా? తను ఏ సుఖం పొంది, తనవారిని సుఖపెట్టాలని

విశ్వం, ఇంతదూరం వచ్చాక్కో, ఆ సుఖం కాస్తా మాయమయినట్టు తోచసాగింది.

పాపం సుందరం ఒక విధంగా మంచివాడే. తను చేయగలిగిందేదో చేస్తూ ఉండగలగటం సుందరం వంటి వ్యక్తిలో గొప్పగుణం కాక మరేమిటి? ఆ చేయవలసిన పద్ధతిలో లోపముంటే ఉండవచ్చు. లోపాలు అనేవి మనిషికి ఎన్ని లేవు? అయితే సుందరం స్నేహాన్ని ప్రదర్శించటంలో, తన మనసు కష్టపడ్తున్న సంగతి సుందరం గ్రహించలేదనుకోవచ్చు. సుందరం చేస్తున్నది సహాయంగా పరిగణించటంతో 'ఇదిగో! నువ్వీ పని ఇట్లా చేస్తున్నందువల్ల, నా మనసు కష్టపడుతోంది. నా అభిమానం దెబ్బ తింటోంది' అని అనగలిగే శక్తి తనకు లేకుండా పోయింది. ఎంత ఆలోచించినాసరే, ఈ విషయంలో సుందరంలో మంచితనమే తనకు కనిపిస్తున్నదిగాని, అతనిలో లోపం కనపడటం లేదు. సుందరానికి తను ఉంటున్న అంతస్థులోంచి అతనికి కనుపించేది, విశ్వానికి తన అంతస్థులోంచి వేరేవిధంగా కనిపించటం సహజం. మానసికంగా తన్ను హింసించాలని సుందరం అభిప్రాయం ఎన్నటికీ కాకపోవచ్చు. కాని, యథార్థం ఆలోచిస్తే, తను పడుతున్నది మానసిక వ్యథే!

తను మధ్యతరగతిలో కింది వర్గానికి చెందినవాడనీ, ఈ వర్గానికి చెందినవారు, సాంఘిక వ్యవస్థలో నిలపడటానికి చేసే ప్రయత్నంలో, పైకి ఎగబాకనూ లేరనీ, కిందకు దిగజారనూ లేరనీ, ధనిక వ్యవస్థలో తనవంటివారిది గబ్బిలాల జీవితంగా ఉంటుందనీ కథకుడైన విశ్వం గ్రహించకపోలేదు. అయితే, తనకే సంభవించిన ఈ పరిస్థితిలో తనపై ప్రత్యేకత చూపించుకోగలిగాడు గనక?

ఈ సంఘంలో తనవంటివారు పడుతున్న మానాలు కష్టాలే తనూ పడుతున్నాడు. ఈ కష్టాలేమీ లేకుండా, సమాజంలో ప్రతివ్యక్తీ కూడా, పరిసమాన బాధ్యతలుగల వ్యక్తి అనీ, పరస్పర గౌరవ మర్యాదలూ హక్కులూ కలవాడనీ, సమాజం యావత్తూ కూడా గుర్తించగలిగే సామ్యవాదంలో తప్ప, ఈ అంతస్థులు తొలగిపోవన్న సత్యం గ్రహించాడు విశ్వం. సుందరం ఉన్నటువంటి అంతస్థులు నిర్మించటానికి ఈ సమాజం బోలెడంత అవకాశం ఇచ్చింది. ఇక సుందరంలో ఉన్న లోపమల్లా ఎక్కడంటే—ఈ అంతస్థుల భేదాన్ని, అంతే చదువుకున్నవాడైనా, ప్రపంచాన్ని చూసినవాడైనా, గుర్తించకపోవటం. అతను ప్రపంచాన్ని భౌతికంగా మాత్రమే చూడగలిగాడుగాని, తనలాగా నైతిక దృష్టిలో చూడలేదు. సుందరం ఏనాడైతే తన బుద్ధి అనుభవమూ సక్రమంగా వినియోగించి, ఈ అంతస్థుల్ని గుర్తిస్తాడో అప్పుడే, దిగివస్తాడు. కనీసం ఈ యథార్థం సుందరం ఇదివరకు గుర్తించి ఉన్నట్టయితే, తన్ను—అంటే విశ్వాన్ని—సరాసరి తన కిందే 'బానిస'గా చేసుకొని ఉండేవాడు. ఈ అంతస్థుల భేదంవల్లనే, సుందరం, స్నేహాన్ని ప్రదర్శించగలిగినప్పటికీ, స్నేహానికి ఉండవలసిన—చూపవలసిన—గౌరవం ఉంచనూ లేడు—చూపనూ లేడు.

ఈ ఆలోచనలతోనే విశ్వం ఎప్పుడు నిద్రపోయినాడో గాని, మళ్ళీ మెలకువ వచ్చేసరికి, ఉదయం ఎనిమిది దాటింది.

6

లీల ఉత్తరం రాసింది. పిల్లవాడికి నాలుగైదు రోజులై జ్వరం వస్తున్నదనీ, నాన్నగారికి మక్కపట్టుకుపోయి లేవ లేకుండా ఉన్నారనీ, పూటగడవటం అతికష్టమయిపోతున్నదనీ, పాపం మరిదే, తన నుకలుపడుతూ, బండి లాగుతున్నాడనీ, తన చెల్లెలి సహాయమే లేకుంటే ఏమయ్యేదాన్నో అనీ, అమ్మకి ఎప్పుడూ తనగురించే విచారంగా ఉంటున్నదనీ...

ఇంతకన్న ఆశాజనకమైన ఉత్తరం వస్తుందని విశ్వం ఎన్నడూ ఆశించలేదుగాని, కనీసం, అంతా క్షేమంగా ఉన్నారనివస్తే చాలనుకున్నాడు. ఈ పరిస్థితిలో తను చేయగలిగేదేమిటో స్పష్టంగా కనిపించటంలేదు. ఒకసారి పోయివస్తే? శెలవూ డబ్బూ రెండూ కావాలి. శెలవు సుందరాన్ని అడిగితే ఇవ్వకపోడు. కాని మొదటినెలజీతంలోనే సగం ఇంటికి పంపాలా, తన ప్రయాణానికి ఖర్చు చెయ్యాలా? ఇదివరకు చేసుకొచ్చిన అప్పు వంద రూపాయలూ తీర్చేదెలా?

మనిషికి కొంతవరకైనా తెగింపంటూ ఉంటేనేగాని బతకటం కష్టం. తెగించి ఊరికి వెళ్ల

కుండా ఉంటేనే మంచిది. ఆ ప్రయాణానికి అయ్యే ఖర్చుతో మరికొంత కలిపి, జీతంలో సగం, ఇంటికి పంపేస్తే వాళ్ళే ఏదో తంటాలు పడతారు. అంతే గాని, ఈవిషయం సుందరంతో చర్చించి లాభం లేదు.

మొదటితారీఖు రాగానే, జీతం కూడా ముట్టింది. విశ్వం, ముప్ఫయిరూపాయలు ఇంటికి అద్దె ఇచ్చి, మరో నలభై, హోటలుకి ఇచ్చాడు. తన చెయికొళ్ళకి ఇంకో ముప్ఫయిఉంచుకొని, మిగతా నూటపదిరూపాయలు ఇంటికి మనియార్డరు చేస్తూ, లీలకీ, తమ్ముడికీ ఉత్తరాలు రాశాడు. అనాడే, తను రాసిన కథకూడా పత్రిక్కి పంపించాడు.

ఆఫీసులో పని అంత మెదడుతో కూడుకున్నది కాదు. బండచాకిరీ బోరెకుంది.

అయితే ఇందులో పేచీ ఎక్కడ వస్తూన్న దంటే, సుందరం చేసే ప్రతీ పనిలోనూ, ఆడే ప్రతీ మాటలోనూ ఏదో అధికారం చెలాయిస్తూన్నట్టుగా తోచసాగింది విశ్వానికి. ఇది రాను రాను భరించడం కూడా కష్టమవుతోంది. అదీకాక, సుందరం కొత్త 'చేయితడి' చేసుకుంటూ ఉండటం విశ్వానికి చాలా అసహ్యం వేసింది. లంచాలు పుచ్చుకోవటం, ఇవ్వటం తమాషా గా ఒక చక్రం తిరిగినట్టు తిరుగుతుంది. దీనికి సుందరం ఎట్లా అలవాటు పడ్డాడో పరమాత్ముడికే తెలియాలి. ఈ విషయం సుందరంతోనే, తన స్నేహాన్ని పురస్కరించుకొని ప్రస్తావించినా, అతనికి కోపమూ రావచ్చు. మొదటికే మోసం కలగ వచ్చు. ఎవరి ఖర్మం వారిది.

ఒకనాడు సుందరం, తనతో-'చూడు విశ్వం-నువ్వు మొన్నటి ఫైలుమీద రాయకూడని విషయాలు చాలా రాశావు. ప్రభుత్వోద్యోగంలో అటువంటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. నీకు తెలీకపోతే నన్ను అడగాలి. అంతేగాని, నీకు తోచిందే న్యాయం అను కుని రాసిపారెయ్యరాదు. దానివల్ల ఎంత నష్టం వచ్చిందో చూడు. ఖస్ ఖస్ తడికలు, కొంత కాలానికి వేయించడంలో, మనకు పాతికవేల రూపాయలు కానక్షను ఉంది. అంటే ఆ డబ్బంతా ఖర్చు చేయాలని కాదు. కొంత ఆదా చూపటానికే మనం ఇక్క డుంటున్నది!" అంటూ వెళ్లిపోయినాడు.

ఈ మాటలతో విశ్వానికి యథార్థం బోధపడ్డది. తన బుద్ధి ప్రయోగించి, ఆ ఫైలులో తనకు తోచిన దేదో రాయటంవల్ల, సుందరం ఈ వ్యవహారంలో చేసుకుందా మనుకున్న అయిదువేల రూపాయలూ కంట్రాక్టరుకే దక్కాలి. అయితే, ఇప్పుడు సుందరం వ్యవహారం బయటపడకుండా, ఆ అయిదువేల రూపాయలూ ప్రభుత్వానికి ఆదాగా ఉన్నట్టు చూపించి ఊరుకున్నాడు.

తెల్లవారి లేస్తే ఇటువంటివి లక్ష జరుగుతు న్నాయి. ఇటువంటివి చూస్తూ బయటకు రావటం ఎన్నాళ్లు? తనవంటివాడికి దొరక్క దొరక్క ఈ దిక్కుమాలిన ఉద్యోగం దొరికిందేమిటి? లంచాలు బాగా పట్టగలిగే వారికీ, పై వాడు ఏమన్నా పడి ఉంటూ ఉండేవారికీ ఈ ఉద్యోగాలు.

"పిల్లవాడికి జ్వరం తగ్గినా, రోజూ కొద్దిగా వస్తూనే ఉంది. వాడు మీకోసం బెంగపెట్టుకున్నట్టు కనిపిస్తూంది. రాత్రులు పలవరిస్తాడు. మీ నాన్న గారికి ఇప్పుడు కొంచెం నయంగానే ఉంది. మీరు పంపిన డబ్బుతో ఈ నెల గడుస్తుంది. మీరు ఊరికి వెళ్ళటానికి చేసిన అప్పు మీ తమ్ముడు తీర్చాడు. ఎట్లా తీర్చాడో ఎవరికీ చెప్పడు."

ఈ ఉత్తరంలో తను బెంగపెట్టుకోటానికి ఉంది. సంతోషించటానికీ ఉంది. అవమానం పొందటానికీ ఉంది. తనకన్న తన తమ్ముడే అనేక రెట్లు నయం!

ఈసారి తమ్ముడి ఉత్తరంకూడా లీల ఉత్తరం తోపాటు వచ్చింది.

..."నువ్వు ఇక్కడి పరిస్థితులనుగురించి బెంగ పెట్టుకోకు. అంతా క్షేమమే—నీ ఉద్యోగం మట్టుకు స్థిరంగా ఉండేటట్టు చూచుకో. ఏ పరిస్థితులలోనూ కూడా, అది వొదిలిపెట్టెయ్యకు. నువ్వు కోరితే, వొది నెనూ, పిల్లవాడినీ తెచ్చి దిగపెట్టటానికి నేను సిద్ధంగా లేననుకోకు... అన్నట్టు ఈనెల పత్రికలో నీకథ చదివాను..."

తమ్ముడికి ఇప్పుడున్నటువంటి ప్రపంచ జ్ఞానం, తమ్ముడి ఈడులో తను ఉండినప్పుడు తనకు లేకపోయినందుకే విశ్వం చింతించలేదు. రోజు రోజుకీ ప్రపంచమే మారిపోతోంది. పరిమాణాలు ఎక్కువవుతున్నాయి. ఏనాటి పరిమాణాలను

తగ్గట్టుగా ఆనాటి బుద్ధికూడా వికసింపచేసుకోవటంలోనే ఉంది మనిషి అభ్యుదయం అంతానూ.

తనకథ పడిన పత్రిక తనకు ఎందుకు రాలేదా అని ఆలోచిస్తూ ఉండగానే సుందరం వచ్చి నిజం బయటపెట్టాడు.

"నీ పేర ఒక పత్రిక వచ్చిందోయ్, ఇంద. నీ అనుమతిలేకుండా, పత్రికేకదా అని చూడటం తటస్థించింది. అయితే అదీ మంచికే అయింది. చూడూ! నువు కథలు రాయటం బాగానే ఉంది. రాయగలిగే వాడు రాస్తూ ఉండాలికూడానూ. నువుకూడా ప్రభుత్వోద్యోగివి గనక చెప్తున్నాననుకో. నిబంధనల ప్రకారం మనం అసలు ఏదీ ఇట్లా రాసి అచ్చువేయించరాదు. ఒక కథ రాస్తే, దాన్ని పత్రికకు పంపేముందు పర్మిషన్ తీసుకోవలసివుంటుంది లేకుంటే ఎంతేనా పేచీ వస్తుంది. అది నా చేతిలో ఉన్నపనే అనుకో. నువొక దరఖాస్తు పెట్టు పర్మిషన్ ఇచ్చినట్టు నేను చేసేస్తానులే."

ఇది విశ్వం ఇదివరకు ఎరిగి ఉన్నదే. అయితే, ఈ బాధ, రాజకీయాలకు సంబంధించినవాటికే కాకుండా, మామూలుగా ఒక కథ రాసినా, ఉంటుందనిమాత్రం విశ్వం ఊహించుకోలేకపోయినాడు. మనకు స్వతంత్రం అంటే వచ్చిందనుకుంటున్నాంగాని, ప్రభుత్వం మారలేదనీ, పాతతంత్ర వ్యవస్థకి తగ్గట్టుగా ప్రభుత్వోద్యోగాల నిబంధనలు పరిణామం చెందలేదనీ విశ్వం గుర్తించాడు.

ఇప్పుడు తను కథలు రాయటానికి ముందు 'పర్మిషను' పుచ్చుకోవాలి. ఇదైనా మళ్లా, తన స్నేహితుడు—సుందరం—ఇవ్వాలి! సుందరం అనుమతిస్తేనే తను కథలంటూ రాయగలనన్నమాట! ఈస్థితిలో తను సాహిత్యసేవకు తిలోదకాలన్నా ఇవ్వాలి. లేదా ఉద్యోగానికైనా పాట పాడెయ్యాలి. అంతేగాని, ఈపర్మిషనూ వ్యవహారం విశ్వానికి నచ్చలేదు.

7

విశ్వానికి ఈ చాకిరీ నచ్చటం లేదన్న విషయం మొదట్నుంచీ తెలుస్తూనే ఉంది. దీనికి కాలపరిమితి కూడా, మరో నెల్లాళ్ళలో పూర్తి కాబోతుందని, విశ్వం ఉద్యోగంలో ప్రవేశించిననాడే తెలుసుకున్నాడు. సుందరం ఆ విషయం ఎందుకు దాచాడో, ఇప్పుడు సుందరం, దీని కాలపరిమితి మరో మూడు నెలలకు పెంచటానికి చేస్తున్న ప్రయత్నంవల్ల బోధపడుతున్నది విశ్వానికి. ఇప్పటికి రెండు నెలలకు పైగా ఈ బండచాకిరీ చేయటమే కాక, సుందరానికి అయిదువేల రూపాయలు నష్టం తీసుకురావటంతో సుందరానికి బాగా దూరమైనాడుకూడానూ. ఇప్పుడు సుందరం—తనతో పూర్వపుస్నేహంతో గానీ, ఆ ధోరణిలో గానీ, ఆ ఆప్యాయంతో గానీ మాట్లాడటం లేదు. పైగా ఒకవేళ ఏదన్నా అవసరమొచ్చి, సుందరం మాట్లాడినా, అది తన మనసుని, నిశ్చితంగా కష్టపెడుతున్నది. సుందరం అంతకన్నా ఎక్కువ సంప్రదాయయుక్తంగా ఎందుకు మాట్లాడడో విశ్వం తరిచిచూస్తే మళ్లా అతనికి అంతస్థులే కనిపించసాగాయి.

ఈ ఉద్యోగంలో తను, ఇంతవరకూ సాధించిందేమిటి? ఏంసాధించా లనుకున్నా ఇంత త్వరలో తేలే విషయం కాకపోవచ్చు. కాని, దాని సూచనన్నా కనిపించకపోవటంలో అర్థం లేదు. పైగా, తను చేసే ప్రతీ పనికీ అడ్డుపుల్లలు అధికమవుతున్నాయి. ఇది భరించటం చాలా కష్టం. ఇదిలా ఉండగా, ఈ ఉద్యోగంవల్ల, విశ్వం, తన వాళ్ళకు దూరమైనాడే గాని, దగ్గర పడే సూచన లేమీ కనపడటం లేదు.

ఈ మనస్సే తన కొక రోజు తల భారమై, జ్వరం లక్షణాలు తగిలి లంఖణంలో ఉంటే - సెలవు చీటీ పంపించటం—"ఈ మాత్రానికి సెలవేమిటోయ్! రెండు 'ఆస్ప్రిన్'మాత్రలు తిను"అంటూ సుందరం తిన్న ఆఫీసుకి రమ్మని ప్రత్యేకంగా కబురుచేయటం జరిగిందికూడాను! అంటే, తనకు కనీసం సెలవు, కావలసినపుడు దొరకటం—సుందరం అజమాయిషీలో కష్టమని కూడాబుజువైంది.

ఇటువంటి చాకిరీ చేయటానికి సిద్ధపడేవాడు ముందుగా తన ఆత్మాభిమానం చంపుకోవాలి. ఇట్లా ఆత్మాభిమానం చంపుకోవటం కనీసం తనవంటివానికి చేతకాని పని. తన ఆత్మాభిమానాన్ని అప్పుడప్పుడు గాయపరిచేటంతవరకూ ముందుకు సాగాడు విశ్వం. కాని, ఇప్పుడు పూర్తిగా దాన్ని చంపుకుంటేనే

గాని, ఇందులో మోక్షం సాధించటం సాధ్యపడదని విశ్వసించాడు. తనకు చేతకాని పని చేయటానికి— అందులో, ఆత్మాభిమానం చంపుకొనటానికి, తెగించేటంత ద్రోహం మరొకటి లేదు.

ఆనాటిరాత్రి, విశ్వం, ఇవే ఆలోచనలతో ఒక కథ రాయాలని మళ్లీ సంకల్పించాడు. కాని, అది కథగా రావటం మానేసి, ఒక ఉత్తరంగా పరిణమించింది. ఇది అనుకోకుండా జరిగినటువంటిది. ఆ ఉత్తరం సుందరానికి ఉద్దేశించింది.

8

"మైడియర్ సుందరం! ఈ ఉత్తరాన్ని నాపై అధికారిగా ఉన్న సుందరానికి కాకుండా, నా స్నేహితుడైన సుందరానికి రాస్తున్నాననుకొంటావనే నా విశ్వాసం. ఈ ఉత్తరాన్ని నీకు ఎందుకు రాస్తున్నానో నన్నడక్కు. నిజానికి నేను ఈరాత్రి, ఒక కథ రాయాలని కూర్చున్నాను. తీరా చూస్తే ఇది ఇలా ప్రారంభమైంది. అయితే ఇదీ ఒక కథలాగే తోచవచ్చు. కనక దాన్ని ఇంతటితో ఆపేయకుండా పూర్తి చేస్తున్నాను.

నాకు స్నేహితులంటే పరమ గౌరవం. నా స్నేహితులలో నిన్నే అందరికన్నా ఎక్కువగా భావించుకొంటూ ఉంటాను. నువు నాకు చేసిన సేవకీ, చూపిన సానుభూతికీ అంతకన్నా ఉత్తమమైన పద్ధతిలో నా కృతజ్ఞత తెలియచేసుకోవటం నాకు చాతకాదు.

నేను సహజంగా కథకుణ్ణి. ఈరాత్రి కథ రాద్దామంటే, ఇది ఈ ఉత్తరంగా పరిణమించటానికి కారణం. కథ రాస్తే అది ప్రకటించుకోటానికి, నా పాటివాడివైన నీ అనుమతి, అధికారపూర్వకంగా పొందాలి. ఆ మాటకూడా నువ్వే పాపం— నామంచికే ఆలోచించి అన్నావు. కాని, నాకిది సరిపడదు. నా స్వేచ్ఛని ఈవిధంగా నేను ఇంకొకరి చేతిలో బంధించివేయలేను. అందువల్ల, ఈ ఉద్యోగంలో ఉండిన ఆఖరు క్షణంవరకూ నాలో ఉన్న కథకుడు విద్రోహిగా ఉండాలి.

మనం పరిసమానమైన హోదాలో ఉండే స్నేహితులం. ఈ స్నేహానికి భంగం రావటం నేను భరించలేను. నేను చాలా సెన్సిటివ్‌గా ఉంటున్నానని అనుకొంటున్నావా? నిజమే అందుకే నావంటివాళ్లకి ఇటువంటి ఉద్యోగాలలో స్థానంలేదని గుర్తించాను. నీతో నాకుండిన స్నేహాన్ని పురస్కరించుకొని, నాకొక ఉద్యోగం చూసిపెట్టమంటూ నీకుత్తరం రాశాను. నా ఊహకు అతీతంగా పాపం నువు నన్ను ఆదరించి, నీ అభిమానంతో నన్ను ఉక్కిరి బిక్కిరి చేశావు. నిన్ను నేను తప్పుపడుతున్నాననుకోకు. స్నేహితుడనేవాడు నీ అంతస్థులో ఉంటే, నువ్వు చేసినదానికన్నా ఎక్కువ ఎవడూ చేయలేడనుకో. అయితే ఒక యథార్థం చెపుతాను. నువ్వు కేవలం నీకిందే నన్ను వేసుకుంటావని మాత్రం నేనెన్నడూ కలలోకూడా ఊహించలేదు. నన్ను స్నేహితుడిగా ఆదరించిన వాడివి, స్నేహాన్ని గౌరవిస్తావనే విశ్వసించాను. అయితే, నువు చేసిన ఈపనిలో, మన స్నేహానికి అగౌరవం కలిగిందని నువు గుర్తించకపోవచ్చు, అంతస్థుల భేదంవల్ల, అది, కిందనుంచి నేను గమనించాను. పైనున్నవాడివి, నీ కాట్టే కనపడదది.

నాకు ఆత్మాభిమానం చాలా ఎక్కువ. నీ అధికారాన్ని నేను గౌరవంగా చూసి, దానికి అణిగిపోయినప్పుడు నా ఆత్మాభిమానాన్ని చాలా మట్టుకు గాయపరుచుకున్నాను.

చూస్తూ చూస్తూ నేను అన్యాయానికి తల వొంచలేను. న్యాయంగా నేను రాయవలసిన టీఏ రాస్తే, దానిమూలంగా అయిదువేలరూపాయలు ప్రభుత్వానికి ఆదా కనిపించింది. ఆ ఆదా నువు చేసినట్టే రికార్డులో చిక్కించుకొన్నావంటే, నువు అధికారికి గనక నేను కాదనను. అయితే ఆదా జరుగుతున్నప్పుడే, 'ఆదా చేయటానికే మనం ఉన్నాం' అని నువ్వప్పుడు నాతో అనటంలో, నాకు కించిత్తు నైచ్యం కనిపించింది. బహుశా ఆ సొమ్ము వేరో కార్యార్థం ఉపయోగించాలని నువు ఉద్దేశించి ఉండవచ్చును. ఈ పద్ధతి నాకు నచ్చదు. నేను ఉద్యోగరీత్యా ఇక్కడ అతి అల్పుణ్ణి. నామాట ఎవరు పాటిస్తారు?

నాకు ఒకరోజు శెలవు కావాలంటే నువు అభ్యంతరం చెప్పావు. బహుశా అభ్యంతరం చెప్పవలసిన అవసరం ఉందని నీకు తోచిందేమో. కాని,

ఈ చర్య, మనిషిశక్తిని దుర్వినియోగపరుచుకొంటున్నట్టుగా నా కర్థమయింది.

ఇదీకాక, ప్రతీ చిన్నవిషయంలోనూ నేను నీకు తలవొంచి ఉండవలసిన పరిస్థితి ఏర్పడింది. నిన్ను నేను, స్నేహితుడిగా ఎంచుకోవడం మూలాన, నా ఆత్మాభిమానం బాగా దెబ్బ తిన్నదేగాని, నీ స్థానంలో నాకు తెలియనివాడు ఇంకొకడున్నా, నేను బాధపడవలసినవాణ్ణే. నా స్వభావమే అంత. ఈ బాధకు నేను తట్టుకోలేను.

'ఉద్యోగమంటే, తీరికూర్చొని సుష్టుగా భోంచేయటమా?' అని నువ్వు ప్రశ్నిస్తావు. కాని, తీరికూర్చొని సుష్టుగా భోంచేయటంమాట ఎలా ఉన్నా, ఉద్యోగమంటే, ఇప్పుడున్నంత హీనంగా లంచగొండివ్యవహారంగా, అధికారమదాంధతగా, మానవత్వరహితంగా హృదయశూన్యంగా ఉంటుందని మాత్రం నేను అనుకోలేదు.

ఇంతెందుకూ? నా అంతస్థు వేరు. అది చాలా పైనుంది. నేను, నీ దృష్టిలో చాలా దిగువ ఉన్నానన్నమాట నిజం. మానసికంగా, సంస్కారంగా నే నెంతో పైమెట్టులో ఉన్నా యథార్థం నువ్వు గుర్తించ నవసరంలేదు కూడాను. దానివల్ల నీకూ నాకూ కూడా ప్రయోజనమంటూ ఏదీ ఉండదు.

పోతే, నేను ఇక్కడికి నీ ధర్మమా అని వచ్చి, నా వాళ్లకు చాలా దూరమైపోయినాను. నా తమ్ముడు నన్ను ఉద్యోగం వొదులుకోవద్దన్నాడు. పాపం! వాడికేం తెలుసు నావంటి వాడి మానసిక బాధ! ఈ పరిస్థితిలో నేను నా కుటుంబాన్ని ఇక్కడికి రప్పించనూ లేను. నేను వెళ్లనూ లేను. నావంటివాళ్లు ఇక్కడ అనేక వందలమంది ఎలా బతుక్కొస్తూన్నారంటే అది వేరే మాట. అందరూ నావంటివాళ్లలా అవుతారు! అందరికీ ఆత్మాభిమానాలు లేవని కూడా నే ననలేను. వాళ్ళ పరిస్థితులు భిన్నమై ఉండవచ్చును. వాటికి తట్టుకోగలిగేవారు నిలబడుతున్నారు. తట్టుకోలేని నావంటివాళ్లు, ఈ వ్యవస్థలో ఇరుక్కోలేక పాతాళంలో పడిపోతున్నారు. కాని, నే నింత హీనంగా పాతాళంలో పడిపోన నే ధైర్యం నాకుంది. నన్ను లక్ష్మి కటాక్షించకపోయినా సరస్వతి కాస్త ఓరకంటితో చూస్తోంది. ఇదివర కెలా జీవితం గడిపానో అలాగే గడపకపోను. బహుశా, పరిస్థితులు అనుకూలంగా ఉంటే, ఇంకా గౌరవంగానే బతగ్గలనని నా ధైర్యం.

ఇక్కడితో నా చాకిరీ కాలపరిమితి కూడా పూర్తికాబోతున్నది. రేపు జీతంపుచ్చుకొని, నా మానాన నేను పోతున్నాను. నన్నేదో ఉద్ధరించాలని మాత్రం ఈ ఉద్యోగం అనవసరంగా పొడిగించి, ప్రభుత్వానికి కలగబోయే అపాయం కలగకుండా చేయకు. అవసరమే ఉంటే, మరో 'స్నేహితుణ్ణి' వేసుకో. మన స్నేహంమాత్రం ఈ విధంగా కాపాడుకుంటే ఇదే చాల్ను.

అసలు, ఈ నాలుగు ముక్కలూ నీముఖం ముందు చెప్పే అధికారం నాకుంది. అయితే, నా అధికారం మన స్నేహంనుంచి వచ్చినది. ఇంత మట్టుకూ ఈవిధంగా తెచ్చిఉన్న ఈ స్నేహానికి ఇంక అధికారమేముంటుంది? అదీకాక, గాయపడ్డ నా మానాభిమానాలతో, నీముఖం ముందు, నామనసులో ఉన్న ముక్కలు చెప్పలేకపోయినాను. అందువల్లనే ఈ ఉత్తరం ఇలా పరిణమించింది.

నే నింత పొడుగాటిఉత్తరం రాసినందుకు నన్ను క్షమించు. ఉన్నవిషయం కాస్తా రానేస్తే, నేను, ఇటీవల నామీద పడిన బూజుదులుపుకొన్నట్టవుతుంది. నీ ఎప్పటి సానుభూతితోనే దీన్ని చదువుకొని, నన్ను అర్థంచేసుకోటానికి ప్రయత్నించు. ఇదే నిన్ను నేను కోరబోతున్న చిన్ని కోరిక.

నీ విశ్వం.

మరో — ఈ ఉత్తరంతోపాటు, నా రాజీనామా ఉత్తరంకూడా జతపరిచాను. ఉద్యోగ కాలపరిమితి అయిపోయింది గనక, దాని అవసరం లేదు. అయినా అవసరం ఉంటుందేమో అని, పంపిస్తున్నాను. స్వీకరించు—

అంతస్థుల భేదంవల్ల, ఈ ఉత్తరానికి సమాధాన మేమిటని నువ్వు అనుకోవచ్చు. నీ సమాధానం కోసం నేను ఎదురు చూడనులే. అయితే, ఎటువంటి సమాధాన మివ్వాలి? అని మాత్రం నువ్వు కాస్త ఆలోచించినపక్షంలోమాత్రం ఈ వ్యవస్థలో ఒక పెద్ద విప్లవం రావటానికి సిద్ధంగా ఉండమనకో — నీ విశ్వం,"

హేమంతము

★

శ్రీ సామవేదం జానకిరామశర్మ

చేలగట్లఁ బచ్చపూల సింగారాల
నొలికించె జనపమొక్కలు తమంత,
కాలిబందము వచ్చెకానికి; దట్టమై
కొనలుసాగెను గట్టు మినపతీగె,
పురుగుపట్టిన దొండ పెరటిలోనఁ జిగిర్చి
పూలపిందెలఁ గ్రొత్త పొలుపుఁ దాల్చె.
చచ్చినకాకర చచ్చినట్లయుండి
తుదిమొదళ్లుగ నాకుఁ దొడిగికొనెను.
'కడచిపోయినదే మేలు కాలమన్న'
నానుడికిఁగూర్చి వ్యాఖ్య; యధునాతనముగఁ
జేలఁ బెరడుల హేమంతసిరులు చాలఁ
గూర్చుకొనెఁ దెల్గుపల్లెలు కొసరి కొసరి.

1

పరికిణీజీరాడ శిరమెత్తి యాటకై
మునికాళ్లఁ గన్నియ చనినయట్లు,
పల్యంకికను బాల పరిణయమ్మున సిగ్గు
బరువుచే శిరమును వంచినట్లు,
పదిమందిలోఁ బ్రౌఢ భర్తను శీర్షమ్ము
చాచిచాచక తొంగి చూచినట్లు,
బంగరు మైతీగ భాసింప సౌధాంత
రమున జవ్వని కురు లార్చినట్లు,
తెల్లెడల శ్రీత్వమే మది నల్లుకొనఁగ
విఱుగఁబండిన కేదారవీధిశాలి
దండములతుది కంకెలు నిండఁ దాల్చె
రమ్యహేమంతమే ఋతురాజ మనఁగ!

2

ముద్దుగ దిద్దిన పెద్ద ముత్తైదువు
నుదుటి కుంకుమబొట్టు కుదురనంగ,
నవయౌవనమ్ము సందడిసేయు యువతీల
లామమ్ము బింబాధరమ్మనంగ,
పచ్చరావేదిక భాసిల్లు నరుణారు
ణమ్ము భాస్వత్ప్రవాళమ్మనంగ,
పొడుపుకొండ ఇనుండు భూమిపై దీయించు
కొనిన ఛాయాచిత్రమనఁగ మెఱసి
కర్ణికారఫలమ్ము లోకమునఁ గల్గు
రాగమును బూనె హేమంత రాత్రులందు
కాముకీ కాముకుల నేత్రకమలములను
మానసమ్ములఁ గల రాగమహిమ మించి!

3

చిఱుచలికే సంజె చీకటి పడకుండ
ముదుసలి దుప్పటి ముసుఁగు వెట్టె,
అసురసంధియ నాడియాడి వచ్చినబిడ్డ
యడుగులు కడుగగా వడఁకిపోయె,
పొత్తమ్ముతో దీపమునకు ముందుగ నున్న
బాలుఁడు గురువుపైఁ జాలఁగినిసె.
రాత్రి వంటకము నీరాడి యారంభించు
వనితకుఁ బతి తలపునను మెదలె
సందెపొద్దుల నిశలను జనులనెల్ల
స్వీయశక్తి ప్రభావ విశీర్ణమాన
మానసులఁజేసియును సౌఖ్యమూను నిద్ర
నంతరించెను హేమంతచక్రవర్తి!

4


పెనువాన జల్లువచ్చినయట్లు లోకసారి
భూనభోంతరమును మూసివేయు,
సన్నని చినుకులు జాఱి సర్వలోకమారు
మేనెల్లఁ జిఱుతడిఁ బూనఁజేయు

చినుకులు చిదురలై చెదరి నట్లొకపరి
  మోమెల్లఁ దడితోడ ముంచియెత్తు
ముత్తైపు బిందువుల్ మొనసినట్లొకతేప
  దేహమ్ముపైనఁ గదించుకొనును,
సర్వవిధముల వర్షమ్మె సాగననుచు
జనము భ్రమియింప గారడీ సలిపి, మింట
హిమముగుడికట్టి, చినుకులై, హెచ్చుచిదుర
లగుచు, బిందువులై పరిహాసమాడె!

5

కడుపులోనికిఁ గాళ్లు ముడుచుకు ముద్దనై
  వీధి పంచ శయించు బిచ్చగాడు
చినిగిన గొంగళి చిన్న పిల్లకుఁ గప్పి
  పేరుచుఁజలిఁ దూఁగు పేదతల్లి
అకటి దయ్యమ్ముసోఁకగా నదవద
  లైయుండి, గజగజలాడు శిసువు
చలికప్పు సుతునకు సంతరింపఁగ లేక
  యవియు గుండియఁ జూచునట్టి తండ్రి
యగుచు హేమంత మెంతొ దయాదరిద్ర
మయ్యె; నెల్లెడ బీదల యార్తరవమె
తోఁచు నన్న విధమ్ముగా నాఁచియాఁచి
నన్న రొదతోడి శీతువు సంచరించె!

అభ్యంజనంబాడి యాఱినతల చిక్కు-
  సవరింపఁగాఁ బోని చానయట్లు
పగతుఱఁ జెండాడఁ బదును బెట్టించిన
  యాంధ్ర సైనికుని మహాసియనఁగ
అనుభవ జ్ఞానమ్ములను బండి బరువెక్కి-
  చలియించు వృద్ధుని దలయుపోలె,
విద్యా నగర రాజవీధి రాసులు పోసి
  వెలకిచ్చు మాణిక్యముల విధాన
తెలుఁగునేలను బండింపఁ గలిగె కంది
మొక్కలను, ధూమపత్రమ్ములక్కుమిగుల
జొన్నకంకెల, మిరప పండ్లనో వేడ్క-
ననుభవజ్ఞుండు హేమంత హాలికుండు!



కాళిదాసమహాకవి-జీవిత 'సమస్యలు'

★

శ్రీ పి. గణపతిశాస్త్రి

సమస్య అనే పదం ఈ రోజుల్లో (*Problem*) 'గట్టిచిక్కు' అనే అర్థంలో వాడుతున్నారు. పూర్వం ఇది 'పరీక్షార్థం ఇచ్చిన పద్యపాదము' అనే అర్థంలో వాడేవారు. నేటి తెలుగువార్తా పత్రికల పరిభాషలో దీని అర్థం బాగా మారిపోయింది. ఆర్థికసమస్య, సాంఘికసమస్య మొదలైన పదాలలో ఈ అర్థపరిణామం ఇంకా బాగా స్పష్టంగా కనిపిస్తుంది. వ్యావహారిక సంప్రదాయాన్ని అనుసరించి ఈ పదం ఈ అర్థంలోనే వాడుతున్నాను—కాళిదాస కవితలో ఇల్లాంటి 'సమస్య' లేమైనా ఉన్నాయేమో చూదాము.

రచయిత లెవరు తమ దేశ కాలపరిస్థితులు దాటిపోలేరనీ, ఈ పరిస్థితులకు వీరి రచనలకు ఏదో ఒక విధమైన సంబంధం ఉండితీరుతుందనీ కొందరు వాఙ్మయవిమర్శకు లంటారు. ఇది చాలావరకు నిజం. అయితే ఈ దేశ కాలపరిస్థితుల అవగాహనలోను, వీటివల్ల బయలుదేరే సమస్యల సమన్వయంలోను అనేకమైన అంతరువు లున్నాయి. ఒక రచయిత తన సమానకాలీన సమస్యలు ఒక తాత్కాలికమైన సంకుచిత దృక్పథంతో పరిష్కరించవచ్చును. మరి ఒక రచయిత ఆ సమస్యలన్నీ బాగా విశాలదృష్టితో పరిశీలించి మరి ఒకవిధంగా సమన్వయించి, పరిష్కార మార్గం సూక్ష్మంగా స్ఫురింపజెయ్యవచ్చును.

అంతేనేగాని కేవలం నేలవిడిచిన సామువంటిది సారస్వత మార్గంలో సాధ్యంకాదు. ఒకవేళ తెలిసిగాని, తెలియకగాని రచయిత లెవరయినా ఇలాంటి సాము ప్రారంభించినా—దీనికి సారస్వత గౌరవం దక్కదు. నిజానికి పలాయనవాదం (*Escapism*) గాని, *'కళకోసమే కళ' (*Art for art's sake*) అనే వాదంగాని మన సంస్కృత సారస్వత సంప్రదాయంలో లేనేలేవు. ఇలాంటి సరుకంతా ఇటీవలే పాశ్చాత్య వాఙ్మయాల్లోనుంచి మనదేశానికి దిగుమతి అయింది. ఆ దేశాల్లో ఇలాంటి వాదాలు బయలుదేరడానికి అనేకమైన కారణా లున్నాయి—అయితే మన కిప్పు డిది అప్రస్తుతం—

'కాళిదాసకవి రసమయ కవితా ప్రతినిధి' అన్న అరవిందుని అభిప్రాయం ఈ వ్యాసాల్లో ఇంతకు పూర్వమే వ్రాశాను. వాల్మీకి కవిత ధర్మప్రధానమయినదనీ, వ్యాసకవిత మేధాప్రధానమయినదనీ, కాళిదాస కవిత రసప్రధానమయినదనీ అరవిందుని అభిప్రాయము. కాళిదాస కవిత్వాన్ని గురించి ఆయన '*Aesthetic*' అనే పదం వాడారు. 'రసమయం' అన్న పదం ఈ ఆంగ్లపదానికి చాలావరకు సరిపోతుంది. కాని ఈఆంగ్లపదానికి పాశ్చాత్య సౌందర్య సిద్ధాంతాలలో అనేకమైన అర్థచ్ఛాయలు ఏర్పడుతూ వచ్చాయి. రసపదానికి కావ్యానుభూతి జన్యమైన ఆనందమని అర్థం. మన ఆలంకారికుల ఆనందానుభూతి ప్రధాన కావ్యప్రయోజనం అని ఒత్తిచెప్పినా—వీరి నిర్వచనంలో సాంఘిక ప్రయోజన ధర్మసూత్రం అంతర్గర్భితంగానే ఉన్నది. ఆలంకార శాస్త్ర రచనాకాలంలో ధర్మాధర్మాలను గురించీ, విధినిషేధాలను గురించీ ఈ నాటి వారి కున్నన్ని అనుమానాలుగాని, అభిప్రాయభేదాలుగాని ఉండేవి కావు. ఒక సాధారణ ధర్మసూత్ర సరణి ననుసరించి ఆ రోజుల్లో అందరు ఆలోచించేవారు. అందుచేతనే ధర్మాధర్మదృష్ట్యా రసానుభూతిలో వచ్చేమార్పులను గూర్చిన చర్చ అలంకార శాస్త్రంలో అంత ప్రధానంగా కనబడదు—

అయితే ఒక్కొక్క సమయంలో ఈ ధర్మాచరణలో కొన్ని లోపాలు సంభవించడము, ఆయా కాలాల్లోని కావ్యాలలో ఆ ధార్మిక దృష్టి నిశితం కావడము సంస్కృత వాఙ్మయంలోకూడా అక్క

డక్కడ పక్కృష్టగా కనిపిస్తుంది. కాళిదాసకవిత ప్రధానంగా రసమయమే, అయినా దీనిలోని ధర్మ సమస్య వ్యంగ్యంగా స్ఫురిస్తూనే ఉంటుంది.

కాళిదాసకృతు లన్నిటిలోను, తత్రాపి రఘువంశకుమార సంభవాల్లోను, విక్రమోర్వశీయాభిజ్ఞాన శాకుంతలాల్లోను మాత్రమే ఈ సమస్యా ధ్వని బాగా వినిపిస్తున్నది. కాళిదాస కృతులలో కనిపించే సమస్యలు రెండు విధాలుగా విభజించవచ్చును. ఒకటి జీవన భోగసమస్య. రెండవది ప్రేమభావసమస్య. ఈ రెండు కాళిదాసకృతులలో పరస్పర సమ్మిళితములై కనిపించవచ్చును గాని ఒక్కొక్క కావ్యంలో వీటిల్లో ఒక్కొక్కటి ప్రస్ఫుటంగా ధ్వనించి ఉండడంవల్ల ఇవి రెండు సమస్యలని వర్గీకరిస్తున్నాను.

మొత్తంమీద కాళిదాసకావ్యా లన్నిటిలోను. అందులోను రఘువంశ శాకుంతలాల్లో ఈ జీవితభోగ సమస్య మరింత స్పష్టంగా కనబడుతుంది. ఇంద్రియ గోచరమైన సౌందర్యం (*Sensuous Beauty*) కాళిదాస కవితలో ప్రతిఫలించినంత మహోజ్జ్వలంగా మరి ఇతర సంస్కృతకవులలో ఎక్కడా స్ఫురించదు. ఇది ఈ కవితలో గల ప్రత్యేక గుణం.

రఘువంశంలో ఇందు మతీ మరణానంతరం వసిష్ఠుడు అజుని ఓదార్చే సందర్భంలో శరీరధారులకు మరణమే ప్రకృతి అనీ జీవితమే వికృతి అనీ ప్రబోధించాడు. అటుపిమ్మట "క్షణమైనా ఊపిరి విడుస్తూ జీవించగలిగిన వ్యక్తి చాలా అదృష్టవంతుడుసుమా!" అని వసిష్ఠుడు అజునితో నొక్కి వక్కాణిస్తున్నాడు. ఇందుమతీ మృతివల్ల విరాగోపహతుడైన అజునిగురించి అన్న ఈవసిష్ఠుని సూక్తి చాలా సందర్భోచితంగా సరిపోయింది. అయితే నిశితంగా కాళిదాస కవితపరిశీలించిన వారికి రెండోవాక్యం వసిష్ఠసూక్తిగానే కాక కవి హృదయాంతర్గత భావంగా స్ఫురించి తీరుతుంది. నిజానికీ వాక్యం కాళిదాసకవికి జీవితసౌందర్యానుభూతిపై గల మమకారాని కంతటికీ తార్కాణంగా తీసుకోవచ్చును. అయితే—మరణమే జీవిత ప్రకృతి కనక ముందువెనుకలు చూచుకోకుండా భోగలాలసలో మైమరచిపోవడమే కాళిదాసాభిప్రాయమని అనుకోకూడదు. నిజాని కిటువంటి ఉన్మత్తలాలసతో గల ఒడిదుడుకులన్నీ, ఈ మహాకవి సాకల్యంగా పరిశీలించినవాడే—కనకనే ధర్మపరులైన రఘువంశీయులలో చిట్టచివర ఉదయించిన అగ్నివర్ణునిలో ఈ ఉన్మత్త భోగలాలస వల్లకలిగిన దుష్ఫలితాలన్నీ వర్ణించనిదే కాళిదాసు తన కావ్య సమాప్తి చెయ్యనేలేదు. ఇలాగ అగ్నివర్ణునిలో కలిగిన దుష్ఫలితాలవల్లనే కవి భోగలాలసాదోషాలు పాఠకుల హృదయాలకు హత్తుకొనేటట్లు ధ్వనింపజేస్తున్నాడు. అంతేనే గాని కవి కంఠోక్తిగా ఈ విషయం ఖండించలేదు. ఒక్కచోటమాత్రం "స్వాదుభిస్తు విషయైర్హృతస్తతో దుఃఖమింద్రియగణో నివార్యతే" అని మాత్రం అంటాడు. "స్వాదువు లయిన విషయాలచే ఆకర్షించబడిన ఇంద్రియసమూహాన్ని తిరిగి మళ్లించడం చాలా దుష్కరం" అని దీని అర్థము. ఇంత తటస్థంగా చెప్పిన కవి స్వీయోక్తినిబట్టి జీవిత సౌందర్యానుభూతిపై కవికి గల ఆసక్తి, అనాసక్తి అత్యంత మనోహరమైన సమ్మేళనంతో పాఠకులకు స్ఫురిస్తున్నాయి.

అభిజ్ఞాన శాకుంతలంలో ఈ సమస్య మరింత స్పష్టంగా కనబడుతుంది. ఈ నాటకంలో పాఠకులకు అనేక విధాలుగా వ్యంగ్యాలు ధ్వనిస్తాయి. ఒక విధంగా చూస్తే ఇది భోగపరుడైన దుష్యంతుని జీవితానికీ అనాసక్తులైన అరణ్యవాసుల జీవితానికీ గల తారతమ్యం చిత్రించే రూపకంలా కనబడుతుంది. శకుంతల తాపసకన్యక. తాపస ధర్మాచరణం ఆమె వేసే ప్రతిఅడుగులోను ప్రతిధ్వనిస్తూంటుంది. ఇక దుష్యంతుని సంగతాయే వేరు. ఇతడు బహుభార్యాసక్తుడు. అంతఃపురంలో ఇతనిచేత ఒకప్పుడు అతిగా ఆదరింపబడి, ఆ తరవాత ఉపేక్షింపబడిన హంసపదిక వ్యంగ్యంగా ఇతన్నిగురించి పాడిన పాటవల్లనే ఇతని భోగపరాయణత పాఠకులకు చక్కగా తెలిసిపోతుంది.

వ్యాస భారతంలోని దుష్యంతునికీ, కాళిదాస శాకుంతలంలోని దుష్యంతునికీ ఎక్కడా పోలిక కనబడదు. భారత దుష్యంతుడు ఆశ్రమాన్నించి తిరిగి వచ్చిన తరవాత అసలు శకుంతల గోజే మరిచిపోతాడు. కాని ఆశరీరవాణి ఇతనికి ఆసరాగా నిలబడి 'శకుంతల నీభార్య సుమా!' అని హెచ్చరిస్తుంది. ప్రభువులు పక్కదారిపట్టి

నప్పుడు ఆ అశరీరవాణి వారిని హెచ్చరించడము, మళ్లీ వారు సరియైన పంథాలో నడుతూండడము, ఆ కాలంలో ఒక పరిపాటిగా ఉండేది కాబోలు!

అయితే కాళిదాసు మాత్రం దుర్వాస శాప వృత్తాంతం ఒకటి కల్పించి, దుష్యంతుని స్వభావానికి, చాలావరకు మెరుగు పెట్టాడు. కాని అతని బహు భార్యాసక్తికి మాత్రం ఎక్కడా లోటు రానివ్వలేదు. పతి తిరస్కరించినా తపస్వినియై అతనినే అనుసరిస్తూ కాలం వెళ్ళబుచ్చిన శకుంతల దగ్గర నిలబడినప్పుడు—దుష్యంతుడు దివిటీ ముందర దివ్వెలా వెలవెలబోతాడు—ఈవిధమైన శకుంతలా దుష్యంతుల తారతమ్య ప్రదర్శనవ్యంగ్యంలో కవి భోగపరాయణతలో గల లోపాలు వేలెత్తి చూపిస్తున్నట్టే కనపడుతుంది.

అభిజ్ఞానశాకుంతలం మరి ఒక విధంగా కూడా పరిశీలించవచ్చును. కాళిదాసమహాకవి దేశకాల నిర్ణయం ఇంతవరకు స్పష్టంగా జరగలేదు గాని, ఇతడు తన నివాసభూమి సర్వ సంపత్సమృద్ధమైన కాలంలో జన్మించిన వాడై ఉండవచ్చునన్నదైనా పాఠకులకు స్పష్టపడి తీరుతుంది. విమర్శకు లనేకులు గుప్తసామ్రాజ్యం సర్వోచ్ఛ స్థితిలో ఉన్నప్పుడు కాళిదాసకవి ఉద్భవించి ఉండవచ్చునని అన్నారు—ఏది ఎలాగ ఉన్నా కాళిదాస కవితలో భారతదేశ చరిత్రలో సర్వ సమృద్ధమైన ఒక స్వర్ణయుగం ప్రతిబింబించిన విషయంలో అభిప్రాయభేదం ఉండనక్కరలేదు.

అయితే కాళిదాస కవి ఆ కాలంలో మితి మీరిన భోగాసక్తిలో మైమరచిన తాత్కాలిక నాగరక జీవితాన్ని వ్యంగ్యంగా అధిక్షేపిస్తూ తన కావ్య నాటకరచన కుపక్రమించినట్టు కనబడుతుంది. అభిజ్ఞాన శాకుంతలంలో ఆశ్రమ నగరజీవితాల తారతమ్య పరిశీలన చాలా నిశితంగా చెల్లింది. దీనికి శకుంతల వెంటవచ్చిన కణ్వశిష్యుల సూక్తులు తార్కాణంగా ఇవ్వవచ్చును. వీ రిద్దరు కేవలం ఆశ్రమవాసులు. మొట్టమొదటగా కణ్వుని ఆజ్ఞానుసారమే వీరు దుష్యంత నగరానికి వచ్చినట్టు కనిపిస్తారు. వీ రిద్దరి శ్లోకాలు నాగరక జీవనంలోగల భీభత్సం చక్కగా వివరిస్తాయి—

"మహాభాగః కామం నరపతి రభిన్నస్థితి రసౌ
న కశ్చి ద్వర్ణానా మపథ మపకృష్టోపి భజతే
తథాపీదం శశ్వ త్పరిచిత వివిక్తేన మనసా
జనాకీర్ణం మన్యే హుతవహపరీతం గృహ మివ"

ఇది కణ్వశిష్యులలో మొదటివాడన్న శ్లోకము. దీని అభిప్రాయం ఇది. "ఈనరపతి మహానుభావుడు. ఇతడు ఒక క్షణమైనా ఏమరకుండా తన రాజధర్మం నిర్వహిస్తున్నాడు. వర్ణాలలో అసమవర్ణస్థులు కూడా చెడుమార్గం జోలికి పోవడంలేదు—అయినా వివిక్త మనస్సుతో ఇదంతా పరిశీలిస్తున్న నాకీ జనాకీర్ణమయిన నగరం అగ్గిదరికొన్న భవనంలా భాసిస్తున్నది." నగరం అగ్నిపరీతమైన గృహంలా ఉన్నదన్న ఈ ఉపమానంలో కాళిదాసెంత సూక్ష్మంగా నాగరికజీవన భీభత్సం మన కళ్ళకు కడుతున్నాడో ఊహించుకోవచ్చును.

రెండవ శిష్యుడన్న శ్లోకంకూడా ఆశ్రమ జీవితానికీ, నాగరక జీవితానికి గల తారతమ్యం స్పష్టంగా ప్రతిఫలింపజేస్తుంది:

"అభ్యక్త మివ స్నాతః
శుచి రశుచి మివ ప్రబుద్ధ ఇవ సుప్తమ్
బద్ధ మివ స్వైరగతి
ర్జన మిహ సుఖసంగిన మవైమి."

"స్నానంచేసినవానికి ఒళ్ళంతా నూనె రాసుకున్న వ్యక్తీ, శుచిఅయిన వానికి అశుచిఅయిన మనిషీ, మేలుకొన్న వానికి నిద్రపోయేవాడు, స్వేచ్ఛావిహారికి ఖైదీ కనబడినట్టుగా నాకీ సుఖాసక్తులయిన జనం కనబడుతున్నారని దీని భావము. ఇక్కడ కవి ఆశ్రమవాసులయి నిర్లిప్తులయిన జనానికీ, నాగరికులయి సుఖలిప్తులయిన జనానికీ తారతమ్యం చూపించడానికి నాలుగు ఉపమానాలు ఉపయోగించాడు. ఈ నాలుగు ఉపమానాలు వాడడంలో చాలా అంతరార్థం ఉన్నది. ఇవి సుఖనిర్లిప్తుల శారీరక మానసికపరిస్థితులు చాలా సూక్ష్మంగా ప్రదర్శించే ఉపమానాలు. ఈ రెండు శ్లోకాలేకాక మొత్తం అభిజ్ఞానశాకుంతలం అంతా నాగరక జీవనంపై ఒక వ్యంగ్యావహేళనంగా తీసుకోవచ్చును.

ఇంతకుపూర్వం కాళిదాసవ్యాసాలలో కాళిదాసకవితలో కనబడే అనాసక్తి జీవితం ఎదుర్కొనలేని ఒట్టి వైరాగి ధోరణికాదనీ ఇతని జీవిత భోగా

సక్తిలోనే అంత లీనమైన నిర్లిప్తతకూడా ఉన్నదని సూచించాను. ఈ దృష్టితో చూచినప్పుడే కాళిదాస జీవన సౌందర్యభుక్తిలోగల పరిపూర్ణత బాగా అవగాహన అవుతుంది. అయితే కాళిదాసకవితలో ఒక వైచిత్రి కనిపిస్తుంది. ఈ కవి తన కాలంలో గల విశృంఖల భోగానుభూతిలో గల దోషాలు వ్యంగ్యంగా ధ్వనించి ఉంటాడని అనుకున్నాము. అయినా కేవలం వైరాగ్యధర్మం ఉపదేశించక తన కవితలో సర్వత్ర జీవిత భోగసౌందర్యం ప్రతిఫలిస్తాంటాడు. ఈవిధమైన రక్తివిరక్తుల సమదృష్టి సమన్వయం కాళిదాసకవిత కొక అతి సౌందర్యం ఆపాదించింది.

కాళిదాస కవితలో ప్రేమభావ పరిశీలన, దానికి సంబంధించిన 'సమస్యలు' కూడా ధ్వనిస్తున్నాయని అనుకున్నాము. నేటి కాలంలో ఈ ప్రేమపదానికి చాలా చిత్రవిచిత్రమైన అర్థవిభేదాలు ఏర్పడుతున్నాయి. కేవల శారీరక కామన మొదలుకొని శారీరక మానసికమిశ్రమైన అనేక విధాలైన మానసిక ప్రవృత్తు లన్నిటికీ ఒకటే మంత్రంగా మన రచయితలీ పదం వాడుతున్నారు. కాళిదాస కవితలో ఈ సమస్యాపరిశీలనం చాలా సూక్ష్మంగా నడిచింది. ఇతని కావ్యాలన్నిటిలోను ఈ ప్రేమ భావ పరిశీలన ఒక విధమైన క్రమికపరిణతి పొందినట్టు కనబడుతుంది. ఆయా కావ్యాలలోను నాటకాలలో ఈపరిణామం ఎలాగ పెరిగిందో చూదాము.

ఋతుసంహారం ప్రధానంగా ప్రకృతివర్ణన పరమైన కావ్యం. కాళిదాసీ కావ్యం తన ప్రేయసిని సంబోధిస్తూ రచించాడు. ఇందులో ప్రకృతివర్ణనకు వచ్చిన ప్రాధాన్యం ప్రేమభావానికి రానేలేదు. దీనిలో కవి ప్రేమ అంకురాకారంలో ఉన్నది గాని అంతకంటె పరిణతి పొందలేదు.

ఈ విషయంలో దీని తరవాత పరిగణింపదగిన కావ్యం మేఘదూతము. ఈ కావ్యరచనాకాలానికి కవి కేవలం వ్యక్తిగత భావావ్యక్తి విడిచిపెట్టి యక్షుని తెరముసుగులో స్వీయభావప్రకటన చేస్తున్నాడని పూర్వవ్యాసంలో వ్రాశాను. కాని కవి ఇక్కడ యక్షు ప్రేమ సామాన్యమానవ సాధారణమైన ప్రేమగానే వ్యక్తీకరించాడు గాని దీనితో ఆధ్యాత్మిక సమస్యలు గాని ధార్మిక సమస్యలు గాని జతపరచలేదు. మేఘ సందేశంలో మానవసహజమైన సరళ ప్రేమ భావం చక్కగా అభివ్యక్తమై సంపూర్ణ పరిణతి పొందింది.

మేఘసందేశంలోని కాళిదాస కవితను గురించి ఇక్కడ ఒక విషయం చెప్పవలసి ఉంది. కాళిదాస కవితా స్వరూపం ఎక్కువగా నేటికాలంలో (*Lyric*) 'భావకవిత'కు సమానమైనదని కొందరు విమర్శకులు అంటారు. కాని కాళిదాస మేఘదూత ప్రేమ కవితకు ఇది సరిగా అన్వయించదు. పాశ్చాత్య విమర్శన సాహిత్యంలోని (*Classic*) సంప్రదాయ కవిత (*Lyric*) భావకవిత మొదలైన విభాగాలు మన ప్రాచీన సాహిత్యానికి అన్వయించవు. నేటి కాలపు మన భావకవితపై ఆంగ్ల భావకవితా (*Lyrical Poetry*) ఛాయలు బాగా పడ్డాయి. ఆంగ్ల భావకవితలో ఆదర్శమయ ప్రేయసీగవేషణ అత్యధికంగా కనిపిస్తుంది. అనేకమైన సాంప్రదాయిక కారణాలవల్ల ఆంగ్ల సాహిత్యంలో ఈ విధమైన దృక్పథం ఏర్పడింది క్రైస్తవమత సంస్కృతిప్రభావంవల్ల ఆ రోజుల్లోని పాశ్చాత్య సాహిత్యంలో శారీరిక సంసర్గంమీద ఒక విధమైన ఏహ్యభావం ఏర్పడింది. కేథలిక్ మతప్రాబల్యం ఉన్న దేశాల్లో ఈ ఏహ్యభావం మరింత ఎక్కువగా విజృంభించినట్టు కనిపిస్తుంది. అసలు క్రైస్తవమత సంస్కృతిలోనే శారీరిక భోగాలపై ఒక విధమైన ఏహ్యభావం ఏర్పడింది. జీసస్ సిలువ చిహ్నం ఎక్కువగా ఈ అభిప్రాయ ప్రేరకమైన చిహ్నంగా ఏర్పడి ఉండవచ్చును. క్రమేపీ ఇటీవల వచ్చిన పాశ్చాత్య వాఙ్మయ రచయితలు కొందరు ఈ భావంమీద ఒక పెద్ద విప్లవం లేవదీసి తమ రచనల్లో శారీరిక భోగానికి, కామ ప్రవృత్తికి అగ్రతాంబూలం ఇచ్చారు. డి. హెచ్. లారెన్స్ (*D. H. Lawrence*) ఈ వర్గానికి చెందిన ప్రముఖ రచయిత. అయితే ఇది బాగా ఇటీవల కాలంలో వచ్చిన తిరుగుబాటు. ఆంగ్ల భావకవితాయుగం ఉచ్చస్థితిలో ఉన్న రోజుల్లో ఈభావనాజగతీవిహారం బాగా విశృంఖలంగా సాగింది. ఆ కవితా ఛాయల్లో పడిన నేటి మన తెలుగు భావకవితలో కూడా ఆ ఆదర్శ ప్రియాన్వేషణ జరిగింది.

అయితే భారతీయ సంస్కృతిలో—తత్రాపి కాళిదాసకాలీన భారతీయ సంస్కృతిలో ఇట్లాంటి దృక్పథం ఎన్నడూ ఏర్పడలేదు. నిజానికి భార

తీయ సంస్కృతిలో చక్కని ఐహికాముష్మిక సమన్వయం కనిపిస్తుంది. మనవారు ఐహికాముష్మికాలెప్పుడూ పరస్పర విరుద్ధాలని భావించలేదు. వారు పరస్పసమన్వితమైన మానవజీవితంలో ఈ రెండింటికీ సముచితమైన సమాన స్థానగౌరవాలు ఇచ్చారు. అయితే భారతీయ చరిత్రలో ఒక్కొక్కప్పుడీ సమన్వయం మరచిపోవడము, దానివల్ల జాతికి అనేకాఘాతాలు తగలడం జరిగితే జరిగిఉండవచ్చును. అది వేరే విషయం.

మేఘసందేశంలో అంతటా మానవసహజమైన ప్రేమభావం సర్వాంగసుందరమై సహజపంథాలో నడిచింది.

కాళిదాస కవితలో వచ్చిన ప్రేమభావ పరిణతి దృష్ట్యా చూస్తే ఈ తరవాత విక్రమోర్వశీయ, మాళవికాగ్నిమిత్రాలు తీసుకోవాలి. రచనను బట్టి పరిశీలిస్తే రూపకాలన్నిటిలోను విక్రమోర్వశీయం అన్నింటికన్నా ముందు రచించిన రూపకంలా కనబడుతుంది. దీనిలో కాళిదాస కవిత యువకోద్రేకంతో ఉరకలు వేస్తూంటుంది. ఈ నాటకంలో నాయకుడు ఊర్వశిని వలచి ఆమె వియోగంలో లతలు, నదులు మొదలైనవన్నీ ఊర్వశీరూప పరిణామాలని భావిస్తూ ఉన్మత్తుడై పోతాడు. విక్రమోర్వశీయ మాళవికాగ్నిమిత్రాలు రెండింటిలోను ప్రేమ, మానవలోక పరిధుల్లోనే సంచరిస్తుంది. విక్రమోర్వశీయంలో యువకావేశంలో వెల్లివిరిసిన అనురక్తి మాళవికాగ్నిమిత్రంలో బాగా స్తిమితపడిపోయింది. ఈ నాటక కథావస్తువంతా కేవలం ఒక అంతఃపుర ప్రేమగాథ మాత్రమే. దీని రచనాకాలంలో మన కవి చీకు, చింతా లేకుండా కేవలం జీవన భోగపరాయణుడై హాయిగా కాలక్షేపం చేస్తున్నట్టు కనిపిస్తాడు.

ఈ తరవాతి క్రమంలో పరిగణింపదగినవి రఘువంశాభిజ్ఞాన శాకుంతలాలు. రఘువంశ రచనాకాలానికి మహాకవి జీవనదృక్పథంలో చాలా తీవ్రమైన పరివర్తన జరిగినట్టు కనబడుతుంది. రఘువంశ మహాకావ్యం ఉదాత్తమైన ధార్మికదృక్పథంతో రచించిన కావ్యమని వెనకటి కాళిదాస విమర్శన వ్యాసాలలో వ్రాశాను. రఘువంశ రాజులలో చివరివాడైన అగ్నివర్ణునిలో ధర్మవిరుద్ధమైన యథేచ్ఛాభోగప్రవృత్తి వల్ల, తద్ద్వారా అలవడిన రాజధర్మ పరిత్యాగంవల్ల కలిగిన ఫలితాలన్నీ కవి పాఠకులకు కళ్ళకు కట్టినట్టు ప్రదర్శించాడు. రఘువంశంలో మొదట వర్ణించిన రాజుల చరిత్రలన్నీ మహా ధర్మశిఖరాల్లాగ అత్యుచ్చ స్థితికి వెళ్ళిపోయాయి. కాని చివర బయలుదేరిన అగ్నివర్ణుడు తన రాజ్యధర్మాలన్నీ మంట గలిపివేసి నిత్యము అంతఃపుర భోగాల్లో మునిగి తేలుతూ తన రాజధర్మాలకు పూర్తిగా తిలోదకాలిచ్చాడు—చివరికి అత్యంతలాలసవల్ల ఇతని శరీరంలో రాజయక్ష్మరోగం అంకురించింది. రఘువంశంలో అనూచానంగా వస్తూన్న యౌవరాజ్య పట్టాభిషేకం జరగకుండానే అగ్నివర్ణుడీ రోగంతోనే మరణించాడు. చివరికి ఇతని రాణులలో గర్భవతి అయిన ఒక రాజ్ఞి గర్భానికి జరిగిన పట్టాభిషేకంతో రఘువంశీయుల ఆదర్శ చరిత్ర అంతిమాధ్యాయం ముగిసిపోతుంది.

అయితే ఇక్కడ కవి రాజధర్మ నిర్వహణానికి భోగలోలుపత వల్ల కలిగిన దుష్ఫలితాలు మాత్రమే ధ్వనింపజేశాడు కాని అంతకంటె విస్తృతమైన మానవ జీవితంలో, ధర్మాచరణకు, విశృంఖల భోగాసక్తివల్ల కలిగే దుష్ఫలితాలు ప్రదర్శించలేదు. ఈ విధమైన సూక్ష్మసూచన ద్వారానే సువిశాల మానవజీవిత భోగ సమస్యా పరిష్కారం కూడా కవి ధ్వనింపచేస్తున్నాడని మనం ఇక్కడ గ్రహింపవలసి ఉన్నది.

అభిజ్ఞాన శాకుంతలంలో కవి ప్రేమపరిణతి ఇంకొక విధంగా ఒక అంతస్తుపైకి వెళ్ళినట్టు కనిపిస్తుంది. మేఘసందేశంలో మిగిలిన కవి స్వీయవ్యక్తిచ్ఛాయలు మాళవికాగ్నిమిత్రంలోకి వచ్చేసరికి చాలా వరకు లోపించిపోయాయి. రఘువంశంలోను త్రాపి శాకుంతలంలోను కవి మానవజీవనంతో పెనవేసుకున్న అనురాగ సమస్యలన్నీ బాగా తటస్థుడై పరిశీలిస్తున్నాడు.

శాకుంతలంలోని ప్రేమభావం మానవలోక పరిధులు దాటి దివ్యలోకోన్ముఖమైనది. శకుంతల జనని మేనక. ఈమె గంధర్వ స్త్రీ. విశ్వామిత్రుని తపస్సమాధి లోకభయంకరంగా పరిణమించింది. దీనితో భయభ్రాంతుడైపోయిన దేవేంద్రుడు దీనిని తపోభంగం చెయ్యవలసిందని మేనకను పంపించాడు. మేనకా హావభావాలకు ముగ్ధుడై తపోభ్రష్టుడైన విశ్వామిత్రునికి శకుంతల జనించింది. తరవాత పశ్చాత్తప్తుడైన విశ్వామిత్రుడీ శకుంతలను పక్షుల రక్షణకు వదిలి తన

దారిని తాను వెళ్ళిపోయి ముక్కుమూసీ బిగించుకుని కూర్చుని మళ్ళీ తపస్సులో పడ్డాడు. తరవాత ఈమె ధర్మనిరతుడై ఆశ్రమధర్మం అవలంబించిన కణ్వుని దగ్గిర పెరిగింది. ఈ విధంగా శకుంతల పూర్వచరిత్ర పరిశీలిస్తే ఈమె జీవనాళాల్లో ధర్మధ్వంసకమైన విప్లవోద్రేక చిహ్నాలున్నాయని అనవచ్చును. కనకనే ఈమె ఆశ్రమనియమా లతిక్రమించి తనంతట తానుగా గాంధర్వ వివాహానికి అంగీకరించింది. ఇక దుష్యంతుని విషయం ప్రత్యేకంగా చెప్పనే అక్కరలేదు. ఇతని కింతకు పూర్వమే అంతఃపురంలో కొంతమంది రాణులున్నారు. ఇతగాడు మృగయావినోదసందర్భంలో మునికన్యా వ్యామోహంలో చిక్కుకున్నాడు. ఇతడుకూడా ఆశ్రమమర్యాద లతిక్రమించాడు. 'గౌతమి' వంటి వృద్ధస్త్రీ ఆశ్రమరక్షకురాలుగా ఉన్నా ఆమె ప్రేక్ష్యం లేకుండానే గాంధర్వవిధి ప్రకారం శకుంతలకు కంకణం కట్టాడు.

అభిజ్ఞాన శాకుంతలం పంచమాంకంలో శకుంతలను రాజు తిరస్కరించినప్పుడు గౌతమి రాజుతో అన్న చిన్నశ్లోకంలో కవి ఈ విషయాలన్నీ ధ్వనింపచేస్తున్నాడు:

“నాపేక్షితో గురుజన
స్త్వయానయా న పృష్టా బంధవః
ఏకైక మేవ చరితే
భణామి కి మేకైకస్య?”

“నీ వీమె వివాహవిషయంలో గురుజనుల అభిప్రాయం అపేక్షింపలేదు; ఈమె అయినా తన బంధువులను అడగలేదు. ఈ విషయంలో ఒక్కరుగానే వ్యవహరించిన మీ కిద్దరికీ ప్రత్యేకంగా నే నేమి చెప్పగలను?” అని దీని భావము. ఈ శ్లోకం ప్రస్తుత పరిస్థితి మాత్రమే గాక శకుంతలా దుష్యంతుల స్వైర గాంధర్వవిధినే తీవ్రంగా అధిక్షేపిస్తున్నట్లు ధ్వనిస్తున్నది.

ఇటుపిమ్మట శకుంతలా దుష్యంతు లిద్దరు గాఢ వేదనాపరితప్తులై పునీతులయినారు. వీరిద్దరు తిరిగి మారీచాశ్రమంలో కలుసుకున్నారు. ఇది భూస్వర్గ లోకాలకు మధ్యమార్గంలో ఉన్న దివ్యాశ్రమ ప్రదేశము. ఇక్కడ వీరి కలయిక భూస్వర్గలోకాల మంగళోద్వాహంలా మనకన్నులకు స్ఫురిస్తున్నది. ఇక్కడ శకుంతలా దుష్యంతుల ప్రేమ కళ పెళా కాగి చల్లారిన క్షీరతరంగంలాగ స్వర్ణమయమై ప్రశాంతంగా స్తిమితపడింది. వీరిద్దరికీ కలిగిన సర్వదమన భరతుడు భారత చక్రవర్తిఅయి తన నామధేయం సార్థకపరుచుకున్నాడు.

శాకుంతలం చదివి ముగ్ధుడైన గెటే మహాకవి తన శాకుంతల ప్రశస్తి కవితలో శాకుంతలంలో స్వర్గ మర్త్య లోకోద్వాహం జరిగిందని ప్రశంసించాడు. ఈ ప్రశంసకు ఈ ప్రేమపరిణామమే ప్రధానాభిప్రాయము. అనేక విధాలుగా ప్రపంచ ప్రశంసలందుకొన్న అభిజ్ఞాన శాకుంతల గౌరవానికీ, కాళిదాస కవితా మహత్త్వానికీ ఈ పరిణామప్రదర్శనం ఒక ముఖ్యకారణమని అనాలి.

ఇక కుమారసంభవ కావ్యం తీసుకుందాము. దీనిలో కాళిదాసీయ ప్రేమపరిణతికి పరమావధి కనిపిస్తుంది. దీనిలో నాయికా నాయకు లిద్దరు జగత్పితరులయిన పార్వతీ పరమేశ్వరులు. సతీదేవి దక్షాధ్వరధ్వంసానంతరం హిమవంతుని ఇంట పార్వతిగా జన్మించింది. కుమారసంభవంలోని కాళిదాసీయప్రేమ పరిశీలన గాంభీర్యం అనితరసాధారణమైనది. పార్వతీ పరమేశ్వరు లిద్దరు మానవత్వస్పర్శలేని కేవల దివ్యస్వరూపులు. కాని కావ్యంలో మాత్రం వీరిద్దరు సామాన్య మానవమాత్రులవలె కష్టసుఖాలన్నీ అనుభవిస్తున్నట్టే కనిపిస్తారు. దేవతలు మన్మథుణ్ణి ప్రార్థించి, పరమేశ్వరుని తపోభంగం చెయ్యవలసిందని ప్రార్థించారు. కాని చివరికి దేవతల ప్రయత్నం విఫలమైపోయింది. శివుని మూడవకంటి చిచ్చులోపడి మన్మథుడు భస్మమైపోయాడు. అయినా పార్వతి పట్టువిడక పంచాగ్నిమధ్యంలో నిలబడి ఘోరతపస్సు చేసింది. కామదహనంవల్ల వీరి అనురాగంలో సామాన్యమానవకామప్రవృత్తి ధ్వస్తీభూతమైపోయిందని కవియిక్కడ సూచిస్తున్నాడు. కాని చివరికి ఈశ్వరుడు బ్రహ్మచారి వేషంతో పార్వతిభావపరిశీలనం చేసి ఆమె వివాహోన్ముఖుడైనాడు. పార్వతీ పరిణయానంతరం బ్రహ్మాదులు మన్మథుని సేవ స్వీకరించవలసిందని పరమేశ్వరుణ్ణి ప్రార్థిస్తారు. మన్మథుడు మళ్ళీ నవమన్మథుడైనాడు. అయితే ఈశ్వరు డిక్కడ స్వేచ్ఛా కటాక్షంతో మాత్రమే మన్మథునికి


సేవాభాగ్యం కలిగిస్తున్నాడని కవి పాఠకులకు స్ఫురింపజేస్తున్నాడు.

అయితే ఈశ్వరుని స్వేచ్ఛాప్రవృత్తి కూడా కేవలం విశృంఖలమైనదికాదు. ఈ ప్రవృత్తికి మూలహేతువు లోక సంరక్షణమే గాని కేవలం భోగం కాదు. అయినా ఈ భోగవర్ణనకోసం కాళిదాసు కుమారసంభవం కావ్యం చివరిసర్గ అంతా ప్రత్యేకించాడు.

ఈ విధంగా కుమారసంభవంలోని భోగ వైరాగ్యాలు, మానవతిర్యదివ్యత్వాలు పరస్పర సమ్మేళనంలో తమ ప్రత్యేకతత్వాలు విడిచి అర్ధనారీశ్వర మూర్తులై అద్వైతతాదాత్మ్యంలో లీనమైపోయాయి! బహుశః ఈ అభిప్రాయం ప్రధానంగా స్ఫురింపజేయడానికే కాళిదాసు కావ్యం పరమేశ్వరభోగవర్ణనంతోనే ముగించిఉంటాడని తోస్తుంది. అయితే కథ ఇంత అసంపూర్ణంగా ముగించడంవల్ల కావ్యనిర్మాణానికి లోటు వచ్చిందని భావించ నవసరంలేదు. పార్వతీ పరమేశ్వరుల వివాహంతోనే తదనంతరం జరిగే కుమారజననము, తారకాసురవధ అవశ్యం జరగబోయే సంఘటనలుగా కవి ధ్వనించిఉండవచ్చును. కాని ఈ ధ్వని మరీ సూక్ష్మమై సద్యఃస్ఫూర్తి కలిగించడం లేదనిమాత్రం అంగీకరించాలి.

కనక నే సుప్రసిద్ధ చరిత్ర విమర్శకులు కొందరి కావ్యరచన పూర్తికాలేదని విమర్శించడం జరిగింది. కాళిదాస కవితను లోతుగా తరిచిచూచినవారికి చారిత్రిక విమర్శ యుక్తియుక్తంగా కనబడదు.

ఒక సమష్టిదృక్పథంతో పరిశీలించినప్పుడు కాళిదాసకవితలో స్ఫురించే సమస్యలు వాటి విషయంలో కవి ధ్వనింపచేసిన దృక్పథము ఈ వ్యాసంలో దిఙ్మాత్రంగా సూచించాను. కాని ఈ మహాకవి కవితలో ఇది సమస్య, ఇది కథ, ఇది రచనాసౌందర్యము అని ప్రత్యేకంగా వేరుపరిచి పరిశీలించడం చాలా కష్టము. ఇతని కవితలో ఈ విషయాలన్నీ ఒకే ఆకృతిలో నిలిచి అవిభాజ్యమైన అర్ధనారీశ్వరసౌందర్యంతో కన్నులకు మిరుమిట్లు గొలుపుతూంటాయి!



విపరిణామము

★

శ్రీ బాదరాజు రాధాకృష్ణ

నాడు ప్రాతస్సమీర గానమ్ము నిత్య
నూతనమ్మగు మంగళగీతి నాకు;
మధు మధూళీ రసప్రాయమగు నుషస్తు
షారబిందువు లమృతభాజనము లపుడు.

తామ్రపల్లవ తరుణ పత్రముల క్రింది
కర్ణికా భద్రపీఠభాగమ్మునుండి
నవ్య వాసంతవనశోభనమ్ము కూర్పు
పూర్ణసౌందర్యవతి యగు పూవునపుడు.

మధుర మధుబిందు సంపర్క మందియుంట
నవ్యలావణ్య భారావనతను నాడు;
ఈడువచ్చినదని పుట్టినింటివారు;
పాఱద్రోలి రటంచు జ్ఞాపకము నాకు!

నాడు హిందోళనమ్ముల పాడుచున్న
కామినుల గానశక్తికి కఱగి, ఏక
ధారగా జాలువాఱె కుందమ్ము; లట్టి
సంఘమరణము పెండ్లికి సదృశ మగుట!...

ప్రత్యుషఃకాల పవమాన భాషణములు
కాలు నాజ్ఞలు తెల్పు బాకాలు మాకు;
జీర్ణమై నేలపైరాలు పర్ణకోటి
యముడు పంచిన శవవాహనములు మాకు.

రక్తబంధము విడని మారందపాన
మత్త షట్పదగణము సంబంధి మాకు;
వెనుక వెనుకల మమ్ముల అనుసరించి
తిరిగిపోయెడు వేఱొక దిక్కు లేదు!

పాలుగారెడు మా దేహభాగ మెల్ల
తెల్లనెత్తురు ఏరుల తెరలె నపుడు:
కాయమును త్రుంపగల్గెదు గాని, నతుల
కలవి కాలేదు మా పరీమళము చంప!

రాలిపోవుచు రత్నగర్భకు శిరోఽభి
షేక మొనరించు మమ్ము గ్రసించి శయ్య
లందు పీడింతురే-మా పరార్థబుద్ధి
సైపరాదయ్యెనా నరజాతి కెల్ల?

కంటకమ్ములు పాదము లంటె నవ్య
నాగరీకుల నెత్తుకు లాగు ననుచు,
స్వీయ దేహాలనే తివాచీలు చేసి
కొలుదు మాజాతినే నరుల్ కూల్తురేమి?

తనకు రత్నాల తొడుగులు తాల్పుజాతి
నాశమగు వేళ కిఃకిల నవ్వునేమి
పరభృతరుతాలలో వని--ప్రకృతి యేని
కరుణఁజూపదు దీనసంఘములమీద!

భారతనారి

★

శ్రీమతి వట్టికొండ విశాలాక్షి

ఇప్పుడు ఇంతకాలానికి భార్య చనిపోవటం, తల్లి మంచానపడటం, మళ్ళీ పెళ్ళిచేసుకుందామన్నా కానిపరిస్థితులు రావటం ఏ టన్నిటి మూలానా నన్ను రమ్మని చెప్పంపుతున్నారే కాని ఇంతకు ముందెప్పుడైనా రమ్మన్నారా? ఎక్కడ గతిలేనప్పుడు నేను కావలసివచ్చా నన్నమాట. నేనుమాత్రం మనిషినికాదు? నాకుమాత్రం మానాభిమానాలు లేవా? నాకైనా జ్ఞాపకశక్తి అనేది పూర్తిగా నశించలేదే! వారు చేసినవన్నీ ఎలా మరచిపోగలను? కష్టాలవల్ల మనస్సెంత పాడైపోయినా బాధలుమాత్రం తప్పకుండా జ్ఞాపకం ఉంటవి. ఒకసారి వెళ్ళగొట్టిన తరువాత మళ్ళీ ఆ భర్తతో కలసి ఉండటం మాటలా? ఒకవేళ మనం తలవంచుకున్నా లోకం తలవంచగలదా? ఇప్పుడు కూడా లోకానికి పోళ్ళనగానే ఉన్నప్పటికీ కనీసం కష్టపడుతున్నా నవే సంతృప్తిఅయినా ఉంటుంది. మళ్ళీ మేము కలిసిఉంటే ఎంత అసూయతో ఎంత వేధించాలని చూస్తుందీ లోకం? లోకంమాట అలా ఉంచి ఎవరైనా ఒకరకమైన జీవితానికి అలవాటుపడిన తరువాత మళ్ళీ ఇంకొక రకమైన జీవితాన్ని గడపాలంటే ఎంత కష్టమో ఆలోచించండి. దుస్తులు మార్చుకున్నంత తేలికగా పూటకొకరకమైన జీవితానికి అలవాటుపడలేము. ఏకోదిశంగా గతాన్ని విస్మరించి అక్కడకు వెళ్తానే అనుకోండి. అప్పుడు మాత్రం వారు నన్ను అక్కడే ఉండనిచ్చి సుఖపెడతారని ఏమిటి నమ్మకం? అంతే! అవసరమయితే తిరిగిరావటానికి కూడా సిద్ధపడే పోవాలన్నమాట. తెలిసీ కూడా చేసేపని చేయలేనబ్బా. పోనీ మరల ఆ దాస్యకూపంలోపోయి పడేకంటే అంత తిండిలేకపోతే పదిమంది చిన్నపిల్లలకు చదువు చెప్పుకొనైనా బ్రతుకుదాం లెమ్మనిపిస్తుంది, ఒకొకసారి. కాని ఇదివరకు బ్రతికిన బ్రతుక్కి చిన్నపిల్లలకు చదువుచెప్పుకోని బ్రతకటమా? అది మాత్రం తోటి నలుగురిలో తేలికకాదు? పాతబాధలను భరించలేను. కొత్తబాధల కంతకంటే అలవాటు పడలేను. అయినా మరల అక్కడకు వెళ్ళి ఆ బాధలనుభవించేకంటే ఈ బాధలకే ఒప్పుకొని ఇక్కడే ఉండటానికి నిశ్చయించుకుందామంటే ముందు మా అన్నయ్య ఊరుకుంటాడా? తను నన్ను బాగా పోషించినా లేకపోయినా తన భార్యకు పిల్లలకు చాకిరీచేస్తూ మెదలకుండా ఇంట్లో పడుండమంటాడు. లేకపోతే మాట్లాడకుండా అక్కడికే వెళ్ళమంటాడు. అంతేగాని నేను వేరేవుండి నా అంతట నేను స్వతంత్రజీవనం గడుపుకోవటానికి ఆయన అంగీకరించలేడు. అదంతా ఆయనకు తలవంపులుగా వుంటుంది.

ఏమిటోనబ్బా! మన భారతనారీమణులను గురించి మనదేశ నాయకులంతా పెద్దపెద్ద ఉపన్యాసా లిస్తుంటారుగాని అదంతా ఎంతవరకు నిజమంటారు? 'మా భారత నారీమణులు ప్రపంచనారీలోకాన్ని తలదన్నగల సౌశీల్యాన్ని పొందియున్నారని పూర్వంనుంచీ కూడా అలాంటి సాంప్రదాయాన్నే పాటిస్తూవచ్చారనీ.........' అంటారు. అదొక్కటేనా? మా భారతదేశపు స్త్రీలు విదేశాంగ రాయబారులుగా ఉన్నారనీ, మంత్రు లయారనీ, ఇంకా ఏమేమో చెప్తారు. కాని ఈ చెప్పేదంతా మన భారతదేశపు స్త్రీలకు ఎంతమందికి వర్తిస్తుందనేదే కొంత హృదయంలో బాధిస్తుంటుంది. పైన మన దేశనాయకులు చెపుతున్నదంతా వర్తించే స్త్రీలు మనదేశంలో వేళ్ళమీద లెక్కపెట్టదగినంత మందికన్నా ఎక్కువ ఉండరు. ఏ ఒక రిద్దరినిబట్టో దేశం మొత్తం ఆ విధంగా ఉన్నదనుకోవటం ఎంత అన్యాయం? సామాన్యస్త్రీ సమాజమంతా ఏవిధంగా ఉన్నదో ఎవరివరకు వారు తమ జీవితాన్ని పర్యాలోచించుకుంటే చాలదూ?

ఎక్కడిదాకానో ఎందుకు? నావరకు నన్ను చూడండి. నేను పుట్టటమే అంతమంది ఆడపిల్లల మధ్య పుడితిని. పైగా మా నాన్న గారిది అంత స్థితి గల సంసారంకూడా కాదు. నేను పుట్టి భూమిమీద పడినప్పటినుండీ ఇంతే ననుకోండి నా కష్టాలు. అలాంటి పరిస్థితుల్లో నన్ను బాగ చదివించి విజ్ఞానవంతురాలను చేయాలనిగాని, మంచి సంబంధం తెచ్చి వివాహం చేద్దామనిగాని అనుకోటానికి అవకాశం లేదుగదా? నిజంగా నేను చిన్నప్పుడు ఎంత చురుగ్గా ఎంత ఉత్సాహంగా ఉండేదాన్ననీ. మా అన్నయ్య ఉండేవాడా ఆయన్ను నాకంటె రెండు సంవత్సరాలు ముందు బడిలోకి పంపించినా ఆయన కంటె తరువాత పోయినదాన్ని నేనే చదువులో ఎంతో ముందుకు పోతుండేదాన్ని. అయినప్పటికీ మగపిల్లవాడు ఒక్కడేకదా ఆయన్నే కొస్త అభివృద్ధిలోకి తీసుకువస్తే బాగుంటుందని వచ్చినా రాక పోయినా అవి అమ్మి ఇవి అమ్మి ఆయన చదువు కోసమైనా ఖర్చుపెట్టారుగాని నాకుమాత్రం చదువు చెప్పించలేదు. పెద్దదాన్నయిన తరువాత లోకంలో నలుగురితో పాటు ఎలాగు మంచి సంబంధం రావటం కష్టమని తెలిసి మరేమీ చూచుకోకుండా మాకంటే కొస్త ఆ స్తివిషయంలో పరవాలేదు లెమ్మని ఇచ్చివేశారీ సంబంధానికి. మాకంటే తాము పెద్ద భాగ్యవంతులమనీ, తమకు తగినట్లుగా మేము చూడలేక పోతున్నామనీ పెళ్లయిన మరుపటిరోజునుంచి మా అత్తగారు ఎప్పుడు సాధిస్తూనే ఉండేది. కొడుకు కూడా ఆ అమ్మమాటలకు తల ఊపటమే కాని మా పరిస్థితులు సరీగా అర్థం చేసుకోగలిగేవారు కారు. అక్కడికీ మావాళ్లు వాళ్ళకున్నంతలో మా అక్కచెల్లెండ్రందరినీ సమానంగానే చూస్తూఉంటూ రీ రోజువరకు. నిజం చెప్పవలసివస్తే వీళ్ళ ఒత్తిడికి తట్టుకోలేక నాకే కొంచెం ఎక్కువగా ముట్టచెపుతూ ఉంటారు. అయినా వారికి సంతృప్తిలేదు. ఆ పని చేతగాదని ఈపని చేతగాదని నన్నూ, దానిమీదగా అది పెట్టలేదని ఇది పెట్టలేదని మా వాళ్ళనూ ప్రొద్దస్తమానము తిట్టి పోస్తుండటమే పని. నిజంగా అదేమిటో గాని నన్ను నిలువునా నిలబెట్టి వెయ్యి తిట్టినా ఏదో ఒకవిధంగా సరిపెట్టుకుపోయేదాన్ని కాని మావాళ్లను మాత్రం ఒక్కమాటన్నా, తరవాత నాకెంత కష్టమైనా రానీ, ఆ క్షణానమాత్రం సహించగలిగేదాన్ని కాదు. దాని మీదట తగాదా ఇంకా పెద్దదవుతుండేది.

నాకు సాధారణంగా ఇక్కడ జరిగే తగాదాలు పుట్టినింట్లో చెప్పే అలవాటుండేది కాదు. కాని కొత్తగా కాపురానికి వెళ్ళి పుట్టింటికివచ్చిన రోజుల్లో మావాళ్లు నన్ను మరీ గుచ్చిగుచ్చి అడుగుతూఉంటే ఎప్పుడో ఒకసారి మాటల సందర్భంలో కొంచమైనా చెప్పక తప్పేదికాదు. అప్పుడు మా అమ్మ అనేది 'మనుష్యులను అంటే నీకెందుకు రోషం? నీవు మాట్లాడకుండా వూరుకో. మా ఎదుటమాత్రం అనరుగదా? ఒకవేళ అంటే మేమే చెపుతాం జవాబు. నీ ఎదుట ఏదన్నా అన్నా గానీ నీకు పట్టనట్లుగా ఊరుకో, అంతగా అయితే, నా ఎదుట అంటే ఏం ప్రయోజనం మా వాళ్లె ఎదటనే అనరాదా? అను. నీకు రోషం అని తెలిస్తే వాళ్లు ఇంకా ఎక్కువ చేస్తారు. నీకు పట్టనట్లుగా వూరుకుంటే అనీ అనీ వాళ్లే వూరుకుంటారు.' మా అమ్మ నాకీ విధంగా చెప్పటం నాకెంతో బాధగా ఉండేది. నేను తమకోసం అని నాకు ఎక్కువవుతున్న కష్టాలను కూడా సహిస్తూ తమమీద మాటపడకుండా కాపాడుతుంటే చివరకు ఇదేమిటా ఇలా అయిందనిపించేది. ఆమె అలా చెప్పటంలో అభిప్రాయం మంచిదే కావచ్చు. తమ మూలాన నేనేవిధమైన కష్టాలు పడకుండా ఉండటానికే కావచ్చు. కాని నేను సహించేదెట్లా? నేను మా తల్లితండ్రుల మెప్పు పొందటంకోసమని ఆవిధంగా రోషానికి పోతే అనుకోవచ్చు, అలాకాదుగదా? నిజంగా ఎంతో బాధపడే ఆ విధంగా వాళ్లను ఎదుర్కొనటం, మనం అత్తగారింటికి పోయి అక్కడ మన జీవితాన్ని వాళ్లమీద ఆధారపడి గడుపుతూ ఉంటాం కాబట్టి సమంజసమైనా కాక పోయినా మనల్ని ఒక మాట అనే అధికారం వారికి గాని పడవలసిన బాధ్యత మనకుగాని ఉంటుంది. ఏదో వాళ్ళకున్నంతలో కలో గంజో తాగి వాళ్లింటట వాళ్లు బ్రతుకుతున్నప్పుడు అనవసరంగా మాటిమాటికీ వాళ్లను తూలనాడుతూ ఉంటే ఏ స్త్రీ అయితే మాత్రం ఎలా సహిస్తుంది? ఎంత ఈ రోజు ఒకళ్ల చేతుల్లో పెట్టినా మనలను పుట్టినప్పటినుండీ పెంచి పెద్దవాళ్లను చేసింది తల్లితండ్రులే కదా. మన ఉనికి ప్రారంభంనుంచీ కూడా వాళ్లను చూచి సంతోషిం

చటం కానీ, వాళ్లవల్ల సుఖపడటం కాని, ఒకటేమిటి జీవితానికి కావలసిన సమస్తము వాళ్లవల్లనే కదా సమకూరింది. మనకు ఇంకొక రకమైన మనుష్యులతో పరిచయం కలగగానే ఇంకొక ఇంట్లో అడుగుపెట్టగానే పూర్వ సంస్కృతులన్నీ ఒక్కసారిగా మరచిపోవాలంటే సాధ్యమా? 'నీకెందుకు నీకు పట్టనట్లుగా ఊరుకో' అని మా అమ్మ చెప్తుంటే కాని నా క్షేమం కోరి అదెలా చెయ్యగలం? ఆమె మాకు చెప్తుంటే కాని మేమంతా ఇంత మందిమి పెరిగి పెద్ద వాళ్లమైనా ఈ రోజుకీ కూడా మా నాన్న ఏదైనా తమాషాకు మా అమ్మ— పుట్టినింటివారి నేదైనా అంటే ఆమెకే ఎంతో కోపం వస్తుంది. నిన్న గాక మొన్న కాపురానికి వెళ్లిన నాసంగతి చెప్పే దేమున్నదింకా?

మా వూరికీ వారి వూరికీ చాలా దూరం కావటానో ఏమో వారి పనులు, ఆచార వ్యవహారాలు, అభిప్రాయాలు అన్నీ మార్పుగానే వుండేవి. మేము సాధారణంగా అంట్లు తోమినా, అన్నాలు వడ్డించినా కూర్చునే చేస్తాం. మా అత్తగారు అలా కాదు. ఆమె అలాంటిపనులన్నీ వంగోని చేస్తూ వుంటుంది. నన్ను ప్రతిసారీ హెచ్చరిస్తూనే ఉండేది. 'ముసలమ్మవా ఏం కూర్చొని చేయటానికి?' అని ఒకొక సారి చాలా గట్టిగా కోపంగా కూడా చెప్పేది. కాని నా కెందుకో అలా వంగోని అంట్లు తోమబోయినా అన్నాలు వడ్డించబోయినా వీలుగా ఉండేది కాదు. మానటానికి కూడా అదోక తరహాగావుండేది. నేను మార్చుకోలేకపోయేదాన్ని, తనకు పని కావటం ప్రధానం గాని ఇవన్నీ ఎందుకా అని చాలా విసుగ్గావుండి 'మా వూళ్ళో అందరం ఇలాగే చేస్తాం' అని చెప్పేదాన్ని ఒకొకసారి. 'మీ ఇంట్లో ఏ అలవాటైతే ఆ అలవాటేనా ఏం, మార్చుకో నక్కర్లేదా?' అని కొడుకుకూడా నన్నే కసిరేవారు. దాదాపు ఇంట్లో ప్రతి చిన్న విషయం వారికి పట్టనిదింటూ వుండేదికాదు. ప్రతిదీ పట్టించుకోవలసిందే. తీర్పేమో తల్లివైపు. అక్కడ నా అన్న వాళ్లు ఎవరు లేకపోవటాన నా విషయం ఎవ్వరికీ తెలిసేది కాదు. వీలైనంతవరకు ఇంట్లో తగాదాలు బయటకు పొక్కనిచ్చేవాళ్లం కాదు. ఆ విషయంలో మాత్రం అందరం ఒకటిగానే నడుచుకునేవాళ్లం.

మేము పైకి అంతగా పోట్లాడుకోకుండా వుండటం ఇరుగుపొరుగువాళ్లకు ఏమంత బాగా వుండేదికాదు. మా తగాదాలను రెచ్చగొట్టటానికి వాళ్లు సర్వశక్తులను ధారపోస్తుండేవాళ్లు. నన్ను ఒకటి రెండుసార్లు కదలించి చూచారు కాని లాభంలేకపోయింది. మా అత్తగారి దగ్గర మాత్రం కొన్ని కొన్ని పనిచేస్తూ వుండేవి. అదంతా గ్రహించి ఎక్కువగా నేనే సరిపెట్టుకు పోతుండేదాన్ని.

ఒక పండుగకు ఇళ్ళలుక్కుంటున్నాము. పొరుగింటామె ముగ్గు గొట్టంకోసమని వచ్చి 'కోడలు వచ్చినా ఇంకా మా వదినకు అలకటం తప్పలేదే' అన్నది.

'అః తప్పద్ది, అసలు పోయిన్నాడే తప్పేది' అన్నది మా అత్తగారు. పోనీ నేను వూరికే కూర్చుంటే ఆ పొరుగింటామె అలా అమాట అన్నా ఈమె విసుక్కున్నా కొంత అర్థం ఉన్నది. నేను అడ్డాలు సర్దను, ముగ్గు వెయ్యను, కందిమొంటల మంట పెడుతూ ఒకదాన్నే వంట చెయ్యటం, ఈలోగా ఎవరైనా వస్తే అన్నాలు వడ్డించటం అమెకంటే నాలుగువంతులు నాకూ పని ఎక్కువగానే ఉన్నది. అంతకంటే ఇంకా నేను మాత్రం ఏమి చేయగలను. నేనూ మనిషినే కదా. ఎంత పనిచేస్తున్నా మాకోడలికి అన్నం వండటం కూడా చేతగాదు అని ప్రచారం చేస్తుండేది మా అత్తగారు. ఎప్పుడైనా అలా కొంచెం బయటకు పోతే సరి 'అన్నం కూడా వండవటకదా? ఏం చేస్తావు?' అని అడిగేవాళ్లు నన్ను ముఖానపట్టుకుని. కోపంవచ్చి ఆమె నన్ను ఏపనీ చెయ్యనివ్వదు ఆమే చేసుకుంటుంది అని చెప్పేదాన్ని, మొదట. తరువాత నిజమే చెప్పేదాన్ని లెండి. తిన్నదానికి సరిపోను వీలైనంతవరకు బండచాకిరి చేయించుకుందామనే దృష్టి తప్ప ఈ మనిషి ఎంతవరకు చేయగలుగుతుందా, ఏయే పనులు చేయగలుగుతుందా, అనే ఆలోచనే వుండేది కాదామెకు. మాపుట్టినింటివాళ్లు ఎక్కువ భాగ్యవంతులు కాకపోయినా బస్తీకి పక్క వూరు కావటానో ఏమో వడ్లు దంచుకునే అలవాటే లేదు. మాకు మాకే కాదు మా వూళ్ళో మాకంటే తక్కువ పరిస్థితుల్లో వున్నవాళ్ళకుకూడా ఆ అలవాటే లేదు. అందువల్ల నాకు రోకలి ఎలా పట్టుకోవాలో కూడా

తెలిసేదికాదు. ఎప్పుడైనా పండుగలకు పిండి కావలసివస్తే మరవ వేయించుకొస్తుండేవాళ్లు మావాళ్లు. ఎప్పుడైనా ఒకొకసారిమాత్రం ఇంటి దగ్గరనే పిండికొడుతుండే వాళ్లు. పూర్వం పోటు వేసిన అలవాటువల్ల మా అమ్మ, అక్కయ్యలు కొట్టేవాళ్లు. సరదాకు నేను కూడా పోయి రోకలి తీసుకుంటే నాలుగుపోట్లు వేయగానే ఎంతో సొలి వచ్చేది. వెంటనే నీకు చేతగాదులే ఎవరిచేతిమీద నవ్వు వేసేవు రోకలిఅంటూ, నా చేతులో రోకలి తీసుకునేవాళ్లు. అలాంటిదాన్ని అత్తవారింటికి వెళ్లగానే వడ్లుదంచమంటే ఏమి దంచగలుగుతాను?

నేను అత్తవారింటికి వెళ్లిన రెండవసారే యిరవైరోజులకు పదిపద్దెనిమిది మానికలు వడ్లు గుంటలోపోసి రోకలి తీసుకోమన్నది నన్ను, మా అత్తగారు తనొక రోకలితీసుకుని దంచుతూ. నా గుండెల్లో గుభేలు మన్నది. నేను వడ్లు దంచాలి. నిర్ఘాంతపోయి స్తంభాని కానుకుని అలాగే నిలబడ్డాను. అట్లానుంచుంటా వేమే? నీకు కాదూ చెప్పేది రోకలి తీసుకోమని? అన్నదామె. ఇక నీ విషయంలో నోరుమూసుకొనివుంటే లాభంలే దనిపించింది. అలాగే ధైర్యం తెచ్చుకుని గోళ్లు గిల్లుకుంటూ ఆమె ముఖంవైపు చూడటానికి కూడా భయమేసి తలవంచుకునే నాకు చేతగాదు అన్నాను. 'అదే చేతనొద్దిలే. తీసుకో. తీసుకో.' అన్నదామె మళ్ళీ. ఆచేతులోకీ ఈ చేతిలోకీ రోకలి గబగబా మార్చుకుంటూ, కాలితో వడ్లు గుంటలోకి ఎగదోసుకుంటూ. అంతటితో నాలో అదివరకున్న ఓపిక కూడా పోయినట్లయింది. రోకలి తీసుకోబోతే చేతులకు నరాలుగాని ఎముకలుగాని వున్నట్లు తోచలేదు. తప్పేదిలేదని ఉన్నవాటిల్లోకి చిన్నరోకలి ఏరి తీసుకున్నాను. ఒక వరసకూడా పూర్తిగా వెయ్యకముందే విపరీతంగా సొలివచ్చి రోకలి దింపాను. కొంచెం ఆగి కొంచెంసేపు, మళ్ళీ కొంచెం ఆగి కొంచెంసేపు వేస్తూవుంటే మొదటి సారి వేసినంతసేపు కూడా ఒక్క బిసువున వెయ్యలేకపోతున్నాను. నోరు ఎండిపోయి మంచినీళ్లు త్రాగటం జాస్తిఅయినకొద్దీ అసలు రోకలే నా స్వాధీనంలో లేకుండాపోయింది. ఇక ఏమైనాసరే తెమ్మని చేతిలో రోకలి గోడకు ఆనించిపెట్టి అరుగు కానుకుని కూర్చున్నాను.

'ఇట్లా కూర్చుంటే ఇక నాతో నలిగినట్టే వడ్లు' అన్నదామె.

'అయితే ఏంచేయమంటారు? నా కసలే అలవాటులేదు' అన్నాను. అరిచేతులు ఊదుకుంటూ.

'ఇన్నాళ్లనుంచీ చేతగాదూ నేనూ దంచిపోసిన బియ్యంవుంటే తిని కూర్చుంటిరి మరి. ఎల్లకాలం అట్లట్లా అమర్తది కూర్చొని తినటానికి. అలవాటు లేదంటే అలవాటుచేసుకోవాల. మా అందరికీమాత్రం పుట్టంగానే అలవాటైందా? ఇట్లాగే ఎయ్యంగా ఎయ్యంగా అలవాటైంది. నీకూ అంతే—' అని ఆమె అంటూంటగానే జీతగాడు వచ్చాడు. ఇకూక చిన్నదొరసాని గారి చేత వడ్లు దంపిత్తున్నట్టుందారే—అన్నాడు వాడు నా వాలకం చూచి.

'ఆఁ దంపిచ్చం ఆమెనీ నిన్నా కూర్చొబెట్టి పెడ్తాం. మిమ్మల్నందర్నీ కూర్చొబెట్టి మేము తెచ్చిపెట్టలేమయ్యా. ముందు నువ్వుకూడా రోకలి తీసుకో గబగబ ఒక వరస వేసి తరవాత కూడు తిందువుగాని—' అంటూ ఆమెకూడా రోకలి గోడకు ఆనించి పెట్టి వడ్లగుంట చుట్టూ ఊడుస్తూ లేవమ్మా లే లే అన్నది. నేనుకూడా ఒకసారి చేతులు చూచుకుని రోకలి తీసుకున్నాను.

'అబ్బ' కొరసానిగారి చేతులు ఎఱ్ఱగా ఎట్ట కందిపొయ్యినయ్యో చూడు పెద్ద దొరసానీ. పాపం బొబ్బలుకూడా పొక్కినియ్యి. అవెయ్యా అయ్యిగనక చితికితేనా? ఇకాబాద బగవంతుడికి దెలియాల్సిందే. అయ్యి చితికితే ఇక రోకలి పట్టుకోటానికే యీలు గాదుగా?—అన్నాడు వాడు. నేను అలాగే పోటు వేస్తూనే ఉన్నాను.

'ఊఁ యీలుగాకు కొట్టుద్ది మా కందరికీ పొక్కలేదంటావా? అరోగ్యం జాస్తర్యం? రొండు మూడు రోజుల్లో కాయలు గాసిపోతై, తరవాత ఇక బాదె తెలవదు.' అన్నదామెకూడా రోకలి తీసుకుంటూ.

'అయినా ఇసుమంటి పన్లు మాబోటి మోటోళ్ళం చెయ్యాల్సిందే కాని మీబోటి దొరసాంన్లు చెయ్యలేరులేండి. నాకెందుకు చెప్తారు...అన్నాడు వాడు ఉసిగా ఒక చేతులోనుంచీ ఇంకొక చేతిలోకి రోకలి మార్చుకుంటూ.

'ఏం? మీబోటి దొరసాన్లంటే. మేము మాత్రం తినట్లేదా? మీరేనా తింటుంది? పొట్ట

ఉన్నంతవరకి ఎటువంటి దొరసాన్లకైనా తప్పదు ఎటువంటి దొరగార్లకైనా తప్పదు.' అన్నదామె.

'అయినా వెనకటి కాలపోరు మీకు పోలేదు; ఏదు. ఈకాలప దొరసాన్లు ఏమనలేంది. మామట్టికి మాలోనే ఎంతో తేడా వుంటది—వెనకటోళ్లకీ ఇప్పటోళ్ళకీ. మా చెల్లెల్నొకదాన్ని పరమటిచ్చాం. ఏదో పొలము బుట్టావుంది ఒకళ్ళకి కూలికిపోకండా వాళ్ల పొలాల్లో వాళ్ళేసేసుకు బతుకుతారు గదా అని. వాళ్ల పొలం వాళ్లు ఊడ్చుకుపోను. తెల్లవారి గోంగోర తప్ప రొండోది నోట్లో పెట్టుకోటానికి దొరకదు. ఆరుగాలం అదే. ఆ తైదలు అయినా ఆరుగాలం ఎంత కాకిరీకేస్తే వస్తై. ఇప్పుడు బుట్టిన పిల్లనైనా సరే ఇట్టా దోలానికి దుప్పటికట్టి ఆ దుప్పట్లో పడేసి పొలాని కురికితే మళ్ళీ యింటికొచ్చే ఆ బిడ్డని జూసుకునేది. లేకపోతే ఒడిగట్టుకొనైనా బయలేరాల. పొలం తీసకపోయి అక్కడ ఏ చెట్టు కొమ్మకో ఒక పైపంచ కట్టేదీను ఆ పంచలో పారేసి అంటకంటే ఇంకా కొత్త వుహ తెల్సిన పిల్లల్ని కాపలా పెట్టేదీ, మనం పొలం పన్లో పడేది. ఆడోళ్లు మొగోళ్లు ఆ మాదిరిగా కట్టపడితేగాని ఆ తైద జావకూడా దొరకదు. మా చెల్లెలు మా అన్నదమ్ములమధ్దిన ఒక్కతే కాటాన కొత్త పొలము బుట్టా పంపకుండా గారాబంగానే పెంచాం చెప్పొద్దు. ఏటొచ్చీ ఇక్కడ కొత్త సుకపడిపోయిందాయ. అక్కడ రెయ్యింబవళ్లు పొలానికి తిరిగి ఎట్టికాకిరీ అంతా చేయించేటప్పటికీ సన్నాసిది క్కైపోయిందిగా. అంతకీముందు మాలో కందల్లోకీ అదే కొత్త పాయంగా వుండేది. ఇప్పుడేముంది? మామాత్రం తిన్నాలేదుగా? ఈ దొరసాన్ని జూసినప్పుడల్లా నాకదే మనసులో కొస్తుంటది—అంటూ వాడుకూడా పోటుచాలించి చెమట తుడుచుకుంటున్నాడు. నేను కొంచెంసేపు చేసి మధ్యలో ఎప్పుడో చాలించి వాడిమాటలు వింటూ అలాగే రోకలిపట్టుకొని నిలబడివున్నాను.

'ఏమమ్మ అట్టాగే నుంచుంటివేం ఇందాకట్నుంచీ' అన్నది మా అత్తగారు. 'నా యూళ్లో ఇసుమంటి పనులన్నీ ఎరగన్లేంది, ఆ దొరసానే—మేత్తది పాపం. గబగబ నేనే రెండుమూడు వరస లేసి పోతా'—అన్నాను.

నువ్వు చేసేపని నువ్వు చేసేసుద్దాం. నువ్వు కూడా ఇంట్లోపను లెక్కడ పనిరిస్తా కూసుంటావు. ఇక పదయిపోయి అన్నంతిని ఇంకొకరెట్ట పచ్చిగడ్డి తీసుకురా—అన్నదామె. వాడు అన్నం తిని పచ్చిగడ్డికి వెళ్లాడు. బొబ్బలు చితికి చేతులుమంటలు పుడుతున్నా అట్లాగే ఆ ఒడ్లు బియ్యంచేశాం. ఆ రోజు మొదటిరోజునే కాదు నా చేతులకు బొబ్బలు పొక్కటం. ఎప్పుడు దంచినబియ్యం అయిపోయి మళ్లీ వడ్లుపోసి దంచబోయేటప్పటికీ ఎప్పటికప్పుడు కొత్తగా బొబ్బలు పొక్కవలసిందే. ఆ బొబ్బలు చితికిన చేతులతోనే వడ్లు దంచవలసిందే. ఆమె చెప్పినట్లు కాయలుకాచినా బాగానే ఉండేది. ఎన్నిసార్లు దంచినా, నా చేతులు కాయలుకాచేవి కావు, ఎందువల్లనో మరి. మరీ ఆ వస్తెదంపుకు తట్టుకోలేక ఎప్పుడు మా యింటికి వెళ్దామా అనిపించేది అక్కడ వుండగా. మా యింటికివస్తే అక్కడికి వెళ్ళటం అంటేనరి భయంగా వుండేది.

చేయించుకున్నప్పుడు అలా చాకిరీ చేయించుకున్నా తీరిక సమయంలోనైనా ఎక్కడికైనా పోనిచ్చేవాళ్లా అంటే అదీలేదు. వూళ్లోనే సభలనీ, అవనీ ఇవనీ ఏవైనా జరుగుతుండేవా? ఎక్కడికీ పోనిచ్చేదికాదు. ఎక్కడికి వెళ్తే ఎవరు ఏమి నేర్పి పంపుతారో, ఎక్కడిమాట వినకపోతుందోనని భయపడుతుండేవాళ్లు. ఏవైనా ఊరేగింపులవీ వచ్చేవా కొంచెం వాకిట్లోకివెళ్లి చూద్దాం అంటే వీలుపడనిచ్చేది కాదు. సరీగ్గా ఆ బజార్లోకి వచ్చేటప్పటికే 'పాలు పొంగిపోతవి పాలు చూస్తుండు' అనో, ఏదో ఒకటి అలాంటి పనులే నాకు అప్పజెప్పి తనింకే పని మీదనన్నా అక్కడ లేకుండా వెళ్లిపోయేది. అబ్బ చెప్పుకుంటే ఒకటా రెండా. ఇలాంటివన్నైనా వుంటవి.

ఆ వూళ్ళో మహిళాసంఘం వున్నది. బయటకువచ్చి పనిచేయగలిగినవాళ్లు ఆ వూళ్లో అన్నివేల మందిలో ఇద్దరుమాత్రమే ఉన్నారు. వాళ్లు మనుష్యుల్ని కూడా మహిళాసంఘంలో చేర్పించాలని వచ్చారొకరోజు. ముందు మా అత్తగారి నడిగారు. మనకు ఆకష్టాలున్నై ఈ కష్టాలున్నై. ఇవన్నీ పోవాలంటే మనం అంతా ఒక సంఘంగా ఉంటే మంచిదనిచెప్పి ఆమెను సంఘంలో చేరమన్నారు.

'మాకు సంగాలు వద్దు, ఏమీ వద్దు మమ్మల్నిట్టా వుండనియ్యండమ్మా చాలు—అన్నదామె.

'మీ కిష్టం లేకపోతే మీరు చేరవద్దులెండి, మీ కోడల్ని అయినా చేర్పించుకుంటాం' అన్నారు వాళ్లు.

'మా కోడలొకటీ నే నొకటీనా ఏం? నేనే చేరకపోతే మా కోడలెట్టా చేరుద్ది? బలేవాళ్ళే మీరు, ఇవాళ సంగంలో చేరమంటారు, రేపు మీ మాదిరిగా ఇల్లిల్లు పట్టుకుని తిరగమంటారు. మా కయినే ఏం తెలవపులే పోండి. పోండమ్మా' అన్నది; ఆమె విసురుగా. పాపం వాళ్ళేమనుకున్నారో ఏమో. తెల్లపోయి.

అలా కోపపడితే ఎలాగండీ. మాకుమాత్రం ఏం పనిపాటల్లేక ఇలా తిరుగుతున్నామంటారా? ఇప్పుడు ఇంటికివెళ్లి మీలాగానే మీ కోడలిలాగానే అన్ని పనులు మేమే చూచుకోవాలి. ఇంకా కొంత కాలం పోతే ఇలా అనేవాళ్ళే ముందుముందుగా చేరుతారు లెండి' అని నావైపు ఒకసారిచూచి వాళ్లు వెళ్ళిపోయారు. ఎప్పుడైనా మహిళా సంఘానికి చందాలు అవీ కావలసివస్తే మా యింటిదగరనుంచీ దేనికైనా వాడు కోవటానికని తీసుకువెళ్లిన డబ్బులోజీ అప్పుడప్పుడు ఒక రూపాయి అర్ధరూపాయి ఇస్తూ ఉండేదాన్ని. అది నా పెళ్ళిఅయినప్పటికీ మళ్ళీ మా అత్తగారింట్లో ఎవ్వరికీ తెలియకుండా చాలా రహస్యంగా ఇస్తుండేదాన్ని. మనకు అభిమానం ఉన్న సంఘానికి మనడబ్బు మనం ఇచ్చుకునే అధికారంకూడా లేదన్నమాట. ఒక సంఘానికే కాదు. నా కవసరమైన ఖర్చులకు నాకుంటున్నా కూడా వారందరికీ కష్టంగానే ఉండేది అదేమిటో మరి. ఎప్పుడైనా పూలవ్వ వస్తే పిలిచి తీసుకుంటుంటే 'ఇవాళ ఏం పేరంటం వచ్చిందనో, ఏవన్నా పండగా పబ్బమా? అవి నాలుగు అయిపోయినదాకా అంతేలే' అని తనలో తనే గొణుగుకుంటుండేది. పెండ్లై ఇన్ని సంవత్సరాలైనా వారి డబ్బు దేనికి ఇవ్వకపోగా నాడబ్బు నన్నుకూడా సంతోషంగా స్వేచ్ఛగా ఖర్చుపెట్టుకోనిచ్చేవాళ్లు కాదు.

ఒక డబ్బేమిటిలే. కొత్తవస్త్రంగా వుంటే కూడా చూడలేకపోయేవాళ్లు. సాధారణంగా వారాని కొకసారి తలంటుకోవటం అలవాటు నాకు. ఇంత తొందరగా ఎందుకు అంటుకోవాలా? అని కోపం చూపిస్తూ ఉండేదామె. కుంకుడుకాయలు కొట్టుకుంటుండేదాన్నా? 'తెచ్చిపోస్తావుంటే కొట్టి పోస్తావుండండి. మీ సొంపోయిందిలే. అన్నిటికీ నేనుండగా?' అనేది. అలా ఒకసారా రెండుసార్లా? ప్రతి తలంటుకీ ఏదో ఒకమాట మార్పుతో ముత్తంపిరాద తలెంటుకు అంటుకోవాలా? అనే భావాన్నే సూచిస్తూవుండేది. అక్కడికీ వారాని కొకసారి అంటుకునే అలవాటును పది పదకొండు రోజులవరకు కూడా మార్చుకున్నాను. అంతకన్నా ఇంకా నేను చేయగలిగే దేమున్నది? ఆమె కసలు నన్ను చూస్తూవుంటేనే ఎప్పుడు ఏదో ఒకటి అన బుద్ధి అవుతూనే ఉండేది.

ఒకసారి ఇంట్లో బియ్యము పప్పు అన్నీ అయిపోయేవి. అయిపోయిన సంగతి మా యిద్దరికీ తెలుసు. అయిపోయినవని చెప్పబోతే 'అయిపోతే నన్నేం చేయమంటావు?' అనేది. అందుకని ఒకసారి పైపనంతా చేసి పొయ్యి రాజెయ్యకుండా కూర్చునేదాన్ని. 'చేతులు ముందు పెట్టు కూర్చున్నారేం? తినరా? అనేది. 'పొయ్యిమీద ఏం పెట్టేది మరి?' అనేదాన్ని. ఏమో నీవు చెపుతావో. కాజేసుకు కూచున్నవాళ్లు ఎరగరా?' అంటూ చేట తీసుకుని పొరుగింటికి పోయేది. ఎక్కడనన్నా బదులు తీసుకొస్తాను పొయ్యి రాజేసి ఉంచమని చెప్పటానికి కాబోలు ఈ ఉపోద్ఘాతమంతా అనుకుని పొయ్యి రాజేసేదాన్ని. ఇలాంటివి ఒకటా రెండా ప్రతి దినము ఎన్నో సంఘటనలు జరుగుతుండేవి.

మన బంగారం మంచిదైతే కంసాలి ఏం చేయగలడని ఒక సామెత. అలాగే అసలు చేసుకున్నవాళ్లు మంచివాళ్లైతే అత్తలు ఆడబిడ్డలు ఏం చేయగలుగుతారు? వాళ్ళ అలవాట్లప్రకారం కొన్ని కొన్ని మాటలు అంటున్నా చేసుకున్నవాళ్లైనా ఆదరంగా చూస్తావుంటే వాళ్లను చూచైనా కొంతవరకు మరచిపోవటానికి వీలుంటుంది. ఇప్పుడు వచ్చిన బాధలన్నీ చేసుకున్నవాళ్ళ దగ్గరనుంచే ప్రారంభమైనవి. అసలే అంతంత మాత్రపు సంసార మనకోండి. దానికి తగ్గట్టూ పాలను బట్టా కూడా చూసుకోకుండా,

ఏదో మస్తాలకు ఇచ్చుకుంటే వచ్చే ఆదాయాన్ని కూడా ఇంట్లోకి సరీగ్గా ఇవ్వకుండా చీట్లాటలకనీ, వాటికనీ, వీటికనీ అన్ని దురభ్యాసాలకు ఖర్చుపెట్టు కుంటూ పైగా తమలోవున్న బలహీనతలను ఇతరులలో కూడా వెదకచూడటం, ఎవరు ఏది చెప్తే అదంతా కూడా నిజమేననుకోవటం, ఇంట్లోఉన్న కాసేపు నాతో పోట్లాడుతూ కూర్చోవటం. ఇదంతా అత్త, ఆడబిడ్డలకు మాత్రం అలుసు కాదూ? లోకానికి మాత్రం అలుసు కాదా?

కాపురానికి వెళ్లిన కొత్తలో ఎక్కువ పనులు తగులుతుండేవి కాదుగాని తరువాత తరువాత ఆమె ఏమీ పట్టించుకోవకపోవటం, పనులన్నీ నేనే చేసు కోవలసిరావటం జరుగుతూ వచ్చింది. వారు నాతో సరిగా వుండకపోవటంవల్ల నైతేనేమి, ఒకవైపున అత్తగారితో పోట్లాటలవల్లనైతే నేమి జీవితమే చాలా చీకాకుగా ఉండేది. సాధారణంగా ఎప్పుడు ఏదో పనులతోనే ప్రొద్దుపోతూ వుండేది. ఎప్పుడైనా తీరిక చిక్కినప్పుడు వీటన్నిటిని గురించి ఆలోచించి ఆలోచించి మనస్సు మరీ పాడైపోతుండేది. ఆ ఆలోచనలేవీ జ్ఞాపకం రాకుండావుంటానికే ఉపయోగ పడుతుందేమోనని తీరిక ఉన్నప్పుడు ఏదైనా పుస్తకం చదవటం మామూలుగా పెట్టుకున్నాను. అప్పుడు దీపావళి దగ్గరకొస్తూ వున్నది. ఆ రోజు పండుగ పనులతో పగలంతా ఒళ్లు విరగ్గొట్టుకుని పని చేశాను. రాత్రిపూట భోజనాలైన తరువాత గదిలో చదువుకుంటూ పండుకున్నాను. ఎప్పుడైనా మా అత్తగారు చావడిలో పడుకుంటూ వుండేది. ఈ ఇంట్లో ఏమి జరుగుతున్నా ఆమెకు తెలియటానికి అవకాశం వుండేదికాదు. వారు గది తలుపులు వెట్టుకుని లోపలకువచ్చి పండుకున్నారు. నేను చదువుకుంటూనే వున్నాను.

'మా అమ్మ అంటుందంటే అనదుమరి? ఇంత ప్రొద్దుపోయినా లాంతరువత్తి అంత పెద్దదిగా వుంచితే?' అని కసిరారు.

మా అమ్మ మీరు అనంది దేనికి? నన్ను చూస్తే సరి ఏదో ఒకటి మీకు అనబుద్ధి అవుతూనే వుంటుంది— అన్నాను.

లాంతరు తగ్గించి ముందు నిద్రపో. అన్నారు. ఎందుకన్నాను.

'ఎందుకో నోరుమూసుకుని ముందురా లేచి.' అన్నారు విసుగ్గా. నేను పుస్తకం చేత్తోపట్టుకునే వెళ్లాను. నా చేతిలో పుస్తకం లాక్కుని ముందు కాళ్లు పట్టమన్నారు. అలాగే చేస్తూవున్నాను. పుస్తకం తెరచిచూచి ముఖం చిట్లించుకుని ప్రతి పుస్తకంమీద సత్యం పేరు వ్రాస్తావెందుకు? అంటూ అదోక మోస్తరుగా చూచారు నావైపు. ఆ చూపు నా మీద అసహ్యభావాన్ని స్ఫురింపచేస్తూ వున్నది. ఎందుకో నామీద నాకే జాలివేసిందా క్షణాన. నేనేమైనా తప్పు చేసివుంటానేమోనని ఆత్మవిమర్శ చేసుకోవటానికి కూడా నా మనస్సు అంగీకరించలా. ఏమి? అన్నాను వెంటనే అమాయి కంగా. 'ఏమా? ఎందుకు వ్రాస్తావని అడుగు తున్నాను. ప్రశ్నకు ప్రతిప్రశ్న కాదు నేను కోరు తున్నది జవాబు' అంటూ పళ్లునూరుతూ చూపులు తీక్ష్ణం చేశారు.

నేను వ్రాయలేదే. అది ఆయనగారే వ్రాసు కున్నారు—అన్నాను.

నీ పుస్తకంమీద అతని పేరెందుకు వ్రాశాడు? అన్నారు ఇంకా ఏమో దీర్ఘంగా ఆలోచించు కుంటూ.

ఇది నా పుస్తకం కాదు. ఆయన పుస్తకమే.

అతని పుస్తకాలు నీ దగ్గర కెందుకు వస్తవి?

ఆయన భార్య నాకు బాగా తెలిసినామె. ఆమెను ఏమైనా పుస్తకాలు ఇవ్వమంటే ఇది ఇచ్చింది.

ఇకనుంచీ ఆ పుస్తకాలేవైనాసరే ఇక్కడకు తీసుకువచ్చావంటే నేను వూరుకునేదిలేదు. ఇదే చెప్పటం. ఎప్పుడైనా మీ వూరు వెళ్లినప్పుడు వాళ్ల ఇంటికి వెళ్లినట్లు తెలిసినా ఎక్కడైనా అతనితో మాట్లాడినట్లు తెలిసినాసరే అంతటితో పోవలసిందే.

ఇదంతా ఏమిటో నాకు బోధపడటంలేదే. ఆయన చేసిన తప్పేమిటి? నేను చేసిన తప్పేమిటి?

అదేమిటో మీకే తెలియాలి. 'ఇంతకూ నీవు నేను చెప్పినట్లుగా నడుచుకో దలంచుకొన్నావా లేదా?'

'ఇలాంటి విషయాల్లో మీకు నేను వాగ్దాన

ఇవ్వవలసిన అవసరం నా కేమీ కనపడటంలేదు. పైగా ఇలాంటి వాటివల్ల లోకంలో లేనిపోని నిందలకు తావివ్వటమే అవుతుందని నా అభిప్రాయం.'

'చేసిన తప్పును దిద్దుకోవటానికి బదులు ఇంకా ఎదురు చెపుతున్నావా? సిగ్గులేక ? అతనితో మాట్లాడకుండా ఉంటావా ఉండవా ? ఏదో ఒకటే చెప్పు నాకు ఉంటాననో, ఉండననో—'అని వేలు చూపించారు.

'నేను తప్పేమీ చేయలేదు సరిగదా. దీని మూలాన తప్పుచేసినదాన నవుతా నేమోనని భయపడుతున్నాను. మీరు నన్ను ఏమిచేసినాసరే, ఈ విషయంలో మాత్రం నేనే బాగా ఆలోచించుకుని ఏదైనా నా యిష్టంవచ్చినట్లుగా నడుచుకోవలసిందే కాని ఇప్పుడు మీకు నేను చెప్పేదేమీ లేదు—అని అనీ అనటంతోనే ఏమీ ఆధారంలేకుండా నిలపెట్టిన పుస్తకంలాగా పోయి పడక్కపడ్డాను. కొంచెంసేపటికి ఎడముకాలితో ఒక్క తన్ను తన్నినట్లుగా జ్ఞాపకం వచ్చింది. అది నా జీవితంలో మొదటితన్ను. నా కింక భూమ్యాకాశాలు తెలియలేదు. నా బాధల్లో మిగిలున్నభాగం కాస్తా అయిపోయిందా రోజుతో. నా శరీరమంతా భగ్గుమండి బూడిద కాలేదు. సమయం వచ్చినప్పుడు ప్రతీకారం చేయటానికా ? అన్నట్లు ఎఱ్ఱగా కాలిన ఇనపచువ్వలాగా అయిపోయింది. నా హృదయమంతా కాలిన ఇనపచువ్వ కుండవలసినంత వేడిగా మారిపోయింది. నా కన్నులలో ప్రళయరుద్రమూర్తి తాండవమాడుతున్నట్లుగా ఆశ్చర్యంగా విశ్చేష్టితురాలనై వారివైపు చూస్తూ అలాగే నిలబడ్డాను. కళ్లవెంబడి బాష్పకణాలు నిప్పుకణాలలాగా రాలుతూ ఉన్నవి. నాకు అసలు పెండ్లికాకముందు అయిన తరువాత కూడా భర్తలు భార్యలను కొట్టటాన్ని గురించి తీవ్రంగా ఆలోచించేదాన్ని. చిన్న పిల్లలుగా వున్నప్పుడే ఎవరైనా కొడుతూవుంటే అంత అవమానంగానూ, అసహ్యంగాను వుంటుండే పెద్దవాళ్ళయిన తరువాతకూడా అంతంత పెద్దవాళ్లు అంతంత పెద్దవాళ్లను పట్టుకుని కొడుతూవుండటం తలుచుకుంటే అదొక రాక్షసకృత్యంలాగా అనిపించేది. ఎంతో సహించరానిదిగా ఉండేది. ఒక్కసారి కొట్టినతరువాత ఇంకా ఆ భర్తముఖం ఎలా చూస్తారా, అనిపించేది. ఇంకా అతనితో కలిసి వుండేదానికన్నా ఎందుకు చావరా అనుకునేదాన్ని. అవన్నీ తలుచుకుంటే అసలు పెండ్లే వద్దనిపించేది; పెండ్లి కాకముం దొకసారి. అయినా వాళ్లు కొట్టటానికి కూడా వీళ్ళ లోపాలుకూడా వుండవచ్చును గదా. అలాంటి పొరపాట్లేమీ రాకుండా చూసుకుంటే ఎందుకు కొడతారు ? తప్పు చెయ్యకుండానే వుందాం; అనుకున్నప్పుడు పెండ్లి కావాలనే అనిపించేది. నావరకు నేను పెండ్లికాకముందు అయిన తరువాత కూడా ఆలోచించి ఆలోచించీ, తప్పు చేయకపోతే కొట్టరుకదా. ఒకవేళ చెయ్యకుండా వున్నా కొడతారా, ఆ కొట్టిన రెండవసారితోనే ఆఖరుకు ఎక్కడా వుండటానికికూడా వీలులేకపోతే చచ్చైనా పోదామనే నిర్ణయానికి వచ్చాను. అంతకుముందు కొట్టకపోయినా కొడ్తాను కొడ్తాను అని చెప్పనైనా చెప్పేవారు. అప్పుడు చెప్పనైనా చెప్పకుండానే అంత పనీ చేశారు. అంతకుముందు కొడతా నన్నప్పుడల్లా 'కొడతారు, ఎందుకు కొట్టరు? కొట్టినా ఎన్నిసార్లు కొట్టొచ్చారేం!అనేదాన్ని.' ఎన్నిసార్లైనా కొడతాననేవారు. ఆలా ఎప్పుడు జరగదని ఖచ్చితంగానే చెప్పేదాన్ని.

వారి మాట కొంతవరకు చెల్లించుకున్నారు. ఇక నా మాటే మిగిలున్నది. ఏం చెయ్యటమా? అని ఆలోచించాను. ఏమి చేయవలసినదీ ఇదివరకే అనేకసార్లు ఒక నిర్ణయానికి వచ్చికూడా సమయం వచ్చేసరికి మళ్లీ ప్రశ్న వేసుకోవటంలో కర్తవ్యానికి దూరమౌతున్న నా బలహీనత కళ్ళకు కట్టినట్లు కనపడింది. నాకు తెలియకుండానే నా చిన్నప్పటి ఆలోచనలకు ఏదో ఒక గుదిబండలాంటి బాధ్యత అడ్డు తగిలింది. వారాపని చేయటానికి ఒక నిమిషంకూడా నాకు నేను చిన్నదానను గానే వున్నాను. మరు నిమిషానికే ఒక ముసలమ్మనైపోయానేమో ననిపించింది. అలాగే చూస్తూ నిలబడినానే కాని ఏమీ తోచలేదు. నా చూపులు వారి కళ్లల్లో గుచ్చినవో ఏమో 'ఏమిటా చూపు ఇంకా అనుమానం తీరలేదా? మళ్లీ తగలాలా' అన్నారు చెయ్యెత్తుతూ.

'అనుమానం నా కెప్పుడూ లేదు. మీకే అనుమానంగా వున్నది. మీరు కానిచ్చే దేమిటో ముందు

కానివ్వండి. అందర సుమానాలు తరువాత తీరుతై.' అన్నాను.

'ఇంకా పొగరుబోతుతనం పోనేలేదా?' అంటూ మళ్లీ చెంపమీద ఈడ్చి కొట్టారు. ఒక మెరుపు మెరిసి నా కళ్లు బయర్లు కమ్మినవి. అంతటితో నాతో పాటు నా ఆలోచనలు కూడా స్తంభించి పోయినవి. నాకు తెలియకుండా నేనా మంచం మీదకుపోయి ఒత్తిగిలాను.

'జాగ్రత్త! ఒళ్లు దగ్గరపెట్టుకొని బ్రతుకు' అంటూ ముసుకు పెట్టుకున్నారు వారు. మళ్లీ నాకు కొంచెం స్పృహ వస్తుండేటప్పటికి 'జాగ్రత్త ఒళ్లు దగ్గర పెట్టుకు బ్రతుకు' అన్న మాట నా చెవుల్లో గింగురుమంటూంది. ఈ మాట వారు పెడుతున్న సురకకు తాళం వేస్తున్నట్లుగా ఉన్నది. ప్రకృతి మాత్రం ఊఁ ఊఁ. ఊఁ. అంటూ విరామం లేకుండా మూలుగుతూనే ఉన్నది. ఆ మూలుగులోనే నా జీవితాన్ని గూడా ఐక్యంచేయా లనిపించింది. వెంటనే ఆ భావన పిరికితనంగా తోచింది. నేను సాధించా లనుకున్న విషయం సాధించలేననుకున్నా. తొందరపడి పుట్టినింటికి వెళ్ళినా వాళ్లు తేలికగానే చూస్తారుకదా? ఈ ఒక్క సారికీ సహించుదా మనుకున్నా. ఇంకా ఏమో ఆలోచిస్తూనే వున్నాను.

ఇంతలోకే కాకులు కాకా మంటూ గోల పెట్టటం ప్రారంభించినవి. రయ్యి రయ్యిన ఇంట్లోకి తెల్లనికాంతులు ప్రవేశించుతున్నవి. అబ్బ! తెల్లవార్లు నిద్రలేకపోయినా లేవక తప్పదుకదా ? అనుకుంటున్నాను.

'పొద్దు పొడిసినా ఇంకా లేవలేవమ్మా, ఎవరన్నా చూస్తే నవ్వి పోదురే' అని అంటూ వున్నప్పుడే మా అత్తగారు; ఏకో చప్పుడు చేస్తూ. సరే ఎలాగు తప్పేది లేదుగదా అని వెంటనే లేచి బయటకు వెళ్లాను. ఆ రోజు కూడా మామూలు పనిపాటలన్నీ అలవాటుగా చేసుకు పోతున్నానే కాని కొంచెం మెదడుతో అవసరమయ్యే పనులు పాడై పోతూనే వున్నవి. పొయ్యిమీద పప్పుగిన్నె పెట్టి పొయ్యి కెదురుగా కూర్చుని కాయగూరలు తరుగుతూ వున్నాను.

'అయ్యవొయ్య, ఇంకా ఆ దూడ బతకనేనా ? అది చస్తే మాత్రం మీకేం లే ? నాకేగా తిప్పలు' అంటూ ఆమె నీళ్లు తాగుతున్న పసిదూడను చెవ్వు పట్టుకుని అవతలకు లాగుతూ వున్నది నేను తలెత్తి చూచేటప్పటికి.

'నేను చూడలేదండీ' అన్నాను. అయితే మాత్రం ఆమె అంతమాత్రానికి వూరుకుంటుందా ?

'ఎదురుగానే వుంటే ఎట్లా చూశ్చేదమ్మా, అంతా ఉబద్రం, ఎవరన్నా ఇంటే నవ్విపోదురే, ఆయనేమో అట్లా జాస్తున్నాడు. నువ్వే మనా ఇట్లా చెయ్యి సరిపోతది. రెంకు రెండే సమకూరిసైలే. దేవుడే అట్లా సమకూరుస్తాడు కావాల, నేనెంత ఏకెలు బోకెలు యిరుసుకుంటే మాత్రం ఏం లాబం ? ఎవళ్లుజేసేది వాళ్లు జాస్తానే వుంటిరి?' అని ఆమె అంటూ వుండగానే ఈ విషయంఅప్పుడే పొరుగింటామె చెవిన ఎప్పుడు పడిందో ఏమో నిప్పుకోసం వచ్చినట్లుగా గంటె ఒకటిచేత్తో పట్టుకుని 'ఏంది ?' అంటూ వచ్చింది ఉత్సాహంగా, ఇక మళ్ళి మొదలు మెట్టిందామె పాట.

'మా పనెట్లా వుందనుకున్నావేం ? వాడే మావాన్న వున్నదికాస్తా అట్లా నాశనం జాస్తా కదిలిస్తే మీదికి దోకొస్తాడు. ఈ తెద్దేమన్నా పలకరించే యీలే లేదు.' అని ఆమె ఏమేమో సాధిస్తూ వుంటే అవి వింటూ పొయ్యిమీద పప్పుగిన్నె మాట మరిచేపోయాను.

'పొయ్యిమీద ఏం తగలేశావేం ? కాటు కంపు కొడతావుంది' అన్న దామె అప్పుడే ఆ వాసన ఎలా పట్టిందో ఏమో.

'పప్పులో ఎసరు తగ్గిపోయినట్లున్నది' అంటూ పప్పుగిన్నె మీద మూత తీసేటప్పటికి మాడిపోయిన వాసన ఇంకా గప్పుమని వచ్చింది.

'ఇంకేం తేసుకో నా పప్పు! చూసేవమ్మ చూడు. ప్రతి పని యింతే. నేను కాసేపు ఎక్కడ లేకపోతే అక్కడల్లా నాశనంగా వాల్చిందే వనుకో. రామరామ ఒక్క పనిగూడ చేతగాదు గదా ? ఆ అమ్మ ఎట్లా పెంచిందో ఏమో మరి. కని మందికొంపలమీదికి పెత్తే సరనుకుంటారమ్మ ఒకొక్కళ్లు. ఇంటి సొరంతి లేకుండా పనులుచేసే కోడళ్లని ఏ యింట్లోనన్నా చూశావటమ్మ! నువ్వు ?'

అని ఒక చెయ్యి నడుమున పెట్టుకుని ఒక చెయ్యి మూతిమీద పెట్టుకున్నది ఆశ్చర్యంగా.

'ఇప్పుడు నేనేం చేశానని నన్నింతగా సాధించటం? ఎవరికైనా పొరపాటు రాకుండా ఉంటుందా? చేసేవాళ్లెంత పాడుచేస్తున్నా బాగానే వుంటుంది. నావల్లమాత్రం ఏ కొంచెం పొరపాటువచ్చినా గొంతు పట్టుకుంటారు. అసలైనా గాని ఎక్కడో వున్న వాళ్ళ జోలి ఏమి వస్తుంది మీకు మాట మాట్లాడితే?' అన్నాను కూరగాయలు తరుగుతూనే. 'ఇట్లా ఎదురుకూతలు కూసే వాళ్లింకేం కాపరం జాస్తరమ్మ. ఇన్నిటికీ వాడు మంచాడు గాదులే. వాడే సరైనవాడైతే అంతా చచ్చినట్టే పడుండేవాళ్లు' అన్నదామె. కొడుకు ఇంకా నన్ను రాచి రంపాన పెడితే బాగుండు నన్నట్లుగా. 'పెద్దాళ్ళు ఏదయినా విసుక్కున్నా నువ్వు వూరుకుంటే పోద్దిలే అమ్మాయి' అన్నది పొరుగింటామె నాదే తప్పన్నట్లుగా.

'ఒకరి కష్టాలు ఒకరికేం తెలుస్తవిలెండి. ఎదటి వాళ్ళకు ఎన్నైనా చెప్పవచ్చు. తమదాకా వస్తే గదా తెలిసేది' అన్నాను.

'అంత ఆపె నలుసటువంటిదన్నా కనబడితే ఆ అబ్బాయైనా కాస్త తిన్నంగా వుండేవాడేమో. అదీ లేదాయె. అంతే లేవదెనా. ఒకొకళ్ళ కెన్నాళ్లున్నా తీరవు కష్టాలు' అన్నది పొరిగింటామె మా అత్తగారితో.

'అయ్యో అంతమాత్రపురాత. ఇటువంటి ముక్కాలకే అటువంటి గీతలబ్బేది. ఆ గీతుంటే మాకీ సంబంధమే అయ్యేది కాదనుకో. ఎందుకక్కడ' అన్నది మా అత్తగారు నొసలుమీద చేతితో కొట్టుకుని.

'ఎండెక్కింది పొయ్యి రాజెయ్యాల' అంటూ పొరుగింటామె వెళ్లిపోయింది.

మా అత్తగారి కోర్కెకు తగ్గట్లుగానే క్రిందటి రాత్రి జరిగిన సంఘటనవల్ల మేము ఎడముఖం పెడ ముఖంగా వుండటం ఆమెకు మరీ సంతోషమైంది. ఆ రోజునుంచీ కూడా మాటమాట్లాడితే నా మీదకు ఒంటి కాలిమీద తగాదాకు రావటం సాగించింది. ఆ సంఘటన జరగకముందు అంత ఇష్టంలేకపోయినప్పటికీ మనిషన్న తరువాత ఎవరో ఒకరితో ప్రొద్దు పుచ్చుకోవాలి కాబట్టి నాకు తోచనప్పుడల్లా నేనే వారి దగ్గరకువెళ్లి కూర్చోవటం ఏవో పిచ్చాపాటి నాలుగు ఖబుర్లు చెప్పుకోవటం జరుగుతుండేది. ఆ సంఘటన జరిగిప్పటినుండి మాత్రం వారిని చూసి బోతేనే చాలా సిగ్గుగా వుండేది. అవమానంగాను, అసహ్యంగాను కూడా వుండేది. ఎక్కువ తెలివి తేటలు, చదువు, చక్కదనము, లేకపోయినప్పటికీ అంతకుముందు అనేకరకమైనజాలివుండేది వారిమీద. తరువాత అది కాస్తాపోయింది. ఇంకా నేనే వుద్రేకంతో వారి దగ్గరకుపోయి మామూలుగా ఖబుర్లు చెప్పగలను? నామీద అపనమ్మకం ఏర్పడిన తరువాత నేను ఖబుర్లు చెప్తేమాత్రం వారు సంతోషిస్తారని ఎలా అనుకుంటాను? ఈ విధంగా నే మాట్లాడకుండావుంటే ఇలాగే అలవాటైపోయి ఇంకా ఎక్కువ ప్రమాదానికి గురికావలసివస్తుందని భయపడి ఎప్పుడైనా పూచాయగా మాటలు అందించబోయే దాన్ని. కాని వారుమాత్రం ఆ అవకాశం ఇచ్చేవారు కాదు. తమకు ఏవి కావలసివచ్చినా తమ తల్లినే అడిగి కావలసినపనులు చేయించుకుంటుండే వారు. ఆమెకూడా నన్నడగకుండా తననే అడుగుతున్నందువల్ల ఎప్పటికంటే ఇంకా ఎదురెదురుగా వుండి కొడుకు నోట్లోమాటనోట్లో ఉండగానే ఎప్పటికప్పుడు అమర్చిపెడుతూ వుండేది. ఆమె కొడుకుతో కబుర్లు చెప్పుకుంటూ కొడుక్కి కావలసినవన్నీ అందిస్తూ అక్కడే ప్రొద్దుపుచ్చుకుంటుండేది. ఆమె చేయవలసిన పనులుకూడా నేనే చేయవలసి రావటంవల్ల ఎప్పుడైనా వారికి అలా కనుపించు దామన్నా వీలులేకపోయేది. ఈవిధంగా వాళ్ల తల్లీ కుమారుల మన్యోన్య వాత్సల్యం అభివృద్ధికావటం మా దాంపత్య ప్రేమ సన్నగిల్లిపోవటం జరుగుతూ వచ్చింది.

ఒకొకసారి ఎవరైనావచ్చి ఒక్కొక్కగానొక్క కొడుకుంటే అంత ఆపెనలుసంటిదన్నా కనపడకపోయెనే పాపం! అనేవాళ్లు. వాళ్లామాట అనటంతోనే ఆమెలోఉన్న అసంతృప్తి జ్వాలలన్నీ ఒక్కసారిగా ప్రజ్వరిల్లేవి. ఆ రాతుంటే మాకీ సంబంధమయ్యేదే కాదు. అనేది ఆమె ఆక్రోశంగా. ఆమె మాట అన్నప్పుడల్లా నేనేమీ తప్పు చెయ్యకుండానే నా మీదకు తప్పులన్నీ ఇలా ఎందుకు వచ్చిపడుతున్నవో

అని చాలా విచారపడేవాణ్ని. ఆమెమాత్రం మాకు సంతానంలేదని ఎంత బాధపడేదో చెప్పటానికి వీలు లేదు. నిజంగా ఆమెకు బాధ అనేది ఏదైనావుంటే ఇదేనని చెప్పాలి. ఏ విధంగానైనా సరే తన కొడుక్కు కొడుకు పుట్టాలి, తాను ఎత్తుకోవాలి. ఆమె జీవితంలో అదేకవరకు లేకపోతే చేసిన శ్రమలైతేనేమి, అనుభవించిన బాధలైతేనేమి అన్నీ వ్యర్థమేనని ఆమె నమ్మకం. అందుకోసం ఆమె ఏది చేయటానికైనా జంకదు గొంకదు. ఈమా ఎడబాటును ఆధారం చేసుకుని ఆమె కొడుక్కు నూరిపోయవలసినవన్నీ నూరిపోసింది. ఇక నది మీకు కాపరం చేయదనే కాదు, ఇక దానికి పిల్లలు పుట్టరనేకాదు, భార్య మీద భర్తకు విరక్తి కలగటానికి ఏవేవైతే అవసరమో అవన్నీ రంగరించిపోసింది. కొడుకు ఆ తల్లి మాయ మాటల్లోపడి నాతోవున్న సంబంధం ఇంకా ఎడమై పోసాగింది. నేనా ప్రమాదాన్ని గుర్తించకపోలేదు. నేనీ ఇల్లు దాటిపోతే సమాజంలో నాకుండే స్థానాన్ని తెలుసుకోకపోలేదు. అయినా చేయగలిగినంతవరకేకదా నేను చేసేది. ఏ మానవుడైనా ఎలాంటి పరిస్థితుల్లోనైనా తనకున్న సర్వశక్తులను వినియోగించుకోవగలడే కాని అంతకన్నా ఏం చేయగలడు? ఆ రాత్రిమాత్రం ఏదో ఒక అభాండమైన నేరాన్ని నా నెత్తిమీద మోపవస్తే అప్పటికింకా నిజంతో కూడుకున్న నా నిర్మల హృదయాన్ని బూటకపు లౌకికచ్ఛాయలు ఆవరించకపోవటాన ఉన్నదున్నట్లుగా నా హృదయంలోని విషయాన్ని విప్పి చూపించి సత్యంతో నా కేలాంటి సంబంధము లేదనీ, మాట్లాడకుండా వుండవలసిన అవసరం నాకేమీ కనిపించటం లేదని, అంత గట్టిగా చెప్పానే కాని ఇంతదాకా వస్తుందనుకున్నానా? పోనీ అప్పుడేదో ఆ క్షణాన అలా అన్నానే అనుకోండి. తరువాత ఎంత ప్రయత్నం చేశాను. వారి మనస్సును మామూలు పరిస్థితుల్లోకి తీసుకురావటంకోసం? తను పలుకరించక పోయినప్పటికీ ఏదో ఒకవంక పెట్టుకుని నేనే పలకరించినప్పటికీ పలికేవారు కారు. ఒకొకసారి నేను మంచినీళ్లు తాగుతూవుంటే వారికే జాలయ్యేదో ఏమో నాకుకూడా ఇవ్వు అనేవారు. ఏముందీ సిగ్గ లేకపోతే సరి. అంత పెళ్లాంతో మాట్లాడకుండా వుండలేని వాళ్లు మూడురోజుల కొకసారి గూపులు చేసుకోవటం ఎందుకు మరీ—అని ఆమెలో ఆమె గొణుక్కుంటూ వుండేది. అలా అనగానే వారు అడిగితేమాత్రం నేనెందుకిచ్చానా అనిపించేది. వారికెలా వుండేదో ఏమో మళ్ళీ కొన్ని రోజులవరకు ఆ మంచినీళ్లు కూడా అడిగేవారే కాదు. ఆ రోజుల్లో రాత్రిళ్లు గడపటం మరీ కష్టంగా వుండేది. ప్రొద్దు క్రుంకుతూవుంటే సరి భయంగా వుండేది. ఎప్పటిలాగే ఇద్దరం ఒక గదిలోనే పండుకుంటుండేవాళ్లం. ఎరగనివాళ్ళకు మేము బాగానే వున్నట్లు కనపడేది. మేము మాత్రం మాట్లాడుకోనైనా మాట్లాడుకునే వాళ్ళం కాదు. సాధారణంగా ఎప్పుడూ వూళ్లోనే వుండేవారు కారు. ఉన్నప్పుడైనా అలాగే జరిగేది. నేనే ఒకొకసారి బ్రతిమలాడేదాన్ని. ఒకొక రాత్రి మరీ పట్టుపట్టి అడిగేదాన్ని నామీద మీకంత కోపం ఎందుకని. వారినుండి ఏమీ జవాబే వచ్చేది కాదు. అయినప్పటికీ ఏదో ఒకటి చెపుతూనే వుండేదాన్ని.

'నేను సత్యంతో మాట్లాడకుండా వుంటానని మీకు వాగ్దానం చెయ్యలేదనా? సరే అలాగే చేస్తాను లెండి. మనం ఇలా చెయ్యటంవల్ల మనం ఇతరులకు లేని అనుమానాలకు తావిచ్చినవాళ్ళ మౌతామని ఆరోజు మీకు వాగ్దానం చేయలేకపోయాను గాని ఏమీ లేదు. ఆయనతో మాట్లాడకుండా వుండటమే కాదు మా వూరే వెళ్ళటం మానెయ్యమన్నా మానేస్తాను. మనస్ఫూర్తిగా చెపుతున్నాను. నేనింకప్పటికీ సత్యంతో మాట్లాడను.'

అని అంటూంటే ఎందుకో నా గొంతు వణక సాగింది. నేను గుడ్డిగా ఏపని పడితే ఆపని చేయటానికి తయారవుతున్నా నేమో అనిపించి శరీరమంతా చెమటలు పట్టిపోయింది. నేనలా వాగ్దానం చేయటానికి లోపల బాధపడుతున్నా ననుకున్నట్లున్నారు.

ఇకముందు నీవు నా ఎదుట ఎలాంటి వాగ్దానాలు చేయవద్దు. నాకు నిజంగా నీతో జీవితం గడపాలని లేనే లేదు. నీవు ఉన్నా ఒకటే పోయినా ఒకటే నాకు. ఇంకా పోతేనే శ్రేయస్సును చేకూర్చినదానవౌతావు. — అన్నారు. నేను తప్పు చేశానో లేదో తెలుసుకునే సమర్థతైనా వుండాలి మనిషిలో. లేకపోతే ఒకవేళ చెడి వుంటానని అనుమానమే వుంటే నా తప్పును దిద్దటానికైనా ప్రయత్నం చేయాలి. అదీ ఇదీ కాకుండా

ఏదో ఒక నేరాన్ని పైన వేసి బయటకు నెట్టాలని చూచేవాళ్లలో ఇంకా నేనెందాకా కలసివుండగలను. ఇవతలకు వచ్చినా తిప్పలే నన్న ఉద్దేశంతో అక్కడే వుందామని ప్రయత్నం చేయటమే కాని నా కసలు ఆమనుష్యులన్నా, ఆ ఇల్లన్నా విరక్తి కలిగింది. ఏమైనా సరేనని అలాగే జీవితాన్ని గడుపుతూ వున్నాను.

ఒక రోజు ఉదయం భోజనాలైన తరువాత మా అత్తగారు ఎక్కడికో బయటకు వెళ్లింది. వారు నా మెళ్ళో గొలుసు ఇవ్వమన్నారు. ఎందుకన్నాను.

ఎందుకేమిటి తీసి ఇవ్వక—అన్నారు.

అంత చెప్పకూడదా ఏమిటి?—అన్నాను.

అప్పులున్నవి కావాలి.

అయితే మా అమ్మను రానివ్వండి ఆమెకూడా ఇవ్వమంటే ఇస్తాను. లేకపోతే [illegible] మెప్పు కోసం ఇచ్చిందంటుంది. నా కెందుకు వచ్చిన గొడవ ఇదంతా ?

మా అమ్మ ఏదన్నా అంటే నేనే తీసుకు వెళ్లానని చెప్పు. దీనిలో మా అమ్మ పెత్తనం ఏమున్నది ? నీవే మర్యాదగా ఇస్తావా లేక నన్ను చెయ్యి చేసుకోమంటావా—అని గదిమారు.

మీకు అప్పులుంటేనా గొలుసు కాకపోతే ఇంకేదైనా అమ్మకోకూడదా ? మీరు ఇంటిఖర్చుల కోసం ఏమి వాడారని మీకు ఇన్ని అప్పులైనవి ? అనవసరంగా ఇంత బంగారం తీసుకు వెళ్లి నాశనం చేస్తానంటారేం ? నాకు మాత్రం చేతులమీదగా ఇవ్వటానికి ప్రాణం ఒప్పటంలేదు...—అన్నాను.

బాగా ఎదురు మాట్లాడటం నేర్చుకున్నావే—అంటూ తలమీద ఒకదెబ్బ కొట్టి గొలుసు లాక్కున్నారు. నాకళ్ళంబడి నీళ్లు బొటబొట కారినవి.

ఇంకా ఏడుస్తున్నావా సిగ్గులేక. ఇదివరకు అనేదానవుగా—ఎన్ని సార్లు కొడ్తారో కొట్టమని, ఇప్పుడేం చేస్తున్నావ్ ఏడుస్తూ కూర్చోలా ? అంటూ చెప్పులు తొడుక్కు వెళ్లిపోయారు.

అప్పుడు పూర్తిగా తెలిసిపోయింది భార్య తప్పు చెయకపోయినా భర్తకు ఈ సంఘంలో కొట్టే అవకాశం ఉన్నదని. అంతకుముందు నాకు నేను ప్రత్యేకంగా చూచుకున్నాను కాని తరువాత మాత్రం అదొక అలవాటుగా అప్పుడప్పుడు భర్తల చేత దెబ్బలు తినే స్త్రీలల్లో నేను ఒకదాననైపోయాను గదా; అనుకున్నాను. నా జీవితం ఈవిధంగా అవుతుందని ఎన్నడూ అనుకోలేదు. అన్ని విధాల అనుకూల దాంపత్యంలో ఉన్నా సంతోషసౌభాగ్యాలు లేకపోవచ్చుగాని, అన్ని విధాల నాకంటే తక్కువ పడిఉన్న భర్తచేత అవమానింపబడటం మాత్రం అసంభవమనిపించేది. నేననుకున్నదంతా వ్యతిరేకమైనదీనాడు. ఇలా జరిగిన పక్షంలో చేయాలనుకున్న పని అంతకంటే చేయలేకపోతున్నానే. భర్త నిలవనివ్వకపోతే పుట్టింటికి వెళ్లితే అక్కడ గౌరవ మర్యాదల సంగతి తెలిసే వున్నా మరీ నీచమైన బాధల నుంచి తప్పించుకోటానికైనా పుట్టినింటికి వెళ్ళవచ్చు. కాని సంఘం? సంఘంలో ప్రతి మనిషి తను పడుతున్న బాధలే అందరు పడాలని కోరుతూ వుండటం సహజం. తమకు ఆత్మాభిమానాన్ని కాపాడుకోటానికి సాహసం లేకపోగా ఎవరైనా అలాంటి పనికి పూనుకున్నా వాళ్ళను తిప్పి తమ స్థానంలోకి తీసుకువచ్చేదాకా నిద్రపోరు. అబ్బ. ఏమి సంఘం? నిజంగా ఈ సంఘాన్ని తలచుకుంటే చిత్రవధ చేసే ఫాసిష్టును చూచినంత భయంగా ఉంటుంది.

భర్త ఇష్టమైనవాడైనా సరే కాకపోయినా సరే జీవితాన్ని సమర్పించవలసిందేనని శాసిస్తోంది సంఘం. ఇంతకంటే ఘోరం ఏమున్నది? భర్తంటే ఏమాత్రం ఇష్టంలేనట్లు తెలిసినా స్త్రీని సంఘం నీచురాలుగా చూస్తుంది. భర్త భార్యకు గానీ, భార్య భర్తకు గాని దేనికోసమో అదంతా సంఘాని కవసరం. ప్రతి స్త్రీకి ఒక భర్త కావాలి. భర్త చెప్పినదల్లా భార్య చేసి తీరాలి. అలా చేస్తున్నప్పటికీ భర్తకు ఏ ఇతర కారణాలవల్లనైనా సరే కోపంవచ్చి తిట్టినా కొట్టినా కూడా కిక్కురుమనకుండా భర్త పాదాలక్రింద ప్రాణాలు వదలవలసిందే. ఇది సంఘాదర్శం. ఈలాంటి సంఘాదర్శాలలో దారి తెన్ను కానలేక జీవితాన్ని విరమించుకుందామన్నా దానికీ సంఘమే నిందిస్తుంది. 'కాదు కాలంతో వుంటే కన్య ఎదురు చూస్తూ వుంటుందనీ, అదిపోతే దానంటివాళ్లు లక్షతొంభైమంది వస్తారు, చచ్చి ఎవర్ని సాధించాలనుకుందో అనీ, లోకం ఇష్టంవచ్చినట్లుగా ఆడిపోసుకుంటుంది. ఏమి చేయటమా అని ఆలోచిస్తూ ఉన్నాను.

పొద్దుగూకినా ఇంకా పనిలో ఏలన్నా పెట్టక పోతే ఎప్పుడెపుద్దమ్మా. మరీ బూటకంగా ఉండే —అని అంటున్నది కూర్పింట్లో మా అత్తగారు. 'గొలుసు అడుగుతుంది కాబోలు ఏమి చెప్పినా భగవంతుడా అనుకుంటూ బయటకు వచ్చాను.

వాళ్ళమ్మాయి పేరంటానికి పోతుందట కాసేపు నీ గొలుసు ఎరువివ్వవే—అన్నదామె. నేనేమీ మాట్లాడకుండా గోడకానుకుని అలాగే నిలబడ్డాను.

పాపం నుంచోనుంటే మాట్లాడవేమే. ఇంత

లోకే అరిగిపోద్దా ఏం? అన్నది మళ్ళీ. లేదన్నాను గొంతు పెకలించుకుని.

లేదు ఏమైందీ—అన్నది ఆదుర్దాగా.

అప్పు ఉన్నవట కావాలని నేనివ్వనన్నా కూడా బలవంతాన తీసుకెళ్లారు.

ఎవరు వాడేనా తీసుకెళ్లింది. అయ్యొయ్యొ, ఇంకా నేనేం చేద్దునే, నీ కట్టా చేతులొచ్చినియ్యే వాడి కియ్యటానికి? నేనింకా చావలేదుగా? బతికే వుంటినిగా, నాతో మాత్రం అనగూడదటే, కొంప నిలువునా ముంచితివిగదే. అన్నదామె గుండెలు బాదుకుంటూ, కాసేపుండి తెప్పరించుకుని—ఎంత సేపైందే—అన్నది మళ్ళీ.

చాలసేపైందన్నాను. 'చాలా సేపైందీ? చాలా సేపైందంటే చాలాసేపైంది. ఎంత ఒయ్యారంగా చెపుతున్నదో చూడు చాలసేపైందని. అవున్లే ఒయ్యారంగాక మీకేమమ్మా. నీదేం పోయిందిలే నీ అబ్బగాడి సొమ్మైతేగా. నాకేం నాది కాదుగదా పోతే పోయిందనుకున్నావు. ఇంతే చాలు అడగనే అడిగాడు నా మొగుడేగదా అని ఎగిరి గంతేసిచ్చావు. ఇట్లాగన్నా వాడి మంచి సంపాదించుకుందామని చూశావు. అదే కనక మీ అయ్య చేయించి పెట్టినవైతే ఊరంతా ఒక్క కొలిక్కి తీసుకురాక పోయావు. ఇక తిండురుగాల్లే ఉండండి' అంటూ 'ఇక నువ్వ పోమ్మా. మా యింట్లో గొలుసులుండే రోజులు రాలేదు లేవంద ఎందుకు? ఒకొక్క మహాతల్లి పాదం పెట్టిన నక్షత్రం అటువంటిది. ఈ మహాతల్లి మా యింట్లో ఎప్పుడైతే అడుగుపెట్టిందో అప్పట్నుంచీ అన్నీ వరసన ఊడ్చుకుపోవటమే. అప్పుడే అయిందీ మా పని. ఇంకెంత ఊడ్చుకుపోవాలో. ఒకొక్క గొడ్డొచ్చిన యాళ బిడ్డొచ్చిన యాళ అంటారిదే కావాల. నా కూతుళ్లు ఎక్కడ పాదం పెడితే అక్కడల్లా బంగారం అయివూరుకుంటుందంటే. ఇంత దరిద్రపు మొకందీ, గొడ్డుబోతుదీ మా కెక్కడ దాపరించిందో మరి' అంటూ యీ వరసన ఒకటే పాట పాడటం మొదలు పెట్టిందామె. ఎంతసేపు చూచినా వూరుకుంటుందేమో అంటే వూరుకోదు. నాకు విసుకు వచ్చి, తిట్లాటలు, శాపన్లు, తిరుగుళ్లు అన్నీ కప్పిపెట్టి, నా గొంతు కోసిందికాక పైగా నాకు బదెందుకు ఎప్పుడు అట్లా ఏడుస్తారు? అంటూ లోపలకు పోయి పండుకున్నాను.

ఆ రోజునుంచీ మరీ కక్ష పట్టిందామె నామీద. ఇక ఆ ఇంట్లో నాకొకనిమిషం ఒకయుగంగా గడుస్తూ ఉన్నది. ఎన్నాళ్లు చూచినా వారు ఇంటికే రాలేదు. వారసలు నామీద అలా అనుమానపడటానికి కారణం ఆ తిరుగుడే ననుకోండి. అక్కడ ఒకావిడ ఉన్నది. తాను వారిని పూర్తిగా తన స్వాధీనంలో వుంచుకోటానికని కల్లిబొల్లి ఖబుర్లన్నీ కల్పించినిషా ఎక్కిస్తూ వున్నది నామీద విరక్తి కలిగించటానికని. ఇంటికి వస్తే తల్లి కూడా అలాగే నూరేది. అసలు మనిషిలో స్వయంగా ఆలోచించుకో గలిగిన శక్తి లేకపోవటం వల్లనే ఇలాంటి ప్రమాదాలకు గురి కావలసివస్తూ వున్నది. అక్కడకు వెళ్లి వచ్చారంటే సరి ఏదో ఒక తగాదా తీసుకురావలసిందే. అక్కడకు వెళ్లి వచ్చినప్పుడల్లా ఏదో ఒక తగాదా జరుగుతూ వుందని ఎక్కడికి వెళ్లి వస్తున్నా సరే, ఆ చెప్పుల మోత వినపడితే చాలా భయంగా ఉండేది. ఒకొకసారి ఆ చెప్పుల అడుగులు నా హృదయంలోనే పడుతున్నంత బాధగా ఉండేది. వీరు వస్తారంటే భయంగానే వున్నప్పటికీ ఇంట్లో పోరు మరీ ఎక్కువై పోవటాన వారు వస్తేనైనా కొంత పోరు తగ్గిపోతుందేమోనని ఎదురు చూస్తూ వుంటే ఎంత కాలానికీ రానేలేదు.

ఏమీ తోచక మళ్ళీ పుస్తకం చదువుకుంటున్నాను. ప్రక్కనే ఇంకొక పుస్తకం వున్నది. కాసేపటికి పొరుగింటి అమ్మాయి వచ్చి నా ప్రక్కనే కూర్చున్నది. నేను చదువుకుంటున్న పుస్తకం మూసేసి ఏమిటమ్మాయి అన్నాను. ఏమీలేదు వూరికే వచ్చాను. మరే, ఇప్పుడే మేము కాపీ రాస్తున్నాంగా? అన్నది. 'ఊఁ సరేలే' అన్నాను. మళ్ళీ నేను చదువుకుంటున్నాను. ఆ అమ్మాయి కొంచెం సేపుండి లేచిపోయినట్లుంది. నేను మరల రెండవ పుస్తకం తీసి చదువుకుంటున్నాను. అంతలో చెప్పులు కూడా చప్పుడు చెయ్యకుండానే ఒక్కసారి లోపలకు వచ్చారు వారు. నేను ఉలిక్కిపడి లేచి నిలబడ్డాను. నా చేతిలో పుస్తకం తీసుకున్నారు. 'నీ కెన్నిసార్లు చెప్పాల? బుద్ధిలేదు? చదివిన పుస్తకమే ఎన్నిసార్లు చదువుతావు? కనీసం వాడి పుస్తకమైనా చూడకుండా ఉండలేవన్న మాట. నాతో నీవు ఎన్ని మాయమాటలు చెప్పావు? ఇక అతనితో మాట్లాడననీ, మా వూరికి కూడా పోననీ చెప్పలా? నన్నవతలకు పోనిచ్చి మళ్ళీ ఇదేంపనీ? అసలు నీ మనసులో లేకుండా వుండాల గాని నిర్బంధంవల్ల నీ అలవాట్లను

ఎందాకా మాట్నకో గలవుతే—అన్నారు ఒక్క సుక్కన.

చదువుకోడాని కింకేమీ పుస్తకాలు లేకపోవటాన, మాట్లాడటానికి కూడా ఎవ్వరు లేకపోటాన చదివిన పుస్తకమే చదువుకున్నాను కాని అంతకంటే ఏమీ లేదు. అంత మంచి ఆయనమీద కూడా ఎందుకు వేస్తారు నిందలు—అన్నాను సహించలేక.

అవును ఇష్టమైతే సరి అల్లాగే ఉంటుంది. వాడు అంత మంచివాడేం ఈ రోజునుంచీ నీ వసలు నా కళ్ళకు కనపడ్డావంటే ప్రాణం తీస్తా. నీ మనస్సంతా ఎవడిమీదనో పెట్టుకుని నాతో బాసుంటున్నట్లుగా నటించుదా మనుకుంటున్నావు కాబోలు. అవన్నీ నాదగ్గర సాగవు. పో ముందు—అంటూ బయటకు నెట్టారు. నే నింకో గదిలోకి పోయి వెక్కి వెక్కి ఏడుస్తున్నాను.

ఏంచ్ ఇట్రా...అన్నారు మళ్ళీ గద్దిస్తూ. నేను వెళ్ళకపోయినా వారైనా వచ్చేటట్లున్నారని నేనే మళ్ళీ ఆ గదిలోకి వెళ్ళాను, పెద్దపులి బోనులోకి పోతున్న మేకపిల్లలాగా.

[సశేషం]



చిత్రకారుడు: శ్రీ బంకిం సర్కార్. శాంతినికేతనం

కలగూరగంప

నన్నెచోడ కవికాలము— ఒక మనవి

నన్నెచోడకవి నన్నయకంటె ప్రాచీనుడని శ్రీ మానవల్లి రామకృష్ణ కవిగారును, కీ. శే. నడకుదుటి వీరరాజు పంతులుగారును చాల కాలము క్రిందటనే చెప్పియుండిరి. తరువాతి పరిశోధకులు ఈ కవిరాజ శిఖామణి నన్నయకు తరువాతి వాడనియే నిశ్చయించుచు వచ్చిరి.

ఇటీవల శ్రీ దేవరపల్లి వెంకట కృష్ణారెడ్డిగారు తాను పది సంవత్సరముల కాలములో చేసిన పరిశోధనకు ఫలముగా 'నన్నెచోడకవి చరిత్ర' అను పేర విపుల విమర్శ గ్రంథము వ్రాసి నన్నెచోడుడు నన్నయకు కొంచెము పూర్వుడును, సమకాలికుడును కావలయునని నిరూపించిరి. దానిలో వారు పెదచెరుకూరు శాసనమును, నన్నూరుపాడు శాసనమును, కుమార సంభవాంతర్గతములగు కొన్ని పద్యస్థ కాలములను ఆధారముగగొని కవిరాజ శిఖామణి నన్నెచోడుడు క్రీ. శ. 1028-58 ప్రాంతపువాడని సిద్ధాంతీకరించిరి.

అంతట శ్రీ వేటూరి వెంకటరమణయ్యగారు 1951 సెప్టెంబరు భారతిలో 'నన్నెచోడకవి కాలము—ఒక సూచన' అను వ్యాసమున నన్నెచోడుడు నన్నయకంటె ప్రాచీనుడను తమ నమ్మకమును దృఢపఱచు కొన్ని విషయములు చెప్పి నన్నెచోడుడు క్రీ. శ. 940—76 ప్రాంతపు వాడని చెప్పుచున్నారు. ఆ విషయములందు నాకు తోచిన సందేహముల నిట తెలుపుకొనుచున్నాను.

బద్దెన:

బద్దెన నీతిశాస్త్ర ముక్తావళిభాష, దత్తమండల భాషయనియు, కమ్మనాటి తెనుగుభాష కాదనియు శ్రీ వెంకటరమణయ్యగారు సూచించి యున్నారు. కమ్మనాటి బొప్పిడి శాసనమందలి 'జటాచోడ' వంశములో 'నన్నిచోడ [న్నృ] ధీః' అను వ్రాత యొకటున్నట్లు కనిపించుచున్నది. ఆ శాసనము సూదని పాడు దానమును తెలుపుచున్నది. ఈ 'నన్నిచోడ సుధీ' పండిత కవి మాత్రమే గాక దాత, రాజుగా గూడ నున్నాడు. 'శాకే—నిధి తిథి వ్యోమ క్షమా సమ్మితే' అనగా. ఇది శా. శ. 1009 (క్రీ. శ. 1087) కాలము అనుచున్నది. కాని ఈ నన్నచోడ సుధీ తండ్రి పేరు శాసనములో స్పష్టముగా లేదు. బల్లరాజని చెప్పుట కవకాశము లేదు. పైగా ఈ 'సుధీ' కమ్మనాటి నివాసి. కనుక ఇతడు కుమార సంభవ కర్తయగు పాకనాటి నన్నెచోడకవి కాడు. ఇతడు నన్నెచోడనరేంద్రుడను బద్దెనకవియగు నేమో తెలియదు. నీతి పద్యములు రచించిన బద్దెనకు 'నన్నెచోడ నరేంద్రు'డను నామాంతరమున్నట్లు బద్దెన నీతి పద్యమకుటము వలన దెలియుచున్నది. కాన శతక కర్త బద్దె భూపతియు, శాసన దాత నన్నెచోడ సుధియు ఒక్కరే యనుటకు వీలున్నదో లేదో పరిశీలింపవలసియున్నది.

మల్లప్రభువు

నన్నెచోడుడు తన కుమార సంభవములో

'...జంగమ మల్లయ పేర సప్తసం
తానము లొప్పనిల్పుడు ముదంబున
దత్ప్రభు నాజ్ఞ పెంపునకా.'

* * *

"గురువున కిష్ట దైవమునకున్ బతికిన్
 గృతి చెప్పి పుణ్యమున్
పరమును దేజమున్ బడయ
 నమ్మ జగంబుల నిశ్చయంబు మ
ద్గురువును నిష్ట దైవమును
 గూర్చు నిజేశుడు దానవారిగా
కొరవకు నిట్లుపేరుగానె
 యొక్కట లాభము లెన్నియున్నియున్."

అనియు చెప్పియున్నాడు. ఇందలి గురువు, ఇష్టదైవము, నిజేశుడు అను పదముల మూలమున 'మల్లయ్య' అను గురునామ సామ్యమును గ్రహించి శబ్దశక్తి ధ్వని మూలమున గురువు జంగము మల్లయ్య, ఇష్టదైవము శ్రీశైల మల్లయ్య, నిజేశుడు త్రైలోక్య మల్లయ్య అని శ్రీ రెడ్డిగారు నిరూపించిరి. పై పద్యములో 'నిజేశ' విషయమున కనుకూలముగ సాక్ష్యమిచ్చు 'సోమ మనుష్యరూప...మల్లికార్జునున్' అను సోమేశ్వర త్రైలోక్య మల్లయను శ్రీ రెడ్డిగారు చూపిరి. దీనివలన నన్నెచోడుని కాలములో నున్నవాడు సోమేశ్వర త్రైలోక్య మల్లయ్య అనియే తలంపవలయును. కవి తాను తొలుత చేసిన ప్రతిజ్ఞకు అనుకూలముగ గూఢ వస్తుమయ కావ్య నిర్మాణమందు కృతకృత్యుడైనట్లు శ్రీ రెడ్డిగారు నిరూపించిరి. గూఢ వస్తుధ్వని చూపుట ప్రాచీనాలంకారిక సమ్మతము.

శ్రీ వెంకటరమణయ్యగారు తన వ్యాసములో 'త్రైలోక్యమల్ల' పదము బిరుద నామముగాని వ్యక్తి నామము కాదనియు, 'త్రైలోక్యమల్ల' బిరుదునుబట్టి 'సోమేశ్వర' వ్యక్తిని ఊహించుటకు వీలులేదనియు, కళ్యాణీ చాళుక్యులకు పాకనాటి తెలుగు చోళులు సామంతులు కారనియు, వైదుంబ వంశజుడగు భువనత్రినేత్రుడనువాడు నన్నెచోడుని సంహరించి క్రీ. శ. 972 లో పాకనాటిని ఆక్రమించియుండు ననియు, నన్నెచోడుడు ధ్వనింప జేసిన 'నిజేశుడు' పూర్వ చాళుక్యరాజగు ఇమ్మడి యుద్ధమల్లుడనియు, అందువలన నన్నెచోడుడు క్రీ. శ. 940—70 ప్రాంతములో నుండి యుండవలెననియు చెప్పుచున్నారు.

అయితే వీరు 1951 జనవరి భారతిలో ప్రకటించిన 'రాజరాజ నరేంద్రు'డను వ్యాసములో "క్రీ. శ. 1044 నాటో ఆ మరుసటి సంవత్సరముననో కళ్యాణ చాళుక్య చక్రవర్తి త్రైలోక్య మల్లాహవమల్ల బిరుదాంకితుడగు మొదటి సోమేశ్వరుడు వేంగీరాజ్యమును జయించెను. అది మొదలు క్రీ. శ. 1060 పర్యంతము వేంగీ మీద అతని అధికారము చెల్లినది. రాజ రాజ నరేంద్రుడు కళ్యాణీ చాళుక్యుల కరిగా పాలెను' అని నిర్ణయించియున్నారు. అట్లుండగా పాకనాటిమీద కళ్యాణీ చాళుక్యులకు ఎన్నడును అధిపత్యము లేదనుట శ్రీ వెంకట రమణయ్యగారు చెప్పినట్లు సత్యము గాదు. ఇందు స్వ వచన వ్యాఘాతము కలదు. ఇంతియేగాక ఆకాలమున (క్రీ. శ. 1048-57) పాకనాటికి చక్రవర్తి యెవరో అను విషయమును శ్రీ వెంకట రమణయ్యగారు శాసనాధారముతో నిరూపింప లేదు.

'ఉదయాద్రి ప్రభు శృంగం బెక్కినట్లు' అనగా ఉదయగిరి ప్రభువుయొక్క ప్రభుత్వము అనగా పాకనాటి ప్రభుత్వమును స్వీకరించినట్లు గ్రంథాధారముతో శ్రీ రెడ్డిగారు చెప్పుచున్నారు. '(ద్వాదశార్ధార్ణవయను)...... అయ్యుదయాగము' అను గీతపద్యమందలి 'పాకనాటి ఇరువదియొక్కవేయి' ఇత్యాది దేశకాలములను శ్రీ రెడ్డిగారు లెక్కతో నిరూపించి ఉదయగిరి పాకనాటిలోనిదని నిరూపించిరి. ఇంతేగాక 'వస్తుకవిత—ఉదయ పర్వత శిఖరాగ్రారోహణ వర్ణన' అను కవి సూచనను గూడ చేర్కొనిరి. పెదచెరుకూరు శాసన దాతయగు 'కందుకూరి పురవరేశ్వర ......పాకనాంటి విషయ ఏక వింశతి సహస్ర గ్రామావనీ వల్లభ...మల్లిదేవ చోడ' అనువానిని కందుకూరు పాకనాటి రాజ్యమునకును, ఈ మల్లిదేవ చోడుని తాత ముత్తాతయగు నన్నెచోడ కవియొక్క ఉదయగిరి పాకనాటి రాజ్యమునకును దగ్గఱ సంబంధమున్నదిగాని, కడపజిల్లాలోని పడమటి పాకనాటికి, కందుకూరి తూర్పు పాకనాటి రాజ్యమునకు సంబంధముండియుండదని స్పష్టమగుచున్నది.

పాకనాటి నన్నెచోడుడు శ్రీ వెంకటరమణయ్యగారు చెప్పినట్లు కళ్యాణీ చాళుక్యులకు సామంతుడు కాడని అంగీకరించినను ఈ క్రింది విషయము మరువరాదు. కంచి అరవ చోడులకు తూర్పు తెలుగు చాళుక్యులకు మధ్య నన్నెచోడుని పాకనాటి రాజ్య

మున్నది. పశ్చిమమున కళ్యాణి చాళుక్యుల కర్ణాటక రాజ్యమున్నది. అరవ చోడులకును కళ్యాణి చాళుక్యులకునుమధ్య కొన్ని యుద్ధములు జరిగినవి. ఆ యుద్ధములలో తూర్పు చాళుక్యులు తమబంధువులగు కంచి అరవ చోడులకు సాయము చేయకుండుటకై కళ్యాణి చాళుక్యులు తెలుగు చోడులకును, తూర్పు చాళుక్యులకును మధ్య యుద్ధములు కల్పించి తంత్రములు పన్నియుండ వచ్చును. అట్టి సందర్భములలో రాజ్యతంత్రముల ప్రకారము నన్నెచోడుడు ప్రధానముగ కళ్యాణి చాళుక్యులకు సామంతుడు కాకపోవచ్చును. కాని కళ్యాణి త్రైలోక్య మల్ల సోమేశ్వరుడు ప్రబలుడు కాబట్టి వాని మూలమున తనకు లాభము రావచ్చునని తలంచి అతనికి ప్రతికూలము కాకుండ అనుకూలముగ నుండుటకు యోచించి అతని శక్తి సామర్థ్యములు తనకు తోడ్పాటుగా నుండునని తలంచి అతనిని తనకు 'కూర్చని తేసు'నిగ కవి చెప్పికొనెనని చెప్పుటకు అవకాశము లేకపోలేదు. అన్నిటికి శాసన ప్రమాణములు చూపినప్పుడే ఈ విషయమునకు శాసన ప్రమాణము లేదన వీలుండును.

ఒక గ్రంథములోని ఒక విషయమును ఆధారముగగొని ఒక నిర్ణయము చేయుట కుపక్రమించితి మేని, అందులకు ఉపోద్బలకములును, గ్రంథస్థములును, శాసనానుకూలములును అగు నితర విషయములను గూడ గమనింప వలయును గాని ఏకదేశ మంత్రము గ్రహించి ఇతర ప్రధాన ప్రమాణములను త్రోసి రాజనుట యుక్తము కాదు. ఏలయన కావ్యమందలి 'జంగమ మల్లయ పేర సప్త సంతానము లొప్ప సల్పుదుముదంబున దక్షప్రభు నాజ్ఞ పెంపునన్' అను ప్రభువు నాధారముగాగొని గురువు ఇష్టదైవము, నిజేశుడు వీరి మువ్వురికి కాలనామ సామ్యము స్వీకరించి నిజేశుడుగనుండు త్రైలోక్య మల్ల సోమేశ్వరుడే తన ప్రభువని కవి చెప్పికొనుచుండగ అతడు కాడు. 'ఇమ్మడి యుద్ధమల్లు'డని గ్రంథేతర రాధారములతో వేరొకనిని గ్రహించుటలో ఔచిత్యము లేదు. యుద్ధమల్లుండు అను నామముగూడ బిరుదముగ చెప్పుచు, ఇమ్మడి యుద్ధమల్లుని తాతకు 'మల్లపరాజు' అను పేరున్నట్లు బెజవాడ శాసనములో కలదని చెప్పుచు, అటులే మనుమడగు రెండవ (ఇమ్మడి) యుద్ధమల్లునికిగూడ 'మల్లణ్ణ' అను పేరుగలదని శ్రీ వెంకట రమణయ్యగారు రూహించుచున్నారు. కాని బెజవాడ శాసనమునందీ విరోధము గలదు.

'స్వస్తి నృపాంకుశాత్యన్తవత్సల సత్యత్రినేత్ర విస్తర శ్రీయుద్ధమల్ల ద్విరదవిఖ్యాత కీర్తి ప్రస్తుత రాజాశ్రయుణ్డు త్రిభువనాభరణుణ్డు సకల వస్తుసమేతుణ్డు రాజసల్కి భూవల్లభుణ్డర్థిన.'

ఇందు ఇమ్మడి యుద్ధ మల్లునికి 'రాజసల్కి' అను అసలు పేరున్నట్లు స్పష్టమగుచున్నది. ఇది 'భీమసల్కి' వంటి వ్యక్తి నామము. కాగా శ్రీ వెంకట రమణయ్యగారన్నట్లు రెండవ యుద్ధ మల్లునికి 'మల్లణ్ణ' అను అసలు పేరు లేదని చెప్పక తప్పదు. కాబట్టి ఈ రాజసల్కి కుమార సంభవ కృతిపతి కాడు. ఇక్కడ కూడ రెడ్డిగారు చెప్పినట్లు ('యుద్ధ బిరుదు వదలిన) 'మల్ల' శబ్దమే శ్రీ వెంకటరమణయ్యగారికి తారకమగుచున్నది. ఎట్లయినను 'రాజసల్కి' అను అసలు పేరుండుటవల్ల 'మల్లణ్ణ' అను బిరుదు పేరు యుద్ధమల్లుండు అను బిరుదము నుండి జనించి దనుటకు వీలులేక పోలేదు. ఇట్టిదే త్రైలోక్య మల్ల బిరుదమునుండి పుట్టిన మల్లయ్య పేరు కూడ. శ్లేషలో 'మల్ల' శబ్దము సమయానుకూలముగ 'జెట్టి-మల్లయ్య' అను రెండర్థములను సాధించుననుట నిరాక్షేపము. కావున శ్రీ రెడ్డిగారి వాదమే గ్రంథాధార సమ్మతము. లేనిచో చారిత్రకుల వాదమునకు కూడ ఈ 'మల్ల' బిరుద నామ దోషము సంక్రమించుచున్నది.

మఱియు నన్నెచోడుడు తన గురువును కథానాయకునిగా ప్రవేశపెట్టి వర్ణించిన ఘట్టములో 'త్రైలోక్య పూజ్యక' అని యొక చోటను, 'సోమ మనుష్యరూప...—మల్లికార్జునుడ' అని మఱియొక చోటను పేర్కొనియున్నాడు. ఇంతియేగాక నాగబంధమందలి 'సోమదేవ విస్ఫురితరమా దయా రసయుతా' అను సమాసములో తన గురువు సోమదేవుని దయా పాత్రుడుగా నన్నట్లు కవి చెప్పికొని యున్నాడు. ఇయ్యది శివస్తోత్ర పరమైనను శబ్దశక్తి ధ్వనిచేత త్రైలోక్య మల్ల సోమేశ్వర ప్రశంస కూడ నగుచున్నది. శ్రీశైల మల్లయ్యను గ్రంథాధారముచే నిరూపించినట్లు తత్ప్రభువు త్రైలోక్య మల్లయ్యను గూడ గ్రంథస్థాధారముచే నిరూపింప వలసి యున్నది. శ్రీ వెంకటరమణయ్య గారట్లు చేయక గ్రంథేతర రాధారములతో కాలాంతర

మును వ్యక్త్యంతరమును సాధింపబూనుట సమంజసముగా గాని, యుక్తాయుక్తముగా గాని తోపదు. ఖాజీపేట శాసనములో 'త్రైలోక్య మల్లకుమారీశాత్ శాసనబద్ధం, అను బిరుదనామమే సోమేశ్వరవ్యక్తి నామముగా వాడబడి యున్నది.

బల్లయ.

శ్రీ వెంకట రమణయ్యగారు పేర్కొన్నమంథాన గ్రామ శాసన దాతయగు 'పాకనాటి బల్లయచోళ మహారా' జే ఈ కమ్మనాటి బొప్పిడి శాసనమందలి పాకనాటి బల్లె భూపతియైనచో వీనికి నన్నెచోడుడని కొడుకున్నట్లు ఊహించుటకు వీలులేదు. ఇచ్చట శాసిన భాగము శిథిలమైయున్నది. ఈ బల్లయచోడ మహారాజునకు నన్నెచోడుడను కొడుకున్నట్లు శ్రీ వెంకటరమణయ్యగారు ప్రమాణము చూపలేదు. బల్లయ నామము మాత్రము గ్రహించి అతనికి 'నన్నెచోడు'డని కొడుకుండునని—అతడే కుమారసంభవ కావ్యకర్త, అతడే పాకనాటి కధిపతి, అతడే వైదుంబ త్రిభువన నేత్రునిచే జంపబడినవాడు అని చెప్పుట ఊహాతీతముగా నున్నది.

ఈ జటాచోడ వంశము వారుకూడ ఒరయూరి పురాధీశ్వరులుగా నుండి దశవర్మ కాలము నుండి పొత్తపి పాకనాటి కధీశ్వరులైనట్లు, కమ్మనాటి నివాసులైనట్లు కమ్మనాటి బొప్పిడి శాసన వాక్యములు తెలుపుచున్నవి. ఇట్లే క్రీ. శ. 902 ప్రాంతమున కృష్ణా తీరమున బీచుపల్లి శాసనములో కూడ నొక చోడబల్లి చేవుకున్నాడు. అతనికి గూడ నన్నెచోడుడని కుమారుడుండవలయునని శ్రీ మానవల్లి రామకృష్ణ కవిగారును, కీ. శే. నడకుదుటి వీరరాజు గారును ఊహించియున్నారు. అట్లే ఇది ఊహాకు చెందినదిగాని సోపపత్తికము కాదు. గ్రంథాధార చరిత్రతో సమన్వయ పఱచు చోడబల్లి కొడుకు నన్నిచోడుడను పెద చెరుకూరు శాసన చరిత్రను నమ్మకపోవుట చిత్రముగా నున్నది.

శైవ మతము

తెలంగాణా యందలి వేములవాడ శాసనములో 'త్రిభువన మల్ల సామన్త చూడామణి శ్రీ మదరి కేసరి' కాలమున (సాక్షి) మల్లికార్జున భట్టారకుడు ఒకడు కలడు గాని ఇతడు శ్రీ వెంకటరమణయ్యగారు చెప్పినట్లు కాలాముఖ శైవ మతమునకు చెందినవాడని చెప్పుటకు శాసనాధారము కనబడలేదు. ఇందలి 'మల్లికార్జున, ముక్తిలింగి, విద్యాసరాది భట్టార కాశసాక్షిణః' అను పాఠము గమనింపదగియున్నది. ఇందలి 'భట్టారకాః' అను బహువచనముపై ముగ్గురి వ్యక్తుల కన్వయించుచున్నది. కావున ఈ భట్టారకులు కాలాముఖులన వీలులేదు. మల్లికార్జునుడు, ముక్తిలింగి, విద్యాసరుడు మొదలగునవి ప్రత్యేక నామములు.

తెంకణము

'తెంకణధారిణి' పెన్న పరివాహము లోనిదని శ్రీ వెంకట రమణయ్యగారు చెప్పుచున్నారు. అనగా తెంకణ దేశమనునది అనంతపుర మండలమందలి తాడిపత్రి సమీపమునుండి పూర్వ వాహినియై ప్రవహించు పెన్నానదీతట ప్రాంతమని చెప్పుట కవకాశమున్నను తెలంగాణా ప్రాంతమందలి అలంపుర శాసనములో "హల వాలియ తెంకణాదిత్య [న] కలియుత్తురు" ... "మరాజనుడొంకె జవినిం తెంకలు కొట్టముత్తురుణ్"

అను తెంకణభూమి వాడబడియున్నది. దీనిని బట్టి తెలంగాణా ప్రాంతములో గూడ తెంకణ దేశ భాగమున్నట్లు తెలియుచున్నది. ఇట్లే కళింగ దేశ ప్రాంతములో 'తెంకణలు' సంస్థాన మున్నది. కావున ఇవి యన్నియు ఒకప్పుడు తెలుగు జాతికి చెందిన పూర్వదేశములై ఆ పూర్వ నామములతో వ్యవహరింపబడినట్లు తలంప వచ్చును. అదియును గాక 'తెంక (ణ) శబ్దమునుండియే క్రమముగా 'తెఁక'—'తెఁగ', 'తెనుకు—తెనుగు' దేశ భాషా పదము పుట్టినదా అను జిజ్ఞాస కలుగుచున్నది.

ముగింపు

పరిశీలింపగా శ్రీ రెడ్డిగారు వ్రాసిన నన్నెచోడకవి చరిత్రలో అన్ని విషయములైన ఉపపత్తులచే ఈ కవి క్రీ. శ. 1028—58 ప్రాంతములో నుండెనని నిరూపితమగుచున్నది. గర్భకవిత్వము వ్రాయునలవాటు నన్నెచోడునికి గలదు.

'అసిధార బొల్చెప గజ—యకొంత కొంతరవ,
దవదాళి ఖద్గలలజ—యచైత్ర సంపద.'

గ్రంథవిమర్శనము

ఆంధ్రవ్యాకరణసంహితా సర్వస్వము

[మొదటిసంపుటము]

కళాప్రపూర్ణ శ్రీవజ్ఝల చినసీతారామశాస్త్రి. ప్రతులకు: రిజిస్ట్రారు, ఆంధ్రయూనివర్సిటీ, వాల్తేరు. వెల 25 రూపాయలు.

ఇది, ఆంధ్రశబ్దచింతామణికీ, అథర్వణకారికలకు, బాలవ్యాకరణానికీ, ఇంకా ఇతరాంధ్ర వ్యాకరణాలకు, శ్రీ శాస్త్రిగారు వ్యాఖ్యానరూపంగా రచించిన వ్యాకరణగ్రంథము.

తెలుగులో వ్యావహారికవాదం బయలుదేరిన తరవాత, గ్రాంథికాంధ్రవ్యాకరణాభినివేశం చాలా వరకు సన్నగిల్లింది. కాని వ్యావహారికభాషకు ఇంతవరకు ఒక సమగ్రమైన వ్యాకరణం బయలు దేరనేలేదు. అందుచేత వ్యావహారిక రచయితలందరు తమకు తోచిన మార్గాలలో వ్యావహారికరచన సాగిస్తున్నారు.

అటు గ్రాంథికాంధ్రం మాత్రే ఆది విశ్వవిద్యాలయంలో విద్యార్థుల ప్రశ్నపత్రాలలోను, అక్కడక్కడ కొందరు గద్యపద్యరచయితల వ్రాతలలోను మాత్రమే మిగిలి ఉంది.

మనకింతవరకు వచ్చిన తెలుగు వ్యాకరణాలన్నీ చాలా సంక్షిప్తంగా ఉన్నాయి. ఇంతవరకు వచ్చినభారతాది గ్రంథాల పద్యభాషకుకూడా వీటిలో సమగ్ర సూత్రీకరణం కనబడదు. నిజానికి ఏ వ్యాకరణమైనా బయలుదేరినప్పుడు అది అంతకు పూర్వమే ప్రసిద్ధులయిన గ్రంథకర్తల భాషకైనా మార్గదర్శకం కావాలి. తెలుగు వ్యాకరణా లీవిషయంలో చాలా అసమగ్రంగా ఉన్నాయన్న విషయం గిడుగు రామమూర్తిపంతులు గారు చాలాకాలంకిందటే సప్రమాణంగా నిరూపించారు. ఉదాహరణకు ఆంధ్రశబ్దచింతామణి ప్రకారం చూస్తే నన్నయ్య భారత ప్రయోగాలే అసాధువులని కొట్టివెయ్యవలసి ఉంటుంది. అయితే-నన్నయ్య వ్యాకరణంప్రకారం అతని భారతప్రయోగాలు కుదరక పోయినంత మాత్రాన పెద్దదోష మేమీ లేదనీ, పాణినిసూత్రాలకు అతీతమయిన పాణినీయసూత్ర ప్రయోగాలే కనిపిస్తున్నాయనీ శ్రీసీతారామశాస్త్రిగారు సమర్థిస్తున్నారు.

కాని సంస్కృతవ్యాకరణంలో ఇల్లాంటి ప్రయోగాల కన్నిటికీ ఒక నిర్ణీతమయిన వ్యవస్థ ఏర్పాటైఉంది. పాణినీయసూత్రాలప్రకారం కుదరని ఈపాణినిప్రయోగాలు చాలా తక్కువ. ఆంధ్రశబ్దచింతామణి ప్రకారం కుదరని నన్నయ్య ప్రయోగాలు అసంఖ్యాకంగా కనిపిస్తున్నాయి. ఈదృష్టిలో మాత్రే మనకున్న వ్యాకరణాలతో ఇంతవరకు వచ్చిన సుప్రసిద్ధాంధ్రకవుల ప్రయోగాల కన్నింటికీ లక్షణసమన్వయం కుదరడం లేదు.

శ్రీ శాస్త్రిగారే తమ వ్యాఖ్యానాల్లో అనేక స్థలాలలో ఆంధ్రశబ్దచింతామణికీ, అథర్వణకారికలకు, బాలప్రౌఢవ్యాకరణాలకు, ఇంకా ఇటీవల బయలుదేరిన వ్యాకరణాలకు మధ్యన బయలుదేరిన పరస్పర వైరుధ్యాలెన్నో ఎత్తి చూపించి, తమ వ్యాకరణ పాండిత్యబలంతో అవన్నీ సమన్వయించడానికి ప్రయత్నించారు.

అయితే ఈ పూర్వాంధ్ర వ్యాకరణాల కన్నింటికీ కలిపి, పాణినీయాని కున్నంత విస్తృతిగాని, ప్రామాణికతగాని లేకపోవడంవల్ల కొన్ని కొన్ని సిద్ధాంతాల విషయంలో పాఠకులు ఇదమిత్థం అని నిర్ణయించుకోవడానికి వీలుపడడం లేదు.

ఉదాహరణకు 'సంహితైకపదే నిత్యా నిత్యా ధాతూపసర్గయోః, నిత్యా సమాసే వాక్యే తు సా వివక్షామపేక్షతే' అనే సంస్కృత వ్యాకరణ సంహితా నియమం తీసుకుందాము. ఈ అనుశాసనం తెనుగు సంధిలో సర్వత్ర అనువర్తించదని శ్రీశాస్త్రిగారు నిరూపించారు. కాని శాస్త్రిగారు తమ గ్రంథపీఠికలో తద్ధితాది విషయాలలో సంస్కృత వ్యాకరణ సూత్రాలే తెనుగుకు అనువర్తిస్తాయనీ, సంస్కృత వ్యాకరణ పరిశిష్ట విషయాలకే తెలుగు వ్యాకరణ కర్తలు సూత్రాలు రచించారనీ వ్రాశారు.

ఇక్కడ సంస్కృత సంహితాను శాసనం తెనుగులో అనువర్తించే విషయం సమగ్ర ప్రయోగ పరిశీలన చేసి తేల్చుకోవలసిన విషయం. ఇంతవరకు వచ్చిన వ్యాకరణాలలో ఈ విషయంలో సమగ్రపరిశీలన జరగలేదు. శాస్త్రిగారు చేసిన సమన్వయాలు కూడా సంక్షిప్తంగా ఉన్నాయిగాని సమగ్రంగా లేవు. ఈ పరిస్థితిలో ఈ సమన్వయానికి సరిపోని ప్రాచీన కవిప్రయోగాలు అపప్రయోగాలేనా అని పాఠకులకు సందేహం కలగడం సహజమే. ఇంక ప్రసిద్ధ ప్రాచీన కవులలో వీరు ప్రామాణికులు—వీరు అప్రామాణికులు అని కొట్టివెయ్యడం కూడా అంత తేలికైన పని కాదు. ఇల్లాంటప్పుడు—శ్రీ శాస్త్రిగారు కొంతమంది ప్రాచీన కవుల ప్రయోగాలు ప్రత్యేకించి అపప్రయోగాల నిర్ణయించడం వ్యాకరణసంప్రదాయదృష్ట్యా యుక్తియుక్తం కాదు.

అయితే ఈ చేసినదంతా ఆంధ్ర వ్యాకరణ ప్రాథమిక సంప్రదాయాలను గురించి చేసిన విమర్శ. ఇదంతా గతానుగతికంగా వచ్చిందని విడిచిపెట్టి, కేవల సాంప్రదాయి కాంధ్రవ్యాకరణదృష్టితో పరిశీలించినప్పుడు—శాస్త్రిగారి ఆంధ్రవ్యాకరణ సంహితాసర్వస్వమువంటి సమగ్ర వ్యాకరణగ్రంథం తెలుగు భాషలో ఇంతకుముందెన్నడు బయలుదేరలేదని చెప్పాలి.

శాస్త్రిగారు సంస్కృత ప్రాకృతాంధ్రవ్యాకరణాలు కూలంకషంగా మథించినవారు. ఈ వ్యాఖ్యానంలో దొర్లిపోయే అనేక సంస్కృతాంధ్ర శబ్దాల సాధుత్వాసాధుత్వ నిర్ణయాలలో, వీరి కూలంకష పాండిత్యము, చిరకాలానుభవము, ప్రయోగ విశేష పరిజ్ఞానము ప్రస్ఫుటంగా గోచరిస్తాయి.

గ్రాంథి కాంధ్ర వ్యాకరణ సంప్రదాయాలు, ప్రయోగ విశేషాలు, సూత్రకర్తల లోపాలు మొదలయిన భాషావిషయాలు తెలుసుకోదలిచిన వారందరికీ ఇది అవశ్య పఠనీయమయిన ఉత్తమగ్రంథము.

ఇది ఇంతకుపూర్వం వెలువడిన గ్రాంథికాంధ్ర వ్యాకరణాల కన్నింటికీ మహాభాష్యంవంటిదని చెప్పవచ్చును.

అయితే శాస్త్రిగారీ భాష్య రచనతో తృప్తి పడక అపూర్వమయిన తమ పరిశ్రమను వినియోగించి భాష్యరూపంలో వెలువరించిన తమ అభిప్రాయాలు సూత్రీకరించి గ్రాంథికాంధ్రాని కొకసమగ్ర వ్యాకరణం రచించగలరనీ," ఆంధ్ర విశ్వవిద్యాలయానికా వ్యాకరణం ప్రచురించే గౌరవం దక్కగలదనీ ఆశిస్తున్నాను.

ఆంధ్రవ్యాకరణ సంహితాసర్వస్వం రాయల్ సైజులో సుమారు వెయ్యి పుటల గ్రంథం. చింతామణ్యాది వ్యాకరణసూత్ర సూచికలు, విస్తృత విషయసూచికలు మొదలయిన వాటితో గ్రంథ ముద్రణం ప్రశంసనీయంగా ఉన్నది.

ఇంతటి ఉత్తమ వ్యాకరణగ్రంథం ప్రచురించిన ఆంధ్రవిశ్వకళా పరిషత్తువారు ఆంధ్రభాష కొక అమూల్యాలంకారం చేకూర్చారు.

ఆంధ్రభాషాభిమానులందరికీ ఇది అవశ్యం పఠింపదగిన అమూల్య వ్యాకరణ గ్రంథము.

నాటకం

[అనువాద నాటకం]

డి. వి. నరసరాజు, ప్రకాశకులు: దేశి కవితా మండలి, విజయవాడ 2, వెల: రూపాయి పావలా.

అప లిటి హంగరీ కవి ఫెరెన్స్ మొల్నార్ వ్రాసిన నాటకం. ఈ నాటక రచనాచమత్కృతికి ముగ్ధుడై పి. జి. వుడ్‌హౌస్ అంతటి రచయిత దీనికి "*The play is the thing*" అని పేరుపెట్టి ఇంగ్లీషులోకి తర్జుమా చేశాడు. ఆ ఇంగ్లీషులోనుంచి డి. వి. నరసరాజుగారు చేసిన తెలుగుఅనువాదమే ఈ 'నాటిక'.

ఊర్వశి, మధు, అనే ఇద్దరు యువతీయువకులు పరస్పరము ప్రేమించుకుని వివాహం చేసుకుందామని నిశ్చయించుకుంటారు. అయితే ఇంతకు పూర్వమే ఊర్వశికి నాట్యం నేర్పిన కాలంలో బాగా జోస్తీగా తిరిగిన కామరాజనే ఆసామి ఆమెనొక హోటల్లో కలుసుకుని సరసాలాడడం మొదలుపెడతాడు. కాని ఊర్వశి తన పెళ్ళి నిశ్చయం అతనికి చెప్పి తిరస్కరిస్తుంది. ఈ హోటల్లో పక్కగదిలోనే మధు, అతని సన్నిహిత మిత్రులు రఘుపతి, రామానుజం మకాం చేసి ఉంటారు. మధు ఈ సంభాషణ విని,

నిర్ఘాంతపడి ఊర్వశితో తెగతెంపులు చేసుకోడానికి సిద్ధపడతాడు. కాని రఘు, రామానుజము, మధుమీద జాలికొద్దీ ఆత్మహత్య జరక్కుండా ఈ వ్యవహారం సానుకూలపరచి పెళ్ళి జరిగించాలని నిశ్చయించి, మధుతో ఆసంభాషణ అంతా ఒక నాటకం రిహార్సల్లోదని చెబుతారు. స్వయంగా అప్పటికప్పుడు ఒక చిన్న నాటకం వ్రాసి, ఊర్వశీ కామరాజు లిద్దరిచేతా ఆ నాటకం ఆడిస్తారు. పాపం మధు భావకవి. ఆ అమాయకుడిదంతా నమ్మి, చివరికి ఊర్వశీ పాణిగ్రహణోన్ముఖు డవుతాడు. ఇదే ఈ నాటకంలో కథ.

ఈ కథ సామాన్యంగానే కనిపిస్తుంది. కాని ఫెరన్స్ లారెన్స్ మాత్రం ఇదంతా మూడంకాల్లో ఇమిడ్చి, అత్యద్భుతంగా నడిపించుకుపోయాడు. ఈ రూపక రచనావిధానం అంతా పరిపూర్తిగా అతి సున్నితమైన హాస్యధోరణిలో సాగిపోతుంది.

దీనికి డి. వి. నరసరాజు గారు చేసిన అనువాదం కూడా చాలా చక్కగా నడిచింది. వీరి సంభాషణలు మంచి చురుగ్గా హుషారుగా సాగిపోతాయి. రచనకు, ప్రదర్శనానికీ, ఆంధ్రనాటక కళాపరిషత్తు ప్రథమతాంబూలం అందుకున్న వీరి 'నాటకా'న్ని గురించి, ఇంతకంటె ఎక్కువగా వ్రాయడం అనవసరం.

అయితే—ఒక యువతికి ముందుగా ఒక ఆసామితో బాగా దగ్గిరసంబంధం ఏర్పడడం, తరవాత ఆమె ఇంకొకర్ని పెళ్లాడాలని అనుకోవడం—పాత గోల బయటపడడం—మధ్యవర్తులు కలుగజేసుకుని వ్యవహారం చెయ్యిదాటిపోకుండా చూడడం—లాంటివి పాశ్చాత్యసంఘానికి నప్పినంతగా మనకు నప్పవు. ఇందుచేత తెలుగుజనానికి ఈ నాటకం కొంత విడ్డూరంగా కనబడుతుంది.

ఆంధ్రనాటక కళాపరిషత్తు మన సంఘ వ్యవస్థకు బాగా అతుక్కుపోయే స్వతంత్ర నాటకాలుగాని లేకపోతే—అథమపక్షం అలాంటి అనువాదాలుగాని ప్రోత్సహించడం మంచిది.

సింహగడము

[నాటకము]

సురభి నరసింహము. బి. ఏ.; బి. ఇ. డి. ప్రతులకు: అరుణాశ్రమము, నడకుదురు. కాకినాడ తాలూకా, తూర్పుగోదావరి జిల్లా.

ఈ నాటకంలో ప్రధానేతివృత్తం సింహగడ విజయము. ఈ విజయం సాధించిన వీరుడు తానాజీ మాలుసురే. ఇతడు శివాజీకి నమ్మినబంటు. తన చాకచక్యంవల్ల సింహగడదుర్గరక్షకుడైన రాయాజీఘుకేసరుని తన పక్షానికి తిప్పుకుంటాడు. ఈ కథలో ఉదయభానునికీ, కమలకుమారికీ మధ్య నడిచిన వ్యవహారం కూడా కలుస్తుంది. రచయిత ఇదంతా ఆరుఅంకాలలో కుదించారు.

సాంప్రదాయిక పద్ధతి ననుసరించిన పద్యాలు, పాటలు, గ్రాంథిక భాషారచన మొదలైనవన్నీ ఈ నాటకంలో కనిపిస్తాయి.

చారిత్రకరూపకాలు వ్రాసేటప్పుడు ఆకాలపు ప్రజల మనోభావాలు స్ఫురింపజెయ్యడంలో చాలా జాగ్రత్త పడాలి. శివాజీకాలంలో హైందవ ధర్మాచరణావేశం ఉంటే ఉండవచ్చునుగాని, ఈనాడు బయలుదేరిన అఖిలభారతజాతీయావేశంలాంటిది ఆరోజుల్లో కనబడదు. అందుచేత ఈ నాటకంలో చాలాచోట్ల మరాటీవీరులు 'భారత వీరత!' మొదలైనవాటిని గురించి ప్రస్తావించడం సముచితంకాదు. రచయిత ఇక్కడ ఈనాటిభావాలు ఆనాటి వ్యక్తులకు హత్తించినట్లు కనిపిస్తుంది.

ఈరచయిత నాటకరచనకంటె పద్యరచన కొంత బాగుంది. ఈ క్రింది పద్యాలనుబట్టి వీరి రచనాపద్ధతి గమనించవచ్చును.

"ఓహో! ఆహవలక్ష్మియే మనకుం
బ్రత్యక్షమై నిచ్చెండమో
రాహిత్యమ్ము వరించి, శాత్రవ కర
గ్రస్తంబులౌ దివ్వెలన్
వ్యూహమ్ముల్ వచరింపుడీ రిపుల
కాయశ్రీపమూర్ఛన్నవో
త్సాహావేశ పరాక్రమ ప్రళయ
రుద్రస్ఫూర్తి నర్తింపుడీ!
ప్రాణమ్ముల్ క్షణభంగురమ్ములు
లటిత్రాయంబు లౌశ్రీలు; కోం
డాణీన్ శాత్రవముక్త జేసి
శివరాట్ఛ్రీనగీలించి, గీ
ర్వాణ ప్రస్తుత తేపువీర
శివజీపాదోపజీవుల్ పరి

శ్రీలోద్యోగు లటంచు శాశ్వత
సువర్ణఖ్యాతి దీపింపరే!"

TWELVE PEAS IN A POD

[కథల సంపుటి]

మార్గరెట్ బార్న్స్. ఆథర్స్ అండ్ ఆర్టిస్ట్స్ ఎసోసియేషన్. 16. శాండ్ సన్స్ గార్డెన్ స్ట్రీట్, కిల్పాక్. మదరాసు. వెల: 2 రూపాయలు

ఇది భారతదేశ పరిసరాలపై ఆంగ్లభాషలో రచించిన 12 కథల సంపుటి.

వైదేశికులు అన్యదేశాలలో చాలాకాలం నివసించినా ఆ దేశీయుల ఆచారవ్యవహారాల అంతరాంతరాలు పరిశీలించి ఎన్నదగినసాహిత్యసృష్టి చెయ్యడం చాలాకష్టం. అసలాయాదేశీయుల జీవితాంతర్యం వారి కైనందిన వ్యావహారిక భాషలో అంతర్లీనమై ఉంటుంది. అందుచేత విదేశభాషల్లో అన్యదేశీయుల జీవితపరిసరాలు చిత్రించడంలో కొంత క్లిష్టత ఏర్పడుతుంది.

కాని ఈ రచయిత్రి రచనలలో అంతటా చక్కని భారతీయ జీవన పరిశీలన కనిపిస్తుంది. కథలు చదువుతూంటే ఇవి ఎవరో భారతీయులు వ్రాసినట్లే ఉంటాయి గాని వైదేశిక దృష్టి ఛాయలు వీటిలో కనబడవు. ఇది ఈరచయిత్రి కథలలో ఎన్నదగిన ప్రత్యేక విశిష్టత.

ఈసంపుటికి పీఠిక రచించిన మం కేరీ. యస్. ఈశ్వరన్‌గారు వ్రాసినట్లు ఈమె కథల్లో సున్నితమైన స్వభావపరిశీలనము, చిత్రణము ప్రత్యేకంగా పేర్కొనదగిన సుగుణాలు. ఈ జాతి రచనలకు *Twixt Here and there*, *Renunciation*, *The Goldsmith Finishes His work* అన్నవి ఉదాహరణలుగా తీసుకోవచ్చును.

ఈమె వ్రాసిన కథ లన్నిటిలోను, *One night in a Barn*, *A qnestion of Authorship* అన్నవి రెండు ప్రత్యేకంగా పేర్కొనదగిన ఉత్తమ కథలు.

మిగిలిన వాటిలో చాలావరకు చిత్రణాల తరగతికి చెందుతాయి. వీటిలో *The call of the eights* ఎన్నదగిన చిత్రణం. కవితాత్మకమైన ఒక సన్నివేశం తీసుకొని రచయితలను ఉన్నత పథాలకు తీసుకొనిపోయిన మార్గరెట్‌బార్న్స్ రచనాకౌశలం దీనిలో గమనించవచ్చును.

ఆకర్షకమైన ముఖచిత్రంతో ముద్రణాదికం ప్రశస్తంగా ఉన్నది.

ఈ ఉత్తమాంగ్ల కథాసంపుటి ప్రచురించిన ఆథర్స్ అండ్ ఆర్టిస్ట్స్ సంఘంవారు అభినందనీయులు.

శ బ్ద సిం ధు

[హిందీ–తెలుగు నిఘంటువు]

సంకలనకర్త: సాగిసత్యనారాయణగారు. ప్రతులకు విజయ భారతీ పబ్లికేషన్స్, రాజమహేంద్రవరము. వెల: 12 రూపాయలు.

ఇదిడెమ్మీసైజులో 1278 పుటలుగల పెద్దనిఘంటువు. దీనిలో 75 వేల పదాలున్నాయి. సాగివారు సామాన్యంగా హిందీలో దొర్లిపోయే సంస్కృత, పార్సీ, ఉర్దూ, అరబ్బీ మొదలైన భాషలపదాలన్నీ సేకరించి, అకారాదిక్రమంలో ఇందులో చేర్చారు. ఇదిగాక, ఇందులో ఇంకా 5 వేల హిందీ జాతీయాలుకూడా చేరి ఉన్నాయి.

హిందీ జాతీయ భాషగా మారిన ఈ రోజుల్లో అందరూ ఈభాష తప్పకుండా చదవవలసిన అవసరం ఏర్పడింది. తెలుగులో ఇంతవరకు ఇంత పెద్ద హిందీ—తెలుగు నిఘంటువు బయలుదేరలేదు. ఇది హిందీభాష చదివేవారికి బాగా ఉపయోగిస్తుంది. ఇంత పెద్ద నిఘంటువు తెలుగులో ప్రకటించడానికి శ్రమపడిన ప్రకాశకులు, సంకలనకర్తలైన సాగి సత్యనారాయణగారు హిందీభాష చదివేవారికి చక్కని సౌకర్యం కలిగించారు.

వి క్ర మ ప్ర కృ తి

[పద్య కావ్యము]

యామిజాల పద్మనాభస్వామి, శారదా విద్యాలయ బాలికోన్నత పాఠశాల, త్యాగరాజనగర్, మదరాసు. వెల లేదు.

ఇది జయపురమార్గంలో తగిలే కొండదారి ప్రకృతిసౌందర్యంవర్ణించే ఏకాశ్వాస పద్య కావ్యము.

ఈ కావ్యంలో అక్కడక్కడవచ్చే ప్రకృతి వర్ణనలతోపాటు డ్రైవర్లు బస్సులు, మొదలయినవాటి గొడవలుకూడా అక్కడక్కడ దొర్లుతూంటాయి. ఇందులో కేవల ప్రకృతివర్ణనలే కాక, జయపుర రాజ్యంలో నివసించే మనుషుల సాంఘిక వర్ణన కూడా కనిపిస్తుంది.

విక్రమప్రకృతిలో పద్యాలన్నీ సాంప్రదాయికమార్గంలో సాఫీగా నడిచిపోతూంటాయి. పదప్రయోగాను, సమాసాలకట్టుబడి, చక్కని జాతీయ మార్గంలో నడిచాయి. అయితే వృత్తరచనలో ఈ రచయిత కంఠితగా చెయ్యితిరిగినట్లు కనబడరు. ప్రధానంగా ప్రకృతివర్ణనపరమైన ఈ కావ్యంలోని వర్ణన అక్కడక్కడ ఉదాత్తమార్గం విడిచి, చాలా పేలవంగా తేలిపోతూంటుంది. అయితే ఈ క్రింద ఉదాహరించిన వర్ణనవంటివి అరుదుగా ఉన్నా, దీనినిబట్టి ఈ రచయిత ఉత్తమస్థాయి ఏ అంతరువు దాకా వెళ్లిందో గ్రహించుకోవచ్చును.

"కుసుమరుగ మంచిగంధపు జిగుళ్ల
నొడళ్లను గప్పుకొంచు సం
పద కలవారిపోల్కి మదవారణ
కుంభ విరాజి మౌక్తికా
ప్పదగళ భూషమానలయి
పాటలు పాడుచు నచ్చటచ్చటన్
మెవలుచు నుందురందు గను
సీటుగ భిల్లపురంధ్రి కామణుల్."

భక్తి తత్త్వము

శ్రీ నిర్వికల్పానందస్వామి. ప్రకాశకులు : సాధన గ్రంథమండలి, తెనాలి. వెల : 12 అణాలు.

నారద భక్తిసూత్రాలు సంస్కృత భక్తి తత్త్వంలో ప్రామాణిక గ్రంథం. నిర్వికల్పానంద స్వామిగారు ఆ గ్రంథంలోనివిషయం సంగ్రహంగా క్రోడీకరించి తెలుగులో తేటతెల్లంగా వివరించారు.

ఇది క్రౌను సైజులో 50 పుటల గ్రంథం. అయినా సూక్ష్మంగా నారదభక్తి సూత్రంవిషయం అవగాహన చేసుకోగోరేవారికిది బాగా ఉపయోగిస్తుంది.

గౌతమ బుద్ధ

(జీవిత చరిత్ర)

చెరుకూరి వీరయ్య. ఎమ్. ఏ. ఎల్; ఎల్. టి. ప్రకాశకులు : పి. ఆర్. అండ్ సన్స్. విజయవాడ. వెల : 1-8-0

రచయిత దీనిలో గౌతమబుద్ధుని చరిత్ర సంగ్రహంగా వ్రాశారు. అయితే ఉన్నంతలో దీనిలో ప్రతి ప్రకరణంలోను, బుద్ధుని జీవితచరిత్ర విశేషాలు ధర్మబోధనలు పూర్తిగా వచ్చాయి.

దీనిలో వాడిన భాష గ్రాంథికమే. అయినా చాలా చక్కగా సరళంగా నడిచింది.

రామనామ ప్రభావము

శ్రీ కందుర్తి వెంకటనరసయ్య. ప్రకాశకులు : సాధన గ్రంథమండలి, తెనాలి. వెల : 6 అణాలు.

ఆయా ధర్మ గ్రంథాలలో గల రామనామ ప్రశస్తిపరమైన శ్లోకాలన్నీ సేకరించి రచయిత దీనిలో రామనామ ప్రభావం సంగ్రహంగా వివరించారు.

రామనామ వ్యుత్పత్తి, జపవిధానము మొదలైనవన్నీ తెలిసికోగోరేవారికీ గ్రంథం ఉపయోగిస్తుంది.

అంబికావిజయం

పురాణపండ రామమూర్తి : భారతీ ముద్రణాలయము. ఆలమూరు. వెల : 12 అణాలు.

శారద నవరాత్రులు జరపడం ఆంధ్రదేశంలో అనూచానంగా వస్తున్న సంప్రదాయము. ఈ పుస్తకంలో రచయిత దేవీపూజావిషయంలో పురాణ ప్రసిద్ధమైన మాహాత్మ్యాలు, కథలు సేకరించి సరళ వ్యావహారిక శైలిలో సర్వులకు బోధపడేటట్లు వ్రాశారు.

వీరి వ్యావహారికంలో అక్కడక్కడ గ్రాంథిక శైలికూడా కనిపిస్తుంది. రచయిత ఈ విషయంలో జాగ్రత్తపడడం అవసరం.

బాపూ—నా తల్లి

కుమారి మనూగాంధి. అనువాదకుడు నండూరి వెంకటకృష్ణమాచార్యులు. సర్వోదయ సాహిత్య పరిషత్తు. హుసేనిఆలంరోడ్డు. హైదరాబాద్ (దక్కన్) వెల: పన్నెండు అణాలు.

కుమారి మనూగాంధి గాంధీజీతో నౌఖాలీ సంచారం చేసినప్పుడు ఆనాటి సంగతులన్నీ గుజరాతీ భాషలో దినచర్యరూపంలో వ్రాసింది. దానికి నండూరి వెంకటకృష్ణమాచార్యులుగారు చేసిన అనువాదమే ఈ గ్రంథం.

సామాన్యమయిన గాంధీజీ దైనందిన చర్యలో జరిగిన మహత్తర సంఘటనలెన్నో మనూగాంధీ పాఠకుల కళ్ళకు కట్టినట్లు వ్రాసింది. ప్రతి చిన్న విషయంలోను మహాత్ముని దృక్పథం ఎంత నిశితంగా పనిచేసిందో ఈ చిన్న పుస్తకంవల్ల స్పష్టపడుతుంది.

అనువాదం అంత జాతీయంగా లేకపోయినా మూలగ్రంథంలోని విషయాలన్నీ పాఠకులకు సులభంగా తెలుస్తున్నాయి.

శ్రీ కుసుమహరనాథ లీలాసంగ్రహము

కొత్తపల్లి బుచ్చయ్యశర్మ. పాలమూరు, పశ్చిమ గోదావరిజిల్లా. వెల ఒకరూపాయి.

దీనిలో గ్రంథకర్త కుసుమహరనాథుని జననము, జీవితవృత్తాంతము సంగ్రహంగా వ్రాశారు.

జీవితవృత్తాంతం తరవాత రచయిత హరనాథ లీలలు, హరనాథసంభాషణ మొదలయిన విషయాలు కూడా చేర్చారు.

హరనాథతత్త్వం తెలిసికోగోరేవారందరికీ ఈ గ్రంథం సంగ్రహప్రకాశికగా ఉపయోగించగలదు.

శ్రీ

ఖండకావ్య సంపుటి.

శ్రీ రాధాకృష్ణ ప్రెస్. రామచంద్రపురం— వెలలేదు. దీనిలో కె. లైరా, శ్రీపాద వెంకటరత్నం, వాడ్రేవు నారాయణమూర్తి, పొన్నపల్లి వెంకటకృష్ణయ్య, రావులపర్తి భద్రిరాజు, పోచుకూచి సూర్యనారాయణమూర్తి అనే ఆరుగురు యువరచయితల ఖండకావ్యాలున్నాయి.

ఈ ఖండకావ్య సంపుటికి పోచుకూచి సూర్యనారాయణమూర్తిగా రొక విస్తృతపీఠిక రచించారు. దీనిలో వీరు చెప్పిన అభిప్రాయాలతో ఏవరన్నా అతివాదులు అంగీకరించక పోవచ్చునుగాని సామాన్య సారస్వతోపాసకు లందరు ఇది తప్పకుండా అంగీకరించే విషయాలే.

ఈ రచయితల రచనలలో గేయాలు, పద్యాలు మొదలైన ఆధునికరచనాపద్ధతులన్నీ కనిపిస్తున్నాయి. వీరందరు కొత్త కొత్త దారులలో రచనాపద్ధతి సాగించారు. వాడ్రేవు నారాయణమూర్తిగారి 'చంచలుడు' సున్నితమైన హాస్యంతో హుషారుగా నడిచి పోతుంది.

కె. లైరా వ్రాసిన జీవితి, జ్యోత్స్న, ఈయన వ్రాసిన రచనలలో ఉత్తమంగా ఉన్నాయి.

పొన్నపల్లి వెంకటకృష్ణయ్యగారు వ్రాసిన రచనల్లో ఉగాది—వికృతి అనే ఖండకావ్యం బాగుంది.

రావులపర్తి భద్రిరాజుగారికి గేయరచనలు భావకవితాపద్ధతి అనుసరిస్తున్నాయి.

మొత్తంమీద ఈ రచయిత లందరిలోను యువకోత్సాహము, నూత్న రచనా ప్రభావాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. క్రమంగా వీరు తమ రచనలలో పరిణతి పొందగలరని అక్కడక్కడ నుంచి సూచనలు కనిపిస్తున్నాయి.

ఆర్య ప్రవర్తనము

పం. అన్నెకేశవాచార్య సిద్ధాంతశాస్త్రి.

ప్రకాశకులు : ఆర్యసమాజము. గోసామహల్, హైదరాబాద్. (దక్కన్) వెల ఆరణాలు.

ఇది హిందీభాషలో పండిత రామనారాయణ మిశ్ర వ్రాసిన భారతీయ శిష్టాచార్ అనే గ్రంథం ఆధారంగా తీసుకుని రచించిన గ్రంథమని గ్రంథకర్త తమ పీఠికలో తెలియజేశారు.

ఇది ఆర్యసమాజం ధర్మపద్ధతిని అనుసరించి వ్రాసిన పుస్తకము.

దీనిలో విద్యార్థులు ముఖ్యంగా దైనందిన జీవితంలో అవలంబించవలసిన నియమావళిని గురించిన వివరాలున్నాయి.

అయితే ఈ నియమాలు ఆర్యసమాజస్థు లయిన విద్యార్థులే కాక ఇతరేతర విద్యార్థులు కూడా అనుదినము ఆచరణలో పెట్టడానికి తగినవిగా ఉన్నాయి.

దీనికి మాడపాటి హనుమంతరావుగా రొక పీఠిక రచించారు. ఇది విద్యార్థులందరు చదవవలసిన పుస్తకము.

Printed & published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, No 7, Thambu Chetty Street, Madras. Editor: S. Sambhu Prasad.